అనుదినం... జనస్వరం
www.navatelangana.com
# నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
బుధవారం 08-01-2025
సంపుటి : 11 | సంచిక : 09 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

## ఢిల్లీ అసెంబ్లీకి మోగిన ఎన్నికల నగారా

**ఫిబ్రవరి 5న పోలింగ్... 8న కౌంటింగ్**

షెడ్యూల్‌ను ప్రకటించిన కేంద్ర ఎన్నికల సంఘం

**70 స్థానాలకు ఒకే ఫేజ్‌లో పోలింగ్**

మొత్తం ఓటర్లు 1.55 కోట్లు...

కొత్తవారు 2.08 లక్షలు




నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికల నగారా మోగింది. 70 అసెంబ్లీ స్థానాలున్న ఢిల్లీకి ఒకే దశలో ఎన్నికలు నిర్వహించ నున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీఐ) ప్రకటిం చింది. మంగళవారం నాడిక్కడ విజ్ఞాన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో ఎన్నికల కమిషనర్లు ..5లో

## మార్చి నాటికి మెట్రోల డీపీఆర్‌లు సిద్ధం చేయాలి

**శామీర్‌పేట్-మేడ్చల్ వద్ద భారీ జంక్షన్ ఏర్పాటు**


హెచ్‌జీసీఎల్ కింద రేడియల్ రోడ్లు : సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఫ్యూచర్‌సిటీ, శామీర్‌పేట్-మేడ్చల్ మెట్రో మార్గాల సమగ్ర వివరణాత్మక ప్రణాళికలు (డీపీఆర్) మార్చినాటికి సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మూడు మెట్రోల డీపీఆర్‌లకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం పొంది ఏప్రిల్ నెలాఖరుకు టెండర్లు పిలవాలని సూచించారు. హైదరాబాద్ నగరంలో మెట్రో విస్తరణ, రేడియల్ రోడ్ల నిర్మాణాలు, ఎలివేటర్లపై మంగళవారం సీఎం సమీక్ష నిర్వహించారు. రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం-ఫ్యూచర్ సిటీ మెట్రో (40 కి.మీ.), జేబీఎస్-శామీర్‌పేట మెట్రో (22 కి.మీ.), ప్యారడైజ్-మేడ్చల్ మెట్రో (23 కి.మీ.) మార్గాలకు సంబంధించి భూ సేకరణను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఎలివేటెడ్ కారిడార్ల విషయంలో భవిష్యత్ అవసరాలను దష్టిలో ఉంచుకోవాలని అభిప్రాయపడ్డారు. ఎలైన్‌మెంట్ రూపొందించేటప్పుడే క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేయాల్సిన అవసరం ఉందన్నారు. మేడ్చల్ ఎన్‌హెచ్ మార్గంలో ఇప్పటికే ఉన్న మూడు ఫ్లైఓవర్లను దష్టిలో ఉంచుకొని మెట్రో లైన్ తీసుకెళ్లాలని సూచించారు. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాన్ని సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.

శామీర్‌పేట్-మేడ్చల్ మెట్రోలు ఒకేచోట ప్రారంభమయ్యేలా చూసుకోవాలనీ, అక్కడ అధునాతన వసతులు, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా భారీ జంక్షన్‌ను ఏర్పాటు చేయాలని సీఎం అధికారులకు సూచించారు. ఆయా ప్రాంతాల వారు ...13లో



# టిబెట్‌లో భూకంపం

**• 126 మంది మృతి, 188 మందికి గాయాలు • రిక్టర్ స్కేల్‌పై 7.1 గా తీవ్రత నమోదు**

**నేపాల్, భారత్‌లోనూ ప్రకంపనలు**

ఖాట్మండు : హిమాలయ ప్రాంతమైన టిబెట్‌లో మంగళవారం తెల్లవారు జామున భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై 6.8 తీవ్రతగా నమోదైన ఈ భూకంపంలో ఇప్పటివరకు 126 మంది మరణించగా, మరో 188 మంది గాయపడ్డారు. మృతుల సంఖ్య పెరిగే అవ కాశం వుంది. కాగా నేపాల్ సరిహద్దుల్లో కూడా ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. రాజధాని ఖాట్మండులో భూమి కంపించింది. దీని తీవ్రత 7.1గా నమోదైంది. భూమి తీవ్రంగా కంపిస్తుండడంతో భీతిల్లిన ప్రజలు ఇళ్లు వదిలి వీధుల్లోకి పరుగులు పెట్టారు. ఉదయం 9.05గంటల సమయంలో చైనాలోని టిబెట్ స్వయంప్రతిపత్తి ప్రాంతమైన జిగాజెలోని డింగ్రి కౌంటీ తీవ్రంగా కంపించింది. నేపాల్-టిబెట్ సరిహద్దుకు 93కిలో మీటర్ల దూరంలో లబుచె ప్రాంతంలో భూకంపం సంభవిం చింది. జిజాంగ్ స్వయంప్రతిపత్తి ప్రాం తంలో లెవెల్ 2 ఎమర్జన్సీ హెచ్చరిక జారీ చేశారు. ఈ భూకంపం తర్వాత టిబెట్ ప్రాంతంలో మరో రెండు ప్రకంపన లు నమోదయ్యాయి. వాటి తీవ్రత 4.7, 4.9గా నమోదైంది. భూకంప కేంద్రం వున్న టిబెట్‌లో పలు భవనాలు నేలమట్ట మయ్యాయి. శిథిలాల కింద పలువురు చిక్కుకు న్నట్లు భావిస్తున్నారు. ఈ ప్రకంపనల ప్రభా వం భారత్‌పైనా పడింది. పలు ఉత్తరాది రాష్ట్రాల్లో భూమి కంపించింది. ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, బీహార్ సహా పలు చోట్ల భూ ప్రకంపనల వార్తలు వెలువడ్డాయి. భూటాన్; బంగ్లాదేశ్‌ల్లో పలు ప్రాంతాల్లో కూడా ప్రకంపనలు చోటు చేసుకున్నాయి.



**చైనా సాయం**

టిబెట్‌లోని భూకంప ప్రభావిత ప్రాంతాలకు సహాయ సామగ్రిని పంపినట్టు చైనా అధికార సిన్హువా వార్తా సంస్థ తెలిపింది. టిబెట్‌లోని అత్యంత ఎత్తయిన ప్రాంతంలో 62 వేల మంది ప్రజలు నివసిస్తున్నారు. ఇది ఎవరెస్ట్ శిఖరానికి చైనా వైపున ఉంది. శిథిలాల కింద చిక్కుబడిపోయిన వారిని కాపాడేందుకు పూర్తి స్థాయిలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని, సాధ్యమైనంత వరకూ ప్రాణనష్టాన్ని తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నామని, బాధితులకు పునరావాస సౌకర్యాలు కల్పిస్తున్నామని చైనా అధ్యక్షుడు క్సీ జిన్‌పింగ్ ప్రభుత్వ సీసీటీవీకి తెలియజేశారు. శిథిలాల కింద ఉన్న వారిని రక్షించేందుకు 1500 మంది సిబ్బంది కృషి చేస్తున్నారని ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ మంత్రిత్వ శాఖ వివరించింది. ప్రపంచంలో అత్యంత ఎత్తయిన ప్రదేశంలో ఉన్న దింగ్రీ బేస్ క్యాంప్‌లో సిబ్బంది, పర్యాటకులు సురక్షితంగానే ఉన్నారని స్థానిక అధికారులు చెప్పారు.

2015లో నేపాల్‌లో సంభవించిన పెను భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.8గా నమోదైంది. సుమారు తొమ్మిది వేల మంది ప్రాణాలు కోల్పోగా 22 వేల మంది గాయపడ్డారు. దేశంలో ఐదు లక్షలకు పైగా ఇండ్లు ధ్వంసమయ్యాయి. వాయవ్య చైనాలో 2023 డిసెంబర్‌లో వచ్చిన భూకంపంలో 148 మంది ప్రాణాలు కోల్పోగా గన్సూ రాష్ట్రంలో వేలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు.

# కేటీఆర్‌కు షాక్

**హైకోర్టులో ఎదురుదెబ్బ**

ఫార్ములా ఈ రేస్‌పై క్వాష్ పిటిషన్ కొట్టివేత

- సుప్రీంకోర్టుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్
- రాష్ట్ర ప్రభుత్వం కేవియట్ పిటిషన్ దాఖలు



నవతెలంగాణ-హైదరాబాద్

మాజీ మంత్రి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారకరామారావు(కేటీఆర్)కు హైకోర్టులో చుక్కెదురైంది. ఫార్ములా ఈ-రేస్ వ్యవహారంలో ఏసీబీ నమోదు చేసిన కేసును ఎత్తివేయాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను కొట్టివేస్తూ హైకోర్టు మంగళవారం తుది తీర్పు వెలువరించింది. ఏసీబీ అరెస్టు చేయకుండా 10 రోజులు అమల్లో ఉండేలా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కేటీఆర్ లాయర్ గండ్ర మోహన్‌రావు చేసిన విజ్ఞప్తిని తోసిపుచ్చింది. ఇలాంటి కేసుల్లో దర్యాప్తును అడ్డుకునేందుకు ఆస్కారం లేదని చెప్పింది. కేటీఆర్ వేసిన క్వాష్ పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ కె.లక్ష్మణ్ కొట్టివేస్తూ కీలక తీర్పు వెలువరించారు. దీనిపై కేటీఆర్ సుప్రీంకోర్టుకు వెళ్లారు. మరోపక్క రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్‌ను దాఖలు చేసింది.

**అన్నీ దర్యాప్తులో తేలాల్సివుంది**

'ఫార్ములా ఈ రేస్ నిర్వహణ ఎవరి ప్రయోజనాల కోసం నిర్వహించారు. హైదరాబాద్ సిటీ కోసమా? మరో వ్యక్తి కోసమా? ఫార్ములా ఈ రేస్ పేరుతో చెల్లింపులు చేసినట్టు చెబుతున్న సొమ్ము తరలింపు ఎక్కడికి వెళ్లింది? ఎవరికి చేరింది? మళ్లీ నిర్ణయం తీసుకున్న కేటీఆర్‌కు వచ్చిందా? అభియోగాల్లో నిజమెంత? ఇవన్నీ ఏసీబీ దర్యాప్తులో తేలాల్సి వుంది. ఎస్ జెన్‌ను రక్షించడానికే ప్రభుత్వ సొమ్ము చెల్లింపులు చేశారా?. రూ.54.88 కోట్లు ప్రభుత్వ నిధులు తరలి వెళ్లింది వాస్తవమే. రూల్స్ ఉల్లంఘించి చెల్లింపులు జరిగాయా లేదా? ...13లో

## న్యాయవ్యవస్థపై పూర్తి నమ్మకముంది..

**అక్రమ కేసులపై అక్కడే తేల్చుకుంటా :కేటీఆర్**

వివరాలు 14లో



## పెట్టుబడిదారులకే కేంద్రం వత్తాసు

**మోడీ సర్కారు తీరుతో ఎంఎస్పీ కోసం రోడ్డెక్కిన రైతన్న**

- వామపక్షాల పోరాటాల వల్లే 2013 భూసేకరణ చట్టం: సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్
- ఆ పార్టీ రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా జహీరాబాద్‌లో 'నిమ్జ్ భూ బాధితులు- ప్రభుత్వ వైఖరి'పై సదస్సు

వివరాలు 3లో




## హమాలీ రేట్లు పెంచుతాం.. బకాయిలు చెల్లిస్తాం

**సమ్మె విరమణ రెండ్రోజుల్లో జీవో విడుదల**

సివిల్ సప్లయ్, జీసీసీ హమాలీ వర్కర్ల యూనియన్ల జేఏసీకి మంత్రి ఉత్తమ్ హామీ

**ఇతర సమస్యలూ పరిష్కరిస్తాం**

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సివిల్ సప్లయ్, జీసీసీ హమాలీ కార్మికులకు రేట్లను పెంచుతామనీ, అక్టోబర్ 4న జరిగిన చర్చల్లో భాగంగా పెరిగిన హమాలీ రేట్ల బకాయిలను కూడా చెల్లిస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రకటించారు. జీవోను ఒకట్రెండు రోజుల్లో విడుదల చేస్తామని భరోసానిచ్చారు. మిగతా డిమాండ్లనూ పరిష్కరిస్తామని హామీనిచ్చారు. తమకు ఎగుమతి, దిగుమతి హమాలీ రేట్ల ఒప్పందాన్ని అమలు చేస్తూ వెంటనే జీవో విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల ఒకటో తేదీ నుంచి సివిల్ సప్లయ్, జీసీసీ హమాలీ కార్మికులు సమ్మె చేస్తున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లోని జలసౌధలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి నేతృత్వంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, సివిల్ సప్లయ్ హమాలీ యూని యన్ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్‌సివిల్ సప్లయ్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వై.ఓమయ్య, తదితరులతో కూడిన ప్రతినిధి బృందంతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చర్చలు జరి పారు. హమాలీ కార్మికుల సమస్యలను చాడ వెంకట్‌రెడ్డి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి సాను కూలంగా స్పందిస్తూ రెండ్రోజుల్లో జీవో విడుదల చేస్తామనీ, ...13లో





## రమేశ్ బిధూరీ వ్యాఖ్యలపై సెగ

**బీజేపీ ఆఫీస్ ఎదుట యూత్‌కాంగ్రెస్ నిరసన**

**ఇరు పార్టీల నేతల మధ్య బాహాబాహీ, కార్యకర్తలకు గాయాలు**

ఇరు పక్షాలను చెదరగొట్టిన పోలీసులు

**చలో గాంధీభవన్‌కు బీజేపీ పిలుపుతో ఉద్రిక్తం**

కాంగ్రెస్ ఫ్లెక్సీలను చించేసిన బీజేపీ శ్రేణులు

వివరాలు 5లో

# బ్లాక్ మార్కెట్‌లో యూరియా

**ధరలు పెంచి అమ్మకాలు | మొక్కజొన్న సాగుతో పెరుగుతున్న వినియోగం | కత్తెరపురుగుతో తస్మాత్ జాగ్రత్త**

యూరియా ధరలకు రెక్కలొచ్చాయి. వరి, మొక్కజొన్న సాగుతో దీని వినియోగం పెరగడంతో మార్కెట్లో వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి సొమ్ము చేసుకుంటున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రధానంగా వరంగల్, మహబూబాబాద్, హన్మకొండ జిల్లాల్లో ఈ పరిస్థితి ఉంది. 45 కిలోల యూరియా బ్యాగ్‌కు ఎమ్మార్పీ ధర రూ.270 ఉండగా, వ్యాపారులు రూ.300కు విక్రయిస్తున్నారు. పలు మండలాల్లో రిటైల్ వ్యాపారులకు యూరియా లభించడం లేదన్న ప్రచారంతో రూ.350లకు కూడా విక్రయిస్తుండటం గమనార్హం. పలు మండలాల్లో మూడు, నాలుగు బస్తాల యూరియా కొనుగోలు చేసిన రైతులకు విధిగా నానో డీఏపీని కొనుగోలు చేయాలని వ్యాపారులు అంటగడుతున్న పరిస్థితి కనిపిస్తోంది.

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

హనుమకొండ జిల్లాలో గత ఎండాకాలంలో 58,857 ఎకరాల్లో మొక్కజొన్న పండించారు. ఈ సీజన్‌లో ఇప్పటికే 43 వేల ఎకరాలకుపైబడి మొక్కజొన్నను రైతులు సాగు చేస్తున్నారు. ఈసారి 60 వేల ఎకరాల మేరకు సాగు చేసే అవకాశముందని వ్యవసాయాధికారుల అంచనా. యూరియా వాడకం పెరగడంతో ధరలు పెంచేశారు. నెక్కొండ మండలంలో గత రెండు నెలల్లో 20-20 కాంప్లెక్స్ ఎరువు 200 బ్యాగులు కూడా అమ్మకం కాలేదంటే యూరియా వినియోగం ఎంత పెరిగిందో అర్థం చేసుకోవచ్చు.

**యూరియా కృత్రిమ కొరత**

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం నుంచి నెక్కొండ మండలం అలంకానిపేట రైతులు యూరియా బ్యాగ్‌కు రూ.350 చెల్లించి కొనుగోలు



చేసినట్టు తెలిపారు. హనుమకొండ జిల్లాలో ఎండాకాలం సీజన్‌లో 1,86,940 ఎకరాల్లో వివిధ పంటలు పండిస్తారని అంచనా వేశారు. ఇందుకుగాను 25,223 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. జనవరి నాటికి 16,395 మెట్రిక్ టన్నుల యూరియా అవసరముండగా, ప్రస్తుతం 12,090 మెట్రిక్ టన్నులు మాత్రమే ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో జనవరి, ఫిబ్రవరిలోనే యూరియా అధికంగా వినియోగిస్తున్నారు. వరి నాట్లు ముమ్మరం కావడం, మొక్కజొన్నను రైతులు పెద్ద సంఖ్యలో పండిస్తుండటంతో యూరియా వినియోగం మరింతగా పెరిగింది. జనవరికే గోదాముల్లో 2,148 మెట్రిక్ టన్నులు, ..3లో



## ఎంజేపీలో ఫుడ్ పాయిజన్

**30 మంది బాలికలకు తీవ్ర అస్వస్థత వాంతులు, విరేచనాలతో ఆస్పత్రిలో చేరిక**

ఎస్ఎఫ్ఐ, విద్యార్థి సంఘాల ఆందోళన

పరామర్శించిన అడిషనల్ కలెక్టర్, సుడా చైర్మెన్

**చర్యలు తీసుకుంటాం : ఆర్‌సీఓ అంజలి**

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / కరీంనగర్

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శర్మనగర్ మహాత్మజ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో 31మంది విద్యార్థినులు తీవ్ర అవస్థతకు గురయ్యారు. సోమవారం రాత్రి తిన్న కాలిఫ్లవర్ కూర కారణంగా మంగళవారం ఉదయం నుంచే వాంతులు, విరేచనాలు చేసుకున్నారు. ఒక్కొక్కరుగా 31 మంది కడుపునొప్పితో తీవ్ర ఇబ్బంది పడ్డారు. వారికి వెంటనే స్థానిక ప్రభుత్వ ప్రధానాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. సాయంత్రానికి వారందరినీ డిశ్చార్జ్ చేశారు.

శర్మనగర్‌లోని మహాత్మజ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో సోమవారం రాత్రి 436 మంది విద్యార్థులకుగాను 411 మందికి కాలిఫ్లవర్ కూరతో భోజనం వడ్డించారు. ఆ ఫుడ్ పాయిజన్ కావడంతో రాత్రి 11గంటల నుంచి దాదాపు 31 మంది విద్యార్థులు వాంతులు, విరేచనాలు చేసుకున్నారు. ఉదయం వరకు వారి పరిస్థితి విషమించడంతో ...13లో

### వీసీల నియామక నిబంధనల్లో మార్పులు

- పరిశ్రమ నిపుణులు, పీఎస్‌యూల సీనియర్లకూ అవకాశం
- ముసాయిదా మార్గదర్శకాలు విడుదల చేసిన యూజీసీ

13లో

### లైంగికబాబా ఆశారాంకు బెయిల్

- మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన సుప్రీంకోర్టు
- మెడికల్ గ్రౌండ్స్ మీద విడుదల



13లో

### రైతుల కన్నెర్ర

**తమిళనాడులో భారీ ప్రదర్శన**

- కేంద్ర మైనింగ్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం
- మొండిగా మోడీ సర్కారు ముందుకు

3లో



## బీజేపీ నేత రమేష్ బిధూరీని కఠినంగా శిక్షించాలి ఐద్వా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహిళల పట్ల చులకన భావంతో మాట్లాడిన బీజేపీ నేత రమేష్ బిధూరీని కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ అరుణజ్యోతి, మల్లు లక్ష్మి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మహిళల శరీర భాగాలను రోడ్లతో పోల్చుతూ కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ, ఢిల్లీ ముఖ్య మంత్రి అతిశిలనుద్దేశించి రమేష్ బిధూరీ చేసిన వ్యాఖ్యలు అత్యంత అమానవీయమని తెలిపారు. ఆయన మహిళలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ విధానాల్లోనే మహిళలను కించపరిచే ధోరణి ఉందనీ, అందుకే ఆ పార్టీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై దాడులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు.

మహిళలపై లైంగిక దాడులకు పాల్పడిన దోషులను ఆ పార్టీ కాపాడుతున్నదని విమర్శించారు. బిల్కిస్ బానో కేసులో దోషులను జైలు నుంచి విడుదల చేయడంతో దేశమంతా ఆందోళన చెందిందని గుర్తు చేశారు. ఐద్వా నేత న్యాయ పోరాటంతో మళ్లీ వాళ్ళను జైలుకు పంపారని తెలిపారు.

## ఈవో పరీక్షలకు 37.63 శాతం హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (సూపర్‌వైజర్) గ్రేడ్-1 పోస్టుల భర్తీకి సోమ, మంగళవారాల్లో ఆన్‌లైన్‌లో రాతపరీక్షలు జరిగాయి. ఈ మేరకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కంప్యూటర్ ఆధారిత నియామక పరీక్ష (సీబీఆర్టీ) విధానంలో రాష్ట్రవ్యాప్తంగా 53 కేంద్రాల్లో ఈ పరీక్షలను నిర్వహించామని తెలిపారు. 26,751 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. సోమవారం 13,379 మంది దరఖాస్తు చేస్తే, పేపర్-1కు 5,472 (40.90 శాతం) మంది, పేపర్-2కు 5,459 (40.80 శాతం) మంది పరీక్ష రాశారని పేర్కొన్నారు. మంగళవారం 13,372 మంది దరఖాస్తు చేయగా, పేపర్-1కు 5,035 (37.65 శాతం) మంది, పేపర్-2కు 5,032 (37.63 శాతం) మంది హాజరయ్యారని వివరించారు. 181 ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (సూపర్‌వైజర్) గ్రేడ్-1 పోస్టులకు 2022, ఆగస్టు 27న నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. ఇతర వివరాల కోసం www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

## బీజేపీ ఆఫీసుపై దాడి అప్రజాస్వామిక చర్య

- కాంగ్రెస్ నాయకుల తీరును ఖండిస్తున్నాం : కాసం వెంకటేశ్వర్లు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తమ పార్టీ కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ నాయకులు చేసిన దాడి అప్రజాస్వామిక చర్య అని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు అన్నారు. కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదు.. ప్రజలపై దాడిచేసే పాలన అని విమర్శించారు. ఈ ఘటనపై డీజీపీకి, సిటీ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఘటనకు బాధ్యులైన వారందరినీ అరెస్ట్ చేసి కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రౌడీ షీటర్లను వెంటేసుకుని కిరాయి గూండాలతో దాడిచేసే సంస్కృతికి కాంగ్రెస్ తెరలేపిందని విమర్శించారు. ముందస్తు ప్రణాళికతోనే రాళ్లు, కోడిగుడ్లు, కర్రలు, ఇనుపరాడ్లను తీసుకొచ్చి దాడులకు పాల్పడి తమ పార్టీ నాయకులను గాయపర్చారని ఆరోపించారు. ఈ దాడికి పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ సాంప్రదాయం రాష్ట్రానికి మంచిది కాదని సూచించారు. కాంగ్రెస్ కార్యకర్తల ముట్టడిపై పోలీసులకు ముందస్తు సమాచారం ఉన్నప్పటికీ ఎందుకు నిలువరించలేదని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి సర్కారుకు పోలీసు యంత్రాంగం కొమ్ముగాస్తోందని విమర్శించారు. యూత్ కాంగ్రెస్ ముసుగులో చేసిన ఈ దాడి ఘటనలో దళిత కార్యకర్త నందరాజ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్ గాయాలపాలయ్యారని తెలిపారు. వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. మహిళా కార్యకర్తలని కూడా చూడకుండా దాడి చేయడం దుర్మార్గమైన చర్యఅన్నారు. అటువంటి దాడులకు భారతీయ జనతా పార్టీ సహించబోదన్నారు. పోలీసులు తగిన చర్యలు తీసుకోకుంటే.. మా డైరీలో నోట్ చేసుకుంటామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయన్నారు.

## గీత కార్మికులకిచ్చిన హామీని నిలబెట్టు కోవాలి

- కేజీకేఎస్ క్యాలెండర్ అవిష్కరణలో వక్తలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ తన ఎన్నికల ప్రణాళికలో గీత కార్మికులకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ రమణ బెల్లంకొండ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం క్యాలెండర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృత్తిలో మరణించిన వారి కుటుంబాలకు, వికలాంగులైన వారికి ఇవ్వాల్సిన ఎక్స్‌గ్రేషియా ఏడాది నుండి ఇవ్వలేదని తెలిపారు. బాధిత కుటుంబాలను వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వృత్తి పింఛన్‌ను రూ.రెండు వేల నుండి రూ. నాలుగు వేలకు పెంచుతామనీ, సభ్యులందరికీ ద్విచక్ర వాహనాలు ఇస్తామనీ, లిక్కర్ షాపుల రిజర్వేషన్లను 10 శాతం నుడి 25శాతానికి పెంచి సొసైటీలకు ఇస్తామని వాగ్దానం చేసినట్టు గుర్తు చేశారు. ఏజెన్సీ ఏరియాల్లోని సొసైటీలను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బొలగాని జయ రాములు, వి.వెంకట నర్సయ్య, పి అచ్చాలు , బాల్నే వెంకట మల్లయ్య, గౌని వెంకన్న, రాష్ట్ర కార్యదర్శులు చౌగాని సీతారాములు, ఎస్ రమేష్ గౌడ్, బూడిద గోపి, బండ కింది అరుణ్, మడ్డి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌పీఓల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

- హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో..

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ప్రత్యేక పోలీస్ అధికారుల (ఎస్‌పీఓ)ల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానించారు. నగర కమిషనరేట్ పరిధిలో 191 ఎస్‌పీఓల ఖాళీలున్నాయని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని మంగళవారం సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. తాత్కాలిక ప్రాతిపదికపై నియామకాలు ఉంటాయన్నారు. తెలంగాణకు చెందిన మాజీ సైనికులు, మాజీ పారామిలటరీ బలగాలు లేదా రిటైర్డ్ పోలీస్ సిబ్బంది అర్హులని తెలిపారు. ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రిటైర్డ్ పోలీస్ అయితే తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారిగా సర్టిఫికెట్లను(ఆధార్ కార్డ్, ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్) సమర్పించాలన్నారు. మాజీ సైనికులైతే 01-01-2025 నాటికి 58సంవత్సరాల కంటే తక్కువ ఉండాలన్నారు. మాజీ పారామిలటరీ, రిటైర్డ్ పోలీస్ సిబ్బంది రెండేండ్లలోపు సర్వీస్ నుంచి ఉద్యోగ విరమణ చేసి ఉండాలని, గరిష్ట వయోపరిమితి 61ఏండ్ల వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. నెలకు గౌరవ వేతనం రూ.26,000ని, వేతనం చెల్లింపులు లేకుండా సెలవులు తీసుకోవచ్చన్నారు. ఎక్స్ సర్వీస్ మెన్‌కు డిశ్చార్జ్ బుక్, డిశ్చార్జ్ సర్టిఫికెట్, రిటైర్‌మెంట్ ఆర్డర్, టెక్నికల్ ట్రేడ్ ప్రొఫిషియన్సీ సర్టిఫికెట్ కలిగి ఉండాలి. డ్రైవర్ అభ్యర్థులు మాత్రం డ్రైవింగ్ లైసెన్స్ (ఎల్‌ఎంవీ, హెచ్‌ఎంవీ) ఉండాలి. మూడు పాస్‌పోర్టులు జత చేసి పేట్లబూర్జులోని కార్ హెడ్‌క్వార్టర్స్‌లో ఈనెల 25లోపు సాయంత్రం 5గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలి.

# ప్రభుత్వ విద్యను బతికించుకుందాం

## యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ



కాకినాడ: ప్రభుత్వ విద్యా రంగాన్ని బతికించుకోవాలని, దీనికి అందరూ మరింత కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ పిలుపునిచ్చారు. కాకినాడ పిఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న యుటిఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభ మంగళవారం మూడవ రోజుకు చేరింది. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అధ్యక్షతన ప్రతినిధుల ప్రారంభ సభ జరిగింది. ఎంవిఎస్ శర్మ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభోపన్యాసం చేశారు. ఆయన మాట్లాడుతూ.. కర్తవ్య నిర్వహణకు మన భావజాలం వ్యాప్తి చెందాలన్నారు. జగన్, చంద్రబాబు ఇద్దరూ నమ్మకమైన ప్రాణమిత్రులన్నారు. 2047 డాక్యుమెంట్‌లో విద్యను బలోపేతం చేయడం కానీ, ఖాళీలను భర్తీ చేయడం కానీ లేవన్నారు. ఈ రెండు రాజకీయ పార్టీలే మనకు గతి అనే భ్రమను వీడాలని సూచించారు. దేశ సమగ్రత, లౌకికతత్వం కాపాడుకోవడానికి ఉపాధ్యాయులు శాయశక్తుల కృషి చేయాలని కోరారు. సమర్థులు, విజ్ఞులు సమాజంపై బలమైన ప్రభావం చూపించకపోతే స్వార్థపరులు బలపడతారని తెలిపారు. సోషల్ మీడియాను మనం నిరేకదశించాలి తప్ప, సోషల్ మీడియాకు మనం బానిసలం కాకూడదన్నారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. 50 ఏళ్ల ఉపాధ్యాయ ఉద్యమంలో తాను కూడా భాగస్వామ్యం అయినందుకు ఆనందంగా ఉందన్నారు. విద్యా వ్యవస్థను గత ప్రభుత్వం పూర్తిగా నాశనం చేసిందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వమైనా గాడిలో పెట్టే ప్రయత్నం చేయాలని కోరారు. వచ్చే ఐదారేళ్లలో ప్రభుత్వ విద్యారంగం మరింత తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కోబోతుందన్నారు. నేటి పాలకులు భారత లౌకిక రాజ్యాంగాన్ని నాశనం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాజంలోనూ, సంఘంలోనూ ఐక్యతను తీసుకురావడానికి ఉపాధ్యాయులంతా కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ.. రాబోయే గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రజలతో ఉపాధ్యాయులు నిరంతరం మమేకం కావాలని సూచించారు. నిరంతరం అధ్యయనం చేయాలని, క్రియాశీలక పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. స్వర్ణోత్సవ మహాసభకు ముఖ్య అతిథిగా కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి విచ్చేసి సౌహార్ద సందేశం చేశారు. సమాజంలో ఏదైనా మార్పు రావాలంటే గురువుల ద్వారా మాత్రమే సాధ్యమన్నారు. తన తల్లిదండ్రులు కూడా కడప జిల్లాలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారని తెలిపారు. యుటిఎఫ్ తరపున కలెక్టర్‌కు జ్ఞాపికను ఇచ్చి సత్కరించారు. తరువాత యుటిఎఫ్ సంక్షేమ పథకం బాండ్‌ను ప్రారంభించారు. అనంతరం ప్రతినిధుల సభ జరిగింది. కార్యదర్శి నివేదికను యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్, ఆర్థిక నివేదికను ఎమ్మెల్సీ గోపిమూర్తి, ఐక్య ఉపాధ్యాయ పత్రిక నివేదికను కుమార్‌రాజా ప్రవేశ పెట్టారు. వీటిపై జిల్లాల వారీగా ప్రతినిధులు చర్చించారు.

## ఇస్రో తదుపరి ఛైర్మెన్‌గా వి. నారాయణన్



న్యూఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) తదుపరి ఛైర్మెన్‌గా వి.నారాయణన్ నియమితులయ్యారు. ప్రస్తుత ఇస్రో ఛైర్మెన్ ఎస్.సోమనాథ్ పదవీ విరమణ చేయనుండడంతో 14న నారాయణన్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు కేంద్ర క్యాబినెట్ నియమకాల కమిటీ అధికారిక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఇస్రో అధిపతిగా బాధ్యతలు చేపట్టనున్న నారాయణన్ రెండేండ్లపాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. ఆయన ప్రస్తుతం వలియమలాలోని లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్స్ సెంటర్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. రాకెట్ వ్యవస్థ, స్పేస్‌క్రాఫ్ట్ ప్రొపల్షన్‌కు సంబంధించి నాలుగు దశాబ్దాలుగా పలు హోదాల్లో ఆయన పనిచేశారు.

## మూడోసారి అధికారిక నివాసం నుంచి గెంటేశారు

- కేంద్రతీరుపై ఢిల్లీ సీఎం అతిశీ ఆగ్రహం




న్యూఢిల్లీ : ముఖ్యమంత్రి అధికారిక నివాసాన్ని కేంద్రం లాక్కుందని ఢిల్లీ సిఎం అతిషీ మంగళవారం ప్రకటించారు. "ఢిల్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ఈ రోజు ప్రకటించారు. అంతకుముందు రాత్రి బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మూడు నెలల్లో రెండవసారి, నాకోసం కేటాయించిన అధికారిక నివాసం నుంచి నన్ను బయటకు నెట్టించింది. ఓ లేఖ ద్వారా సీఎం నివాసం కేటాయింపును రద్దు చేసింది. ప్రజాస్వామ్యయుతంగా ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం నుంచి, ఎన్నుకున్న సీఎం నుంచి అధికారిక నివాసాన్ని బీజేపీ లాక్కుంది " అతిశీ పేర్కొన్నారు. బీజేపీ తన పైన దాడిని కొనసాగిస్తూనే ఉందని, మూడు నెలల క్రితం తనను నివాసం నుంచి బయటకు పంపారని అన్నారు. తాను సీఎంగా ఎన్నికైన తర్వాత తనతో పాటు తన కుటుంబం రోడ్డున పడేలా చేశారని మండిపడ్డారు. తమ నివాసాలను లాక్కోవడం, తమను దుర్భాషలాడటం, కుటుంబసభ్యులను అవమానపరచడం ద్వారా తమను(ఆప్) అడ్డుకోవాలని బీజేపీ చూస్తోందని, కానీ తమను ఎవరూ అడ్డుకోలేరని ప్రజలకు చెప్పాలనుకుంటున్నానని అన్నారు.ఢిల్లీ ప్రజలపై బీజేపీకి శ్రద్ధ లేదని, కేవలం ఆప్ నేతలను అడ్డుకోవడమే కేంద్రం పని అని ఆప్ మంత్రి సౌరభ్ భరద్వాజ్ పేర్కొన్నారు.

## కొత్త విధాన రూపకల్పనతో రవాణా రంగం

- రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో కొత్త విధాన రూపకల్పనతో రవాణా రంగం ముందుకు తీసుకెళ్తున్నామని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం నాడిక్కడ భారత మండపంలో కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధ్యక్షతన జరిగిన 42వ రవాణా అభివృద్ధి మండలి సమావేశంలో తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో డ్రైవింగ్ శిక్షణా కేంద్రాల విధానాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. కొత్త మోటార్ వెహికల్ చట్టం సవరణలు, ఈడీఏఆర్, ఐఆర్ఏడీ వంటి రహదారి భద్రత సమస్యలు, వాహన్ సారథి, ఫేస్ లేస్ లావాదేవీలు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు భాగంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అధ్యక్షతన జరిగిన రాష్ట్రాల రవాణా శాఖ మంత్రుల సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. సమావేశంలో తెలంగాణ రవాణా శాఖ అమలు చేస్తున్న పాలసీలు తదితర వాటిపై మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు.

## 11 నుంచి జూనియర్ కాలేజీలకు సంక్రాంతి సెలవులు

- ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు, ఎయిడెడ్, కోఆపరేటివ్, గురుకులాలు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీ, ఇన్సెంటివ్ జూనియర్ కాలేజీలతోపాటు కాంపొజిట్ డిగ్రీ కాలేజీలకు ఈనెల 11 నుంచి సంక్రాంతి పండుగ సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 11 నుంచి 16 వరకు జూనియర్ కాలేజీలకు సంక్రాంతి సెలవులుంటాయని స్పష్టం చేశారు. 17న జూనియర్ కాలేజీలు పున:ప్రారంభమవుతాయని వివరించారు. రాష్ట్రంలోని జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్లు ఈ నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. సెలవు దినాల్లో ఎలాంటి తరగతులనూ నిర్వహించొద్దని కాలేజీల ప్రిన్సిపాళ్లు, యాజమాన్యాలను కోరారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే ఆయా కాలేజీల గుర్తింపును రద్దు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు, ఎయిడెడ్ పాఠశాలలకు అకడమిక్ క్యాలెండర్‌లో ఈనెల 13 నుంచి 17 వరకు సంక్రాంతి సెలవులుంటాయని విద్యాశాఖ ప్రకటించింది. అయితే ఈనెల 11న రెండో శనివారం, 12న ఆదివారం కావడంతో అదనంగా రెండు రోజులు సెలవులు ఇవ్వాలని నిర్ణయించింది. దీంతో ఈనెల 11 నుంచి 17 వరకు ఏడురోజుల పాటు పాఠశాలలకు సంక్రాంతి సెలవులుంటాయని విద్యాశాఖ తెలిపింది. ఈనెల 18న పాఠశాలల్లో తిరిగి తరగతులు ప్రారంభమవుతాయి.

## ప్రజావాణికి 450 దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 450 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 150, విద్యుత్ శాఖకు 119, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 68, ఇతర శాఖలకు 113 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

# రైతుల కన్నెర్ర

## తమిళనాడులో భారీ ప్రదర్శన

**కేంద్ర మైనింగ్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా**

**రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం**

**నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో**

కేంద్ర ప్రభుత్వ మైనింగ్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా తమిళనాడులో వేలాది మంది రైతులు ప్రదర్శన చేపట్టారు. మదురై జిల్లాలోని మేలూర్ తాలూకా వద్ద టంగ్‌స్టన్ మైనింగ్ ప్రాజెక్టును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మేలూర్, సమీప ప్రాంతాల నుంచి దాదాపు 10,000 మందికిపైగా రైతులు, గ్రామస్తులు మదురై నగరంలోని నరసింగం పట్టి నుంచి తాళ్లకుళం వరకు 25 కిలోమీటర్ల భారీ ప్రదర్శన చేపట్టారు. మహిళలు, పురుషులు, కార్లు, బైక్‌లు, ట్రాక్టర్లు, బస్సులు, లారీల్లో కాలినడకన బయలుదేరి ఉదయం నరసింగంపట్టిలోని దేవాలయం నుంచి పాదయాత్రగా బయలుదేరి మధ్యాహ్నం నగరానికి చేరుకున్నారు. తిరుచ్చి-మధురై జాతీయ రహదారి మీదుగా తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చేరుకున్న ఆందోళనకారులు ఒతకడై మీదుగా ఎంజీఆర్ బస్టాండ్ దాటి జిల్లా కోర్టు దగ్గర మలుపు తీసుకున్నారు. అక్కడి నుంచి తాళ్లకుళం చేరుకున్నారు. టీఎన్ఏయూ, ఒతకడై, మద్రాస్ హైకోర్టు మధురై బెంచ్ వంటి కొన్ని ముఖ్యమైన జంక్షన్ల వద్ద పోలీసులు బారికేడ్లు వేసినప్పటికీ, రైతులు వాటిని ఛేదించి ముందుకు సాగారు. అయితే, భారీ జనసమూహాన్ని నిరోధించేందుకు అనేక మంది నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ అరెస్టును ఖండిస్తూ అదుపులోకి తీసుకున్న వారిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. దీంతో ఆందోళనకారులను నిరసన ప్రదేశానికి అనుమతించడంతో




వారంతా గుమిగూడి రాష్ట్ర ప్రభుత్వం, ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినా ప్రాజెక్టును కొనసాగించడంపై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలను హోరెత్తించారు. ప్రాజెక్టు కోసం కేటాయించిన ఐదువేల ఎకరాల్లో కేవలం 500 ఎకరాలు వదిలేయడం వల్ల ప్రజలకు, పర్యావరణానికి ఎలాంటి మేలు జరగదన్నారు. గ్రానైట్ తవ్వకం వంటి ప్రాజెక్టులతో పర్యావరణానికి నష్టం వాటిల్లడాన్ని ఇప్పటికే అనేక ఘటనలు స్పష్టం చేశాయని, ఇకపై మా భూమి విధ్వంసాన్ని తట్టుకోలేమని స్పష్టం చేశారు.సీపీఐ(ఎం) నాయకుడు, మదురై డిప్యూటీ మేయర్ టి. నాగరాజన్ మాట్లాడుతూ ఈ ప్రాజెక్టుతో రెండు రకాలుగా నష్టమని అన్నారు. ఒకటి ప్రజల జీవనోపాధి, రెండు చారిత్రాత్మక ఘట్టాలు శాశ్వతంగా లేకుండా పోతాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానం చేసిందని తెలిపారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని విమర్శించారు. సీపీఐ(ఎం) సీనియర్ నేత ఎకె పద్మనాభన్ మాట్లాడుతూ ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా గత రెండు నెలలుగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిల్లో అనేక సమావేశాలు నిర్వహించామని, పార్టీలకతీతంగా ప్రజలు ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీర్మానాన్ని, ప్రజల డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవడం లేదని విమర్శించారు. ఈ నిరసనకు మద్దతుగా ఆగ్రో ఫుడ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ప్రెసిడెంట్ ఎస్.రెతీనవేలు మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని ప్రజల ఏకైక జీవనోపాధి అయిన వ్యవసాయంపై ఈ ప్రాజెక్టు తీవ్ర ప్రభావాన్ని చూపుతోందని అన్నారు. ఈ ప్రాంతంలో ఆహార ఉత్పత్తిని నిలిపివేసినప్పుడు, అది ఆ ప్రజలకే కాదు, ఆహార ఉత్పత్తికి పరోక్షంగా సంబంధం ఉన్న వేలాది మందికి కూడా నష్టం కలిగిస్తుందని ఆయన అన్నారు.



# పెట్టుబడిదారులకే కేంద్రం వత్తాసు



**నవతెలంగాణ-జహీరాబాద్**

కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ.. రైతుల పట్ల వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్నదని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ అన్నారు. ఆ పార్టీ రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని భీమ్ భవన్ కళ్యాణ మండపంలో మంగళవారం సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.రామచంద్ర అధ్యక్షతన 'నిమ్జ్ భూ బాధితులు-ప్రభుత్వ వైఖరి' అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆనాడు వామపక్ష పార్టీలన్నీ కలిసి నాటి యూపీఏ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి 2013 భూ సేకరణ చట్టాన్ని తీసుకొచ్చినట్టు తెలిపారు. ఇప్పుడు ఈ చట్టానికి తూట్లు పొడిచేందుకు ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. చట్టాన్ని రక్షించుకుంటూ..దాన్ని అమలు పరిచేందుకు కోర్టులకు సైతం వెళ్లి భూ బాధితులకు సీపీఐ(ఎం) అండగా నిలిచిందని అన్నారు. స్థానికంగా ఉన్న నిమ్జ్ భూ బాధితుల తరపున పోరాడి.. హైకోర్టు నుంచి ఆదేశాలు తీసుకొచ్చి రైతులకు పట్టా భూములు, అసైన్‌మెంట్ రైతులకు నష్టపరిహారాన్ని అందించిన ఘనత సీపీఐ(ఎం)దేనని తెలిపారు. గత కేసీఆర్ ప్రభుత్వం రైతులకు నష్టం చేకూర్చే విధంగా 123 జీఓను తీసుకువచ్చిందని, దాని ప్రకారం సిద్దిపేట, గజ్వేల్ పరిధిలో భూములను కొనుగోలు చేసి నిర్వాసితులకు నేటికీ న్యాయం చేయలేదని అన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే కొడంగల్ నియోజక వర్గంలో ఫార్మాసిటీ ఏర్పాటుచేయాలని చూశారన్నారు. దానికి వ్యతిరేకంగా రైతుల పక్షాన సీపీఐ(ఎం) పోరాడి, రాష్ట్ర ప్రభుత్వం దాన్ని రద్దు చేసేలా చేసిందన్నారు. రైతులు, భూ బాధితుల పక్షాన నిలిచి పోరాడిన ఎర్రజెండా నాయకులు జైలుకు సైతం వెళ్లారని తెలిపారు. ప్రజల పక్షాన నిలబడే సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలు సంగారెడ్డిలో నిర్వహిస్తున్నందున.. అందరూ సహకరించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంతేకాదు, రాష్ట్రం, కేంద్రంలోని పాలక పార్టీలతోపాటు.. ఇతర పార్టీల నాయకుల్లో సైతం ఈ మహాసభల్లో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారోనని వారిలో ఉత్కంఠ నెలకొన్నదన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకట్రాములు, ప్రసాద్ మాట్లాడుతూ.. సీపీఐ(ఎం) ఎల్లవేళలా అట్టడుగు వర్గాల పక్షమే ఉంటుందన్నారు. ఈ సదస్సులో సీపీఐ(ఎం) నాయకులు చంద్రన్న, నరసయ్య, ప్రసాద్, శంకర్, రాజు, సలీం, ఇమామ్, బాలప్ప, తుల్జమ్మ, సునందమ్మ, శారదమ్మ అనిస్, బుద్ధిపాడు, ముంగి, గ్రామం తాండ, బర్దిపూర్‌కు చెందిన రైతులు, వ్యవసాయ కూలీలు, మహిళలు పాల్గొన్నారు.

### విరివిగా మహిళా రైతు కూలీలు విరాళాలు అందజేత

నిమ్జ్‌లో తమ పక్షాన పోరాడి.. 2013 చట్ట ప్రకారం నష్టపరిహారం ఇప్పించిన సీపీఐ(ఎం)కు మద్దతుగా.. ఆ పార్టీ మహాసభల కోసం నిమ్జ్ భూ నిర్వాసితులు విరివిగా విరాళాలను వెంకట్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మహిళా రైతులు, కూలీలు మాట్లాడుతూ.. తాము వ్యవసాయ కూలీలుగా పని చేస్తున్న భూములను పరిశ్రమల ఏర్పాటుకు తీసుకోగా.. తమకు బతుకుదెరువు ఎలా అని ఆందోళనలో ఉన్నప్పుడు సీపీఐ(ఎం), వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తమ వద్దకు వచ్చి అండగా నిలిచారన్నారు. హైకోర్టులో సైతం కేసును వేసి గెలిచినందువల్లనే తమకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందిందని తెలిపారు. అందుకే తమవంతుగా పార్టీకి మద్దతు తెలుపుతున్నట్టు చెప్పారు.

# రైతు నేతలకు చేదు అనుభవం

## వారిని కలిసేందుకు రాష్ట్రపతి నిరాకరణ

**అపాయింట్‌మెంట్ కోసం వేచి చూశాం**

**ముర్ము నిర్ణయం పట్ల ఎస్కేఎం విచారం**



**నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో**

రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర(ఎంఎస్పీ)కు చట్టపరమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పోరాడుతున్న రైతులకు చేదు అనుభవం ఎదురైంది. దేశ ప్రథమ పౌరురాలైన రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి తమ సమస్యలను విన్నవించుకునేందుకు ఎదురు చూసిన సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) నేతలకు నిరాశే ఎదురైంది. తాను ఎస్కేఎం ప్రతినిధులను కలవలేనని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. తాము అపాయింట్‌మెంట్ కోసం వేచి చూశామని, కానీ ఆమె తమను కలవలేరని రాష్ట్రపతి కార్యాలయం నుంచి ప్రకటన వచ్చిందని ఎస్కేఎం తెలిపింది. ఈ నిర్ణయం పట్ల ఎస్కేఎం తీవ్ర విచారం వ్యక్తం చేస్తోందని తెలిపింది.

సమయాభావం కారణంగా కలిసేందుకు అంగీకరించకపోడం దారుణమని పేర్కొంది. అయితే, రాష్ట్రపతి భవన్ ఈ నిర్ణయంపై సమీక్షిస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది. ఎందుకంటే ప్రధాని మోడీ, సుప్రీంకోర్టు ఇప్పటివరకు ఈ ప్రతిష్టంభనను పరిష్కరించలేకపోయాయని, రైతునేత ప్రాణాలను రక్షించడానికి నిర్మాణాత్మక చర్యలు తీసుకోలేకపోయాయని తెలిపింది. వ్యవసాయ నాయకుడు జగ్జిత్ సింగ్ దల్లేవాల్ గత 42 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నారని తెలిపింది. దేశానికి అధిపతి అయినందున, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థ, రాజ్యాంగ సంస్థలకు సహాయం చేయాల్సిన బాధ్యత రాష్ట్రపతిపై ఉందని గుర్తు చేసింది. ప్రజాస్వామ్య సూత్రాలకు కట్టుబడి రైతులతో చర్చలు జరపాలని పేర్కొంది.వ్యవసాయ మార్కెటింగ్ జాతీయ విధాన ముసాయిదాను ప్రస్తావిస్తూ "రైతుల కష్టాలను పరిష్కరించడానికి చర్చలు జరపడానికి బదులుగా, ఎన్డీఏ ప్రభుత్వం వ్యవసాయం, రైతులు, కార్మికులు, చిన్న వ్యాపారుల జీవనోపాధిపై అగ్రిబిజినెస్ కార్పొరేట్ల దాడిని సులభతరం చేస్తోంది. కొత్త ముసాయిదా విధానాన్ని ప్రవేశపెట్టడంతో ఉత్పత్తిదారులు, రాష్ట్ర ప్రభుత్వాల సమాఖ్య హక్కులపై దాడి జరుగుతుంది. ఇది రద్దు చేసిన మూడు వ్యవసాయ చట్టాల కంటే చాలా ప్రమాదకరమైనది" అని ఎస్కేఎం పేర్కొంది.

# అమెరికాను కమ్మేసిన మంచు తుపాను

**అంధకారంలో లక్షలాదిమంది**

**ఐదుగురు మృతి**

**వేలాది విమానాలు రద్దు**

**పలు రాష్ట్రాల్లో ఎమర్జెన్సీ**

**వాషింగ్టన్ :** అతిపెద్ద మంచు తుపాను సెంట్రల్, తూర్పు అమెరికాను కమ్మేసింది. దీంతో మొత్తంగా అమెరికా మంచు దుప్పటి కప్పుకున్నట్టుగా వుంది. అత్యంత శీతల గాలులు, భారీగా కురుస్తున్న హిమపాతంతో లక్షలాదిమంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటివరకు ఐదుగురు మరణించారని అధికారులు తెలిపారు. సోమవారం నాడు 2300కి పైగా విమానాలు రద్దయ్యాయి. మరికొన్ని వేల విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. మిస్సోరి నుండి వర్జీనియా వరకు దాదాపు రెండు లక్షలమంది ప్రజలు విద్యుత్ లేకుండా చీకట్లో మగ్గుతున్నారు. ఈ సంవత్సరంలో మొట్టమొదటిదైన ఈ మంచు తుపాను మంగళవారం రాత్రికి తూర్పు దిశగా పశ్చిమ అట్లాంటిక్ ప్రాంతంలోకి పయనించనుంది. ఈ తుపాను ఉధృతి తగ్గినా మరికొన్ని రోజుల పాటు గడ్డ కట్టించే ఉష్ణోగ్రతలు కొనసాగుతాయని భావిస్తున్నారు. కన్సాస్ సిటీ వంటి కొన్ని నగరాల్లో మైనస్‌ల్లోకి ఉష్ణోగ్రతలు వెళ్లిపోయాయి. అమెరికా గల్ఫ్ తీర ప్రాంతంలో ఈ సీజనులోనే అత్యంత తక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయి. కాగా బాధిత ప్రాంతాలకు తక్షణమే సాయం అందించేందుకు వీలుగా ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిస్థితులను నిశితంగా పర్యవేక్షిస్తోందని వైట్‌హౌస్ ప్రతినిధి చెప్పారు. మంచు తుపాను కారణంగా వాషింగ్టన్‌లో కార్యాలయాలు, స్కూళ్ళు మూతపడ్డాయి. కెంటకీ ప్రాంతంలో ప్రమాదకర స్థాయిలో మంచు కురుస్తుండడంతో హైవేలన్నీ మంచు దిబ్బలుగా మారిపోయాయి. కనాస్ సిటీలో వాహనాలు ఢీ కొని ఇద్దరు మరణించగా, అదుపు తప్పిన ట్రాక్టర్ ట్రాలర్ ఢీ కొని మరో వ్యక్తి చనిపోయాడు. న్యూయార్క్ దిశగా భయంకరమైన శీతల గాలులు వీస్తున్నాయి. సరస్సులన్నీ గడ్డ కట్టేసి మంచు మైదానాలుగా మారిపోయాయి. వాతావరణ మార్పుల వల్ల ఇటువంటి విపరీతమైన వాతావరణ పరిస్థితులు రాన్రాను సర్వసాధారణమై పోతాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. కెంటకీ, మిస్సోరి, వర్జీనియా, మేరీల్యాండ్, టెక్సాస్ సహా పలు రాష్ట్రాల్లో అత్యవసర పరిస్థితులను ప్రకటించారు. అత్యవసరమైతే తప్ప రోడ్లపైకి వెళ్ళవద్దని ప్రజలను కోరారు.





# 'డబుల్' ఇండ్లపై మంత్రి జోక్యం చేసుకోవాలి

**లబ్దిదారుల దీక్షలకు**

**జూలకంటి మద్దతు**

**వెంటనే ఇండ్లు**

**కేటాయించాలని డిమాండ్**

**నవ తెలంగాణ-క్లాక్‌టవర్**

లాటరీ ద్వారా ఎంపికైన డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు వెంటనే స్వాధీన పరచడానికి జిల్లా మంత్రి జోక్యం చేసుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పోరాట సాధన కమిటీ ఆధ్వర్యంలో లబ్ధిదారులు నల్లగొండ జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని జూలకంటి సందర్శించి దీక్షాపరులకు పూలదండలు వేసి ప్రారంభించి మద్దతు తెలిపి మాట్లాడారు. రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పథకంలో భాగంగా నల్లగొండ పట్టణంలో సుమారు 552 ఇండ్లను నిర్మించారన్నారు. ఇండ్లు నిర్మించి ఏడేండ్లు గడుస్తున్నా లాటరీ ద్వారా ఎంపిక చేసిన లబ్దిదారులకు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా నల్లగొండ పట్టణంలో ఎంపిక చేసిన లబ్దిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని కోరారు. రిలే దీక్షలకు తమ పార్టీ తరపున సంపూర్ణ మద్దతు తెలిపారు. అవసరమైతే కలెక్టర్, మంత్రులతో ముఖ్యమంత్రి మాట్లాడి ఇండ్లు ఇచ్చేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు, మాజీ కౌన్సిలర్ ఎండి. సలీం మాట్లాడుతూ.. నల్లగొండ పట్టణ 48 వార్డుల నుంచి ఎంపికైన డబుల్ బెడ్ రూమ్ లబ్దిదారులు రెండో రోజు రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు దండెంపల్లి సత్తయ్య, ఆవాజ్ సంఘం జిల్లా కార్యదర్శి సయ్యద్ హాశం, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు డబ్బికారు మల్లేశ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరపల్లి వెంకటేశ్వర్లు, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కంబాలపల్లి ఆనంద్, మహిళా జిల్లా కన్వీనర్ దండెంపల్లి సరోజ, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రవి నాయక్, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు తుమ్మల పద్మ, సహాయ కార్యదర్శి భూతం అరుణ కుమారి, కునుకుంట్ల ఉమారాణి, సీఐటీయూ పట్టణ నాయకులు అద్దంకి నరసింహ, కోట్ల అశోక్ రెడ్డి, డీవైఎఫ్ఐ నాయకులు నరేష్, రైతు సంఘం నాయకులు ఊట్కూరు మధుసూదన్ రెడ్డి, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పోరాట కమిటీ కన్వీనర్, మాజీ కౌన్సిలర్ అవుట రవీందర్, కో కన్వీనర్ గంజి నాగరాజు పాల్గొన్నారు.

### గురుకులం సందర్శనకు... బైక్‌పై మంత్రి సీతక్క..!



**నవతెలంగాణ-తాడ్వాయి**

ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో మంగళవారం పలు అభివృద్ధి పనులకు మంత్రి సీతక్క శంకుస్థాపనలు చేశారు. పోచాపూర్ చౌరస్తాలో మినీ దర్బార్ అయిన తరువాత స్థానిక మినీ గురుకుల పాఠశాలను బైక్‌పై వెళ్లి మంత్రి సందర్శించారు. దాంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ సమస్య తలెత్తే అవకాశం ఉండటం వల్లే మంత్రి సీతక్క బైక్‌పై వెళ్లినట్టు చర్చించుకుంటున్నారు.

### చివరి ఆయకట్టుకు ఎస్సారెస్పీ నీరందించాలి

- కాల్వలో దిగి రైతుల నిరసన



**నవతెలంగాణ-అర్వపల్లి**

ఎస్సారెస్పీ సాగునీటిని చివరి ఆయకట్టు వరకు అందించేలా చర్యలు తీసుకోవాలని సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలంలోని కొమ్మాల గ్రామ రైతులు మంగళవారం కాల్వలోకి దిగి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. నీరు విడుదల చేసినా... చివరన ఉన్న తమ పొలాలకు అందడం లేదని, సాగు నీటి కోసం ఎదురుచూస్తున్న తమకు నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు కాలువలు అక్కడక్కడ పిచ్చి మొక్కలతో పూడిపోయాయని, మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. చివరి ఆయకట్టు వరకు నీరందించాలని కోరారు. నిరసన తెలిపిన వారిలో రైతులు కుంటిగొర్ల శ్రీను, అవిలేను, ఉప్పలయ్య, చిన్నలింగం, భద్రి, శిగా రాములు, బడుగుల లింగయ్య, జలెందర్, బుర్ర జనార్దన్, నల్లబెట్టి గంగరాజు, పడిగి శ్రీకాంత్, మర్యాద శ్రీధర్, చందు,బత్తుల ఉపేందర్, విరేష్, రాకేష్ ఉన్నారు.

### బ్లాక్ మార్కెట్‌లో యూరియా

(మొదటిపేజీ తరువాయి)

మార్క్‌ఫెడ్ వద్ద 8080 మెట్రిక్ టన్నులు, రిటైలర్స్ వద్ద 11,877 మెట్రిక్ టన్నుల యూరియా ఉన్నట్టు అధికారులు లెక్కలు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం యూరియాను అధికారులు సొసైటీలకు మాత్రమే ఇస్తున్నారని, తమకు ఇవ్వడం లేదని రిటైలర్లు బహిరంగంగానే చెబుతున్నారు. వాస్తవ పరిస్థితిని పరిశీలిస్తే మార్కెట్‌లో అనిశ్చితి పరిస్థితి ఉందన్నది స్పష్టమవుతుంది.

**ఎరువులు అందుబాటులో ఉంచాలి : దేవనబోయిన వీరభద్రయ్య, రైతు, నెక్కొండ**

ఎండాకాలం సాగుకు ఎరువులు అందుబాటులో ఉంచాలి. వ్యాపారుల వద్ద యూరియా లేదంటున్నారు. రూ.300 నుంచి రూ.350కు కొనాల్సి వస్తుంది.

**యూరియాకు నానో డీఏపీ అంటకడుతున్నారు.. : తేజావత్ రవీందర్, రైతు, టేకులకుంటతండా**

మూడుబస్తాల యూరియా కొంటే నానో డీఏపీ బాటిల్ విధిగా కొనాలని వ్యాపారులు అంటగడుతున్నారు. దాంతో అవసరం లేకున్నా కొనుగోలు చేయాల్సి వస్తుంది. యూరియా ధరలు పెంచి అమ్ముతున్నరు..

**పెరిగిన యూరియా వాడకంతో కత్తెర పురుగు : ఎ.నాగరాజు, ఎఓ, నెక్కొండ**

గతంలో ఎన్నడూ లేనివిధంగా మొక్కజొన్న సాగులో యూరియా వాడకం విపరీతంగా పెరిగింది. మితిమీరిన వాడకం వల్ల మొక్కజొన్నలో త్వరితగతిన కత్తెరపురుగు ఆశించి తీవ్రంగా పంటను దెబ్బతీసే అవకాశముంది. ఎకరాకు 6-7 బ్యాగుల యూరియాను చెట్ల మొదళ్ల వద్ద వేయాల్సి ఉండగా, గతేడాది నుంచి వరిలో వెదజల్లినట్టు మొక్కజొన్నలోనూ రైతులు వెదజల్లుతుండటంతో యూరియా వినియోగం ఎకరాకు 12-15 బ్యాగ్‌లకు పెరిగింది. దాంతో అంచనాలకు భిన్నంగా యూరియా కొనుగోళ్లు జరుగుతు న్నాయి. మితిమీరిన యూరియా వినియోగం వల్ల మృత్తిక దెబ్బతినే ప్రమాదముంది.

# యూపీలో తప్పుడు 'మత మార్పిడుల' కేసులు

**దళిత మెకానిక్‌పై హిందూత్వ మూకల దాడి**

**చేయని తప్పునకు 15 నెలల జైలు జీవితం**

**న్యూఢిల్లీ :** అది 2023వ సంవత్సరం జూన్ 25వ తేదీ. ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలీలో కోద్రా గ్రామం. 35 సంవత్సరాల సోనూ సరోజ్‌కు అందరి లాగానే ఆ ఆదివారం కూడా ప్రారంభమైంది. ఆయన కుటుంబసభ్యులు, బంధువులు, సమీప గ్రామాల ప్రజలు ఇంటి వెనుక ఉన్న ఓ బహిరంగ ప్రదేశంలో ప్రార్థనల కోసం సమావేశమయ్యారు. దళితుడైన సరోజ్ ఓ మెకానిక్. ఆయన తరచూ క్రైస్తవ ప్రార్థనలు నిర్వహిస్తూ ఉంటారు. ఉదయం 11 గంటలకు ప్రార్థనా సమావేశం మొదలైంది. 250 మంది హాజరయ్యారు. మరికొందరు ఆ ప్రాంతానికి చేరుకుంటున్నారు. ఆ సమయంలో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్‌కు చెందిన 10-15 మంది హిందూత్వ వాదులు అక్కడికి చేరుకొని బీభత్సం సృష్టించారు. లాఠీలు, కర్రలు పట్టుకొని అందరికీ కొట్టడం ప్రారంభించారు. సరోజ్ భార్య పట్ల కూడా అవమానకరంగా ప్రవర్తించారు. ఆమె తలపై లాఠీతో కొట్టడంతో తీవ్ర గాయమైంది. స్థానిక హిందువులను క్రైస్తవులుగా మార్చేందుకు సరోజ్



అనధికారికంగా ప్రార్థనా సమావేశాలు నిర్వహిస్తున్నారంటూ ఆరోపించారు.

దాడికి పాల్పడిన అల్లరి మూకలపై చర్య తీసుకోవాల్సిన పోలీసులు సీఆర్‌పీసీ సెక్షన్ 151 కింద కేసు పెట్టి సరోజ్‌ను జైలుకు పంపారు. గుర్తించదగిన నేరం చేసేందుకు పథకం పన్నుతున్నారని భావిస్తే వారంట్ కానీ లేదా మెజిస్ట్రేట్ ఆదేశాలు కానీ లేకుండానే వారిని అరెస్ట్ చేసే అధికారం ఈ సెక్షన్ ద్వారా పోలీసులకు లభిస్తోంది. ఈ సెక్షన్‌తో పాటు మత మార్పిడుల నిరోధక చట్టంలోని సెక్షన్ 3, 5(1) కింద కూడా కేసు నమోదు చేశారు. యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం 2020లో ఆర్డినెన్స్ రూపంలో ఈ చట్టాన్ని తీసుకొచ్చింది.

2020 నవంబర్ నుండి గత ఏడాది జూలై 31 వరకూ మత మార్పిడుల నిరోధక చట్టం కింద ఉత్తరప్రదేశ్‌లో 835 క్రిమినల్ కేసులు నమోదు చేసి 2,700 మందిని అరెస్ట్ చేశారు. వారిలో సరోజ్ ఒకరు. ఈ చట్టాన్ని ప్రయోగించి యోగి ప్రభుత్వం తప్పుడు కేసులు పెడుతోందని హక్కుల కార్యకర్తలు, ప్రతిపక్షాలు, న్యాయవాదులు విమర్శించినా ప్రభుత్వంలో చలనం లేదు. చట్టం కింద నమోదు చేస్తున్న కేసుల సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ శిక్షలు పడిన సందర్భాలు చాలా తక్కువే. తప్పుడు ఆరోపణలు మోపి కేసులు పెట్టిన పోలీసులపై బరేలీ కోర్టు చట్టపరమైన చర్యలకు ఆదేశించిన సందర్భం కూడా ఉంది. సరోజ్‌పై కేసు పెట్టి జైలుకు పంపిన పదిహేను నెలల తర్వాత ఆయనను న్యాయస్థానం నిర్దోషిగా విడిచిపెట్టింది. సరోజ్ విడుదలైనప్పటికీ హిందూత్వ మూకల దాడితో తీవ్రంగా గాయపడిన ఆయన భార్య ఇప్పటికీ కోలుకోలేదు. ఆమె పని చేసుకునే స్థితిలో కూడా లేరు. రాయబరేలీలోని ఏఐఐఎంఎస్‌లో వారం రోజుల పాటు చికిత్స పొందినా ఆమె ఆరోగ్యం కుదుటపడలేదు.

కంటిచూపు దెబ్బతిన్నది. జ్ఞాపకశక్తి కూడా కోల్పోయింది. యోగి ప్రభుత్వం రూపొందించిన మతమార్పిడుల నిరోధక చట్టంలో కఠినమైన నిబంధనలు ఉన్నాయి. బాధితుడు కాకపోయినా, బాధితుల బంధువులు కాకపోయినా ఎవరైనా మత మార్పిడులపై ఫిర్యాదు చేయవచ్చు. సరోజ్ పోరాటంలో మత మార్పిడుల నిరోధక కేసు ఓ పార్శ్వం మాత్రమే. హిందూత్వ వాదులు ఆయన, ఆయన కుటుంబ సభ్యులపై దాడి చేసిన తర్వాత వారిపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ప్రతిని పొందేందుకు సరోజ్ ఎన్నో ఇబ్బందులు పడ్డారు. స్థానిక కోర్టును ఆశ్రయించిన తర్వాతే 17 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల్లో బజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ సురేష్ సింగ్, అతని సహచరులు పప్పూ కౌశల్, రామ్ సంజీవన్, సతీష్ జోషీ, అమన్ సింగ్, శివ, ధీరజ్ కౌశల్ ఉన్నారు. సరోజ్ నిర్దోషిగా బయటికి వచ్చినప్పటికీ ఈ కేసులో నిందితులకు శిక్ష పడుతుందన్న నమ్మకం ఆయనలో కన్పించడం లేదు.

నవతెలంగాణ

మనిషిని సంస్కారవంతుడిగా తీర్చిదిద్దేదే
నిజమైన విద్య - స్వామి వివేకానంద

బుధవారం 8 జనవరి 2025
www.navatelangana.com

సంపాదకీయం

# 'మృత్యు' దారులు




రోడ్డు ప్రమాదాల నివారణ భారతదేశంలో అతి పెద్ద సవాలుగా మారింది. దేశంలో ఏటా సుమారు ఐదు లక్షల రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటే వాటిలో లక్షా 50 వేల మంది దుర్మరణం పాలవుతున్నారు. వేల కుటుంబాలు ఆర్థిక, మానసిక భారం మోస్తున్నాయి. ఆప్తులను కోల్పోయి ఎన్నో కుటుంబాలు కన్నీరుమున్నీరవుతున్నాయి. గతేడాది డిసెంబర్ నుంచి ఈ ఏడాది జనవరి ఐదు వరకు ఈ కొద్ది కాలంలోనే తెలంగాణలో 80 మంది పైగా మంది దుర్మరణం చెందినట్టు పోలీస్‌వర్గాల సమాచారం. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇదే పరిస్థితి. దేశంలో మిగతా రాష్ట్రాల్లో ఇంతకంటే ఎక్కువగానే ఉన్నాయంటే ప్రమాదాల తీవ్రత అర్థమవుతోంది. ఈ దుర్ఘటనలు వ్యక్తిగత, సామాజిక జీవితాలపై తీవ్రమైన ప్రభావం చూపుతున్నాయి. రోడ్లు విస్తరిస్తున్నా, ఆధునీకరిస్తున్నా, సాంకేతికంగా తీర్చిదిద్దుతున్నా, ప్రమాదాల నివారణకు ఏటేటా భద్రతా వారోత్సవాలు చేపడుతున్నా, కఠినమైన చట్టాలు తీసుకొస్తున్నా ప్రమాదాలు, మృతుల సంఖ్య తగ్గకపోగా రోజురోజుకూ ఆ సంఖ్య పెరుగుతుండటం ఆందోళనాకరం.

> కేంద్రంతో పాటు మిగతా ప్రభుత్వాలు చాలాచోట్ల స్థానికుల అవసరాలను నిర్లక్ష్యం చేయడం వల్లే పెద్దఎత్తున ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితులూ ఉన్నాయి. డ్రైవర్లకు పని గంటలను కచ్చితంగా పెట్టాలి. అవి లేకపోవడంతో నిద్రలేమితో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. చిన్న వయస్సులోనే రోడ్డు భద్రతపై పిల్లలకు అవగాహన కల్పించాలి. వాహనాల రద్దీకి అనుగుణంగా రోడ్డు వెడల్పు ఉండాలి. జీబ్రా, క్రాసింగులు, పాదచారి వంతెనలు ఏర్పాటు చేయాలి. ప్రజారవాణా వ్యవస్థ అందుబాటులో ఉంటే ప్రజల భద్రతకు రక్షణగా ఉంటుంది. ఇష్టారాజ్యంగా నడిచే ప్రయివేటు వాహనాలను నియంత్రించాలి.

యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలంలో కారు పల్టీ కొట్టి చెరువులో పడటంతో ఐదుగురి మృతి చెందారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల వద్ద జరిగిన ప్రమాదంలో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఢీకొని నలుగురి మృతిచెందారు. మేడ్చెల్ జిల్లా పోచంపల్లి వద్ద రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాన్ని వాహనం ఢీకొనడంతో ఒకరు చనిపోయారు. స్పీడుగా పోతుండటం, లైట్లు చెక్ చేసుకోకపోవడం, హెల్మెట్ లేకుండా అతివేగంతో పోవడం వంటి నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదాలు చోటు చేసుకున్నాయని పోలీస్ రికార్డుల్లో నోట్ చేశారు. ఇవన్నీ ఇటీవల జరిగినవే. రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం ఉన్నా దాన్ని తొలగించకుండా అక్కడే ఉంచడం ఎవరి నిర్లక్ష్యం? చెరువుల చుట్టూ గోడ కట్టాల్సిన బాధ్యతెవరిది?. స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాల్సింది ఎవరు? వివిధ రకాల వాహనాలు వేర్వేరుగా పోవడానికి రోడ్లపై లైన్సు ఎవరు ఏర్పాటు చేయాలి? సైకిల్ పోవడానికి ప్రత్యేకమైన దారీ లేదంటే రోడ్ల నిర్వహణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. పనిష్మెంట్‌ల పేరుతో 2019 చట్టంలో సవరణలు కఠినంగా అమలు చేస్తున్నామని, అయినా ప్రమాదాలు తగ్గడం లేదని కేంద్ర రవాణాశాఖ మంత్రి గడ్కరీ సెలవిచ్చారు. ఈ ఏఐ వంటి కెమెరాల ఆధారంగా చలాన్‌లు జారీ చేసినా, వందల్లో పెనాల్టీలు వేలకు పెంచినా ఉపయోగం లేకుండా పోయింది. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చాక జనంపై భారాలు వేయడం తప్ప మౌలిక సదుపాయాలు కల్పించిన దాఖలాలు లేవు. హైదరాబాద్ వంటి నగరాల్లో ఫుట్‌పాత్‌ల మీద ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఘోరాలకు మానవ తప్పిదం ఎంతుందో పాలకుల నిర్లక్ష్యమూ అంతకంటే ఎక్కువగా ఉంది. దీనికంతటికీ సరైన రహదారి వ్యవస్థను అభివృద్ధి చేయడంలో కేంద్రం విఫలమైంది.

రోడ్ల నాణ్యత, రూపకల్పన, నిర్వహణ ప్రభావంపైనే రోడ్డు భద్రతా ఆధారపడి ఉంటుంది. ఇది వాస్తవం. గతంలో కేంద్రప్రభుత్వం ఏర్పాటు చేసిన సుందర్‌కమిటీ గానీ, సుప్రీంకోర్టు చేసిన సూచనలు గానీ రోడ్ల నిర్వహణపైనే చేశాయి. మనదగ్గర ఉన్న రోడ్లకు తగ్గ రీతిలో వాహనాల తయారీ లేవని నిపుణులు చెబుతున్నారు. విదేశాల్లో ఉన్న కఠిన చట్టాలను ఇక్కడ అమలు చేసినా తగ్గలేదంటే ..ఆ దేశాల్లో రోడ్లు బాగుంటాయి.. ఔటర్ రింగ్ రోడ్డు, కొన్ని చోట్ల నేషనల్ హైవేలపై దృష్టి పెడుతున్న ప్రభుత్వాలు.. నిత్యం జనం తిరిగే రోడ్లపై జాగ్రత్తలు పాటించడం లేదు. ఔటర్‌రింగ్ రోడ్ల వద్ద తగు చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నా అవి తూతూ మంత్రంగానే ఉన్నాయి. పిపిపి పద్ధతిలో రోడ్ల నిర్వహణకు ఇచ్చేసి చేతులు దులుపేసుకుంటున్నారు. ప్రమాదం అంటే అనుకోకుండా జరిగేది. ప్రమాదం జరిగినప్పుడు తప్ప అవి జరగకుండా ఏమీ చేస్తే బాగుంటుందన్నదానిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆలోచన లేకపోవడం బాధాకరం. అభివృద్ధి చెందిన దేశాల తరహాలో ఆన్‌రోడ్డు అంబులెన్స్ సౌకర్యం కల్పించడం వల్ల ప్రమాదాలు జరిగినా ప్రాణాపాయాన్ని నివారించొచ్చు. కేరళలో సేవ్ కేరళ ప్రాజెక్టు పేరుతో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటోంది అక్కడి ప్రభుత్వం. కేంద్రంతో పాటు మిగతా ప్రభుత్వాలు చాలాచోట్ల స్థానికుల అవసరాలను నిర్లక్ష్యం చేయడం వల్లే పెద్దఎత్తున ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితులూ ఉన్నాయి. డ్రైవర్లకు పని గంటలను కచ్చితంగా పెట్టాలి. అవి లేకపోవడంతో నిద్రలేమితో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. చిన్న వయస్సులోనే రోడ్డు భద్రతపై పిల్లలకు అవగాహన కల్పించాలి. వాహనాల రద్దీకి అనుగుణంగా రోడ్డు వెడల్పు ఉండాలి. జీబ్రా, క్రాసింగులు, పాదచారి వంతెనలు ఏర్పాటు చేయాలి. ప్రజారవాణా వ్యవస్థ అందుబాటులో ఉంటే ప్రజల భద్రతకు రక్షణగా ఉంటుంది. ఇష్టారాజ్యంగా నడిచే ప్రయివేటు వాహనాలను నియంత్రించాలి.

# మసకబారిన పదేండ్ల ప్రభ- కెనడా ప్రధాని రాజీనామా!



ఎం కోటేశ్వరరావు
8331013288

అతడు పదేండ్ల క్రితం లిబరల్ పార్టీకి అనూహ్య విజయం చేపట్టిన నేతగా నీరాజనాలు అందుకున్నాడు. ఇప్పుడు అతని ఉనికి పార్టీని పాతాళానికి దించుతుందంటూ అదే పార్టీ నేతలు తూర్పార పడుతున్నారు. అతడే కెనడా ప్రధాని, అంతకు ముందు ప్రకటనల మోడల్‌గా పనిచేసిన 53 సంవత్సరాల జస్టిన్ ట్రూడూ. ఇంటా బయటా తలెత్తిన పరిస్థితి కారణంగా ఉక్కిరి బిక్కిరితో పార్టీ, ప్రభుత్వ పదవి నుంచి తప్పుకొంటూ సోమవారం నాడు ఆకస్మికంగా రాజీనామా ప్రకటన చేశాడు. ఈ నెల 27న ప్రారంభం కావాల్సిన పార్లమెంటు సమావేశాలను మార్చి 24వరకు సస్పెండ్ చేశారు. వెంటనే పార్లమెంటును రద్దు చేసి ఎన్నికలు జరపాలని ప్రతిపక్షం డిమాండ్ చేసింది. పార్లమెంట్ ప్రారంభం కాగానే ప్రభుత్వం మీద అవిశ్వాస తీర్మానం పెడతామని మూడు ప్రధాన పార్టీలు ప్రకటించాయి. అదే జరిగితే ప్రభుత్వ పతనం ఖాయం. ట్రూడూ ప్రకటన వెలువడిన వెంటనే డోనాల్డ్ ట్రంప్ స్పందించాడు. అమెరికాలో 51వ రాష్ట్రంగా కెనడా విలీనం కావటం మంచిదని గతంలో చేసిన ప్రకటనను పునరుద్ఘాటించాడు. అది అందరికీ మంచిదన్నాడు, రష్యా, చైనాల నుంచి పోటీని ఎదుర్కోవాల్సిన అవసరం ఉండదన్నాడు. ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని ఎన్నుకొనేంత వరకు ట్రూడూ పదవుల్లో కానసాగుతాడు. వారం రోజుల్లో కొత్తనేతను ఎంపిక చేస్తామని లిబరల్ పార్టీ ప్రకటించింది. పార్టీలో తలెత్తిన కుమ్ములాటల కారణంగా పలుకుబడి పాతాళానికి పడిపోవటం, ఆర్థిక మంత్రి రాజీనామా, ఆర్థికంగా అనిశ్చితి, వాణిజ్య యుద్ధానికి డోనాల్డ్ ట్రంప్ ప్రకటన తదితర అనేక కారణాలతో ట్రూడూ రాజీనామా ప్రకటన చేస్తూనే తాను పోరాటయోధుడనని కొందరి మాదిరి వెనక్కు తగ్గేవాడిని కాదని చెప్పుకున్నాడు. దేశానికి నిజమైన నేత అవసరమని, పార్టీలో అంతర్గత పోరు కారణంగా వచ్చే ఎన్నికల్లో పార్టీని విజయపథాన నడిపించటానికి తాను తగిన వాడిని కాదని, ఈ అంశంతో పాటు ప్రభుత్వంలో సంక్షోభం రాజీనామాకు కారణాలని కూడా చెప్పుకున్నాడు. తాను తొలిసారి పదవిలోకి వచ్చినప్పటికంటే రెండోసారి మెరుగైన విజయాలను సాధించానని, ఎన్నికల సంస్కరణలను ప్రవేశపెట్టకపోవటం పట్ల విచారిస్తున్నానని చెప్పాడు. రాజీనామా చేయటానికి ముందు అనేక మంది స్వంత పార్టీ ఎంపీలు గద్దె దిగాలని డిమాండ్ చేశారు.ట్రూడూ ఏ మాత్రం కొనసాగినా వచ్చే ఎన్నికల్లో ఓడిపోవటం ఖాయమని అనేక సర్వేలు వెల్లడించాయి. గడచిన రెండు ఎన్నికల్లోనూ లిబరల్ పార్టీ తక్కువ శాతం ఓట్లతో ఎక్కువ సీట్లు తెచ్చుకొని మైనారిటీ ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది.2021లో జరిగిన ఎన్నికల్లో 338 పార్లమెంటు స్థానాలకు గాను 160 సీట్లు తెచ్చుకున్న లిబరల్ పార్టీకి 32.62శాతం ఓట్లు రాగా ప్రతిపక్ష కన్సర్వేటివ్ పార్టీకి 33.74శాతం ఓట్లు 119 సీట్లు వచ్చాయి. న్యూడెమోక్రటిక్ పార్టీ(ఎన్‌డిపి)కి 17.82శాతం ఓట్లు 25 సీట్లు వచ్చాయి. ఈ పార్టీ మద్దతుతో ట్రూడూ నెట్టుకొచ్చాడు.

గతేడాది సెప్టెంబరులో న్యూడెమోక్రటిక్ పార్టీ మద్దతు ఉపసంహరించు కోవటంతో అస్థిర పరిస్థితి ఏర్పడింది. 2025 అక్టోబరు వరకు పార్లమెంటు వ్యవధి ఉన్నప్పటికీ ఏ క్షణంలోనైనా పార్లమెంటు రద్దు, మధ్యంతర ఎన్నికలు రావచ్చని భావించారు. అయితే సమస్యను బట్టి తాము మద్దతు లేదా వ్యతిరేకించటం చేస్తామని ఎన్‌డిపి ప్రకటించటంతో ప్రభుత్వం ఊపిరి పీల్చుకుంది. అయితే డిసెంబరు 16న ఉప ప్రధాని, ఆర్థిక మంత్రి క్రిస్టియా ఫ్రీ లాండ్ రాజీనామాతో పాలకపార్టీలో లుకలుకలు తీవ్రమ య్యాయని చెప్పవచ్చు. ఆమెతో జరిపిన "ప్రయివేటు సంభాషణ"ల గురించి తాను చెప్పలేనని, ఆమె రాజీనామాయే తన నిర్ణయానికి దారితీసిందనిగానీ లేదని తాను చెప్పనని ట్రూడూ విలేకర్లతో చెప్పాడు.ఇటీవలి వరకు ట్రూడూ మైనారిటీ ప్రభుత్వాన్ని నిలబెట్టిన వామపక్ష న్యూ డెమోక్రటిక్ పార్టీ నేత జగ్‌మీత్ సింగ్ తాజా పరిణామాలపై వ్యాఖ్యానిస్తూ తరువాత లిబరల్ పార్టీ నేత ఎవరుంటారన్నది సమస్య కాదు.వారు జనాన్ని మోసం చేశారు, మరోసారి అవకాశానికి అనర్హులు అన్నాడు.

2015 ఎన్నికల్లో అనూహ్యంగా లిబరల్ పార్టీ అంతకుముందు మూడవ పెద్ద పార్టీగా 36 సీట్ల నుంచి ఏకంగా 184 సంపాదించి తిరుగులేని మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. 2019లో 157 సీట్లకు పడిపోయింది, మైనారిటీ ప్రభుత్వానికి నాయకత్వం వహించిన ట్రూడూ 2021లో పార్లమెంటును రద్దు చేసి సెప్టెంబరులో ఎన్నికలు నిర్వహించారు. ఆ ఎన్నికల్లో ఓట్లు తగ్గినా 160 సీట్లతో మరోసారి మైనారిటీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాడు. ఇప్పుడు లిబరల్ పార్టీ ఎన్నుకొనే కొత్త నాయకత్వం పార్లమెంటులో బలనిరూపణ చేసుకుం టుందా, పార్లమెంటును రద్దు చేసి ముందస్తుకు వెళతారా అన్నది తెలియదు. ఎవరు బాధ్యతలు చేపట్టినప్పటికీ ట్రూడూ తెచ్చిన అపఖ్యాతిని మోయాల్సి ఉంటుంది. 2019 ఎన్నికల్లో ట్రూడూపై అనేక విమర్శలు వచ్చాయి. వయస్సు తక్కువగా కనిపించేందుకు ముఖానికి రంగువేసుకొని తీయించుకున్న ఫొటోలతో ప్రచారం చేసుకున్నాడని ప్రతిపక్షాలు విమర్శించాయి.అనేక అవకతవకల విమర్శలు వచ్చాయి. ధనికదేశాల జి7 కూటమిలో అత్యధికంగా తొమ్మిదేండ్ల అధికారంలో కొనసాగిన రికార్డును ట్రుడేవ్ నెలకొల్పాడు.

> 2015 ఎన్నికల్లో అనూహ్యంగా లిబరల్ పార్టీ అంతకుముందు మూడవ పెద్ద పార్టీగా 36 సీట్ల నుంచి ఏకంగా 184 సంపాదించి తిరుగులేని మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. 2019లో 157 సీట్లకు పడిపోయింది, మైనారిటీ ప్రభుత్వానికి నాయకత్వం వహించిన ట్రూడూ 2021లో పార్లమెంటును రద్దు చేసి సెప్టెంబరులో ఎన్నికలు నిర్వహించారు. ఆ ఎన్నికల్లో ఓట్లు తగ్గినా 160 సీట్లతో మరోసారి మైనారిటీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాడు. ఇప్పుడు లిబరల్ పార్టీ ఎన్నుకొనే కొత్త నాయకత్వం పార్లమెంటులో బలనిరూపణ చేసుకుంటుందా, పార్లమెంటును రద్దు చేసి ముందస్తుకు వెళతారా అన్నది తెలియదు. ఎవరు బాధ్యతలు చేపట్టినప్పటికీ ట్రూడూ తెచ్చిన అపఖ్యాతిని మోయాల్సి ఉంటుంది.




పెరుగుతున్న ధరలు రోజువారీ జీవనాన్ని ప్రభావితం చేస్తున్నాయని రెండేండ్ల క్రితం 33శాతం మంది కెనడా పౌరులు చెబితే 2024లో 45శాతానికి పెరిగినట్లు సామాజిక సర్వే వెల్లడించింది. ఇండ్ల అద్దెలు భరించలేకుండా ఉన్నామని 38శాతం చెప్పారు. 2021 నుంచి ధరల ద్రవ్యోల్బణం పెరుగుదల వలన ప్రతి ఐదుగురిలో ఒకరు సామాజిక సంస్థల నుంచి తక్కువగానో ఎక్కువగానో ఆహారాన్ని పొందినట్లు చెప్పారు. ఆర్థిక సమస్యలతో స్వల్పంగా లేదా తీవ్రంగా మానసిక ఒత్తిడికి గురైనట్లు 35శాతం చెప్పారు. తక్కువ ఆదాయం వచ్చే వారిలో ఇలాంటి సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. అద్దె ఇండ్లలో ఉండేవారిలో జీవన సంతృప్తి చాలా తక్కువగా ఉంది.వయసు మీరిన వారికంటే యువత ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు తేలింది.25-44 సంవత్సరాల వయస్సులో ఉన్నవారిలో 55శాతం మంది ధరల పెరుగుదల గురించి ఆందోళన వెల్లడించారు.వృద్ధులలో 28శాతం ఉన్నారు. ఫుడ్ బాంకులు, సామాజిక సంస్థల నుంచి ఆహారాన్ని పొందుతున్నవారు యువకులలో 46-47శాతం ఉండగా వృద్ధులలో 27-28శాతం ఉన్నారు. పిల్లలపై ధరల పెరుగుదల ప్రతికూల ప్రభావం గురించి చెప్పనవసరం లేదు. ఆర్థికంగా కెనడా తీవ్రమైన అనిశ్చితిని ఎదుర్కొంటోంది.

2008లో ధనిక దేశాల్లో తలెత్తిన సంక్షోభం నాటి నుంచి నేటి వరకు కెనడాలో అనిశ్చితి సూచిక తీవ్ర ఒడిదుడులకు లోనవుతున్నది. రెండువేల సంవత్సరం నుంచి 2008 వరకు 50 నుంచి 200 మధ్య కదలాడగా తరువాత అది వంద నుంచి 400 మధ్య ఊగిసలాడింది. 2020 కరోనా సమయంలో గరిష్ఠంగా 690, గతేడాది 650గా ఉంది. ట్రూడూ ప్రకటనతో ఈ ఏడాది అది మరింతగా పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. నూతన ప్రభుత్వం ఏర్పడినప్పటికీ అక్టోబరులోగా ఎన్నికలు జరగాల్సి ఉండగా పెట్టుబడిదారులు ఎలాంటి నిర్ణయాలు తీసుకొనే అవకాశం లేదు, తమ ప్రాజెక్టులను తాత్కాలింగా నిలిపివేయటం లేదా వాయిదా వేసుకొనే అవకాశాలు ఉన్నాయి. ఇది ఉపాధి మీద కూడా తీవ్ర ప్రభావం చూపటం అనివార్యం. నూతన నియామకాలు పరిమితమవుతాయి. కరెన్సీ కెనడా డాలరు విలువ కూడా గత వారంలో పతనమై కొత్త రికార్డు నెలకొల్పింది. ప్రధాని రాజీనామా ప్రకటన తరువాత స్వల్పంగా పెరిగినప్పటికీ అనిశ్చితిలో కొనసాగవచ్చు. కెనడా అతి పెద్ద వాణిజ్య భాగస్వామి అమెరికా. దిగుమతి చేసుకొనే వస్తువులపై 25శాతం పన్ను విధిస్తానని డోనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన గురించి తెలిసిందే.ఆర్థిక రంగంలో అనిశ్చిత పరిస్థితి ఉన్న కారణంగా దీని గురించి బేరమాడే శక్తి కెనడాకు తగ్గుతుంది.ట్రంప్ చర్య అమెరికా వినియోగదారుల మీద భారాలు మోపినప్పటికీ కెనడా ఎగుమతుల మీద కూడా ప్రతికూల ప్రభావం చూపనుంది.1985 నుంచి రెండు దేశాల మధ్య వాణిజ్య లావాదేవీలలో కెనడా మిగులులో ఉంది. తమ వస్తువులను మరింతగా దిగుమతి చేసుకోవాలని అమెరికా ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తోంది.

గత కొద్ది నెలలుగా పార్టీ ఎంపీలు అనేక మంది డిమాండ్ చేసినప్పటికీ రాజీనామాకు ససేమిరా అన్న ట్రూడూ డిసెంబరు నెలలో జరిగిన పరిణామంతో దిగిరాక తప్పలేదు. ప్రధానితో తన విబేధాల గురించి ఫ్రీలాండ్ రాజీనామా లేఖలో వెల్లడించారు. రాజకీయ జిమ్మిక్కులు భారీ మూల్యం చెల్లిస్తున్నాయంటూ పరోక్షంగా చేసిన విమర్శల లేఖను బహిర్గతం చేయటంతో ఒత్తిడి మరింత పెరిగింది. ఈ ఏడాది బడ్జెట్‌లోటు 20 బిలియన్ డాలర్లు ఉంటుందని అంచనా వేయగా అది 60బిలియన్ డాలర్లకు పెరిగింది.బడ్జెట్ లోటు, ఆర్థిక అసమానతలను తగ్గిస్తానంటూ యువకుడిగా రంగంలోకి దిగిన ట్రూడూకు యువతరం బ్రహ్మరథం పట్టడంతో 2015లో ఘనవిజయం లభించింది, ఆచరణలో దానికి భిన్నంగా వ్యవహరించాడు.

తీవ్రమైన అవినీతి ఆరోపణలను కూడా ఎదుర్కొన్నాడు. ట్రూడూ రాజీనామాతో పాలక లిబరల్ పార్టీ, ప్రతిపక్ష కన్సర్వేటివ్ పార్టీ నుంచి ప్రధాని పదవికి పోటీ పెరిగింది. మంత్రి పదవికి రాజీనామా చేసిన క్రిస్టియా ఫ్రీలాండ్, ప్రస్తుతం రవాణాశాఖ మంత్రిగా ఉన్న భారతీయ సంతతికి చెందిన అనిత ఇందిరా ఆనంద్, విదేశాంగ మంత్రి మెలీనా జోలీ కూడా ప్రధాన పోటీదారుగా ఉన్నట్లు వార్తలు వచ్చాయి. బాంక్ ఆఫ్ ఇంగ్లాండ్, బాంక్ ఆఫ్ కెనడా గవర్నర్‌గా పనిచేసి ట్రూడూకు సలహాదారుగా ఉన్న మార్క్ కార్నే కూడా రేసులో ఉన్నాడు.ప్రభుత్వానికి అపకీర్తి తెచ్చిన కార్బన్ పన్ను విధింపు ఇతగాడి సలహామేరకే జరిగింది.

మూడుసార్లు ఓట్లు అధికంగా తెచ్చుకున్నప్పటికీ అవసరమైన సీట్లు తెచ్చుకోవటంలో విఫలమైన ప్రతిపక్ష నేత పిరే పోయిలివరే ఎన్నికల్లో మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకొనేందుకు సిద్ధమవుతున్నాడు. ఒక టీవీ జరిపిన సర్వేలో పిరేకు 44.2శాతం మంది మద్దతు ప్రకటించగా ట్రుడెవ్‌కు 24శాతం ఉన్నారు.కరోనా తరువాత వివిధ దేశాలలో జరిగిన ఎన్నికల తీరుతెన్నులను చూస్తే అధికారంలో ఉన్నవారందరూ దాదాపు ఓడిపోయారు. కెనడాలో కూడా లిబరల్ పార్టీ పరిస్థితి అలాగే ఉంది. రకరకాల ఆకర్షక వాగ్దానాలతో మద్దతు పొందిన వారిని హృదయ సామ్రాట్టులుగా జేజేలు కొట్టిన జనమే తీరు మారితే ఏ విధంగా తరిమి కొట్టారో బంగ్లాదేశ్, శ్రీలంక పరిణామాలు స్పష్టం చేశాయి. మన దేశంలో పాలక పార్టీలు వీటి నుంచి గుణపాఠాలు తీసుకుంటాయా? ■

# డిజిటల్ ట్రోల్స్ - డేంజర్ బెల్స్



శ్రీ సుందర్
8498084005

'పిచ్చోడి చేతిలో రాయి..అది ఏడ తగులుతుందో తెలియదోయ్' అన్నాడో కవి. మతోన్మాది చేతిలో డిజిటల్ మీడియా అది ఎన్ని దారుణాలకు తెగబడుతుందో గమనించి అలెర్ట్‌వ్వాల్సిన సందర్భమిది. హైదరాబాద్ నడిబొడ్డున జరిగిన జాతీయ బుక్ ఫెయిర్ సాక్షిగా ఒక కుట్ర బట్టబయలైంది. బుక్ ఫెయిర్ చివరి రోజు 'వీక్షణం' స్టాల్‌కు వచ్చాడో అగంతకుడు. సెల్‌ఫోన్ కెమెరా ఆన్‌చేసి, ప్రముఖ జర్నలిస్ట్, రచయిత వేణుగోపాల్ గారిని ట్రిగ్గర్ చేశాడు. 'హిందూ ధర్మాన్ని కించపరిచేటట్లు ఉన్న బుక్, మీరెట్ల అమ్ముతారు? మీరు హిందుత్వాన్ని కించపరుస్తారా? మీ పేరేంటి? మీరు హిందూమతాన్ని పాటిస్తారా, పాటించరా?' ఇలా వాదనకు దిగాడు ఆ ట్రోలర్. అన్ని ప్రశ్నలకు టకాటక్ సమాధానాలు ఇస్తూ పోయాడు వేణుగోపాల్. కానీ వచ్చిన వ్యక్తి ఎవరు? ఎందుకొచ్చాడు? ఎందుకు వీడియో తీస్తున్నాడు? అతనికెందుకు సమాధానం చెప్పాలి? ఆ వీడియోను ఏం చేస్తాడు? అని వేణుగోపాల్‌తో పాటు అక్కడివారెవ్వరూ అంచనా కట్టలేదు. ఆ వీడియోతో పాటు వేణుగోపాల్ ఫోన్ నెంబర్‌ను జోడించి, సోషల్ మీడియాలో వైరల్ చేశారు. నాలుగైదు రోజులుగా వందలాది ఫోన్లు. బెదిరింపులు, తిట్లు. ఈ క్రనాలజీని పరిశీలిస్తే అప్పటికప్పుడు తీసిన వీడియో అనుకోవాలా? కాన్షిరసీ లేదనుకోవడానికి వీలుందా? ఇది పక్కా వెల్ డిజైన్డ్ డిజిటల్ మూకదాడి, కాదనగలమా!

ప్రజాకవి జయరాజుపైన జరిగింది కూడా సరిగ్గా ఇలాంటిదే. ఒకరోజు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి ప్రశ్నలడుగుతుంటే జయరాజు హుందాగా సమాధానాలిస్తూ పోయాడు. క్రమంగా వాగ్వాదానికి దిగాడా కుట్రదారు. కొంత సమయం ఓపిక పట్టి గట్టి క్లాస్ తీసుకున్నాడు జయరాజు. ఆ కాల్ రికార్డు చేసి, తమకు అనుకూలంగా ఉన్న భాగాన్ని ఎడిట్ చేశారు. వీడియోతో పాటు జయరాజు ఫోన్ నంబర్‌నూ వైరల్ చేశారు. ఇంకేముంది? వందలాది ఫోన్లు, మెసేజీలు. పోలీసులను ఆశ్రయించినా పెద్దగా ప్రయోజనం జరగలేదు. ప్రజాస్వామిక గొంతులన్నీ ఏకమై కవి జయరాజుకు మద్దతుగా రౌండ్ టేబుల్స్, సోషల్ మీడియాలో ఒక క్యాంపెయిన్ జరిపితేగానీ ట్రోల్స్ సద్దుమణగలేదు. సాహితీవేత్త కత్తి పద్మారావుపైనా డిజిటల్ మూకదాడి మరో రూపంలో జరిగింది. యూట్యూబ్ ఛానెల్స్‌ను అడ్డం పెట్టుకున్న ఒక మతోన్మాద ముఠా, ఆయన ఏదో సందర్భంలో మాట్లాడిన వీడియో నుండి చిన్న బిట్ కట్ చేసింది. ఆ వీడియోను చూపిస్తూ బూతు పురాణానికి దిగింది. అవమానకర రీతిలో ట్రోల్ చేసింది. ప్రజాస్వామిక శక్తులన్నీ ఏకమై, కత్తి పద్మారావుకు మద్దతుగా గొంతు కలిపితేనే ట్రోలింగ్ ఆగింది. యాక్టివిస్టులు బైరి



నరేష్, రెంజర్ల రాజేష్ మాట్లాడిన సుదీర్ఘ స్పీచ్‌లలో కొన్ని ముక్కలు కట్‌చేసి అతికించి తప్పుడు అర్థాలు వచ్చేట్లు ఎడిట్ చేసి వైరల్ చేశారు. వైరలవుతున్న వీడియో నిజమా, అబద్ధమా అని నిర్ధారించే తీరిక, ఓపిక లేకుండా పోయింది ప్రముఖ టీవీ ఛానెల్స్‌వారికి. తప్పుడు వీడియోలనే రిపీటెడ్‌గా ప్లేచేశారు. దీంతో ఉత్తర భారతదేశ మూకదాడుల విష సంస్కృతి తెలంగాణలో స్వైరవిహారం చేసింది. సినీఫక్కీలో పోలీసు వాహనాన్ని చేజ్ చేసి అందులో ఉన్న బైరి నరేష్‌పై మూకదాడి చేసింది. పోలీసు వాహనంలోనే హత్యాయత్నం జరిగితే, ఒక్కరోజులోనే ఉన్మాదులకు బెయిల్ దొరికింది. ఆ క్రమంలోనే నిజామాబాద్ జిల్లాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మల్లికార్జున్ మరికొంతమందిపై వరుస మూక దాడులు జరిగాయి. అప్పుడు తెలంగాణ సమాజమంతా ఏకతాటిపైకి వచ్చి 120 సంఘాలతో స్వేచ్ఛా జాక్ ఏర్పాటు చేసింది. రౌండ్ టేబుల్ సమావేశాలతో అండగా నిలిచి, ఘటనా స్థలాలకు, బాధితుల వద్దకు నేరుగా వెళ్లి ధైర్యాన్ని చెప్పింది. పరిస్థితి మరింత అదుపు తప్పకుండా కట్టడిచేసింది ఐక్య కార్యాచరణే.

జర్నలిస్టులనూ విడిచిపెట్టలేదు వాట్సాప్ యూనివర్సిటీ. ప్రొ నాగేశ్వర్, తెలకపల్లి రవి, జర్నలిస్టు తులసి చందు, మహువా మీడియా, టి10, ఎన్9 మీడియా లాంటి అభ్యుదయ ఛానెల్స్‌ను టార్గెట్ చేసింది. వీడియోలు, పోస్టుల కింద బూతు కామెంట్లు రాసింది. రిపోర్టులు కొట్టించింది. ఒక దశలో ఈ ట్రోల్స్ భరించలేక తులసి చందు బయటికొచ్చి 'నన్ను చంపినా నా ప్రశ్న ఆగదు' అంటూ.. ఒక బహిరంగ లేఖను రాసింది. తెలుగు సమాజం ఆమెకు మద్దతుగా నిలిచింది. ఇలా కేవలం నలుగురైదుగురితో మాత్రమే ఆగలేదు. యాక్టివిస్ట్ దేవి, పివోడబ్ల్యు సంధ్య, విజ్ఞాన దర్శిని రమేష్, బాబుగోగినేని, ప్రొ.సూరేపల్లి సుజాత, మెర్సీ మార్గరేట్, జిలుకర శ్రీనివాస్, పసునూరి రవీందర్, దిగంబర్ కాంబ్లే, కవులు, కళాకారులపై ట్రోల్స్ మూక ఎగబడింది. ప్రశ్నించే ప్రతిగొంతు ఏదో ఒక సందర్భంలో టార్గెట్ చేయబడి ట్రోల్స్‌కు గురయ్యింది. వాట్సాప్ యూనివర్సిటీ సైన్యాన్ని రంగంలోకి దింపుతుంది. ఒక్కొక్కరినీ ఒంటరిని చేసి ట్రోల్స్ చేస్తోంది. పర్సనల్ అబ్యూజ్, క్యారెక్టర్ అసాసినేషన్ చేస్తూ, ఫ్యామిలీ మెంబర్లనూ బూతులు తిడుతుంది. ఫోన్ నెంబర్లను వైరల్ చేస్తూ, బెదిరిస్తూ, భయపెడుతూ పౌర సమాజంలోనే వారిని వేరుగా చూసేలా తీవ్ర ప్రయత్నం చేస్తోంది.

ఈ డిజిటల్ మూకదాడులు భౌతికదాడులకూ పురిగొల్పుతున్నాయి. దాడులు కాకతాళీయంగా జరుగుతున్నవి కావు. వారి సైద్ధాంతిక పునాదుల్లోంచే వీటిని చూడాలి. వారు ఎంచుకున్న 'శత్రువర్గం'పైనే వ్యూహాత్మక దాడులు చేస్తున్నాయి. సైన్స్ ప్రచారకులు, జర్నలిస్టులు, హేతువాదులు, మానవవాదులు, నాస్తికులు, లెఫ్టిస్టులు, దళితులు, యాక్టివిస్టులు, రచయితలు, అభ్యుదయవాదులే వారి లక్ష్యం. అప్రమత్తంగా, ఐక్యంగా లేకుంటే జరిగే నష్టాన్ని ఊహించలేం, పూరించలేం. అభ్యుదయవాదుల మధ్య చిన్న చిన్న భేదాభిప్రాయాలు, భిన్నాభిప్రాయాలు ఉండొచ్చు. ఉంటాయి కూడా. ట్రోల్స్, డిజిటల్ మూకదాడుల సమయంలో ఏకతాటిపైకి వచ్చి తిప్పి కొడితేనే తోకముడుస్తున్నారన్న నిజాన్ని గుర్తించాలి. 2025 ప్రారంభంలోనే వేణుగోపాల్‌తో పాటు 'ఉచ్చల జలధితరంగ' పుస్తకంలో కవితలు రాసిన పంతొమ్మిది మంది అభ్యుదయ కవుల్ని కూడా టార్గెట్ చేస్తూ మతోన్మాదుల క్యాంపెయిన్ నడుస్తోందిప్పుడు. కుట్రదారుడే రాజ్యాన్ని నడుపుతున్న సందర్భం. ప్రమాదం ఏవైపునుండి, ఏరూపంలో వస్తుందో! ఏ ఇంటి తలుపుతడుతుందో చెప్పలేం. నేను బానే ఉన్నాననే భ్రమతో కండ్లముందు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించకుంటే, ఆ మూకలు నీ, నాదాకా రావడానికి పెద్ద టైం పట్టకపోవచ్చు మిత్రమా. బి అలెర్ట్.. ■

# ఇదేనా..హిందూధర్మం?



టి. స్కైలాబ్ బాబు
9177549646

రాష్ట్ర రాజధానికి ముప్పయి కిలోమీటర్ల దూరంలో ఉన్న రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భక్తి ముసుగులో బడిపంతులుపై ఇటీవల జరిగిన దాడి అమానుషమైనది. ప్రజలు, ప్రజాతంత్రవాదులు, విద్యావంతులు, మేధావులు తీవ్రంగా పరిగణించాల్సిన అంశమిది. అయ్యప్పమాల వేసుకున్న విద్యార్థిని అవమానించాడనే పేరుతో వీహెచ్‌పీ, ఆరెస్సెస్ కార్యకర్తలు పాఠశాల హెడ్మాస్టర్‌తో విద్యార్థి కాళ్లు మొక్కించడం చూస్తే ఇంతకన్నా దౌర్జన్యం ఏముంటుంది? ఇదంతా ఎవరు చేశారు? దాడి వెనుక పాత్రధారులు, సూత్రధారులెవరు? పాఠశాలను సందర్శించి లోతుగా పరిశీలిస్తే దీని వెనుక ఉన్న సంఘ్‌పరివార్ కుట్ర బయటపడింది. డిసెంబర్ 21న ఎనిమిదో తరగతి విద్యార్థులను సాయంత్రం పాఠశాల ఆవరణలోని గ్రౌండ్‌లో చెట్ల కింద కూర్చోబెట్టి ప్రధానోపాధ్యాయులు కంబాలపల్లి రాములు టేబుల్స్ (ఎక్కాలు)అడుగుతున్నాడు. చెప్పిన విద్యార్థులను కూర్చోమని, చెప్పని విద్యార్థులను నిల్చోమని చెప్పాడు. అయ్యప్పస్వామి మాల ధరించిన బి.అరుణ్ అనే విద్యార్థి ఎక్కాలకు సమాధానం చెప్పకపోవడంతో టీచర్ వెనక నుండి వచ్చి ఆ పిల్లవాడిని లేపుతున్న క్రమంలో ఆయన మోకాలు విద్యార్థి వీపునకు తగిలింది. దీంతో ఆ విద్యార్థి మధ్యాహ్నం లంచ్ సమయంలో భిక్షకు వెళ్లి అక్కడ అయ్యప్ప స్వాముల సన్నిధిలో 'మా హెడ్మాస్టర్ కన్నెస్వామిగా ఉన్న నన్ను కాలుతో తన్నాడని' చెప్పాడు. దీన్ని ఆసరా చేసుకుని వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ సంబంధిత సంఘాల కార్యకర్తలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా మెసేజ్‌లు ఫార్వార్డ్ చేశారు.

23న ఉదయం సుమారు 30 మంది అయ్యప్ప స్వామి మాలదారులు, మరో 20 మంది సివిల్ డ్రెస్ వేసుకున్న భజరంగ్ దళ్, విహెచ్‌పీ కార్యకర్తలు పాఠశాల లోపలికి చొచ్చుకొని వచ్చారు. 'హెడ్మాస్టర్ రాములు సార్' ఎక్కడున్నాడని పాఠశాల ఉపాధ్యాయులను బెదిరిస్తూ వాగ్వాదానికి దిగారు. పరుష పదజాలంతో దురుసుగా మాట్లాడారు. 'వెంటనే పిలిపియ్యండి, ఇక్కడికి రాకపోతే మీ అందరికీ దేహశుద్ధి చేస్తాం' అంటూ మొత్తం పాఠశాల సిబ్బందిని హెచ్చరించారు. హిందూ ధర్మాన్ని కించపరిస్తే ఊరుకునేది లేదు. స్వామియే శరణమయ్యప్ప, జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు.ఇంతలోగా హెడ్మాస్టర్ రాగానే గదిలోకి చొచ్చుకొచ్చి ఆయన చొక్కాను, లోపలి బనీయన్‌ను చింపారు. తలపై, వీపుపై పిడిగుద్దులు గుద్దారు. హిందూ ధర్మాన్ని కించపరిస్తే మీ అందరికీ దేహశుద్ధి తప్పదని హెచ్చ రించారు. వాస్తవంగా అక్కడ ఉన్న సిబ్బంది మొత్తం హిందువులే. ముస్లింలు, క్రైస్తవులు ఏ ఒక్కరూ లేరు. అంతటితో ఆగలేదు. కన్నె స్వామిగా ఉన్న ఆ పాఠశాల విద్యార్థి బి.అరుణ్ కాళ్లు మొక్కించారు. అరుణ్ ఒక్కడి కాళ్లు మాత్రమే కాదు, మొత్తం



అయ్యప్ప స్వామి మాలదారులు ఎంతమంది ఇక్కడికి వచ్చారో అందరి కాళ్లు మొక్కాలని భయభ్రాంతులకు గురిచేశారు. ఈ విషయంపై హెడ్మాస్టర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, వారూ కూడా రివర్స్‌గా కేసు పెట్టారు. మున్సిపల్ కమిషనర్, మరికొంతమంది కౌన్సిలర్లు ఈ పంచాయితీ ఎందుకు? రాజీ పడటం మంచిదని ఒత్తిడి తీసుకొచ్చి ఫిర్యాదు ఉపసంహరించుకునే విధంగా చేశారు.

విద్యార్థి కాళ్ల ప్రధానోపాధ్యాయుడు మొక్కిన వీడియోను అయ్యప్ప స్వాములే ప్రత్యక్షంగా తమ ఫోన్‌లలో బంధించారు. దాన్ని ఇతర గ్రూపుల్లోకి ఫార్వర్డ్ చేయడంతో విస్తృత ప్రచారం జరిగింది. ప్రధానోపాధ్యాయుడితో విద్యార్థి కాళ్లు మొక్కించడమేమిటి? అసలు ఎందుకు జరిగింది? ఎవరీ పని చేశారని రాష్ట్రమంతటా సోషల్‌మీడియాలో చర్చ జరిగింది. ఆ తర్వాత కొన్ని ఉపాధ్యాయ, సామాజిక సంఘాలు, ఆ పాఠశాలను సందర్శించడం, విద్యార్థులు, సిబ్బంది నుంచి సమాచారం సేకరించాయి. మాధ్యమాల్లో జరిగిన ప్రచారం తర్వాత గురువు కాళ్లు శిష్యుడు మొక్కడం అనేది గురుశిష్య బంధానికి ఉన్న ఒక గౌరవం. కానీ, విద్యార్థి కాళ్లు ప్రధానోపాధ్యాయుడు మొక్కడమేంటి? ఈ ఘటనపై రాష్ట్రంలో విస్తృత చర్చ జరిగింది. హెడ్మాస్టర్ విద్యార్థిని ఒకవేళ కాలుతో తన్నినా విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి హెడ్మాస్టర్‌ను నిలదీసి అడగవచ్చు, లేదంటే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చు. కానీ తల్లిదండ్రులు ఎవరు పాఠ శాలకు రాలేదు. ఫిర్యాదూ చేయలేదు. మరి ఎందుకు ఇలా జరిగిందని చూస్తే దీని వెనకాల సంఘ్ పరివార్ శక్తులు మత విద్వేషాలు రెచ్చగొట్టారని వెల్లడైంది. ఈదాడి వెనుక ఉన్నది వారేనని విధితమమైంది.

వారు చెప్పే హిందూధర్మం ప్రకారం చూసినా మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ అని ప్రబోధిస్తుంటారు. ఆచార్యుడు దేవుడితో సమానమని సెలవిస్తారు. భక్తుడు దేవుడు కాళ్లు మొక్కడం మనం ఎక్కడైనా చూశాము. కానీ తుక్కుగూడలో దేవుడే భక్తుడు కాళ్లు మొక్కినట్టుగా ఉంది. ఆచార్యుడు విద్యార్థి కాళ్లు మొక్కడం, ఏ హిందూ ధర్మశాస్త్రంలో ఉందో చెప్పాలి. వారికి హిందూ మతం పైన గాని, ధర్మశాస్త్రాల పైన గాని, వేదాలు, శ్లోకాలు ఉపనిషత్తుల పైన గానీ ఏ రకమైనటువంటి అవగాహన లేదు. కానీ హిందూ ధర్మం, జైశ్రీరామ్ అనే ముసుగులో పాఠశాల ప్రధానోపాధ్యాయునిపై మాత్రం దౌర్జన్యానికి ఒడిగట్టారు. గురు బ్రహ్మ..గురువిష్ణు.. గురుదేవో మహేశ్వర, గురు సాక్షాత్ పరబ్రహ్మ తస్మైశ్రీ గురువే నమః అని అంటాము. విద్యార్థులకి ప్రబోధించే ధర్మమిది. వ్యక్తిగత విశ్వాసంగా ఉండాల్సిన మతం రాజకీయ పబ్బం గడుపుకోటానికి, రాజకీయ ప్రయోజనం కోసం దేవుడిని, భక్తిని అధికారాన్ని మిళితం చేస్తూ ఉన్మాద చర్యలకు ఒడిగడుతున్నారు. ఈ చర్యలను పౌర సమాజం ఖండించాలి. ఈ ఘటన జరిగి రెండు వారాలు కావస్తున్నా అధికారులుగానీ, ప్రజాప్రతినిధులుగానీ పాఠశాల వైపు కన్నెత్తి చూడలేదు. ప్రధానోపాధ్యాయుడిని పరామర్శించ లేదు. షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తి కావటంతోనే అతనిపై దాడిచేశారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ,ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేయాలి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి మతో న్మాదుల అరాచకాలకు అడ్డుకట్ట వేయాలి.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత సర్కారుదేనని గుర్తించాలి. ■

# ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో ప్రశ్నాస్త్రాలతో ఏసీబీ రెడీ

**మరోవైపు 16న కేటీఆర్‌ను పిలిచిన ఈడీ**

**నేడు బీఎల్ఎన్ రెడ్డి, అరవింద్ కుమార్ విచారణ**



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫార్ములా-ఈ కార్ రేసు కేసు దర్యాప్తులో ఒకవైపు ఏసీబీ, మరోవైపు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు తమ స్పీడును పెంచారు. ఈ కేసును పూర్తిగా ఎత్తివేయాలంటూ కేటీఆర్ పెట్టుకున్న క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు మంగళవారం కొట్టివేయటంతో ఈ కేసు దర్యాప్తులో ఏ క్షణాన, ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ నెలకొన్నది. ఈ నేపథ్యంలో ఈనెల 9న తమ ఎదుట విచారణ కావాలని ఏసీబీ ఇప్పటికే కేటీఆర్‌కు నోటీసులు ఇవ్వగా, మరోవైపు ఈనెల 16న తమ ముందు హాజరు కావాలని కేటీఆర్‌కు ఈడీ నుంచి కూడా నోటీసులు అందాయి. కాగా, హెచ్ఎండీఏ మాజీ కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌ను ఏసీబీ బుధవారం విచారించనుండగా.. అదేరోజు ఈ సంస్థకు చెందిన మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిని ఈడీ అధికారులు ప్రశ్నించనున్నారు. అనంతరం, 10న బీఎల్ఎన్ రెడ్డిని ఏసీబీ, 9న అరవింద్ కుమార్‌ను ఈడీ అధికారులు విచారించటానికి రంగం సిద్ధం చేసుకున్నారు. ముఖ్యంగా, ఫార్ములా-ఈ కార్ రేసింగ్‌కు సంబంధించి రూ.55 కోట్లను విదేశీ కంపెనీ అయిన ఎఫ్ఈఓకు బదిలీ చేసిన వైనంపై ఏసీబీ, ఈడీలు నిశితంగా దృష్టిని సారించనున్నాయి.

ఇదిలా ఉంటే, క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేయటంతో ఈ కేసులో ప్రధాన నిందితుడైన కేటీఆర్‌ను ఏ క్షణంలోనైనా ఏసీబీ అరెస్ట్ చేయొచ్చనే ఊహాగానాలు చెలరేగటంతో ఇటు బీఆర్ఎస్‌లో కలకలం చెలరేగింది. ఈ దిశగా ఒక దశలో ఏసీబీ ఉన్నతాధికారులు కూడా సమావేశమై ఆలోచన చేసినట్టు తెలిసింది. అయితే, ఎలాగో 9న విచారణకు పిలిచారు కాబట్టి అప్పటి వరకు నిరీక్షించటమే మేలని ఏసీబీ అధికారులు భావించినట్టు సమాచారం. ఈలోగా, అరవింద్‌కుమార్‌ను విచారించటం ద్వారా ఫార్ములా కారు రేసింగ్ నిర్వహణలో చోటు చేసుకున్న పలు అవకతవకలు వెలుగు చూసే అవకాశమున్నదనీ, దాని ఆధారంగా కేటీఆర్‌ను మరింత క్షుణ్ణంగా విచారించొచ్చని న్యాయ నిపుణులు ఏసీబీ అధికారులకు సూచించనట్టు తెలుస్తున్నది. కాగా, ఈ సారి కూడా విచారణకు తన వెంట న్యాయవాదులను తీసుకెళ్లటానికి అనుమతినివ్వాలంటూ కేటీఆర్ బుధవారం హైకోర్టును ఆశ్రయించనున్నట్టు సమాచారం. దీనిపై హైకోర్టు ఏ విధంగా స్పందిస్తుందోనని ఏసీబీ అధికారులు నిశితంగా గమనిస్తున్నారు.

ఈ కేసును ఎత్తివేయాలంటూ సుప్రీంకోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్ వేసిన దృష్ట్యా దాని పైన సుప్రీంకోర్టులో వాదించటానికి ఏసీబీ అధికారులు సైతం తమ వైపు నుంచి న్యాయవాదులను సిద్ధం చేసుకుంటున్నారు. మొత్తమ్మీద బుధవారం నుంచి ఈ కేసులో నిందితులను ప్రశ్నించటానికి అవసరమైన ప్రశ్నాస్త్రాలను ఏసీబీ అధికారులు రెడీ చేసుకున్నారు. ముఖ్యంగా, కార్ రేసింగ్‌కు సంబంధించి జరిగిన చెల్లింపుల్లో ఉల్లంఘనలు జరిగిన మాటలు వాస్తవమేనని హైకోర్టు సైతం గుర్తించిన నేపథ్యంలో ఈ డబ్బులతో ఎవరు లబ్ది పొందారనే దిశగా ఒకవైపు ఏసీబీ, మరోవైపు ఈడీ అధికారులు తమ దర్యాప్తును కేంద్రీకరించనున్నారు.

ఇదిలా ఉంటే, ఈ కేసులో విచారణకు కేటీఆర్‌ను పిలుస్తున్న నేపథ్యంలో బంజారాహిల్స్‌లోని తమ కార్యాలయం వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేయాలని ఏసీబీ డీజీ విజయ్ కుమార్.. బంజారాహిల్స్ ఏసీపీ వెంకట్‌రెడ్డిని పిలిచి సూచించారు.

**అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి ఇండ్లు..**

**గ్రీన్‌కో ఎనర్జీ కంపెనీ కార్యాలయాలపై ఏసీబీ దాడులు**

ఫార్ములా-ఈ కార్‌రేసింగ్ రూ.55 కోట్ల చెల్లింపుల్లో నిబంధనల ఉల్లంఘనలు జరిగాయని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో అప్పటి హెచ్ఎండీఏ కార్యదర్శి అరవింద్ కుమార్, ఆ సంస్థ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిల నివాసాలపై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. అదే సమయంలో, ఈ కేసులోనే సంబంధమున్న గ్రీన్‌కో ఎనర్జీ కంపెనీ కార్యాలయాలపై కూడా ఏసీబీ సోదాలను నిర్వహించింది. అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిల నివాసాలపై ఏసీబీ ప్రత్యేక టీమ్‌లు ఏక కాలంలో సోదాలను నిర్వహించాయి. వీరి నివాసాలలోని కంప్యూటర్లు, హార్డ్ డిస్క్‌లను స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు.. ఫార్ములా ఈ కార్ రేసింగ్‌కు సంబంధించి కొన్ని కీలకమైన పత్రాలను కూడా స్వాధీన పర్చుకున్నట్టు తెలిసింది. అదే సమయంలో గ్రీన్‌కో ఎనర్జీ కంపెనీకి చెందిన మాదాపూర్‌లోని కార్యాలయాలతో పాటు ఏపీలోని కృష్ణా జిల్లా మచిలీపట్నంలో గల ఈ కంపెనీకి చెందిన అనుబంధ సంస్థల కార్యాలయాల పైన ఏసీబీ అధికారులు దాడులు జరిపారు. ముఖ్యంగా, 2022లో బీఆర్ఎస్ సంస్థకు ఈ కంపెనీ నుంచి రూ.47 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్లు జారీ కావటం పైనే ఎక్కువగా దృష్టిని సారించారని తెలిసింది. అందుకు సంబంధించిన పత్రాలను కూడా అధికారులు స్వాధీనపర్చుకొని పరిశీలిస్తున్నారు. ముఖ్యంగా, ఫార్ములా-ఈ కార్ రేసింగ్‌కు సంబంధించి హెచ్ఎండీఏ ద్వారా చెల్లించబడిన కోట్ల రూపాయలు తిరిగి క్విడ్-ప్రో-కో మార్గంలో గ్రీన్‌కో కంపెనీ బీఆర్ఎస్‌కు చెల్లించిందనే కోణంలో ఏసీబీ దర్యాప్తు సాగిస్తున్నట్టు తెలిసింది.

## 'ఉచితాలకు డబ్బులుంటాయి.. జడ్జీల జీతాలు, పెన్షన్లకు ఉండవా..?

- ఢిల్లీ ఎన్నికలకు ముందు సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్య




న్యూఢిల్లీ : "న్యాయమూర్తులకు జీతాలు చెల్లించే విషయంలో ప్రభుత్వాలు ఆర్థిక పరిమితుల గురించి మాట్లాడతాయి" అని న్యాయమూర్తుల జీతాల కేసును విచారిస్తున్న సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ వ్యాఖ్య చేసింది. ఉచితాల పంపిణీ చేయడానికి ప్రభుత్వాల వద్ద డబ్బు ఉందని, కానీ న్యాయమూర్తుల జీతాలు, పెన్షన్లు చెల్లించడానికి కాదని పేర్కొంది. 'కొందరు రూ. 2100, మరికొందరు రూ. 2500 ఇస్తున్నట్టు మాట్లాడుతున్నారు' అని ఢిల్లీ ఎన్నికల్లో చేస్తున్న ప్రకటనలను కూడా ఎస్సీ బెంచ్ ప్రస్తావించింది. న్యాయమూర్తుల జీతం, పదవీ విరమణ ప్రయోజనాలపై అఖిల భారత న్యాయమూర్తుల సంఘం 2015లో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. న్యాయమూర్తులకు సకాలంలో వేతనాలు అందడం లేదని, పదవీ విరమణ తర్వాత న్యాయమూర్తులు పొందే ప్రయోజనాలను కూడా అందకుండా చేస్తున్నారని తెలిపింది. ఈ వ్యాజ్యాన్ని జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఏజీ మసీహ్ విచారించారు.

**న్యాయమూర్తుల జీతాల గురించి మాట్లాడితే ఆర్థిక సంక్షోభం ప్రస్తావన..**

న్యాయమూర్తులకు జీతాలు చెల్లించే విషయంలో రాష్ట్రం ఆర్థిక సంక్షోభం గురించి మాట్లాడుతుందని, అయితే ఎన్నికలు వచ్చినప్పుడు లాడ్లీ బెహనా , ఇతర పథకాలను అమలు చేస్తామని ఎస్సీ బెంచ్ పేర్కొంది. ఢిల్లీలో చూస్తే ఇక్కడ కూడా పార్టీలు అధికారంలోకి వస్తే రూ.2100, రూ.2500 ఇస్తామని చెబుతున్నాయని ధర్మాసనం పేర్కొంది.

**సుప్రీంకోర్టు ధర్మాసనం ఏం చెప్పింది?**

జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ "ఏ పని చేయని వ్యక్తుల కోసం రాష్ట్రం మొత్తం డబ్బును అందజేస్తుంది. మేము ఆర్థిక పరిమితుల గురించి మాట్లాడే టప్పుడు దీనిని కూడా చూడాలి. ఎన్నికలు వచ్చిన వెంటనే, మీరు లాడ్లీ బెహనా, ఇతర కొత్త పథకాలను ప్రకటిస్తారు. కానీ తమ విషయానికి వస్తే మాత్రం ప్రభుత్వాల తీరు సరైంది కాదని అభిప్రాయపడింది' అని అన్నారు.

# ఢిల్లీ అసెంబ్లీకి మోగిన ఎన్నికల నగారా

(మొదటిపేజీ తరువాయి)

జ్ఞానేష్ కుమార్, సుఖ్ బీర్ సింగ్ సంధులతో కలిసి చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ ఢిల్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు. ఈ నెల 10న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్నట్టు వెల్లడించారు. 17న ఎన్నికల నామినేషన్‌కు చివరి తేదీ, 18న నామినేషన్ల పరిశీలన, జనవరి 20న నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ అని వెల్లడించారు. ఒకే విడతలో ఫిబ్రవరి 5న పోలింగ్ జరగనున్నట్టు స్పష్టం చేశారు. ఫిబ్రవరి 8న ఫలితాలు వెల్లడిస్తామన్నారు. షెడ్యూల్ విడుదలతో పాటు ఢిల్లీలో తక్షణమే మోడల్ కోడ్ ఆఫ్ కండెక్ట్ (ఎన్నికల నియమావళి) అమలులోకి వస్తుందని రాజీక్ కుమార్ స్పష్టం చేశారు. అయితే... ఢిల్లీ అసెంబ్లీ పదవీ కాలం వచ్చే నెల (ఫిబ్రవరి) 23తో ముగియనుంది. ఢిల్లీ అసెంబ్లీలో మొత్తం 70 స్థానాలు ఉండగా అందులో జనరల్ 58, ఎస్సీ రిజర్వ్‌డ్ 12 సీట్లు ఉన్నాయి. 2015, 2020లో జరిగిన ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ వరుసగా 67, 62 సీట్లతో ఘన విజయం సొంతం చేసుకుంది.

**ఈవీఎం ట్యాంపరింగ్‌కు నో ఛాన్స్.... త్వరలో 100 కోట్లకు చేరువలో ఓటర్లు**

ఈవీఎంల ట్యాంపరింగ్‌కు ఛాన్సే లేదని రాజీవ్ కుమార్ తేల్చి చెప్పారు. పోలింగ్ రోజు సాయంత్రం 5గంటల తరువాత పోలింగ్ సరళిలో భారీ పెరుగుదల ఉంటోందని వస్తోన్న ఆరోపణలు సరికాదన్నారు. ఎట్టి పరిస్థితుల్లో పోలింగ్ శాతాన్ని ఎవరూ మార్చలేరన్నారు. ఇక ఈవీఎంలను హ్యాక్ చేసేందుకు అవకాశం లేదన్నారు. ఇదే విషయాన్ని సుమారు 42 సార్లు న్యాయస్థానాలు తమ తీర్పుల ద్వారా చెప్పాయన్నారు. అలాగే ఓటర్ జాబితాలోనూ ఎలాంటి అవకతవకలు జరగవన్నారు. త్వరలోనే దేశంలో ఓటర్ల సంఖ్య 100 కోట్లకు చేరనుందన్నారు. ఈ సమయంలో ఎన్నికల ప్రక్రియపై కొందరు ఉద్దేశపూర్వకంగానే తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ఓటర్ లిస్ట్‌ను సిద్ధం చేసే ప్రతి దశలో రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరుపుతూనే ఉన్నట్టు వివరించారు. ఇది పూర్తిగా పారదర్శక ప్రక్రియ అని, ఓటర్ లిస్ట్‌లో పేర్ల చేరిక, తొలగింపులకు మార్గదర్శకాలను పాటిస్తున్నట్టు వెల్లడించారు.

**ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్**

**ఎన్నికల నోటిఫికేషన్ : జనవరి 10**
**నామినేషన్ల దాఖలు చివరి తేదీ : జనవరి 17**
**నామినేషన్ల పరిశీలన : జనవరి 18**
**నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ : జనవరి 20**
**పోలింగ్ : ఫిబ్రవరి 5**
**ఓట్ల లెక్కింపు : ఫిబ్రవరి 8**
**ఎన్నికల ప్రక్రియ పూర్తికావాల్సిన చివరి తేదీ : ఫిబ్రవరి 10**

**ఢిల్లీలో ఓటర్లు మొత్తం : 1.55 కోట్లు**
**పురుషులు : 83.49 లక్షలు**
**మహిళలు: 71.74 లక్షలు**
**యువ ఓటర్లు ( 20-29 సంవత్సరాల మధ్య) : 25.89 లక్షలు**
**తొలిసారి ఓటర్లు (18-19 సంవత్సరాలు) : 2.08 లక్షలు**
**పీడబ్ల్యూడీ ఓటర్లు : 79,436**
**వందేండ్లు దాటిన ఓటర్లు : 830**
**85 ఏండ్ల వయస్సు దాటిన ఓటర్లు : 1.09 లక్షలు**
**ట్రాన్స్‌జెండర్ ఓటర్లు : 1,261**

**ఢిల్లీలో పోలింగ్ స్టేషన్లు : 13,033**
**ప్రాంతాలు : 2,697**
**ఢిల్లీలో 100 శాతం పట్టణ ప్రాంత పోలింగ్ స్టేషన్లు**
**ప్రతీ పోలింగ్ స్టేషన్‌కు సగటు ఓటర్లు : 1191**
**వెబ్ కాస్టింగ్ :100 శాతం**
**పీడబ్ల్యూడీ సిబ్బంది నిర్వహించే పోలింగ్ స్టేషన్లు : 70**
**మహిళా సిబ్బంది నిర్వహించే పోలింగ్ స్టేషన్లు : 70**
**మోడల్ పోలింగ్ స్టేషన్లు : 210**

## దేశానికి బీజేపీ క్షమాపణ చెప్పాలి

- రాజకీయ పార్టీ కార్యాలయాలపై దాడిని సహించం
- ప్రియాంక గాంధీపై అనుచిత వ్యాఖ్యల పట్ల ఖండన: ఎర్రుపాలెంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



నవతెలంగాణ-ఎర్రుపాలెం

కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ పట్ల చేసిన అనుచిత వ్యాఖ్యలపై బీజేపీ కేంద్ర నాయకత్వం దేశానికి క్షమాపణ చెప్పాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. దేశ సంస్కృతిని దిగజార్చే పరిస్థితి తెచ్చినందుకు బీజేపీ నాయకులు సిగ్గుపడాలని విమర్శించారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలో పలు అభివృద్ధి పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతర మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైందవ సంస్కృతి, భారతీయ సంస్కృతి గురించి బాగా గొప్పలు మాట్లాడే బీజేపీ నాయకులు, మాజీ ఎంపీ, ఢిల్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న రమేష్ బిదోరి.. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీపైన అనుచిత వ్యాఖ్యలు చేస్తూ మాట్లాడిన మాటలను దేశంలో స్త్రీలపైన గౌరవం ఉన్న ప్రతి ఒక్కరూ ఖండించాలని అన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్‌ను పటిష్టంగా అమలు చేస్తామన్నారు. ఎవరిపై దాడులు చేసినా చట్టం తన పని తాను చేసుకుపోతుందని, అసెంబ్లీలో కూడా ఇదే విషయాన్ని చెప్పామని తెలిపారు. బీజేపీ కార్యాలయంపై యువజన కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని ఉప ముఖ్యమంత్రిగా తాను, టీపీసీసీ అధ్యక్షునిగా మహేష్ కుమార్ గౌడ్ ఖండించా మన్నారు. కొంతమంది బీజేపీ నాయకులు దాడి గురించి వాస్తవాలుతెలుసుకోకుండా మాట్లాడుతు న్నారన్నారు. ముందుగా మీ పార్టీ నాయకులకు బుద్ధి చెప్పండంతో పాటు సంస్కృతి, సంస్కారం నేర్పండని చురకలు అంటించారు. ప్రియాంక గాంధీపై బీజేపీ నాయకుడు చేసిన వ్యాఖ్యలను జీర్ణించుకోలేక తాత్కాలిక ఆవేశంతో కొంతమంది యువజన కాంగ్రెస్ నాయకులు బీజేపీ కార్యాలయంపైన దాడి చేశారని, దాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే బీజేపీ స్పందించి రమేష్ బిదోరిని సస్పెండ్ చేసి ఉండాల్సిందని, కానీ కనీసం స్పందించ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని ప్రోత్సహించేలా బీజేపీ కేంద్ర నాయకత్వం గాలికి వదిలేయడం తగదన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువాళ్ళ దుర్గా ప్రసాద్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలపై పోరాటమే ఎజెండా

- విద్య, వైద్యం ప్రభుత్వ రంగంలోనే ఉండాలి
- కేంద్ర బడ్జెట్‌లో విద్యకు 10 శాతం నిధులు కేటాయించాలి
- ఎమ్మెల్సీగా ఉపాధ్యాయ, ఉద్యోగుల గొంతుకగా పనిచేశా : ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి



నవతెలంగాణ- కోదాడ టౌన్

విద్యారంగ, ఉపాధ్యాయ, సామాజిక సమస్యలపై శాసనమండలిలో నిరంతర పోరాటమే తన ఎజెండా అని ఖమ్మం, వరంగల్, నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీగా తన పోరాటంతోనే ఉపాధ్యాయ, ఉద్యోగుల అనేక సమస్యలు పరిష్కారమయ్యాయని చెప్పారు. అలాగే, పట్టణ పరిధి లోని కేఆర్ డిగ్రీ కళాశాల జూనియర్ కళాశాలను సందర్శించినట్టు తెలిపారు. కేఆర్ డిగ్రీ, పీజీ కళాశాల చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధ్యాయ ఉద్యమాలు బలంగా ఉంటేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. విద్య, వైద్యం ప్రభుత్వ రంగంలోనే ఉండాలని, కేంద్ర బడ్జెట్‌లో విద్యకు 10 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రీ ప్రైమరీ స్కూల్స్ ఏర్పాట్లకు రూ.500 కోట్లు గ్రాంట్‌గా కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు పెంచాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. మరోసారి తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే శాసనమండలిలో ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానన్నారు. తనకు ఉపాధ్యాయులు అంతా మద్దతు ఇచ్చి మొదటి ప్రాధాన్యతగా ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ పౌర స్పందన వేదిక జిల్లా అధ్యక్షులు ఆర్.ధనమూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.మంగ, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, కె.జ్యోతి, పాండురంగచారి పాల్గొన్నారు.

## ప్రేమజంట ఆత్మహత్య ఘటనపై ఉద్రిక్తత

- నిందితుడి ఇంటి ఎదుట గ్రామస్తుల ధర్నా
- పోలీసుల బందోబస్తు మధ్య బాలిక అంతిమయాత్ర
- పోలీసుల అదుపులో నిందితుడు..?



నవతెలంగాణ-ఘట్కేసర్/పోచారం/కీసర

సమీప బంధువు బ్లాక్ మెయిల్‌తో సోమవారం సాయంత్రం ఓ ప్రేమజంట మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘనపూర్ సమీపంలోని ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. కారులోనే వారు పెట్రోల్ పోసుకుని మంటలు అంటించుకోవడంతో ఆ ఘటన సంచలనం సృష్టించింది. అయితే, ఆత్మహత్య చేసుకున్న బాలిక లిఖిత(17) మృతదేహాన్ని మంగళవారం నిందితుడి ఇంటి ముందు పెట్టి బంధువులు, గ్రామస్తులు ఆందోళనకు దిగారు. గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం ముగియగానే నేరుగా మృతదేహాన్ని మక్తాలోని నిందితుడు ముంత మహేష్(చింటూ) యాదవ్ ఇంటి వద్దకు తీసుకొచ్చి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని ఆందోళన విరమింపజేసే ప్రయత్నం చేశారు. మృతదేహానికి మహేష్ ఇంటి ముందే దహనసంస్కారాలు చేస్తామని బంధువులు, గ్రామస్తులు భీష్మించుకూర్చున్నారు. బాలిక మృతికి కారణమైన మహేష్‌ను కఠినంగా శిక్షించాలని, తమకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి కదలబోమని స్పష్టం చేశారు. మహేష్ ఇంటి ఆవరణలోనే దహన సంస్కరణలు చేసేందుకు కట్టెలు పెట్టి నిప్పంటిస్తుండటంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. చివరికి మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి, స్థానిక సీఐ రాజువర్మ బాలిక బంధువులను సముదాయించి అక్కడి నుంచి పంపించారు. పోలీసు బందోబస్తు మధ్య లిఖిత అంతిమయాత్ర కొనసాగింది. ఇదిలా ఉండగా, ప్రేమజంట ఆత్మహత్యకు కారణమైన మహేష్ కీసర పోలీసుల అదుపులో ఉన్నట్టు తెలిసింది. అన్ని కోణాల్లో మహేష్‌ను విచారిస్తున్నట్టు సమాచారం.

## రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం

- రవాణా శాఖ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ
- మంత్రి దామోదర రాజనర్సింహ హాజరు



నవతెలంగాణ- జడ్చర్ల

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండల పరిధిలోని పోలేపల్లి సెజ్‌లోని ఎస్.వి.కె.ఎం ఇంటర్నేషనల్ ప్రభుత్వ పాఠశాలలో రవాణా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. దీనిని జిల్లా ఇన్‌చార్జి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల నేపథ్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముందుగా రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ తీశారు. హెల్మెట్ ధరించి పోలీసులు, యువకులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. వైజ్ఞానిక ప్రదర్శన సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పోలీసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఏ.వి.యన్ రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాసరెడ్డి, అనిరుధ్‌రెడ్డి, జి.మధు సూధన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, విద్యా శాఖ డైరెక్టర్ ఈ.వి నరసింహారెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ ఒబేదుల్లా కొత్వాల్, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ డి.జానకి తదితరులు పాల్గొన్నారు.

# రమేశ్ బిధూరీ వ్యాఖ్యలపై సెగ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకగాంధీపై బీజేపీ నేత రమేశ్ బిధూరీ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల సెగ తెలంగాణకు తాకింది. బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు పరస్పరం కర్రలు, రాళ్లతో దాడి చేసుకోవడానికి దారితీసింది. పలువురు గాయాలపాలు కావడానికి కారణమైంది. రమేశ్ బిధూరీ రీ వ్యాఖ్యలను నిరసిస్తూ బీజేపీ కార్యాలయాన్ని యూత్‌కాంగ్రెస్ నేతలు ముట్టడించారు. అక్కడే రమేశ్ బిధూరీ దిష్టిబొమ్మను దహనం చేశారు. 'మా ఆఫీసు దగ్గరకు వచ్చి మా నేత దిష్టిబొమ్మను దహనం చేస్తారా? ఆఫీసు లోపలికి వచ్చేందుకు యత్నిస్తారా?' అంటూ కర్రలతో దాడి చేస్తూ బీజేపీ కార్యకర్తలు ముందుకు ఉరుకొచ్చారు. అదే సమయంలో యూత్ కాంగ్రెస్ నాయకులు కోడిగుడ్లు, రాళ్లు, ఇటుకలతో దాడి చేశారు. ఈ క్రమంలో అటు బీజేపీ కార్యకర్తలు, ఇటు కాంగ్రెస్ కార్యకర్తలు గాయపడ్డారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండటంతో పోలీసులు ఇరుపక్షాలను లాఠీలతో చెదరగొట్టారు. బీజేపీ, యూత్ కాంగ్రెస్ నేతల పరస్పర దాడుల్లో ఇరు పార్టీల నేతలు గాయపడ్డారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, నందరాజ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్, మరో కార్యకర్తకు గాయాలయ్యాయి. కాసం వెంకటేశ్వర్లును ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, అధికార ప్రతినిధి ఎన్వీ సుభాశ్ నాంపల్లి కేర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాసేపటికే చలో గాంధీభవన్‌కు బీజేపీ నేతలు పిలుపునివ్వడం మరింత ఉద్రిక్తతలకు దారితీసింది. గాంధీభవన్‌లో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున మోహరించి ఉండటం..ఇటువైపు నుంచి బీజేపీ శ్రేణులు దూకుడుగా ముందుకెళ్లడంతో అంతా గందరగోళం నెలకొంది. కొందరు బీజేపీ కార్యకర్తలు గాంధీభవన్ ఎదుట ఉన్న కాంగ్రెస్ ఫ్లెక్సీలను చించి పడేశారు. గాంధీభవన్‌వైపు రాళ్లురువ్వారు. మళ్లీ పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండటంతో బీజేపీ పార్టీ శ్రేణులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

**విచారణ చేస్తున్నాం : ఏసీపీ**

బీజేపీ కార్యాలయంపై దాడి ఘటనపై విచారణ చేపడుతున్నట్టు ఏసీపీ విక్రమాన్ సింగ్ తెలిపారు. సీసీ ఫుటేజీ పరిశీలించి ఘటనకు కారకులైన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. తమ నిబంధనలకు అనుగుణంగా బలగాలను మోహరించామని స్పష్టం చేశారు.

**బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడిని ఖండిస్తున్నాం : బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి**

తమ పార్టీ రాష్ట్ర కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దాడిని పిరికిపందల చర్యగా అభివర్ణించారు. కాంగ్రెస్ పార్టీ తన తీరును మార్చుకోకపోతే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేస్తుంటే అక్కడే ఉన్న పోలీసులు ఏం చేశారని ప్రశ్నించారు. రాళ్లు, కర్రలతో దాడులు చేస్తున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడాన్ని తప్పుబట్టారు. ప్రజాస్వామ్యంలో హింసా రాజకీయాలకు తావు లేదని తెలిపారు. బీజేపీ కార్యకర్తలు తిరగబడితే కాంగ్రెస్ పార్టీకి ఉన్న కొందరు నాయకులు కూడా మిగలరని హెచ్చరించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడిని ఖండిస్తూ కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, రఘునందన్‌రావు, బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. ఇలాంటి దాడులకు పాల్పడటం సరిగాదని పేర్కొన్నారు. దీనికి కాంగ్రెస్ పార్టీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

**బీజేపీ ఆఫీస్ ఎదుట యూత్ కాంగ్రెస్ నిరసన**

- ఇరు పార్టీల నేతల మధ్య బాహాబాహీ, కార్యకర్తలకు గాయాలు
- ఇరు పక్షాలను చెదరగొట్టిన పోలీసులు
- చలో గాంధీభవన్‌కు బీజేపీ పిలుపుతో మరింత ఉద్రిక్తం
- కాంగ్రెస్ ఫ్లెక్సీలను చించేసిన బీజేపీ శ్రేణులు

**దాడులను మేం ప్రోత్సహించం : టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్**

పార్టీల కార్యాలయాలపై ఎవరు దాడులు చేసినా అది తప్పేనని టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. దాడులను తాము ప్రోత్సహించబోమని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనలు చేయాలి తప్ప ఇలా దాడులు చేయడం సరిగాదని తెలిపారు. ప్రియాంకగాంధీపై రమేశ్‌బిధూరీ అనుచిత వ్యాఖ్యలను తీవ్ర ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి చేసిన యూత్ కాంగ్రెస్ నేతలను పిలిపించి మందలిస్తామని తెలిపారు.

## విద్యార్థినులతో ప్రిన్సిపాల్ అసభ్య ప్రవర్తన

- పోక్సో కేసు నమోదు

నవతెలంగాణ-కాప్రా

విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన స్కూల్ ప్రినిపాల్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. ఈ ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుషాయిగూడ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకెళ్తే.. ఏ.ఎస్.రావు నగర్‌లోని సదాశివ స్కూల్‌లో ప్రిన్సిపాల్ బొర్రా నాగేందర్‌రావు చేతులు వేస్తూ అసభ్యంగా ప్రవర్తించాడంటూ విద్యార్థినులు తల్లిదండ్రులకు చెప్పారు. దాంతో తల్లిదండ్రులు, ఏఐవైఎఫ్, టిఎస్ఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు మంగళవారం ధర్నాకు దిగాయి. అనంతరం ప్రధానోపాధ్యాయుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కుషాయి గూడ పోలీస్ స్టేషన్‌లో విద్యార్థినులు, తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రభుత్వ ప్రాధాన్యతలు గుర్తించాలి

- రైతుల విజ్ఞప్తులను అధికారులు వెంటనే పరిష్కరించాలి
- యాంత్రీకరణ, సూక్ష్మ సేద్యానికి ప్రోత్సాహం
- మూడు ఆధునిక మార్కెట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు
- జిల్లాకో భూసార పరీక్షా కేంద్రం : సమీక్షా సమావేశంలో మంత్రి తుమ్మల

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రభుత్వ ప్రాధాన్యతను ఎరిగి పని చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయం, అనుబంధ సంఘాల అధికారులతో మంత్రి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వాటికి సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలు, పథకాల పురోగతిపై చర్చించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులు, ప్రజా ప్రతినిధులు, మంత్రుల నుంచి వచ్చే విజ్ఞప్తులపై సత్వరమే పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. సమస్యలను పరిష్కరించడంలో జాప్యం చేయొద్దని సూచించారు. అధిక మొత్తంలో సన్న, చిన్నకారు రైతులకు ప్రయోజనం అందేలా వ్యవసాయ యాంత్రికరణను, సూక్ష్మసేద్య పరికరాలను మరింతగా ప్రోత్సహించాలని కోరారు. ట్రేడర్లు రైతుల వద్దకు వెళ్ళి కొనేలా రాష్ట్రంలో మూడు ఆధునిక మార్కెట్లను అధునాతన హంగులతో ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా సూచించారు. సంచార భూసార పరీక్షా కేంద్రాలను ఉమ్మడి జిల్లాకు



ఒకటి చొప్పున ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ యూనివర్సిటీల్లో ప్రస్తుతమున్న మౌలిక సదుపాయాల వృద్ధికి, కొత్త భవనాల నిర్మాణాలకు బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా ఆదేశించారు. రైతు వేదికల నిర్వహణ ఖర్చుల నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకో 1000 రైతువేదికల నుంచి వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం కల్పిస్తామన్నారు. సేంద్రీయ వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిందిగా అధికారులను కోరారు. వచ్చే బడ్జెట్‌లో ప్రభుత్వ ప్రాధాన్యతలను, కేంద్ర ప్రభుత్వ పథకాలను పూర్తి స్థాయిలో వినియోగించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.

ప్రజాప్రతినిధుల నుంచి వచ్చే విజ్ఞప్తులను పెండింగ్‌లో పెట్టడం మంచి పద్ధతి కాదన్నారు. వాటిని వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. మార్కెటింగ్ లో మార్కెట్ కమిటీల పునర్విభజనకు వస్తున్న ప్రతిపాదనలు దీర్ఘకాలం పెండింగ్‌లో పెట్టడంపై మార్కెటింగ్ కార్యాలయ ఉన్నతోద్యోగిపై అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి వచ్చే కేంద్ర ప్రభుత్వ నిధులను పూర్తిగా వినియోగించి, అదనంగా అవసరమయ్యే నిధుల కోసం కేంద్రానికి ఎప్పటికప్పుడు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు అవసరమయ్యే రాష్ట్ర వాటా నిధులను ఎప్పటికప్పుడు విడుదల చేస్తామన్నారు.

రాష్ట్రంలో పప్పుదినుసులు, నూనె గింజలు, కూరగాయలు సాగు చేసే రైతులను ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా క్లస్టర్లు ఏర్పాటు చేసి మార్కెటింగ్‌లో సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, ఉద్యానశాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, మార్కెటింగ్, కోఆపరేటివ్ డైరెక్టర్ ఉదయ్ కుమార్ ఆయా శాఖల పురోగతిపై ఈ సందర్భంగా వివరించారు.



## మెగా జాబ్ మేళాకు నిరుద్యోగుల జాతర

- ములుగు జిల్లాలో ఉద్యోగాల కోసం తరలివచ్చిన 3వేల మంది
- ప్రయివేటు ఉద్యోగం చేస్తూనే ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నించాలి : మంత్రి ధనసరి అనసూయ సీతక్క

నవతెలంగాణ-గోవిందరావుపేట

ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, ఈజీఎంఎం సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం మెగా జాబ్ మేళాను నిర్వహించారు. సీజీఎంఎం స్పెషల్ కమిషనర్ సీఈవో బి.షఫీ ఉల్లా, కలెక్టర్ టీఎస్ దివాకర, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్ర, జిల్లా అటవీశాఖ అధికారి రాహుల్ కిషన్‌జాదవ్‌తో కలిసి మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ మెగా జాబ్ మేళాకు నిరుద్యోగ యువత సుమారు 3000మందికిపైగా ఉద్యోగావకాశాల కోసం తరలి వచ్చారు. ప్రయివేటు కంపెనీల్లో కొలువుల కోసం గతంలో జరిగిన జాబ్ మేళాలో 800మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఈ మేళాలో 12,200 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా నుంచి వివిధ కంపెనీల్లో సెలెక్ట్ అయిన నిరుద్యోగ యువతకు ఉద్యోగ పత్రాలను మంత్రి సీతక్క అందజేశారు. కాగా ఇప్పటికే జిల్లా నుంచి 250 మంది ప్రభుత్వ ఉద్యోగాలు పొందారని, ప్రయివేటు రంగంలో ఉద్యోగాలు చేయడం అవమానంగా భావించొద్దని సూచించారు. ఆయా కంపెనీల్లో కష్టపడుతూ ఉన్నత స్థాయికి ఎదిగి మరో నలుగురికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సూచించారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నించాలని కోరారు.

## అసెంబ్లీ నుంచి గవర్నర్ వాకౌట్

- నిరసిస్తూ డీఎంకే భారీ నిరసన

చెన్నై : తమిళనాడు గవర్నర్ ఆర్ఎస్.రవి తీరుని నిరసిస్తూ డీఎంకే మంగళవారం భారీ నిరసన చేపట్టింది. గవర్నర్ సోమవారం మరోసారి అసెంబ్లీ నుంచి వాకౌట్ చేసిన సంగతి తెలిసిందే. ఇలా ఆయన సభ నుంచి వాకౌట్ చేయడం వరుసగా ఇది మూడవసారి. డీఎంకే ఎంపీలు కనిమొళి, దయానిధి మారన్ సహా పలువురు సీనియర్ నేతలు, మద్దతుదారులు ఈ నిరసనలో పాల్గొన్నారు. రాష్ట్ర గీతాన్ని గవర్నర్ అగౌరవపరిచారని అన్నారు. నిష్పక్షపాతంగా విధులను నిర్వర్తించడంలో గవర్నర్ ఆర్.ఎన్. రవి విఫలమయ్యారని ప్లకార్డులు ప్రదర్శించారు. ఆయనను గవర్నర్ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ సహనానికి పరిమితి ఉంటుందని డీఎంకే ఎంపీ కనిమొళి వ్యాఖ్యానించారు. అసెంబ్లీ నుంచి వాకౌట్ చేయడం వరుసగా ఇది మూడోసారి అని, గవర్నర్ మరోసారి గుర్తుకు తెచ్చుకోవాలని అన్నారు. అసెంబ్లీ నుంచి వాకౌట్ చేస్తూ ఇబ్బందికి గురికాకుండా ఇంట్లోనే ఉంటే మంచిదని ఎద్దేవా చేశారు. ముందుగా తమిళ గీతం, తర్వాత జాతీయ గీతం ఆలపించడం రివాజు అని అన్నారు.

తమిళనాడు అసెంబ్లీ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. 11 వరకు కొనసాగనున్న ఈ సమావేశాల్లో మొదటి రోజు సభ నుద్దేశించి గవర్నర్ ఆర్.ఎన్.రవి ప్రసంగించాల్సి వుంది. అయితే రాజ్యాంగం, జాతీయ గీతాన్ని అగౌరవపరిచారని ఆరోపిస్తూ సభ మధ్యలోనే వెళ్లిపోయారు. తన ప్రసంగానికి ముందు జాతీయ గీతం ఆలపించడానికి నిరాకరించడం జాతీయ గీతం కోడ్ ఉల్లంఘనేనని ఆరోపించారు. ఈ వాదనను డీఎంకే తీవ్రంగా ఖండించింది. గవర్నర్ ప్రసంగానికి ముందు తమిళ గీతం (తమిళ తాయ్ వజ్హు), సెషన్ ముగింపులో జాతీయ గీతం ఆలపించడం రివాజు అని పేర్కొన్నారు.

### గవర్నర్‌వి పిల్ల చేష్టలు

గవర్నర్ చర్యలు 'పిల్ల చేష్టలు' అని ముఖ్యమంత్రి స్టాలిన్ మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని, అసెంబ్లీని , తమిళనాడు ప్రజలను పదేపదే అవమానిస్తున్నారని ధ్వజమెత్తారు. ఆర్.ఎన్.రవి తమిళనాడు సాంప్రదాయాలను దెబ్బతీస్తున్నారని, రాష్ట్ర పాలనలో జోక్యం చేసుకుంటున్నారని అన్నారు. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలను ఇబ్బంది పెట్టేందుకు బీజేపీ గవర్నర్లను వినియోగిస్తోందని దుయ్యబట్టారు.

## బండ్లగూడ జాగిర్‌లో యూకో బ్యాంక్ నూతన శాఖ ఏర్పాటు



నవ తెలంగాణ - హైదరాబాద్

ప్రభుత్వ రంగంలోని యూకో బ్యాంక్ తన 83వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా రంగారెడ్డి జిల్లా సన్‌సిటీ బండ్లగూడ జాగిర్‌లో నూతన శాఖను ఏర్పాటు చేసింది. సోమవారం దీనిని ఆర్థిక మంత్రిత్వ శాఖ డిఎఫ్ఎస్ సెక్రటరీ ఎం నాగరాజు, యూకో బ్యాంక్ ఎండి, సిఇఒ అశ్విని కుమార్, జోనల్ మేనేజర్ ఎన్ శ్రీకాంత్ లాంచనంగా ప్రారంభించారు. ఇది తమకు హైదరాబాద్ జోన్‌లో 91వ శాఖ అని ఎన్ శ్రీకాంత్ తెలిపారు. నిర్మాణ, వాణిజ్య రంగంలో సన్‌సిటీ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఈ సందర్భంగా కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా హైదర్స్‌కోట్ గ్రామంలోని జిల్లా పరిషత్ హై హైస్కూల్‌కు వైర్‌లెస్ మైక్ సిస్టమ్ సహా విద్యార్థులకు అహారం అందించారు. హెల్త్ చెకప్, రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయగా.. ఖాతాదారులు, విద్యార్థులు భాగస్వామ్యం అయ్యారని ఆ బ్యాంక్ వర్గాలు తెలిపాయి.

## మిట్టల్ మరణం కళారంగానికి తీరని లోటు

- సినీ దర్శకులు బి. నర్సింగ్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పద్మశ్రీ జగదీశ్ మిట్టల్ మరణం కళారంగానికి తీరని లోటని ప్రముఖ సినీ దర్శకులు బి. నర్సింగ్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. "ప్రాచీన కళాభిమానిగా, నిబద్ధత కలిగిన హైదరాబాద్ వాసిగా మిట్టల్ ఖ్యాతి గాంచారు. ఆయన తన సహచరురాలు కమలతో కలిసి దేశీయ కళా సంపదను సేకరించడంలో అపూర్వ కృషి చేశారు. ఆమె జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన "కమల మిట్టల్ మ్యూజియం ఆఫ్ ఇండియన్ ఆర్ట్", 2 వేలకు పైగా కళాఖండాలుగా రూపుదాల్చింది. ఇది భారతదేశ చరిత్ర, సంస్కృతి పట్ల వారి అభిరుచి, కృషికి ప్రతీకగా నిలిచి, హైదరాబాద్‌కు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చింది" అని కొనియాడారు. ఎందరో కళాకారులకు మార్గదర్శకుడిగా, స్ఫూర్తిగా మిట్టల్ నిలిచారని నర్సింగరావు నివాళులర్పించారు.

## జీవో 107ను వెనక్కి తీసుకోవాలి

- ఆల్ ఇండియా డెంటల్ స్టూడెంట్స్ అసోసియేషన్ విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దంత, వైద్య విద్యలో ఎండీఎస్, ఎంఎస్, ఎండీ విద్య కోసం పెంచిన ఫీజులను తగ్గించాలని ఆల్ ఇండియా డెంటల్ స్టూడెంట్స్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు మంగళవారం అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ మంజూర్ ఒక ప్రకటన విడుదల చేశారు. వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జోక్యం చేసుకుని జీవో నెంబర్ 107ను వెనక్కి తీసుకునేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎ క్యాటగిరీ, బీ క్యాటగిరీలో ఇతర రాష్ట్రాల్లో ఫీజులు తక్కువగా ఉన్నాయని తెలిపారు. న్యాయస్థానంలో విద్యార్థులకు సహకరించేలా అడ్వొకేట్ జనరల్ కు సూచించాలని కోరారు. ప్రయివేటు మెడికల్, డెంటల్ కాలేజీల్లో ఎండీఎస్, ఎండీ, ఎంఎస్ విద్యార్థులకూ ఉపకారవేతనాలను వర్తింపజేయాలని పేర్కొన్నారు.

# రేవంత్‌రెడ్డివి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు

- కేసులకు, అరెస్టులకు భయపడం
- కేటీఆర్ కడిగిన ముత్యంలా బయటకొస్తారు : మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రేవంత్ రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు, అక్రమ కేసులకు భయపడేది లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో నందినగర్‌లోని కేటీఆర్ నివాసం వద్ద పార్టీ నేతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా కేటీఆర్‌పై అక్రమ కేసు నమోదు చేసిందని ఆరోపించారు. రైతుభరోసా ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని చెప్పి మాట తప్పిన ప్రభుత్వం ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటున్నదని చెప్పారు. ఏడాది పాలన తర్వాత అన్ని సర్వే రిపోర్టుల్లో సీఎంగా రేవంత్ ఫెయిల్ అయ్యారని వ్యాఖ్యానించారు. తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు బీఆర్ఎస్‌పై అక్రమ కేసులు, దాడులు చేయిస్తున్నారని విమర్శించారు. రేవంత్ అరెస్టై జైలుకు వెళ్లడానికి, ఈ కేసుకు పొంతనలేదని వ్యాఖ్యానించారు. డబ్బుల కట్టలతో కెమెరాల ముందు దొరికి జైలుకు పోయిన వ్యక్తికి, తెలంగాణ కోసం, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ కోసం ఫార్ములా ఈ రేస్ తీసుకొచ్చిన వ్యక్తికి పోలికెలా అవుతుందని ప్రశ్నించారు. "హైకోర్టు ఇచ్చిన తీర్పులో అవినీతి జరిగిందని నిర్ధారించలేదు. ప్రభుత్వం అవినీతి జరిగిందని కేసు పెట్టగా, విచారణ చేసుకోవచ్చని కోర్టు తెలిపింది. కేటీఆర్‌పై పెట్టిన కేసు తుఫేల్ కేసు. కోర్టు తీర్పుపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోంది. ఫార్ములా-ఈ రేస్‌ను తమ రాష్ట్రాలకు తీసుకు పోవడానికి అనేక రాష్ట్రాలు పోటీపడ్డాయి ఒక్క రూపాయి కూడా చేతులు మారనప్పుడు అవినీతి ఎలా జరుగుతుంది? భవిష్యత్తులోనూ తమలాంటి నాయకులపై కేసులు పెడతారని మాకు తెలుసు. ఎన్ని రకాల కేసులు పెట్టినా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటాం" అని హరీశ్‌రావు హెచ్చరించారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా బీఆర్ఎస్ తెలంగాణ ప్రజల పక్షానే నిలుస్తుందని స్పష్టం చేశారు. తమ నేతలు, కార్యకర్తలపై పెడుతున్న కేసులను ధైర్యంగా ఎదుర్కొంటామని చెప్పారు. కేటీఆర్ కడిగిన ముత్యంలా బయటకి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎలాంటి తప్పు చేయలేదన్న ధైర్యం ఉంది కాబట్టి విచారణను ఎదుర్కొంటామని అన్నారు.



### ఫార్ములా ఈ రేస్ కేసులో రేవంత్‌కే శిక్ష పడుతుంది
### మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి

ఫార్ములా ఈ కారు రేస్ కేసులో చివరికి రేవంత్ రెడ్డికే శిక్ష పడుతుందని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి జోస్యం చెప్పారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో నందినగర్‌లోని కేటీఆర్ నివాసం వద్ద పార్టీ నేతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. చట్టాన్ని పూర్తిగా దుర్వినియోగం చేస్తూ, ఒకరిద్దరు తాబేదారులైన అధికారుల సహాయంతో రేవంత్ రెడ్డి చేస్తున్న డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా అనుకూల మీడియాతో డ్రామా ఆడిస్తున్నారని విమర్శించారు. ప్రపంచ స్థాయి నగరాల సరసన హైదరాబాద్‌ను నిలబెట్టడానికి కేటీఆర్ పడ్డ తాపత్రయాన్ని ఏ ఒక్క హైదరాబాదీ మరిచిపోడని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌కు ఫార్మర్స్ ముఖ్యం కాగా, రేవంత్‌కు ఫార్ములా కేసు ముఖ్యమని ఎద్దేవా చేశారు. చట్టపరంగా ఉన్న అన్ని అవకాశాలను వాడుకుని రేవంత్ ప్రభుత్వాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడుతూనే ఉంటామని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ వేర్వేరు కాదనే విషయం ఏసీబీ తప్పుడు కేసు, ఆ వెంటనే వచ్చిన ఈడీ నోటీసులతో బయట పడిందని గుర్తు చేశారు.

### సర్కార్‌ను నడపలేకే అక్రమ కేసులు
### మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి

ప్రభుత్వాన్ని నడపడంలో విఫలమవుతున్నానన్న ఒత్తిడిలోనే 15 నెలల క్రితం జరిగిన ఫార్ములా ఈ కార్ అంశాన్ని ఎత్తుకుని రెండు నెలల నుంచి రేవంత్ రెడ్డి హంగామా చేస్తున్నారని మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. కేటీఆర్‌ను అరెస్ట్ చేయాలనే యావ తప్ప ఈ కేసులో ఎలాంటి అవినీతి జరగలేదని చెప్పారు. కేసు నిలబడదని తెలిసినా, కాంగ్రెస్ నేతలు ఎలక్టోరల్ బాండ్ల విషయాన్ని ప్రస్తావిస్తున్నారని విమర్శించారు. పార్లమెంట్ అన్ని రాజకీయ పార్టీలకు ఇచ్చిన హక్కు ఎలక్టోరల్ బాండ్లన్న విషయం ఆ పార్టీ మరిచిపోయిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీకి సైతం గ్రీన్ కో కంపెనీ రూ. 25 కోట్లను బాండ్ల రూపంలో ఇచ్చిందని గుర్తు చేశారు. ఇవే బాండ్లతో రూ. 1,500 కోట్ల నిధులను సేకరించిన కాంగ్రెస్ కూడా క్విడ్ ప్రో కో చేసినట్టేనా అని ప్రశ్నించారు. ఫార్ములా కార్ రేసుతో గ్రీన్ కో కంపెనీనే నష్టపోయిందని ప్రశాంత్ రెడ్డి గుర్తుచేశారు. అయినా ఈ కార్ రేసు జరగడానికి సంవత్సరం ముందే 2022లోనే గ్రీన్ కో కంపెనీ బాండ్లు కొనుగోలు చేసిందని పేర్కొన్నారు.

### ఏసీబీ రేవంత్ రెడ్డి జేబు సంస్థలా మారింది
### బీఆర్ఎస్ మహిళా నేతలు సత్యవతి రాథోడ్, సునీతా లక్ష్మారెడ్డి

తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) రేవంత్ రెడ్డి జేబు సంస్థలా మారిందని బీఆర్ఎస్ మహిళా నేతలు విమర్శించారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో నందినగర్‌లోని కేటీఆర్ నివాసం వద్ద పార్టీ నేతలతో కలిసి మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మీడియాతో మాట్లాడారు. "1992లో ఈ కార్ రేస్ నిర్వహించాలని చంద్రబాబు ప్రయత్నించినా, ఇంతవరకూ ఎవరూ దాన్ని తీసుకు రాలేదు. ఈ కార్ రేస్ నిర్వహణ కోసం ఎన్నో దేశాలు పోటీ పడ్డాయి. కేటీఆర్ ప్రతిభను చూసి నిర్వాహకులు హైదరాబాద్‌లో నిర్వహించేందుకు ముందుకు వచ్చారు. రేవంత్ రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడు తున్నారు. ఇలాంటి ముఖ్యమంత్రి ఉండటం రాష్ట్ర ప్రజల దురదృష్టం. రాజకీయంగా బీఆర్ఎస్ పార్టీని ఎదుర్కోలేకే తప్పుడు కేసులు బనాయిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నించినందుకే అక్రమ కేసులు పెడుతు న్నారు" అని వారు విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు దర్యాప్తు సంస్థలు జేబు సంస్థగా మారాయని ఆరోపిం చారు. న్యాయస్థానాలపై నమ్మకముందనీ, అక్రమ కేసులు పెట్టినా న్యాయయే గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.



## సాగర్ స్పిల్ వేపై గుంతల పూడ్చివేత

- ఐఐటీ రూర్కీతో అధ్యయనం
- అనుమల చెక్‌డ్యామ్‌కు అనుమతి
- వచ్చే ఖరీఫ్‌కు నీళ్లందించాలి : సమీక్షలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

నాగార్జునసాగర్ స్పిల్‌వేపై పడిన గుంతల పూడ్చివేతకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎస్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి చెప్పారు. ఐఐటీ రూర్కీ ఆధ్వర్యంలో అధ్యయనం జరపాలని నీటిపారుదల శాఖాధికారులను ఆదేశించారు. నెల్లికల్లు ఎత్తిపోతల పథకం ఫేజ్-1 పనులను వేగంగా పూర్తి చేసేందుకు పనులు ముమ్మరం చేయాలని ఆదేశించారు. వచ్చే ఖరీఫ్ నాటికే నీళ్లు అందించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. నాగార్జునసాగర్ నియోజకవర్గ పరిధిలోని నెల్లికల్లు ఎత్తిపోతల పథకంతో సహా హైలెవల్, లోలెవల్, లింక్ కెనాల్‌తోపాటు సాగర్ స్పిల్‌వేపై పడ్డ గుంతల పూడ్చివేతపై మంత్రి అధ్యక్షతన మంగళవారం జలసౌధలో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో నల్లగొండ లోక్‌సభ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి, శాసనసభ్యులు కుందూరు జయవీర్ రెడ్డి, మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నేత కుందూరు జానారెడ్డి, నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఆర్ అండ్ ఆర్ కమిషనర్ వినయ్‌కష్ణారెడ్డి, ఈఎన్సీలు అనిల్‌కుమార్, యం విజయభాస్కర్‌రెడ్డి, డిప్యూటీ ఈఎన్సీ కె శ్రీనివాస్, నల్లగొండ ఎస్ఈ అజయ్‌కుమార్, సీఈ కే శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నాగార్జునసాగర్ జలాశయం నుంచి నీటిని అందించే నెల్లికల్లు ఎత్తిపోతల పథకం పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రూ. 664.80 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ పథకం పూర్తయితే 24,624 ఎకరాల ఆయకట్టు సేద్యంలోకి వస్తుందన్నారు. ఖరీఫ్ సీజన్ నాటికి మొదటి దశ పూర్తి అయితే 7,600 ఎకరాలకు నీరందించవచ్చన్నారు. అంతేగాక హైలెవల్, లోలెవల్ కెనాళ్ల మధ్యలో చేపట్టిన లింక్ కెనాల్ పనులను సైతం వేగవంతం చేయాలని సూచించారు. 15 కిలోమీటర్ల పరిధిలో రూ. 62.26 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన ఈ కాలువ నిర్మాణం కోసం కావలసిన 65.02 ఎకరాలకు గాను ఇప్పటికే 43.31 ఎకరాల భూమిని సేకరించినట్టు తెలిపారు. త్వరితగతిన టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి పనులు ప్రారంభించాలని సూచించారు. చివరి భూములకూ నీరందేలా ఏఎంఆర్, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్ట్‌ల పరిధిలోని 90.43 కిలోమీటర్ల మేర కాలువలను రూ. 42.26 కోట్ల వ్యయంతో 60 మిల్లీమీటర్ల మేర కాంక్రీట్ లైనింగ్‌తో మరమ్మతులు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. సాగర్ ఆయకట్టు పరిధిలోని 39 ఐడీసీ ఎత్తిపోతల పథకాలలో ఎక్కువ భాగం పనిచేయడం లేదనీ, పనిచేయని వాటిని గుర్తించి మరమ్మతులకు అయ్యే ఖర్చు తాలూకు అంచనాలు రూపొందించి సత్వరమే పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. అనుమల చెక్ డ్యామ్ నిర్మాణానికి పాలనా పరమైన అనుమతులు మంజూరు చేస్తున్నట్టు మంత్రి ప్రకటించారు.

## ఆస్పత్రిలో చేరిన పీకే..

- ఆమరణదీక్షతో బీహార్‌లో జనసురాజ్ పార్టీ అధ్యక్షుడికి అనారోగ్యం

పాట్నా : ఆమరణ నిరాహారదీక్ష చేపడుతున్న ఎన్నికల వ్యూహకర్త, జన సురాజ్ పార్టీ వ్యవస్థాపకులు ప్రశాంత్ కిషోర్‌ని ఆస్పత్రికి తరలించారు. నాలుగు రోజులుగా ఆమరణ దీక్ష చేపడుతున్న ఆయన ఆరోగ్యం క్షీణించిందని, దీంతో ఆయనను పాట్నాలోని ఆస్పత్రికి తరలించినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి.బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (బీపీఎస్సీ) అభ్యర్థులకు మద్దతుగా ప్రశాంత్ కిషోర్ ఇటీవల నిరసన చేపడుతున్న సంగతి తెలిసిందే. నగరంలోని గార్డనీబాగ్ ప్రాంతంలో కాకుండా మరో ప్రాంతంలో విచారణ చేపట్టకూడదన్న పాట్నా హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ ఆమరణ నిరహార దీక్ష చేపట్టిన ఆయనన సోమవారం మధ్యాహ్నం గాంధీ మైదాన్ నుంచి అదుపులోకి తీసుకున్నారు. ముందుగా షరతులతో కూడిన బెయిల్ ఇవ్వడంతో ప్రశాంత్ కిషోర్ దాన్ని తిరస్కరించారు. ఆ తర్వాత షరతులు లేని బెయిల్ జారీ చేయడంతో సోమవారం రాత్రి జైలు నుంచి విడుదలయ్యారు.

# ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు మినీ మేడారం జాతర



నవతెలంగాణ -ములుగు

### పనులు సకాలంలో పూర్తి చేయాలి : మంత్రి ధనసరి సీతక్క

ఫిబ్రవరి 12 నుంచి 15వ తేదీ వరకు జరగనున్న మినీ మేడారం జాతరకు నిర్వహిస్తున్నట్టు మంత్రి సీతక్క తెలిపారు. జాతర కోసం చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని, ప్రతి పని నాణ్యతతో చేపట్టి శాశ్వతంగా నిలిచిపోయేలా ఉండాలని అధికారులకు మంత్రి సూచించారు. మహా జాతర సందర్భంగా జరిగిన చిన్న చిన్న సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అన్నారు. మంగళవారం ములుగు జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర్, ఎస్పీ శబరీష్, ఐటీడీఏ పీఓ చిత్రమిశ్రా, జిల్లా అటవీశాఖ అధికారి రాహుల్ కిషన్‌జాదవ్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు, ఆయా శాఖల ద్వారా చేపట్టనున్న పనుల అంచనా వివరాలను మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. మినీ మేడారం జాతరను పురస్కరించుకొని పదిహేను రోజులుగా సందర్శకుల రాక పెరిగిపోయిందని అన్నారు. ఫిబ్రవరి మొదటి వారం నుండే సందర్శకుల తాకిడి అధికం కానున్నదని, అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మేడారం జాతరకు వచ్చే అన్ని లింక్ రోడ్లను జనవరి 31 లోగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. క్యూలైన్లను ఏర్పాటు చేయడంతో పాటు మంచినీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. జాతర సందర్భంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్మికులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఐదు రోజులపాటు నిరంతరం విద్యుత్ సరఫరా చేయడంతోపాటు పూర్తిస్థాయిలో మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని అన్నారు.

జంపన్న వాగు వద్ద మహిళా సందర్శకులు పుణ్య స్నానాలు ఆచరించిన అనంతరం దుస్తులు మార్చుకోవడానికి ప్రత్యేక షెడ్యూల్ ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లా అధికారులు సమర్పించిన అంచనాల వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి అవసరం కానున్న నిధులను మంజూరు చేయిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో ఎండోమెంట్ ఈఓ రాజేందర్, ఇంజినీరింగ్ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఐటీడీఏ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మే రెండోవారంలో ఎప్‌సెట్!

- అదేనెలలో మిగిలిన ప్రవేశ పరీక్షల నిర్వహణ
- షెడ్యూల్ రూపొందించిన ఉన్నత విద్యామండలి
- సెట్స్ కన్వీనర్లతో చైర్మెన్ సమావేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ (ఎంసెట్) రాతపరీక్షలను మే రెండో వారంలో నిర్వహించాలని ఉన్నత విద్యామండలి సూచనప్రాయంగా నిర్ణయించినట్టు తెలిసింది. ఇంజినీరింగ్‌తోపాటు వివిధ వృత్తివిద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే వివిధ ప్రవేశ పరీక్షలు (సెట్స్)కు సంబంధించి ఉన్నత విద్యామండలి అధికారులు షెడ్యూల్ రూపొందించి ప్రభుత్వ ఆమోదానికి పంపించారు. ప్రభుత్వం నుంచి ఆమోదం రాగానే అధికారికంగా ప్రవేశ పరీక్షల నిర్వహణ తేదీలను వెల్లడిస్తారు. అయితే మేలోనే ఎప్‌సెట్‌తోపాటు ఐసెట్, ఈసెట్, ఎడ్‌సెట్, లాసెట్, పీజీఈసెట్, పీఈసెట్ రాతపరీక్షలను నిర్వహించాలని షెడ్యూల్‌ను రూపొందించారు. ప్రవేశ పరీక్షల నిర్వహణ, నోటిఫికేషన్ విడుదల వంటి అంశాలపై సెట్స్ కన్వీనర్లతో మంగళవారం హైదరాబాద్‌లో ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి సమావేశాన్ని నిర్వహించారు. ప్రవేశ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించినట్టు తెలిసింది. పరీక్షల నిర్వహణ, ప్రశ్నాపత్రాల రూపకల్పనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కన్వీనర్లను కోరినట్టు సమాచారం. ఇప్పటికే ప్రవేశ పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించేందుకు ఆ బాధ్యతను టీసీఎస్‌కు అప్పగించిన విషయం తెలిసిందే. అయితే ప్రతి ఏటా రాతపరీక్షల నిర్వహణ, ఫలితాల విడుదల సకాలంలోనే జరుగుతున్నది. కానీ ఇంజినీరింగ్‌తోపాటు వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియ ఆలస్యమవుతున్నది. కాలేజీలకు అనుమతి ఇవ్వడంతోపాటు విశ్వవిద్యాలయాల అనుబంధ గుర్తింపు ఇవ్వడం కూడా ప్రభావం చూపుతున్నది. దీనిపై ఉన్నత విద్యామండలి అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించనున్నట్టు తెలిసింది. వచ్చే విద్యాసంవత్సరంలో ప్రవేశాలు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో టీజీసీహెచ్ఈ వైస్ చైర్మెన్లు ఇటిక్యాల పురుషోత్తం, ఎస్‌కే మహమూద్, ఎప్‌సెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్, ఐసెట్ కన్వీనర్ అలువాల రవి, పీజీఈసెట్ కన్వీనర్ ఎ అరుణకుమారి, ఈసెట్ కన్వీనర్ పి చంద్రశేఖర్, లాసెట్ కన్వీనర్ బి విజయలక్ష్మి, ఎడ్‌సెట్ కన్వీనర్ బి వెంకట్రామ్‌రెడ్డి, పీఈసెట్ కన్వీనర్ ఎస్ఎస్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించాలి

- సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై విస్తృత ప్రచారం కల్పించాలని సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో సమాచార శాఖ క్షేత్ర స్థాయి ఉద్యోగులకు నూతన టెక్నాలజీతో కూడిన కెమెరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా, క్షేత్ర స్థాయి సిబ్బందికి నూతన కెమెరాలను అందజేయడం ద్వారా ఎప్పటికప్పుడు కార్యక్రమ ఫొటో వార్తలు మీడియాకు సులువుగా అందించవచ్చునని అన్నారు. సమాచార శాఖ కమిషనర్ డాక్టర్ హరీష్ మాట్లాడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కెమెరాలు సిబ్బందికి ప్రయోజనకరంగా ఉంటాయని పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొనే ప్రతి కార్యక్రమంలో సమాచార శాఖ సిబ్బంది విధిగా పాల్గొంటూ ప్రభుత్వ పథకాలకు విస్తృత ప్రచారం కల్పిస్తున్నారని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాచార శాఖ అదనపు సంచాలకులు డిఎస్.జగన్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ -మహేశ్వరం
బుధవారం | జనవరి 08, 2025 | www.navatelangana.com



బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అల్మాస్‌గూడ గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవాలయం ఆవరణంలో అయ్యప్ప గురుస్వామి బోయపల్లి శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి సన్నిధాన కార్యక్రమానికి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, కార్పొరేటర్లు సంరెడ్డి స్వప్న వెంకట్ రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, ముత్యాల లలిత కృష్ణ, గడ్డెన్నారం మార్కెట్ కమిటీ సభ్యులు బోయపల్లి గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బడంగ్‌పేట్

## కాంగ్రెస్ కార్పొరేటర్ల డివిజన్లలో నిధులు మంజూరు చేయండి

**నవతెలంగాణ - హస్తినాపురం**



కాంగ్రెస్ కార్పొరేటర్ల డివిజన్లలోని అభివృద్ధి పనుల కోసం ప్రతి డివిజన్‌కి రూ.10కోట్ల నిధులు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి, హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ కోరారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని వారి కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత వినతి పత్రం అందజేశారు.

## 'సీనియర్ సిటిజెన్స్‌కు ఆటల పోటీలు'



**నవతెలంగాణ -ఎల్బీనగర్**

వనస్థలిపురం క్రాంతి హిల్స్ కాలనీలోని కమ్యూనిటీ హాల్లో సీనియర్ సిటిజెన్స్‌కు మంగళవారం ఇండోర్ గేమ్స్‌ను నిర్వహించారు. ఈ ఆటల పోటీలను వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సీనియర్ సిటిజెన్స్ ఆలోచనలు, క్రమశిక్షణలను నేటి తరం వాళ్లు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. వనస్థలిపురం అభివృద్ధిలో సీనియర్ సిటిజన్ పాత్ర ఎంతో ఉంది అని అన్నారు. క్రాంతి హిల్స్ కాలనీ అధ్యక్షులు బద్దం రాంరెడ్డి మాట్లాడుతూ కాలనీ ఏర్పాటులో, అభివృద్ధిలో సీనియర్ సిటిజెన్స్ ముందు ఉన్నారని కొనియాడారు. సీనియర్ సిటిజెన్స్ ఆలోచనలు యువత తీసుకోని ముందుకెళ్లాలని సూచించారు.సీనియర్ సిటిజెన్స్‌కు క్యారమ్స్ మరియు చెస్ ఓపెనింగ్ పోటీలు నిర్వహించినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్. వెంకటేశ్వర్ రెడ్డి, సీనియర్ సిటిజెన్స్, బద్దం రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ తొలగించాలని నిరసన



**నవతెలంగాణ-బడంగ్‌పేట్**

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 31వ డివిజన్‌లోని బాలాజీ నగర్ కాలనీలో ఇండ్ల మధ్యలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్ ఫార్మర్‌ను తొలగించాలని కాలనీవాసులు నిరసన వ్యక్తం చేశారు. తర్వాత ఏజీఆర్, బాలాజీ నగర్ కాలనీ వాసులు మంగళవారం శ్రీరాములు ప్రేమ్‌రాజ్, రమేష్ ఆధ్వర్యంలో బాలాపూర్ చౌరస్తా సర్కిల్ విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ కాలనీలో ఇంటి పక్కల ట్రాన్స్ఫార్మర్ పెట్టడం వలన చిన్న పిల్లలు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గత వారం రోజుల కిందటే ఇంటి పక్కనే విద్యుత్ షాట్ సర్క్యూట్‌కు గురై ఇల్లు దగ్ధమైందని పేర్కొన్నారు. ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేస్తే ప్రాణాలను అరిచేతుల్లో పెట్టుకొని జీవించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులు వెంటనే ఈ టాన్స్ఫార్మర్‌ను ఇక్కడి నుండి తొలగించాలని కోరారు. కాలనీ వాసుల మాట వినకుండా కావాలని ఈ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేస్తే పై అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

### మరింత కష్టపడాలి...
## సత్వర సేవలందించాలి



- ఉద్యోగులకు ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ సూచన
- జేఈఏ, టీజీవో, టీఎన్జీవో, ఫైనాన్స్ వింగ్ డైరీల ఆవిష్కరణ

**నవతెలంగాణ-సిటీబ్యూరో**

జలమండలి ఇంజినీర్స్ అసోసియేషన్, టీజీవో, టీఎన్జీవో, ఫైనాన్స్ వింగ్ డైరీ, టేబుల్ క్యాలెండర్లను ఎండీ అశోక్ రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ వినియోగదారులు ఉద్యోగులు, సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గతేడాది జలమండలి ఉద్యోగులు, సిబ్బంది అంతా కఠిన పరిస్థితులు ఎదుర్కొని నిలిచారన్నారు. వేసవిలో తాగునీటి డిమాండ్‌ను సమర్థంగా ఎదుర్కొన్నారని కొనియాడారు. జలమండలి ఉద్యోగుల విధి నిర్వహణలో రోజూవారీ సమస్యలను పరిష్కరించే పరిస్థితి ఉందని, ఉన్న శక్తి మొత్తం అందుకే ఖర్చవుతుందని అభిప్రాయపడ్డారు. దీని వల్ల ఇతర పనులపై దృష్టి సారించలేకపోతున్నట్టు చెప్పారు. రోజూవారీ సమస్యల్ని పరిష్కరించే బదులు.. అసలు వాటిని శాశ్వతంగా పరిష్కరించడమే ఉత్తమని యోచించి ఒక డ్రైవ్ మోడ్ లో 90 రోజుల ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్టు వివరించారు. ఈ స్పెషల్ డ్రైవ్ ప్రారంభించిన అనతి కాలంలో ఫలితాలు రావడం ప్రారంభమయ్యాయని తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్ వల్ల రోజూ వచ్చే ఫిర్యాదులు 30 శాతం తగ్గినట్టు వెల్లడించారు. దీనిపై ప్రజల్లో మంచి భావన ఏర్పడిందని చెప్పారు. ఈ డ్రైవ్ గురించి గౌరవనీయులైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం ప్రత్యేకంగా అభినందించారని తెలిపారు. మరో 90 రోజుల పాటు కొనసాగించాలని ఆదేశించినట్టు పేర్కొన్నారు. అందుకే మరో 90 రోజుల పాటు దీన్ని కొనసాగించనున్నట్టు పునరుద్ఘాటించారు. ఈ సారి వేసవిని ఎదుర్కోవడానికి సైతం సిద్ధంగా ఉన్నట్టు ఎండీ తెలిపారు. సమర్థంగా ఎదుర్కోవడానికి ఫిబ్రవరి 15 నుంచి జూన్ 15 వరకు.. 120 రోజుల పాటు ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నట్టు వివరించారు. అప్పటిలోపు చేయాల్సిన పనులు, కావాల్సిన సామగ్రిని సమకూర్చుకుని చేస్తామని తెలిపారు. ఈడీ మయాంక్ మిట్టల్ మాట్లాడుతూ.. జలమండలి ఉద్యోగులు, సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బోర్డు ఉద్యోగులు గతేడాది వేసవిలో సమర్థంగా పని చేశారని చెప్పారు. ఈ సారి సైతం ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఎన్సీ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, ఆపరేషన్ డైరెక్టర్లు స్వామి, అమరేందర్ రెడ్డి, టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్, ప్రాజెక్టు డైరెక్టర్ టీవీ శ్రీధర్, జేఈఏ అధ్యక్షుడు రాజశేఖర్, టీజీవో జలమండలి శాఖ అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ ఖాదర్, జనరల్ సెక్రటరీ చంద్రజ్యోతి, టీఎన్జీవో జలమండలి శాఖ అధ్యక్షుడు మహేష్ కుమార్, యూనియన్ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



### ప్రజా గొంతుక
## 'నవతెలంగాణ'



**నవతెలంగాణ-చంపాపేట్**

ప్రజా గొంతుక నవతెలంగాణ దిన పత్రిక అని ఓనస్ హార్ట్ ఇన్స్టిట్యూట్ రోబోటిక్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ బాలరాజు నాయుడు, డాక్టర్. రాజశేఖర్ పప్పు అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ పరిధిలోని 'ఓనస్' ఆస్పత్రిలో పలువురు వైద్య అధికారులతో కలిసి వారు మంగళవారం 2025 నూతన సంవత్సర నవతెలంగాణ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా ప్రజా సమస్యలను వెలికి తీయాల్సిన బాధ్యత పత్రికలపై ఉందన్నారు. పది మందికి ఉపయోగపడే కథనాలను ప్రచురించే పత్రికలను ప్రజలు ఎల్లప్పుడూ ఆదరిస్తారన్నారు.

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని రూపొందించిన నవతెలంగాణ - 2025 క్యాలెండర్‌ను హైదరాబాద్ జిల్లా యాకుత్ పురా నియోజకవర్గం సంతోష్ నగర్ డివిజన్ పరిధిలోని సంతోష్ నగర్ ఏసీపీ కార్యాలయంలో మంగళవారం ఏసీపీ మహమ్మద్ గౌస్.. ఐఎస్‌సదన్ పోలీస్ స్టేషన్ కార్యాలయంలో సీఐ నాగరాజులు ఆవిష్కరించారు. ఏసీపీ మహమ్మద్ గౌస్ మాట్లాడుతూ.. ఈ నూతన సంవత్సరంలో నవ తెలంగాణ పత్రికకు మంచి ఆదరణ లభించాలని, నేటి పోటీ ప్రపంచంలో మిగతా పత్రికలకు ధీటుగా ఎదగాలని ఆకాంక్షించారు. నిజాలను నిర్భయంగా వెలుగులోకి తీసుకురావడంలో నవతెలంగాణ పాత్ర ప్రత్యేకమైనదని కొనియాడారు. ఏ పార్టీకీ కొమ్ము కాయకుండా, ప్రజల కష్టాలను, కార్మికుల సమస్యలను తెలుసుకుంటూ.. అధికారులకు, పాలకులకు, ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తుందన్నారు. అంతేకాదు ప్రజా సమస్యలను తీర్చేందుకు నవతెలంగాణ దిన పత్రిక ఎంతో కృషి చేస్తుందని కొనియాడారు. ఈ ఆవిష్కరణలో ఎస్ఐలు, బ్రహ్మచారి, విజయ్ కుమార్, మహిళా ఎస్ఐలు, నవతెలంగాణ మేనేజర్ భరత్ కుమార్, నవతెలంగాణ విలేఖరి సింగ్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







## 'నిధులు మంజూరు చేయండి'

**నవతెలంగాణ - హస్తినాపురం**

హస్తినాపురం డివిజన్‌లోని వివిధ కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేయాలని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ కోరారు. ఈ మేరకు జోనల్ కార్యాలయంలో మంగళవారం కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ కాలనీలలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కమిషనర్‌ను కోరినట్టు తెలిపారు వాటితో పాటు నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేయాలని కూడా విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్..నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్టు కార్పొరేటర్ సుజాత నాయక్ తెలిపారు.



## యువతి అదృశ్యం



**నవతెలంగాణ- నాగోల్**

ఓ యువతి అదృశ్యమైన ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నాగోల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శివనాగ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం..బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సబితా ఇంద్రారెడ్డి కాలనీకి చెందిన పూజారి చైతన్య..అనే యువతి డిసెంబర్ 22న నాగోల్ డివిజన్ పరిధిలోని మత్తుగూడలో బంధువుల ఇంటికి తమ కుటుంబ సభ్యులతో పాటు వెళ్లింది. డిసెంబర్ 28న ఉద్యోగరీత్యా ఆమె కుటుంబ సభ్యులు ఉదయం వేళలో వెళ్లిపోగా అదే రోజు మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ఇంట్లో అందరూ పడుకున్న సమయంలో ఎవరికీ చెప్పకుండా పూజారి చైతన్య ఇంటి నుండి వెళ్లిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు అదే రాత్రి తన వద్దనున్న ఫోన్‌కు కాల్ చేస్తే ఎత్తలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం పరిసర ప్రాంతాలతో పాటు మిత్రుల వద్ద విచారించినా ఫలితం లేకపోయింది. వెంటనే చైతన్య తల్లి పూజారి జయశ్రీ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శివనాగ ప్రసాద్ తెలిపారు.

### హరిణ వనస్థలి నేషనల్ పార్క్‌లో
## అగ్నిప్రమాదం



**నవతెలంగాణ-నాగోల్**

నాగోల్ డివిజన్ పరిధిలోని ఫతుల్లాగూడ వైపు ముక్తీఘాట్ సమీపంలోని హరిణ వనస్థలి నేషనల్ పార్క్‌లో మంగళవారం అగ్ని ప్రమాదం సంభవించింది. పార్క్‌లో మంటలు అంటుకోవడంతో అవి పెద్ద ఎత్తున వ్యాపించాయి. పార్క్ కొంతమేర అంటుకోవడంతో స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న ఫారెస్ట్ అధికారులు, ఫైర్ సిబ్బంది మంటలను అదుపుచేసి పూర్తిగా ఆర్పేశారు. ఈ పార్క్‌లో జింకలు, నెమళ్లు, అడవి పందులు, కుందేళ్లతో పాటు ఇతర జంతువులు ఉన్నాయి. ఈ ప్రమాదంలో వన్యప్రాణులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. దీంతో ఫారెస్ట్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. మొదట దట్టమైన పొగలు వ్యాపించి మంటలు పెద్ద ఎత్తున రావడంతో స్థానికులు బాయాందోళనకు గురయ్యారు. ఇది మూడవ ప్రమాదమని స్థానికులు చెబుతున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించారని స్థానికులు చెబుతున్నారు. ఇదే విషయంపై ఫారెస్ట్ ఆఫీసర్ విద్యాసాగర్ స్పందిస్తూ.. ఈ ప్రమాదంలో వన్యప్రాణులకు ఎలాంటి ప్రమాదం జరగలేదని, సమాచారం అందిన వెంటనే ఫైర్ అధికారులతో కలిసి అక్కడికి చేరుకొని మంటలను ఆర్పేశామని చెప్పారు.

### అజయ్ కుమార్ అగర్వాల్‌కు
## మహారాజా అగ్రసేన్ గ్లోబల్ ఐకానిక్ అవార్డు-25



**నవతెలంగాణ-సిటీబ్యూరో**

హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ అజయ్‌కుమార్ అగర్వాల్‌కు ప్రతిష్టాత్మకమైన "మహారాజా అగ్రసేన్ గ్లోబల్ ఐకానిక్ అవార్డు 25" అవార్డు లభించింది. ఈ అవార్డును న్యూఢిల్లీలోని అంబేద్కర్ ఆడిటోరియంలో లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా సమక్షంలో మహా మండలేశ్వర్ పరమ పూజ్య గీతా మనీషి జీ శ్రీ జ్ఞానానంద జీ మహారాజ్ అందజేశారు. జాతీయ స్థాయిలో పబ్లిక్ రిలేషన్స్, సోషల్ సర్వీసెస్ రంగాలకు అజయ్ అగర్వాల్ చేసిన విశేష కృషికి గుర్తింపుగా అఖిల భారతీయ అగర్వాల్ సంస్థాన్ ఈ విశిష్ట అవార్డును ప్రదానం చేసింది. అజయ్ అగర్వాల్ గతంలో బ్రిటీష్ పార్లమెంట్‌లో భారత్ గౌరవ్ అవార్డు, గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ హోల్డర్, ప్రతిష్టాత్మక సంస్థల నుంచి అనేక జీవితకాల సాఫల్య పురస్కారాలతో సహా అనేక ప్రశంసలతో గుర్తింపు పొందారు.

ఈ సందర్భంగా అజయ్ అగర్వాల్ మాట్లాడుతూ "ఈ అవార్డు అందుకోవడం ఎంతో గౌరవంగా ఉంది. ఇది మన వృత్తులు, సమాజాల్లో మనమందరం పంచుకునే బాధ్యతను గుర్తు చేస్తుంది" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ చైర్మెన్ ప్రదీప్ మిట్టల్, జాతీయ అధ్యక్షుడు గిరీష్ గుప్తా, వర్కింగ్ నేషనల్ ప్రెసిడెంట్ ఆర్ఎన్ గుప్తా, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

### రోడ్డు భద్రతపై
## చిరు ప్రాయం నుంచే అవగాహన కల్పించాలి

- ప్రమాద రహిత సమాజాన్ని సాధించుకోవచ్చు
- నాగోల్ ఇన్‌చార్జి ఆర్టీవో కె. అమర్నాథ్

**నవతెలంగాణ -నాగోల్**

నేటి బాలలను రేపటి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు.. చిరుప్రాయం నుండే విద్యార్థులకు రోడ్డు భద్రతపై, ప్రమాదాలపై అవగాహన కల్పించాలని నాగోల్ ఇంచార్జి ఆర్టీవో కె. అమర్నాథ్ కోరారు. రాష్ట్ర రవాణా శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రోడ్డు భద్రత మహోత్సవాల కార్యక్రమంలో భాగంగా మంగళవారం నాగోలు డివిజన్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత మరియు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు రోడ్డు భద్రతలు, ప్రమాదాలపై పలు సూచనలు సలహాలను ఇచ్చారు. తర్వాత ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు భద్రత, నియమ నిబంధనలతో పాటు జరుగుతున్న ప్రమాదలపై అవగాహన కల్పిస్తే భవిష్యత్‌లో వారు ప్రమాదాలకు గురికాకుండా ఉంటారని, ప్రమాద రహిత సమాజాన్ని సాధించుకోవచ్చునని ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిధంగా విద్యార్థులు రోడ్డు భద్రతలపై తాము ఇస్తున్న పలు సూచనలను, సలహాలను అవగాహన చేసుకుని.. తమ తమ తల్లిదండ్రుల వద్ద, తోటి స్నేహితుల వద్ద, బంధువుల వద్ద చర్చించి, వివరించాలని సూచించారు. కారులో ప్రయాణిస్తే సీటు బెల్టు, బైక్ పై ప్రయాణిస్తే హెల్మెట్ ధరించాలని, వాహనాలను నడిపే సమయంలో సెల్ ఫోన్ మాట్లాడవద్దని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో మాట్లాడాలనుకుంటే మీరు నడుపుతున్న వాహనాన్ని పార్కు చేసి మాట్లాడాలని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరం, నేరమని విద్యార్థులకు సూచించారు. అదేవిధంగా ఇంటి నుండి పాఠశాలకు, పాఠశాల నుండి ఇంటికి వచ్చే సమయాలలో రోడ్డును దాటేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అనంతరం తోటి అధికారులతో పాటు విద్యార్థులతో రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా, నియమ నిబంధనలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐలు, ఏఎంవిఐలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పాటు అధ్యాపక బృందం, విద్యార్థులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






## పద్మశాలి టౌన్ షిప్ అభివృద్ధికి కృషి చేస్తా : ఎమ్మెల్యే



**నవతెలంగాణ-కాప్రా**

పద్మశాలి టౌన్ షిప్ అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం డాక్టర్ ఏఎస్‌రావునగర్ డివిజన్ పరిధిలోని పద్మశాలి టౌన్ షిప్‌లో స్థానిక కార్పొరేటర్ శిరీషా సోమశేఖర్ రెడ్డితో కలిసి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సోమ శేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, కాసం మహిపాల్ రెడ్డి, డీఈ బాలకృష్ణ, ఏఈ కీర్తి, పద్మశాలి టౌన్ షిప్ ప్రెసిడెంట్ నరేందర్ రెడ్డి, భరత్, చంద్ర శేఖర్ రెడ్డి, మురాలి, గణేష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ నియోజకవర్గానికి రూ.30 కోట్లు ఇవ్వండి

- జీహెచ్ఎంసీ కమిషనర్‌కు కాంగ్రెస్ ఉప్పల్ ఇన్‌చార్జి పరమేశ్వర్ రెడ్డి వినతి



**నవతెలంగాణ-ఉప్పల్**

ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం రూ. 30 కోట్ల నిధులు కేటాయించాలని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి, ధర్పల్లి రాజశేఖర్ రెడ్డితో కలిసి మంగళవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలో 10 డివిజన్లకు ఒక్కొక్క డివిజన్‌కు మూడు కోట్ల చొప్పున మొత్తం రూ. 30 కోట్ల నిధులను కేటాయించాలని, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

## నవతెలంగాణ దినపత్రిక పేదల పక్షపాతి



- కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ ఫారూఖ్
- నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ

**నవతెలంగాణ - జవహర్ నగర్**

నవతెలంగాణ దినపత్రిక పేదల పక్షపాతిగా పనిచేస్తుందని జవహర్ నగర్ కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ ఫారూఖ్ అన్నారు. మంగళవారం నవ తెలంగాణ 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో నవతెలంగాణ దినపత్రిక ప్రత్యేక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రతీరోజు విభిన్న కథనాలతో ప్రజలకు సమాచారం అందించే నవతెలంగాణ పత్రిక దినదిన అభివృద్ధి చెందుతూ సమాజానికి ఇంకా మేలు చేయాలని కోరారు. పత్రిక యాజమాన్యానికి, సిబ్బందికి, విలేకరులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి అడ్వటైజ్‌మెంట్ ఇన్‌చార్జి జహంగీర్, జవహర్ నగర్ రిపోర్టర్ నరేందర్, పాల్గొన్నారు.

# ఉప్పల్ నియోజకవర్గం సమగ్ర అభివృద్ధే ధ్యేయం



- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**నవతెలంగాణ - చర్లపల్లి**

ఉప్పల్ నియోజకవర్గం సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం ఓల్డ్ మల్లాపూర్ పరిధిలోని వివిధ బస్తీల్లో రూ.60 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డితో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దశలవారీగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని, మల్లాపూర్ డివిజన్ పరిధిలోని దాదాపు అన్ని కాలనీలలో సీసీ రోడ్లు, భూగర్భ డ్రయినేజీ పనులతో పాటు పలు అభివృద్ధి పనులను ప్రత్యేక చొరవతో చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు.

**డివిజన్ అభివృద్ధికి కృషి : కార్పొరేటర్ పన్నాల**

ప్రతి కాలనీలో అవసరమైన చోట రోడ్లు, డ్రయినేజీ, తాగునీటి పైపు లైన్‌లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలు, తదితర మౌలిక వసతులను ఎమ్మెల్యే సహకారంతో ఏర్పాటు చేస్తూ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నానని కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి అన్నారు. డివిజన్‌కు అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ ఇంజనీరింగ్ ఏఈ ప్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ల భిక్షపతి, రామారావు, బీఆర్ఎస్ నేతలు, ఓల్డ్ మల్లాపూర్ బస్తీ వాసులు ఉన్నారు.

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**నవతెలంగాణ-కాప్రా**

కాప్రా డివిజన్ పరిధిలోని హస్తినాపురంలో రూ.17 లక్షల నిధులతో కాంపౌండ్ వాల్ అండ్ ఆర్చ్ నిర్మాణానికి స్థానిక కార్పొరేటర్ స్వర్ణ రాజు శివమణితో కలిసి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానన్నారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఈ బాలకృష్ణ, ఏఈ సూరజ్, బీఆర్ఎస్ నాయకులు బైరీ నవీన్ గౌడ్, ఇంద్రయ్య, గిల్బర్ట్, రవీందర్ రావు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలి



- బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు మహేందర్ యాదవ్
- కాప్రా తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేత

**నవతెలంగాణ - జవహర్ నగర్**

రాష్ట్ర ప్రభుత్వం బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు మహేందర్ యాదవ్ డిమాండ్ చేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు మంగళవారం కాప్రా తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సుచరితకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారం కోసం కామారెడ్డి సభలో బీసీలకు ఇచ్చిన హామీని సీఎం రేవంత్ రెడ్డి వెంటనే నెరవేర్చాలని మేడ్చల్ జిల్లాలోని అన్ని మండలాల తహశీల్దార్ కార్యాలయాలలో వినతి పత్రాలు అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ అధ్యక్షులు కమలాకర్, సీనియర్ నాయకులు అశోక్ గౌడ్, మేరుగు భిక్షపతి గౌడ్, రాము నాయక్, సందీప్ ముదిరాజ్, ముచ్చర్ల యాదగిరి, జ్ఞానేశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రొమ్ము క్యాన్సర్‌ను త్వరగా గుర్తించడం ముఖ్యం



- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.రఘునాథస్వామి
- మొబైల్ మహిళా క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్ ప్రారంభం

**నవతెలంగాణ-సిటీబ్యూరో**

మహిళల్లో అధికంగా కనిపించే రొమ్ము క్యాన్సర్‌ను తొందరగా గుర్తించడం అత్యంత ముఖ్యమని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.రఘునాథస్వామి అన్నారు. గ్రాన్యుల్స్ ఇండియా లిమిటెడ్ తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమం కింద ఏఐజీ హాస్పిటల్‌తో కలిసి ఈ కార్యక్రమాన్ని దుండిగల్ గండిమైసమ్మ మండలంలోని గగిల్లాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. ఇది ఉచిత రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్, అవగాహనా కార్యక్రమం సందర్భంగా మొబైల్ మహిళా క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ మొబైల్ మహిళా క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్ గ్రామీణ, వెనుకబడ్డ ప్రాంతాల్లో మహిళలకు రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం అవసరమైన సదుపాయాలను అందజేస్తుందని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ ప్రారంభ దశలోనే క్యాన్సర్‌ను గుర్తించి, తగిన వైద్యం అందించడం ద్వారా ఆరోగ్య సేవలను మెరుగుపరచడమే లక్ష్యమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఈ ఉచిత సేవను ఉపయోగించుకోవాలని సూచించారు. గ్రాన్యుల్స్ ఇండియా లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమా చిగురుపాటి మాట్లాడుతూ రొమ్ము క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా విజయవంతమైన చికిత్సకు అవకాశాలు మెరుగుపడతాయని, మహిళలు తమ ఆరోగ్యం పట్ల చైతన్యంగా ఉండాలని సూచించారు. ఏఐజీ హాస్పిటల్స్‌లో కన్సల్టెంట్ బ్రెస్ట్ అంకాలజిస్ట్ డాక్టర్ ప్రగ్యా చిగురుపాటి మాట్లాడుతూ ఈ మొబైల్ యూనిట్ జిల్లా వ్యాప్తంగా అనేక మంది మహిళలకు స్క్రీనింగ్, కన్సల్టేషన్ అందించడానికి సిద్ధంగా ఉందని చెప్పారు. రిమోటు ప్రాంతాల్లో కూడా ఈ సౌకర్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ మున్సిపల్ చైర్మెన్ శంభీపూర్ కృష్ణ, గగిల్లాపూర్ కౌన్సిలర్ అరుణ నాగరాజు, మల్కాజిగిరి డివిజన్ డిప్యూటీ డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ శోభారాణి, డిస్ట్రిక్ట్ ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ సరస్వతి, దుండిగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వర్ణలతతో పాటు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి స్పీడ్ స్కేటింగ్ పోటీలకు వెరిటాస్ సైనిక్ స్కూల్ విద్యార్థులు ఎంపిక



**నవతెలంగాణ-కాప్రా**

కాప్రా సర్కిల్ పరిధిలోని కాప్రా లేక్ వద్ద గల స్కేటింగ్ స్టేడియంలో హైదరాబాద్ స్కేటింగ్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పీడ్ స్కేటింగ్ పోటీలలో వెరిటాస్ సైనిక్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ఈ నెల 31న మధురైలో జరగనున్న జాతీస్థాయి స్పీడ్ స్కేటింగ్ పోటీలకు అర్హత సాధించారు. కాప్రాలో నిర్వహించిన స్కేటింగ్ పోటీలలో 5 గోల్డ్ మెడల్స్, ఏడు సిల్వర్ మెడల్స్, రజతం పతకాలను సాధించారు. విద్యార్థులను జాతీయ స్థాయికి అర్హత సాధించడంలో కోచ్‌ల శ్రమకు తార్కానమని సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్ వినోద్ కుమార్ బంగ పేర్కొన్నారు. జాతీయస్థాయిలో సైతం పథకాలను సాధించడం కోసం కృషి చేస్తున్నామని తెలంగాణ స్పీడ్ స్కేటింగ్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తరుణ్ కిషోర్ పేర్కొన్నారు. చైర్మెన్ ఆదిశేషారెడ్డి, శ్రీకర్, వైస్ ప్రిన్సిపాల్ మానస చౌదరి, స్కేటింగ్ కోచ్ పవన్ కల్యాణ్‌లను విద్యార్థులను అభినందించారు.

## ప్రజల కోసమే అభివృద్ధి పనులు చేస్తున్నాం



- నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

**నవతెలంగాణ-కీసర**

ప్రజల కోసమే అభివృద్ధి పనులు చేపడుతున్నామని నాగారం మున్సిపల్ చైరెఓష్బ్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 16 వార్డులోని ఈస్ట్ హనుమాన్ నగర్ కాలనీలో మున్సిపల్ సాధారణ నిధులు రూ.6 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాగారం మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తమ పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్ బాదనపురం శ్రీనివాస్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- కాంగ్రెస్ పార్టీ నాగారం మున్సిపాలిటీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి



**నవతెలంగాణ-కీసర**

మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని నాగారం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 18 వార్డు సాయి సంజీవ నగర్ కాలనీలో కౌన్సిలర్ పంగా హరిబాబు ఆధ్వర్యంలో రూ.1.30 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గూడూర్ అశోక్ గౌడ్, కౌన్సిలర్ అన్నంరాజ్ సుమిత్ర సురేష్, నాయకులు, శ్రీశైలం యాదవ్, మధు, రమేష్ నాయక్, రాజు నాయక్, కాలనీ ప్రెసిడెంట్ విజయ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల పరిరక్షణే ధ్యేయం

- కాప్రా మండల తహశీల్దార్ సుచరిత
- అక్రమ నిర్మాణాలు కూల్చివేత



**నవతెలంగాణ - జవహర్ నగర్**

ప్రభుత్వ భూముల పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తున్నామని కాప్రా మండల తహశీల్దార్ సుచరిత పేర్కొన్నారు. జవహర్ నగర్‌లోని సర్వే నెంబర్ 706 మల్కారం, 434, వీఆర్వో ఆఫీస్ ఎదురుగా, పలు ప్రాంతాలలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను కాప్రా తహసీల్దార్ ఆదేశాలతో మంగళవారం ఆర్ఐ విజయేంద్రసాయి, రమేష్‌లు జేసీబీలతో కూల్చేశారు. వారి వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల వెరిఫికేషన్‌కు ఎవరూ డబ్బులు ఇవొద్దు



- కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్
- 6795 దరఖాస్తులకు 2383 ఇండ్ల వెరిఫికేషన్

**నవతెలంగాణ - చర్లపల్లి**

ఇందిరమ్మ ఇండ్ల వెరిఫికేషన్‌కు ఎవరికీ డబ్బులు ఇచ్చే అవసరం లేదని, ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే తనకు సమాచారం ఇవ్వాలని నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ తెలిపారు. మంగళవారం కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లకు 6795 మంది దరఖాస్తు చేసుకోగా ఇప్పటివరకు 2383 ఇండ్ల వెరిఫికేషన్ పూర్తయ్యిందన్నారు. ఇంకా 4412 దరఖాస్తుల వెరిఫికేషన్ చేయాల్సి ఉందన్నారు. వెరిఫికేషన్‌కు సుమారు 23 మంది సిబ్బందిని ఏర్పాటు చేశారన్నారు. కొన్ని ప్రాంతాల్లో వెరిఫికేషన్‌కు డబ్బులు అడుగుతున్నారని ఫిర్యాదు రావడంతో మంగళవారం నాచారంలో వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సాయిజెన్ శేఖర్, విట్టల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు రోడ్డు ప్రమాదాలపై జాగ్రత్తలు పాటించాలి



**నవతెలంగాణ-కీసర**

విద్యార్థులు రోడ్డు ప్రమాదాలపై జాగ్రత్తలు పాటించాలని రాచకొండ ట్రాఫిక్ పోలీస్ అధికారులు అన్నారు. మంగళవారం కీసర మండల కేంద్రంలోని శ్రద్ధ, స్ఫూర్తి కళాశాల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. దేశవ్యాప్తంగా ప్రతి రోజు జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, వాటి జాగ్రత్తలను వివరించారు. హెల్మెట్, సీట్ బెల్ట్, ట్రిబుల్ రైడింగ్, ట్రాఫిక్ సిగ్నల్స్‌పై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అర్జున్ ఇన్‌స్పెక్టర్, నర్సింహారావు, సోమనాథం, రవి కుమార్, లక్ష్మీనారాయణ, కళాశాల చైర్మెన్ ఎండీ మధార్, లెక్చరర్స్ నర్సింహులు, మేడ్చల్ నియోజకవర్గ జర్నలిస్ట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గణేష్, బీఆర్ఎస్ కీసర గ్రామ ఉపాధ్యక్షుడు సుమన్ బన్నీ పాల్గొన్నారు.

## నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ



**నవతెలంగాణ - పోచారం**

పోచారం మున్సిపల్ పరిధిలో శ్రీనిత్య రియల్ ఎస్టేట్ ఓనర్ వల్లపు రఘు మంగళవారం నవతెలంగాణ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నవ తెలంగాణ దినపత్రిక మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోచారం రిపోర్టర్ సాయికిరణ్, ఉప్పల్ డివిజన్ ఇన్‌చార్జి సీహెచ్ గోపి, చిలుకూరి మంకయ్య, మేకల జగన్, మహేష్, సురేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### ఆల్ ఇండియా యాదవ మహాసభ

## మల్కాజిగిరి యూత్ కన్వీనర్‌గా సతీష్ యాదవ్



**నవతెలంగాణ-నేరేడ్‌మెట్**

మల్కాజిగిరిలోని వినాయక్ నగర్ చెందిన కసరబోయిన సతీష్ యాదవ్‌ను అఖిలభారత యాదవ మహాసభ గ్రేటర్ హైదరాబాద్‌లోని మల్కాజిగిరి నియోజకవర్గానికి యూత్ కన్వీనర్‌గా నియమించారు. సతీష్ యాదవ్‌కు గ్రేటర్ హైదరాబాద్ యూత్ ప్రెసిడెంట్ ఎం. విజయ్ కుమార్ యాదవ్, స్టేట్ యూత్ ప్రెసిడెంట్ యశ్వంత్ రాజు యాదవ్, తెలంగాణ స్టేట్ ప్రెసిడెంట్ బద్దుల బాబురావు యాదవ్, స్టేట్ జనరల్ సెక్రటరీ పోచబోయిన వినోద్ యాదవ్ నేషనల్ జనరల్ సెక్రటరీ ఆర్ లక్ష్మణ్ యాదవ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింతల రవీందర్ నాథ్ యాదవ్, గ్రేటర్ హైదరాబాద్ ప్రెసిడెంట్ మైలకోల్ మహేందర్ యాదవ్ నియామక పత్రాన్ని అందజే శారు. ఈ కార్యక్రమంలో రవికుమార్ యాదవ్, సాయికిరణ్ యాదవ్, రితేష్ యాదవ్, నవీన్ యాదవ్ పోచబోయిన, తదితరులు పాల్గొన్నారు.

## 'బీసీ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలి'



**నవతెలంగాణ-కాప్రా**

కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రభుత్వం అమలు చేయాలని ఓబీసీ మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం కాప్రా తహశీల్దార్ టీ. సుచరితకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పరికి బండ సందీప్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సాధ్యం కానీ హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీలపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే బీసీ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలన్నారు. బీసీ కులగణన చేపట్టి స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్ అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఏ ఒక్క హామీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రమేష్ యాదవ్, సోమేష్ నాయుడు, రజనీకాంత్ రెడ్డి, రామ్ సాని ప్రభాకర్ రెడ్డి,రేగొండ వెంకులు, లక్ష్మణ్ గౌడ్ ,నాదం, ఆనంద్ గౌడ్ , దశరథ్ ,చిత్తారి ముదిరాజ్, సీతారాం రెడ్డి, కృష్ణారెడ్డి, కే రామారావు తదితరులు పాల్గొన్నారు.

## పోచారం మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ మీటింగ్ ఏర్పాటు



**నవతెలంగాణ - పోచారం**

పోచారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మెన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం రెవెన్యూ విభాగం అధికారులతో రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విలీన గ్రామాలతో పాటు అన్ని వార్డులల్లో ఇంటి నెంబర్ లేని ఇండ్లు, వ్యాపార సముదాయాలు ఉండొద్దని, అధికారులకు సూచించారు. మున్సిపల్ పరిధిలోని ప్రజలందరూ ఇంటి పన్నులు కట్టి మున్సిపల్ అభివృద్ధిలో పాలు పంచుకోవాలని, మున్సిపల్ అధికారులకు సహకరించాలని కోరారు. అలాగే యాంనంపేట్ శ్రీనిధి కాలేజ్, రాక్‌ఉడ్ పాఠశాలను రీ అసెస్మెంట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చైర్మెన్‌తో పాటు కమిషనర్ వీరారెడ్డి, రెవెన్యూ అధికారులు కిరణ్, సాయి రాజ్, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రీ లాంచ్ ఆఫర్ పేరుతో క్రితిక డెవలపర్స్ దోపిడీ



- న్యాయం చేయాలంటూ బాధితుల ఆందోళన

**నవతెలంగాణ-ఉప్పల్**

క్రితిక ఇన్‌ఫ్రా డెవలపర్ ప్రయివేట్ లిమిటెడ్ ఫ్రీ లాంచ్ పేరుతో ప్రజల నుంచి భారీగా డబ్బులు వసూలు చేసి, తమకు అన్యాయం, చేసిందంటూ బాధితులు మంగళవారం ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. క్రితిక ఇన్‌ఫ్రా డెవలపర్స్ సంస్థ సీఈఓ శ్రీకాంత్, ఆయన సోదరుడు శశికాంత్ అపార్టుమెంట్‌ల్లో ఫ్లాట్స్ కట్టిస్తామని 170 మంది బాధితుల దగ్గర రూ.40 నుండి 60 లక్షల వరకు వసూలు చేశారన్నారు. నాలుగేండ్లుగా ఫ్లాట్స్ కట్టకుండా కాలయాపన చేస్తున్నారు. తమ డబ్బులన్నా ఇవ్వండి.. లేదా ఫ్లాట్స్ అన్న కట్టివ్వండి బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్లాట్లను డబుల్ రిజిస్ట్రేషన్ చేస్తున్నారని అధికారులు, డబుల్ రిజిస్ట్రేషన్లు కాకుండా చూడాలని కోరారు. తమకు అన్యాయం చేసిన వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలన్నారు.

## పట్నం మహేందర్ రెడ్డికి శుభాకాంక్షలు వెల్లువ



నవతెలంగాణ-కూకట్‌పల్లి

టీపీసీసీ లేబర్ సెల్ తరపున చైర్మెన్ ప్రకాష్ గౌడ్ ఆధ్వర్యంలో.. మాజీ రాష్ట్ర మంత్రి, ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డిని టీపీసీసీ లేబర్ సెల్ నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే కార్మికుల సంక్షేమం కోసం భీమా పథకాలు, కార్మికులకు అవగా హన కోసం కర పత్రాల ద్వారా, ప్రచారం చేస్తున్న కార్యక్రమం వారికి వివరించారు. ఈ కార్యక్రమం లో నల్ల సంజీవ రెడ్డి, సప్పిడి భాస్కర్, ఆయిల శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సురేష్ రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, 130 సుభాష్ నగర్ డివిజన్ కార్పొరేట్ కార్యాలయం వద్ద మంగళవారం డివిజన్‌కు చెందిన పలువురు సీఓ బాలరాజు,ఆర్పీలు, ప్రజాప్రతినిధులు, మహిళా ప్రజాప్రతినిధులు, నాయకులు, సంక్షేమ సంఘాల సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేష్ రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ నూతన ఆంగ్ల నామ సంవత్సరంలో ప్రజలంతా నూతన ఉత్తేజంతో ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో తులతూగాలన్నారు. డివిజన్ ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరాలని ఆకాంక్షించారు.

## ఎమ్మెల్యేను కలిసిన 'డబుల్' ఇండ్ల లబ్ధిదారులు



● ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద దుండిగల్ మున్సిపాలిటీకి చెందిన "దుండిగల్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయ" లబ్ధిదారులు మంగళవారం కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్‌ని కలిశారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయాల వద్ద విద్యుత్ సౌకర్యంతో మౌలిక వసతులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలలో గల డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయాల వద్ద ఇప్పటికే అనేక ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనతోపాటు బస్సు సౌకర్యాలను ఏర్పాటు చేశామని తెలిపారు. త్వరలోనే దుండిగల్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద కూడా మౌలిక వసతులను పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జక్కుల కృష్ణ యాదవ్, జక్కుల విజయ శ్రీనివాస్ యాదవ్, గోపాల్ రెడ్డి, పిఎసిఎస్ మాజీ వైస్ చైర్మెన్ నల్తూరి కృష్ణ, నాయకులు శ్రీనివాస్ గౌడ్, డబల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయాల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## 'దిశ'.. నిర్దేశం చేసేనా..?

- ఇప్పటి వరకు ఒక్కసారి కూడా సమావేశం కాని కమిటీ
- కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించని వైనం
- ప్రతిపాదనల రూపకల్పనలో కొరవడిన అధికార యంత్రాంగం చొరవ
- నేడు నిర్వహించనున్న సమీక్ష సమావేశానికి ప్రాధాన్యత




నవతెలంగాణ-సిటీబ్యూరో

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలు, వాటి అమలు, క్షేత్ర స్థాయిలోని సమస్యలపై చర్చించి పరిష్కరించేందుకు ఉద్దేశించిన 'దిశ' సమావేశం ఎట్టకేలకు నేడు నిర్వహించనున్నారు. నిబంధనల ప్రకారం ప్రతీ 90 రోజులకోసారి సమావేశం కావాలి. కానీ, కమిటీ ఎన్నికైన నాటి నుంచి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా సమావేశం కాలేదు. ఫలితంగా పథకాల ఫలాలు అర్హులకు చేరడంలో జాప్యమవుతోందనే విమర్శలు ఉన్నాయి.

### ఎంపీ అధ్యక్షతన..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రగతి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం మల్కాజిగిరి ఎంపీ అధ్యక్షతన నిర్వహిస్తారు. ఇందులో జిల్లా కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మున్సిపల్ చైర్మెన్లు, నామినేటెడ్ సభ్యులు, కేంద్ర పథకాలు అమలు చేస్తున్న ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టే సంక్షేమ, అభివృద్ధి పథకాలు, వాటికి కేటాయించే నిధులతో కొనసాగుతున్న పనులపై 'దిశ' క్షున్నంగా సమీక్షించాలి. కేంద్ర ప్రభుత్వం పరిధిలోని 29 శాఖల పనితీరుపై చర్చించాలి. ఇప్పటి వరకు ఉన్న పురోగతి సమీక్షించి కొత్తగా చేపట్టాల్సిన పనులపై చర్చించాలి. అధికారులు సర్కారుకు ప్రతిపాదనలు పంపించాలి. ఇప్పటి వరకు ఆ దిశగా అడుగులు పడిన దాఖలాల్లేవు. ఎట్టకేలకు నేడు 'దిశ' సమావేశమవుతుందని అధికారులు ప్రకటించడం కొంత ఊరటనిస్తోంది.

### పథకాలపై కొరవడిన పర్యవేక్షణ

ఎంపీ ల్యాండ్స్ టు కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన, పీఎం ఫసల్ బీమా యోజన, ముద్ర రుణలు, పీఎం ఆవా సయోజన్ తదితర పథకాల అమలుపై నిర్మాణాత్మక చర్చ జరిగితే ప్రయోజనకరంగా ఉంటుందని జిల్లా వాసులు అభిప్రాయపడుతున్నారు.

### లోటుపాట్లు విజిలెన్సు..

పథకాల్లో లోటుపాట్లను ఎత్తిచూపడంతోపాటు విజిలెన్స్ నివేదిక పంపించే అధికారం దిశకు ఉంటుంది. సమీక్ష లేక పథకాల అమలుపై పర్యవేక్షణ కొరవడింది. దీంతో పాత కమిటీని రద్దు చేసి, కొత్త కమిటీ ఏర్పాటు చేయనున్నట్టు సమాచారం.

### జిల్లాపై చిన్నచూపు..

తెలంగాణ రాష్ట్రం అధికారికంగా 2014 జూన్ 2వ తేదీ న ఆవిర్భవించింది. ఆ తర్వాత ఐదేండ్ల వ్యవధిలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా దిశ కమిటీ సమావేశాలు ప్రతీమూడు నెలలకో సారి జరిగేవి. గతంలో జిల్లా ఉన్నతాధికారులు కూడా తరచూ ఇతర జిల్లాలతో పోల్చుతూ వివిధ అంశాలను తెరపైకి తీసు కొచ్చేవారు. జిల్లాల పునర్విభజన తర్వాత కూడా ఆయా దిశ కమిటీ చైర్మెన్లు సమావేశాలు నిర్వహించేలా చర్యలు చేపట్టా రు. ఆ తర్వాత ఇప్పటిదాకా సమావేశం నిర్వహించలేదు. దిశ సమావేశం జరగక దాదాపు నాలుగేండ్లకు పైగా అవుతుంది. సీఎం రేవంత్‌రెడ్డి ఎంపీగా గెలిచిన తర్వాత 2019లో జరగాల్సిన ఈ సమావేశం అనివార్య కారణాల మూలంగా వాయిదా పడింది. అప్పుడు రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలో ఉండగా, మల్కాజిగిరి నుంచి రేవంత్‌రెడ్డి ఎంపీగా గెలిచారు. ప్రస్తుతం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఎన్నికై సుమారు పది నెలలు గడుస్తున్నా సమీక్ష సమావేశం నిర్వహించలేదు. దీంతో చాలా రోజుల తర్వాత నేడు నిర్వహించనున్న దిశ సమావేశానికి ప్రాధాన్యత సంతరించుకున్నది.

## ఇండ్ల నిర్మాణానికి రూ.5 లక్షల సహాయం



● ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఐదు లక్షల ఆర్థిక సహాయం అందించబడుతుందని స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని, కేటీఆర్ కాలనీలో తెలంగాణ ప్రభుతం ఆదేశాల మేరకు.. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను గుర్తించేందుకు సర్వేను నిర్వహిస్తున్నారు. డివిజన్ కార్పొరేటర్, మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజా పాలనలో స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి.. అధికారులు వారి ఇండ్ల వద్దకు వెళ్లి సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. సర్వే కోసం ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌లో లబ్ధిదారుల వివరాలు పొందుపరచడం జరుగుతుందని తెలిపారు. సొంత స్థలం ఉండి లేదా రేకుల ఇండ్ల ఉన్న లబ్ధిదారులను ఎంపికచేసి వారు, స్లాబు ఇండ్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం తరపునుండి ఐదు లక్షల రూపాయల ఆర్థికసాయం అందించడం జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, జిల్లా గణేష్, షౌకత్ అలీ మున్నా, పోశెట్టిగౌడ్, వెంకటేష్, షకీల్ మున్నా, నరసింహులు పాల్గొన్నారు.

## సమ్మా రెడ్డి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలనీ డివిజన్ ఆల్విన్ కాలనీ ఫేస్ 2 కి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ సమ్మారెడ్డి జన్మదిన శుభసందర్భంగా.. డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ , సమ్మారెడ్డి ని శాలువతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, శివరాజ్ గౌడ్, జిల్లా గణేష్, షౌకత్ అలీ మున్నా, పోశెట్టిగౌడ్, రాజేందర్, సంతోష్ బిరాదర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



● ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్

నవతెలంగాణ-బాలానగర్

సైబరాబాద్ కమిషనరేట్ బాలానగర్ జోన్ పరిధిలో రెయిన్బో డిగ్రీ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులకై మంగళవారం బాలానగర్ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో.. అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సురేష్ కుమార్ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను చేపట్టినట్టు సీఐ సురేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించి, బాధ్యతతో రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని రిపై వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబందనలు పాటించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరు డ్రైవింగ్ లైసెన్ తీసుకోవాలని కోరారు. లైసెన్‌లేకుండా డ్రైవింగ్ చేస్తే జరిమానాతో పాటు మూడు నెలల జైలు తప్పదని తెలిపారు. ఇన్స్పెక్టర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ లైసెన్‌లేకుండా డ్రైవింగ్ చేస్తే జరిమానాతో పాటు మూడు నెలల జైలు తప్పదని తెలిపారు. యువత ఓవర్ స్పీడ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని తెలిపారు. వాహనాలు నడిపే ప్రతీ ఒక్కరు డ్రైవింగ్ లైసెన్సులు కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. దేశ భవిష్యత్ యువత చేతిలో ఉందన్నారు. నేటి సమాజంలో పెరుగుతున్న ఆధునికతతో పాటు సైబర్ క్రైంలు, మోసాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు.

## కూకట్‌పల్లి మెట్రో స్టేషన్‌కు ఓమ్ని హాస్పిటల్స్ కూకట్‌పల్లిగా నామకరణం




నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

మెట్రో రైలులో ప్రయాణించే వారికి 399 రూపాయలతో కూడిన ఈసీజీ, చెస్ట్ ఎక్స్‌రే, సి.బి.పి, ఆర్.బి.ఎస్ డాక్టర్ కన్సల్టెంట్‌తో కూడిన హెల్త్ ప్యాకేజీను అందిస్తున్నట్టు ఇన్ కార్స్ సంస్థ చైర్మెన్ సూర్యనారాయణ రెడ్డి వెల్లడించారు. మంగళవారం కూకట్‌పల్లి ఓమ్ని ఆస్పత్రి ఆధ్వర్యంలో.. మెట్రో స్టేషన్లో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెట్రో రైల్ మేనేజింగ్ డైరెక్టర్ కెవిబి రెడ్డి మాట్లాడుతూ మెట్రో ప్రయాణికులతో పాటు సంస్థ పనిచేసే కార్మికులకు పలు రకాల సేవలు అందించేందుకు ముందుకు వచ్చామని తెలిపారు. ఇక నుంచి కూకట్‌పల్లి మెట్రో స్టేషన్‌కు సంబంధించి ఓమ్ని హాస్పిటల్స్ కూకట్‌పల్లిగా నామకరణం చేస్తున్నట్టు తెలిపారు. మెట్రో రైల్ సంస్థలో పని చేసే ప్రతి ఒక్కరికి తమ ఆస్పత్రి తరపున మెడికల్ ఎమర్జెన్సీ టైంలో చేయాల్సిన పనుల పైన ప్రత్యేక శిక్షణ తరగతుల నిర్వహిస్తామన్నారు. హైదరాబాద్ మెట్రో రైల్లో ప్రయాణించే ప్రయాణికులకు మెట్రో అధికారులు ఓమ్ని హాస్పిటల్స్ యాజమాన్యం సంయుక్తంగా రాయితీలు కల్పించనున్నట్టు తెలిపారు. ఈరోజు నుంచి మెట్రో సంస్థతో తాము కూడా ఒక భాగంగా నిలిచినందుకు ఎంతో సంతోషంగా ఉన్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మెట్రో రైల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుధీర్, చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ మురళి, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ లోకేష్ ,ఓమ్ని గ్రూప్ డైరెక్టర్ పూర్ణిమ రెడ్డి, ఓమ్ని హాస్పిటల్ సీఈవో దుర్గేష్ శివ, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ అంకిత్ షా, యూనిట్ హెడ్ మెడికల్ సూపరెడెంట్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్వీ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌లో, ఎమ్మెల్యే మాధవరం కృష్ణ రావు చేతుల మీదుగా.. బీఆర్ఎస్వి నూతన సంవత్సరం క్యాలెండర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వి. ఎక్స్ స్టేట్ జనరల్ సెక్రెటరీ వి.యశ్వంత్ కుమార్, శేర్లింగంపల్లి బీఆర్ఎస్వి రాజు అమలవలస ఆధ్వర్యంలో.. ముఖ్య అతిథులు బీఆర్ఎస్ మియాపూర్ ప్రెసిడెంట్ బీఎస్ఎన్ కిరణ్ యాదవ్, కలదిండి రోజా, గోపరాజు శ్రీనివాసరావు , రాజు వడ్డేరాజ్, తేజ, ముజీబ్ ,కోటి ,జస్వంత్, తదితరులు పాల్గొన్నారు.

## బాలానగర్‌లో పెరుగుతున్న నిఘా నేత్రాలు

- సీసీ కెమెరాలతో తగ్గుతున్న నేరాలు
- బాలానగర్ జోన్ ఏసీపీ హనుమంత రావు



నవతెలంగాణ-బాలానగర్

సైబరాబాద్ కమిషనరేట్ బాలానగర్ పోలీస్ స్టేషన్ పరధిలోని రాజు కాలనీ ఇంటి యజమానులకు సీసీటీవీ అవగాహన కల్పించే సదస్సును బాలానగర్ సీఐ నర్సింహ రాజు ఆధ్వర్యంలో.. మంగళవారం బాలానగర్ ఏసీపీ హనుమంత రావు నిర్వహించారు. అదేవిధంగా బేతేసదా ప్రార్థన మందిరంలో ఇటీవల ఏర్పాటు చేసినా సీసీటీవీ కెమెరాలను ఏసీపీ హనుమంతా రావు, సీఐ నర్సింహ రాజు, ఎస్ఐ హాజీ మియాతో కలిసి ప్రారంభించారు. ఈ సదస్సుకు డివిజన్ పరిధిలోని అనేక మంది ఇంటి యజమానులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ హనుమంత రావు మాట్లాడుతూ ప్రస్తుతం బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ ప్రాంతాలలో దోపిడీ, దొంగతనాలు, అసాంఘీక కార్యకలాపాలను అరికట్టే విధంగా భద్రతాపరమైన చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టడం అవసరమని ఏసీపీ అన్నారు. అనంతరం సీఐ నర్సింహ రాజు మాట్లాడుతూ "ప్రస్తుత పరిస్థితు ల్లో అనుమానాస్పద వ్యక్తులు, సంఘ విద్రోహ శక్తులు స్థానికం గా సంచరిస్తున్నారన్నారు. ఏమైనా అనుమానిత వ్యక్తులు పరిసర ప్రాంతాల్లో సంచరిస్తే వెంటనే పోలీసులకు డయల్ 100 లేదా 9490617444 సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పి. రవి కృష్ణ, గోపాల్, సత్యపాల్, కిషోర్ కుమార్, నయీమ్, పరంజ్యోతి, బెంజమిన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలున్న ప్రాంతాలలో పనులు పూర్తి చేస్తాం



● కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

నిత్యం సమస్యలతో ప్రజలు కొట్టుమిట్టాడుతున్న ప్రాంతాలలో ప్రథమ ప్రాధాన్యతగా పనులు పూర్తి చేస్తామని హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు అన్నారు. హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్ రోడ్డు హెలిస్టిక్ హస్పిటల్ వద్ద చేపడుతున్న వరద కాలువ పనులను జాయింట్ ఇన్స్పెక్షన్ కింద జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్, జలమండలి అధికారులతో కలసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అన్ని డిపార్ట్‌మెంట్ల, ప్రజల సహకారంతో పనులు వేగంగా జరుగుతున్నా యన్నారు. పలు కాలనీలలో ప్రజల నుంచి వచ్చిన వినతి మేరకు.. మా దృష్టికి వచ్చిన సమస్యలను పరిగణలోకి తీసుకొని ప్రత్యేక చొరవతో పనులు జరుగుతున్నందున ప్రజలు సంయమనం పాటించాలన్నారు. ట్రాఫిక్ మళ్లింపుల దగ్గర క్రమశిక్షణతో అధికారులకు సహకరించాలని తెలియచేశారు. ఏ చిన్న సమస్య అయిన నా దృష్టికి వచ్చిన తప్పకుండా పరిష్కరిస్తామన్నారు. నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదన్నారు. త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. ప్రజలకు అందుబాటులోకి ఉంటానని, మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానన్నారు. హైదర్ నగర్ డివిజన్‌ను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన, అగ్రగామి డివిజన్‌గా తీర్చిదితామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ రాజీవ్, వర్క్ ఇన్స్పెక్టర్ మహదేవ్, జలమండలి ఇన్‌చార్జి డీజీఎం శంషీర్, మేనేజర్ ప్రశాంతి, నాయకులు, డివిజన్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా డా.పెండెం. నాగభూషణం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని చింతల్‌కు చెందిన డా.పెండెం.నాగభూషణం ఎన్నికయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు వల్లకాటి రాజ్ కుమార్ డా.పెండెం. నాగభూషణంకి తెలంగాణ రాష్ట్ర కమిటీలో సహాయ కార్యదర్శిగా నియమిస్తూ.. నియామక పత్రాని అందజేశారు. ఈ సందర్భంగా డా.పెండెం. నాగభూషణం మాట్లాడుతూ.. నియామక పత్రం అందజేసినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో అప్పం శ్రీనివాసరావు, సామల వెంకటేశం, ఒడిచేర్ల మారుతి, వల్లకాటి శ్రీను, విష్ణు, గోవర్ధన్, ఆంజనేయులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడం హర్షదాయకం



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

తెలంగాణ ప్రభుత్వం సావిత్రి బాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడం హర్షదాయకమని జేఎన్‌టీయూహెచ్ ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి. బాలకిష్టా రెడ్డి అన్నారు. ప్రముఖ సంఘసంస్కర్త, తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే జయంతిని పురస్కరించుకుని.. మంగళవారం గోల్డెన్ జూబ్లీ హాల్లో మహిళా ఆచార్యుల ఆధ్వర్యంలో.. జేఎన్‌టీయూహెచ్‌లో మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేఎన్‌టీయూ హెచ్ ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.బాలకిష్టా రెడ్డితో పాటు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె. వెంకటేశ్వరరావు, మహిళా డైరెక్టర్లు, ప్రొఫెసర్ మాధవి కుమారి పాల్గొని సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి. బాలకిష్టా రెడ్డి మాట్లాడుతూ యూనివర్సిటీలో మహిళా ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించడమే , రీసెర్చ్‌లోను కాకుండా వివిధ విభాగాల్లో కృషి చేస్తుండటం గర్వకారణమన్నారు. "ఆడది అబల కాదు సభల అని నినాదం మా యూనివర్సిటీలో మహిళా ఉపాధ్యాయుల కృషికి సరిగ్గా అనువైనది," అని ప్రొఫెసర్లు అభిప్రాయపడ్డారు. అనంతరం రిటైర్డ్ ప్రొఫెసర్లను సన్మానించి, సాంస్కృతిక, క్రీడా పోటీలు నిర్వహించి గెలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్లు, సీనియర్ ప్రొఫెసర్లు, మహిళా అధికారులు, మహిళా ఆచార్యులు పాల్గొన్నారు.

## పలు సమస్యలపై కార్పొరేటర్ పర్యటన



నవతెలంగాణ-కూకట్‌పల్లి

శేర్లింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్ డివిజన్‌లోని, రిక్షా పుల్లర్స్ కాలనీ, రామకృష్ణ నగర్‌లలో వివిధ విభాగాలకు చెందిన జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి, పాదయాత్ర చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల సర్వే, శానిటేషన్, శివరేజ్, ఎలక్ట్రికల్, పలు సమస్యల కార్పొ రేటర్ మాధవరం రోజాదేవి రంగారావు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా పాలన లో ఇందిరమ్మ ఇండ్లు పథకానికి, దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు, ఇప్పుడు సర్వే చేసే డేటాలో చాలా వరకు లేవన్నారు. అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి .. అప్లై, చేసుకున్న వాళ్లందరికీ కూడా ఇందిరమ్మ ఇండ్లు ఇప్పించే విధంగా చేస్తా అన్నారు. వాటర్ వాల్ దగ్గర లీకేజ్ అవుతుందని, వీలైనంత తొందరగా మరమ్మత్తులు చేయించాలని అధికారులకు సూచించారు. సింగల్ ఫేస్ లైన్లో కొన్ని వీధులలో లేవని అక్కడ త్రీఫేస్ లైన్లు మార్చాలని, అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ, సిఓ పాపా గౌడ్, టిజిఎస్పీడిసిఎల్ ఏఈ పీరు నాయక్, జలమండలి మేనేజర్ ప్రియాంక, కాలనీ సభ్యులు అల్వాల్ గిరిబాబు, మాచర్ల భద్రయ్య, లింగయ్య, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ స్థపతి వల్లినాయకన్, మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావులు.. బాలాజీనగర్ డివిజన్ ఆంజనేయ నగర్ శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి అలయ నిర్మాణ పనులు వారు పరిశీలించారు.
నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



## నేడు విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-దుండిగల్

నేడు విద్యుత్ ఫీడర్ల నిర్వహణ పనుల కారణంగా కేవీఆర్ ఫీడర్,బౌరంపేట విలేజ్ ఫీడర్ పరిధిలో ఉ11:00 గం॥ ల నుంచి సా 5:00 గం॥ ల వరకు కేవీఆర్ కాలనీ, స్ప్రింగ్ వుడ్, జేఎస్ ఎస్ విల్లాస్, స్టెర్లింగ్ హెూమ్స్, ప్రణీత్ నేచర్ బౌంటీ, అలాగే బౌరంపేట్ విలేజ్, ల్యాండ్మార్క్ 2, కీర్తి హెూమ్స్, అక్షయ్ డెవలపర్స్, బ్లోమ్స్, ప్రణీత్ మీడోస్, మొదలైన ప్రాంతాల్లో అలాగే మల్లంపేట ఫీడర్ పరిధిలో ఉ 11:00 గం నుంచి మ 3:00 గం॥ ల వరక మల్లంపేట్ గ్రామం, హై-రైజ్ విల్లాస్, ఏపి ఆర్ విల్లాస్, జిబిసి విల్లాస్, డ్రీమ్ వ్యాలీ కాలనీ, గ్రీన్ పార్క్ కాలనీ, ఆకాష్ లేఅవుట్, మారుతీ నగర్ మొదలైన ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని,ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని బౌరంపేట విద్యుత్ శాఖ ఏ ఈ బి.సాయికిరణ్ తెలిపారు.

**దుండిగల్:** టీజి ఎయిమ్స్ లైన్ నిర్వహణ పనుల కారణంగా ఆర్ జి కే 1 ఫీడర్‌లో ఉదయం 10.00 గం॥ ల నుంచి మ 01.00 గం॥ వరకు 60 గజాలు, ఆర్ కే బ్లాక్స్ మొదలైన ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని.. ఈ అంతరాయానికి ప్రజలు సహక రించాలని డిపి పల్లి విద్యుత్ శాఖ ఏ ఈ సురేందర్ రెడ్డి తెలిపారు.

## నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-బంజారాహిల్స్

గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఆధ్వర్యంలో తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం ఖైరతాబాద్‌లో బీసీ అధికారి (ఈడి) జి.ఆశన్న ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రజకులు ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చారకొండ వెంకటస్వామి, మరియల గోపాల్, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ పెద్దాపురం భాస్కర్, ఉపాధ్యక్షులు, పి భాస్కరరావు, వి యాదమ్మ, జిల్లా సహాయ కార్యదర్శిలు రాపర్తి ప్రభాకర్, అల్వాల బాబు, జిల్లా సోషల్ మీడియా సిహెచ్ నాగేష్, జిల్లా కమిటీ సభ్యులు, పి రాజు, కేశవులు పాల్గొన్నారు.

## ఆస్పత్రి భవన నిర్మాణ పనులు తనిఖీ



నవతెలంగాణ-ఓయూ

సీతాఫల్‌మండీలో నిర్మిస్తున్న కుట్టివెల్లోడి ప్రభుత్వ ఆస్పత్రి భవనాల నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేసి, సూపర్ స్పెషాలిటి ఆస్పత్రిగా తీర్చిదుద్దుతామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావు గౌడ్ అన్నారు. సితాఫలమండీ కుట్టివెల్లోడి ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణ పనులను అధికారులతో కలిసి ఆయన మంగళవారం తనిఖీ చేశారు. నిర్మాణం పనుల్లో భాగంగా కొత్తగా నిర్మిస్తున్న స్లాబ్ నిర్మాణం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.12 కోట్లతో నిర్మిస్తున్న సితాఫలమండీ కుట్టివెల్లోడి ప్రభుత్వ సివిల్ ఆస్పత్రి భవనాల నిర్మాణానికి గత ప్రభుత్వ హయంలో ప్రత్యేక అనుమతులు సాధించామని, నిర్మాణం పనుల్లో నాణ్యతకు ప్రాముఖ్యతను కల్పించి వేగంగా పూర్తి చేయాలనీ అధికారులకు సూచించారు. కార్పొరేటర్ సామల హేమ, వైద్య శాఖ ఇంజినీరింగ్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు నిరాటంకంగా కొనసాగిస్తాం



- సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో గత పదేండ్ల కాలంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను నిరాటంకంగా కొనసాగిస్తామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావు గౌడ్ అన్నారు. సితాఫలమండీ డివిజన్ పరిధిలో మంగళవారం ఆయన వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సితాఫలమండీ పరిధిలో కొత్తగా రూ.10 కోట్ల ఖర్చుతో నాలా విస్తరణ పనులకు ఆమోదం లభించిందని తెలిపారు. మహమ్మద్ గూడా వద్ద సివరేజ్ సమస్యలు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా మహమ్మద్‌గుడాలో రూ.8 లక్షల ఖర్చుతో సివరేజ్ లైన్ ఏర్పాటు పనులను, ఇందిరానగర్ కాలనీలో రూ.18 లక్షల ఖర్చుతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ సామల హేమతో కలిసి ప్రారంభించారు. కార్పొరేటర్ సామల హేమ మాట్లాడుతూ.. సితాఫలమండీ డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని, ఎమ్మెల్యే సహకారంతో వివిధ ముఖ్యమైన పనులను చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు విద్యాసాగర్ నవ్య, స్వర్ణలత, కౌశిక్, నాయకులు కరాటే రాజు, బీఆర్ఎస్, సమన్వయకర్త రాజ సుందర్, మహమ్మద్ గూడా, ఇందిరానగర్ సంక్షేమ సంఘాల నేతలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## రైల్వే భద్రతపై అవగాహన కార్యక్రమం



నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ రైల్వే రక్షణ దళం, గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్ రెడ్డి లాలాపేట్ తార్నాక రైల్వే బ్రిడ్జ్ వద్ద ఆపరేషన్ సమ్రక్ష, రాళ్ల దాడులు, రైల్వే ట్రాక్‌లో జరిగే ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజలకు రైల్వే భద్రతపై అవగాహన కల్పించడం, ప్రమాదాలను నివారించడంపై దృష్టి సారించని సూచించారు. చలనంలో ఉన్న రైలు ఎక్కడం లేదా దిగడం వంటి ప్రాణాంతక పద్ధతుల ప్రమాదాలపై అవగాహన కల్పించారు. రైల్వే ట్రాక్‌లపై అనధికార ప్రవేశం మానేయమని, భద్రత కోసం ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌లు ఉపయోగించాల్సిందిగా సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో లేదా రైల్వే భద్రతా సమస్యల కోసం 139 టోల్-ఫ్రీ నంబర్‌ను సంప్రదించవచ్చని వివరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ... రైల్వే భద్రతకు సంబంధించిన బాధ్యతను అందరూ పంచుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తూ, ప్రయాణికులందరూ భద్రంగా ప్రయాణం చేయడం కోసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమం రైల్వే ప్రయాణికుల భద్రతపై అవగాహన పెంపొందించడానికి రైల్వే రక్షణ దళం తీసుకున్న మరొక ముఖ్యమైన అడుగు. రైల్వే ప్రయాణం మరింత భద్రంగా మారడానికి ఈ కార్యక్రమం సహాయపడుతుందని నమ్మకంగా చెప్పవచ్చన్నారు.

## అనువాదంపై అంతర్జాతీయ సెమినార్

నవతెలంగాణఓయూ

హిందీ విభాగం వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హిందీ విభాగం సీతాఫల్‌మండి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సెంట్రల్ హిందీ డైరెక్టరేట్ భారత ప్రభుత్వం, ఉస్మానియా విశ్వవిద్యాలయం హిందీ అకాడమి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో 'అనువాదం- మారుతున్న దృక్పథాలు, అభివృద్ధి చెందుతున్న అవకాశాలు' అనే అంశంపై ఓయూ ఆర్ట్స్ కళాశాలలో నేటి నుంచి మూడు రోజుల పాటు అంతర్జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని ఓయూ హిందీ విభాగం అధ్యక్షురాలు ప్రొ. మాయాదేవి, వివేకానంద ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. ప్రభు, సీతాఫల్ మండి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ హిందీ అకాడమీ డైరెక్టర్, ప్రొ.రామచంద్రం మంగళవారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ సెమినార్‌లో భారతదేశంతోపాటు విదేశాలకు చెందిన పలువురు మేధావులు అనువాదానికి సంబంధించిన వివిధ దృక్కోణాలపై మాట్లాడతారని, ఈ రంగంలో ఆవిర్భవిస్తున్న అవకాశాలను కూడా తెలియజేస్తారని సెమినార్ కన్వీనర్ ప్రొ. అనుపమ తెలియజేశారు. అనువాద సందర్భంలో సంస్కృతి, ప్రపంచీకరణ, యంత్ర అనువాదం, ఏఐ వంటి అంశాలపై అర్థవంతమైన చర్చ ఉంటుందన్నారు. పరిశోధకులు, భాషాభిమానులు, విద్యార్థులు సదస్సు విచ్చేసి విజయవంతం చేయాలని సదస్సు నిర్వాహకులు కోరారు.

# సెప్టెంబర్‌లో టిమ్స్ ప్రారంభం

- మంత్రి కోమటిరెడ్డి
- ఆగస్టు చివరి కల్లా పనులు పూర్తి చేయాలని ఆదేశాలు
- ఎమ్మెల్యే శ్రీ గణేష్‌తో కలిసి నిర్మాణ పనుల పరిశీలన





నవతెలంగాణ-కంటోన్మెంట్

టిమ్స్ హాస్పిటల్ ఆగస్టు చివరికల్లా పూర్తి చేసి సెప్టెంబర్‌లో ప్రారంభోత్సవం చేస్తామని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సికింద్రాబాద్ అల్వాల్ రైతు బజార్ సమీపంలో తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తున్న టిమ్స్ ఆస్పత్రి నిర్మాణ పనులను మంగళవారం వారు పరిశీలించారు. ఈ మంత్రి మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల సమయంలో కోడ్ కారణంగా కొంత ఆలస్యమైందని కానీ ఇప్పుడు పనులు వేగంగా అవుతున్నాయన్నారు. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యాయని, మిగతా పనులు కూడా వేగంగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆయన ఆదేశించారు. ఈ ఆస్పత్రి నిర్మాణం పూర్తయి ప్రారంభమైతే నగరంలోని ప్రజలకే కాకుండా చుట్టుపక్కల ఉన్న పలు జిల్లాల ప్రజలకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ హాస్పిటల్‌లో అన్ని విభాగాలకు చెందిన అత్యాధునికమైన చికిత్స అందుబాటులో ఉంటుందని, ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుతాయని తెలియజేశారు. నిర్మాణ పనులను స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేష్ కూడా పర్యవేక్షిస్తున్నారని ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడానికి కట్టుబడి ఉండని వారికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడానికి టిమ్స్ హాస్పిటల్ ఏర్పాటు చేస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్, పలు శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# సమగ్ర సర్వే చేసి విచారణ చేపడతాం..

- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్



నవతెలంగాణ-బంజారాహిల్స్

కబ్జాలపై సమగ్ర సర్వే చేయించి నిర్ధారించుకున్నాక విచారణ చేపడతామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. జూబ్లీహిల్స్‌లోని నందగిరి హిల్స్, హుడా ఎన్‌క్లేవ్ కాలనీతో పాటు గురుబ్రహ్మనగర్ బస్తీల్లో తమ సిబ్బందితో కలిసి మంగళవారం రెండు గంటలపాటు ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గురుబ్రహ్మనగర్ బస్తీ ప్రాంతంలో 2 బెడ్ రూంలు నిర్మించేందుకు కేటాయించిన స్థలాన్ని కొంతమంది ఆక్రమిస్తున్నారని బస్తీ వాసులు ఫిర్యాదు చేశారు. అదే సమయంలో బస్తీకి ఆనుకుని ఉన్న పార్కు స్థలాలను కొంతమంది ఆక్రమణదారులు కబ్జా చేస్తున్నారని నందగిరిగిల్స్, హుడా ఎన్‌క్లేవ్ వాసులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. మొత్తంగా ఈ వ్యవహారంలో డీజీపీస్ (డిఫరెన్షియల్ గ్లోబల్ పోసిషనింగ్ సిస్టమ్) ద్వారా సర్వే చేయించి నిర్ధారించుకున్నాక విచారణ చేపడతామని కమిషనర్ హామీ యిచ్చారు. బాధ్యులందరినీ తమ కార్యాలయానికి పిలిపించి వారి వద్ద ఉన్న ఆధారాలను కూడా తనిఖీ చేస్తామని కమిషనర్ చెప్పారు. హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ కమిషనర్లతో పాటు హైదరాబాద్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ వివాదాన్ని పరిష్కరించి పేదలకు న్యాయం చేసేలా చూస్తామని స్థానికులకు కమిషనర్ హామీ ఇచ్చారు. కమిషనర్ వచ్చారనే విషయం తెలుసుకున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ గురుబ్రహ్మనగర్ బస్తీకి చేరుకున్నారు. అవసరమైతే ప్రభుత్వ స్థలంలో పేదలకు పక్కా ఇండ్లు కట్టించే బాధ్యత తాను తీసుకుంటానని ఎమ్మెల్యే హామి ఇచ్చారు. హైడ్రా ఎలాంటి నిర్ణయం తీసుకున్నా తమ మద్దతు ఉంటుందన్నారు. గంటలపాటు మొత్తం గురుబ్రహ్మనగర్ బస్తీతో పాటు నందగిరి కాలనీ, హుడా ఎనక్లేవ్ కాలనీలతో పాటు అక్కడ ప్రభుత్వ స్థలాలు పార్కులను హైడ్రా కమిషనర్ యితర అధికారులతో కలసి తిరిగి వారు చూపించిన పత్రాలను పరిశీలించి స్థానిక ఎంఎల్‌ఏ దానం నాగేందర్ తోపాటు పలువురు స్థానిక నేతలతో పర్యటనలో పాల్గొని వివరాలు అడిగి తెలుసుకుని ప్రస్తుతం కూల్చివేతలేమీ లేవని ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

అన్ని సమస్యలు న్యాయ పరమైన చిక్కులు లేకుండా ప్రభుత్వం కృషి చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి సైతం పేదలకు న్యాయం చేయాలని చూస్తు న్నారని అలాగే ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# డ్రగ్స్ రహిత తెలంగాణే లక్ష్యం

- ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్
- ఓయూ ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో 2కే రన్




నవతెలంగాణ-ఓయూ

డ్రగ్స్ రహిత తెలంగాణే తమ కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి ఆ దిశగా చర్యలు ప్రారంభించారని ఆయన చెప్పారు. మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీలో ఎన్ ఎస్‌యూఐ అధ్యక్షుడు మేడ శ్రీను ఆధ్వర్యంలో డ్రగ్స్‌ను రూపుమాపే ఆవశ్యకతను తెలియజేస్తూ ఎన్‌సీసీ గేటు నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు 2కే రన్ నిర్వహించారు. "మత్తు వదలరా మిత్రమా" అనే ట్యాగ్ లైన్ ప్లకార్డులతో విద్యార్థులు, యువత ఉత్సాహంగా రన్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ముఖ్య అతిథిగా హాజరై రన్‌ను ప్రారంభించారు. డీసీపీ బాలస్వామి, టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. యువత విలువలతో కూడిన జీవితం అనుభవించాలన్నారు. సమాజానికి హానికరంగా మారిన డ్రగ్స్‌ను ధ్వంసం చేయాలని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్. ఆరోగ్య తెలంగాణ కోసం కృషి చేస్తున్నారన్నారు. డీసీపీ బాలస్వామి మాట్లాడుతూ. డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నామని, డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణంలో ప్రజలంతా భాగస్వాములు కావాలన్నా రు.

ఈ కార్యక్రమ ంలో కుతాడి కుమార్, తెలంగాణ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ నాగేశ్వర రావు, ఓయూ సివిల్ సర్వీస్ అకాడమీ డైరెక్టర్ చింతల నిర్మలారెడ్డి, మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ సర్, అప్కార శాఖ డిఎస్పీ డాక్టర్ శాంతి, సిద్ధిపేట గవర్నమెంట్ హాస్పిటల్ సూపరిడెంట్ జానకి రెడ్డి, నిజాం కాలేజ్ ప్రొఫెసర్ కుందన్, శ్రీకర్, నర్సా గౌడ్, మణికంఠ పాల్గొన్నారు.

## నేటి నుంచి రక్త నమూనా సేకరణపై సర్వే



- సద్వినియోగం చేసుకోవాలి
- సీతాఫల్‌మండి కార్పొరేటర్ డా.సామల హేమ

నవతెలంగాణ-ఓయూ

లింఫాటిక్ ఫైలేరియాసిస్ నిర్మూలన వ్యూహం దృష్ట్యా రక్త నమూనా సేకరణ సర్వేను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి సీతాఫల్‌మండి కార్పొరేటర్ డా.సామల హేమ అన్నారు. కుట్టివెల్లోడి ఆస్పత్రిలో అయిన ఫైలేరియాసిస్ నిర్మూలన వ్యూహం దృష్ట్యా, రక్త నమూనా సేకరణపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రక్త నమూనా సేకరణ సర్వే కొరకు ఆర్యసమాజ్, మేడిబావిలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు రాత్రి 8 నుంచి 12 వరకు ఈ పరీక్ష నిర్వహింస్తున్నట్టు తెలిపారు. ఫైలేరియాసిస్, ఫైలేరియా అని పిలువబడే దారం లాంటి పురుగుల వల్ల కలిగే పరాన్నజీవి వ్యాధి, ప్రపంచవ్యాప్తంగా ప్రజారోగ్యానికి గణనీయమైన ముప్పును కలిగిస్తుందని, దీనివల్ల కాళ్లు, చేతులు లేదా జననేంద్రియాలు వాపుకు కారణమవుతాయి. ఈ పరిస్థితిని సాధారణంగా ఎలిఫెంటియాసిస్ అంటారు. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఫైలేరియా పరాన్నజీవులు సాధారణంగా రాత్రి సమయంలో పరిధీయ రక్తంలో కనిపిస్తాయి. ఫలితంగా, ఆరోగ్య అధికారులు వ్యాధి వ్యాప్తిని సమర్థవంతంగా పర్యవేక్షించడానికి, ట్రాక్ చేయడానికి రాత్రిపూట సర్వేలు, నమూనా సేకరణలను నిర్వహిస్తారు. వ్యాధి వ్యాప్తి చెందే దోమలు కుట్టకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ చర్యలలో క్రిమిసంహారక మందులతో కూడిన బెడ్ నెట్‌లను ఉపయోగించడం, రక్షిత దుస్తులు ధరించడం, దోమల పెంపకాన్ని నిరోధించడం, ఇండ్ల సమీపంలో నిల్వ ఉన్న నీటిని తొలగించడం వంటివి ఉన్నాయి. ఫైలేరియాసిస్ నివారణ చర్యలు, మరింత సమాచారం కోసం రేపటి నుంచి మూడు రోజుల పాటు రక్త నమూనా సేకరణ సర్వేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ డాక్టర్ సామల హేమ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ప్రత్యూష, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

## ప్రపంచంలో మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్



- నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణలో ఐపీఈ డైరెక్టర్ ప్రొ. ఎస్.శ్రీనివాస మూర్తి

నవతెలంగాణ-ఓయూ

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్‌లో అంతర్జాతీయ స్థాయిలో విద్యా ఉపాధి కల్పనకు కృషి చేస్తున్నట్టు డైరెక్టర్ ప్రొ.ఎస్.శ్రీనివాసమూర్తి అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో నవతెలంగాణ క్యాలెండర్, ఆఫీస్ క్యాలెండర్స్, డైరీని సీనియర్ జర్నలిస్టు, ఓయూ పీహెచ్డీ స్టూడెంట్ తలారి. శ్రీనివాసరావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిత్యం ప్రజల పక్షాన నిలబడి ఉన్నా నవతెలంగాణ యాజమాన్యంకు, కుటుంబ సభ్యులకు, ఐపీఈ ప్రొపెసర్స్, ఉద్యోగులు, విద్యార్థులు, సిబ్బందికి నుతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఐపీఈ ప్రస్థానం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రారంభమైన నేడు శామీర్‌పేటలో సువిశాలమైన ప్రాంగణంలో అన్ని హంగులతో విద్యార్థులకు విద్యాను అందిస్తున్న సంస్థ అన్నారు. క్రమశిక్షణ, క్రీడలు,



సాంస్కృతిక కార్యక్రమాలకు పెద్దపీటం వేస్తు, ప్రపంచంలో దేశాన్ని అతిపెద్ద 3వ,ఆర్థిక వ్యవస్థలో ఒకటి చేయాలని లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్టు చెప్పారు. తాము అందిస్తున్న కోర్సులకు సార్క్ దేశాల్లో విశేష ఆదరణ గుర్తింపు లభిస్తుందన్నారు. 1964 సంవత్సరం నుంచి నేటి వరకు సీనియర్, ప్రఖ్యాత ప్రభుత్వ అధికారులు, విద్యావేత్తలు, పరిశ్రమల కెప్టెన్స్‌తో, విధాన నిర్ణేతలతో కూడిన బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ కలిగి ఉన్న మినీ డిమ్డ్ వర్సిటీగా ప్రొ.శ్రీనివాస అభివర్ణించారు. ఇక్కడ విద్యా పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్రాముఖ్యత కలిగిన ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు, లక్షల్లో ప్యాకేజీతో ఉన్నాయి అన్నారు. కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

# పనుల పూర్తి చేయడంపై ప్రభుత్వ నిర్లక్ష్యం

- వాహనాల పార్కింగ్‌కు సరైన స్థలం లేదు
- రూ.5 కోట్లతో మల్టీలెవెల్ పార్కింగ్
- మూడు అంతస్తులతో నిర్మాణం
- కాంగ్రెస్ ప్రభుత్వం నిధులివ్వడం లేదు
- సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ప్రజల అవసరాల కోసం చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వంపై వత్తిడి తీసుకొస్తానని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన బల్కంపేట ఎల్లమ్మ ఆలయం దగ్గర నిర్మాణంలో ఉన్న మల్టీలెవెల్ పార్కింగ్ భవనాన్ని వివిధ శాఖల అధికారులతో కలిసి సందర్శించారు. ముందుగా బల్కంపేట అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మల్టీలెవెల్ పార్కింగ్ భవనం మొత్తం తిరిగి పరిశీలించారు. పనులు అసంపూర్తిగా ఉండటం పట్ల అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మిగిలిన పనులను కూడా త్వరగా పూర్తి చేసే విధంగా త్వరలోనే ఒక సమావేశం నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రముఖ దేవాలయాలలో ఒకటిగా అభివృద్ధి చెందిన బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతూ.. వస్తుందని, అమ్మవారి దర్శనం, మొక్కులు తీర్చుకోవడానికి ఒక్క హైదరాబాద్, సికింద్రాబాద్‌ల నుండే కాకుండా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు వస్తారని వివరించారు. ఆలయానికి వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా గత ప్రభుత్వ హయాంలో అన్ని సౌకర్యాలు, వసతులు కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రధానంగా ఆలయం వద్ద వాహనాల పార్కింగ్ కు సరైన స్థలం లేకపోవడం వలన భక్తులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకొని సమస్యను పరిష్కరించాలనే ఆలోచనతో మల్టీలెవెల్ పార్కింగ్ నిర్మాణం కోసం రూ.5 కోట్లు మంజూరు చేయించినట్టు తెలిపారు. సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్ ఆ పైన మరో మూడు అంతస్తులతో నిర్మాణ పనులు ప్రారంభించినట్టు పేర్కొన్నారు. ఇందులో సెల్లార్‌లో కార్ పార్కింగ్, గ్రౌండ్ ఫ్లోర్‌లో టూ వీలర్స్ పార్కింగ్, ఫస్ట్ ఫ్లోర్‌లో కార్ పార్కింగ్, సెకండ్ ఫ్లోర్‌లో 2 రూమ్స్, 2 డార్మిటరీలు, థర్డ్ ఫ్లోర్‌లో ఫంక్షన్ హాల్, కిచెన్, డైనింగ్ హాల్ ఉండేలా డిజైన్ చేసినట్టు వివరించారు. ప్రభుత్వం మారడం కారణంగా నిధులు విడుదల కాక పనులు నిలిచిపోయాయని చెప్పారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని నియోజకవర్గ పరిధిలో అనేక అభివృద్ధి పనులను గత ప్రభుత్వం మంజూరు చేయగా వాటిలో కొన్ని చేపట్టామన్నారు. వాటిలో మల్టీలెవెల్ పార్కింగ్ భవనం, ఎస్సార్‌నగర్ కమిటీ హాల్ కూడా ఉన్నాయన్నారు. నూతనంగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయని అన్నారు. ఫతేనగర్ ఫ్లై ఓవర్ వంతెన విస్తరణ, సనత్‌నగర్ ఇండస్ట్రియల్ ప్రాంతం నుంచి అండర్ పాస్ నిర్మాణం కోసం రూ.100 కోట్లు గత ప్రభుత్వం మంజూరు చేసినప్పటికీ ఆ పనులను ప్రస్తుత ప్రభుత్వం నేటి వరకు ప్రారంభించలేదన్నారు. ఇవే కాకుండా నియోజకవర్గ పరిధిలో అన్ని అభివృద్ధి పనులు పూర్తయ్యే విధంగా ప్రభుత్వం పై వత్తిడి తీసుకొస్తానని అన్నారు. అవసరమైతే ముఖ్యమంత్రిని కలుస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ సాయిబాబా, ఈఓ కృష్ణ, జీహెచ్ఎంసీ వెంకటేశ్వర్లు, డీఈ వాసుదేవరెడ్డి, దేవాదాయ శాఖ ఇంజినీరింగ్ విభాగం డీఈ శర్మ, వాటర్ వర్క్స్ డీజీఎం విశాల్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు, ప్రధాన కార్యదర్శి నామన సంతోష్ కుమార్, నాయకులు అశోక్ యాదవ్, ప్రవీణ్ రెడ్డి, కర్ణాకర్ రెడ్డి, కూతురు నర్సింహ, గోపిలాల్ చౌహన్, శేఖర్, రాం నివాస్ బన్సాల్, పియూష్ గుప్తా, బలరాం, వనం శ్రీనివాస్, హరిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## చర్చ్ మీటింగ్‌లో పాల్గొన్న హబీబా సుల్తానా



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

బొరబండలోని ఎస్ఆర్ఆర్‌పురం సైట్-3 దగ్గర ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ కమ్యూనిటీ హాల్‌లో, ఫూల్ గాస్పెల్ చర్చి ఆధ్వర్యంలో గాస్పెల్, హీలింగ్, సాల్వేషన్ మీటింగ్ మంగళవారం నిర్వయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ బొరబండ మాజీ డిప్యూటీ మేయర్, జీహెచ్ఎంసీ మొహమ్మద్ బాబా ఫసియుద్దిన్ సతిమని హబీబా సుల్తాన హజరైయ్యారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సోదరులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# కేర్ హాస్పిటల్‌లో బోన్ గ్రాఫ్టింగ్ విధానం



నవతెలంగాణ-బంజారాహిల్స్

మలక్‌పేట్‌లోని కేర్ హాస్పిటల్స్‌లో డా.రేపాకుల కార్తీక్ ఆర్థోపెడిక్ సర్జన్ బృందం ఆధ్వర్యంలో భారతదేశపు మొట్టమొదటి బోన్ గ్రాఫ్టింగ్ విధానాన్ని అనుసరియించి అధునాతన సింథస్ (RIA2), సిస్టమ్‌ను ఉపయోగించి దీర్ఘకాలికంగా ఆర్థో సమస్యతో బాధపడుతున్న రోగికి విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. 31 ఏండ్ల రోగికి గడిచిన ఎనిమిది నెలల క్రితం కాలి ఎముక విరగడంతో సమీపంలో ఉన్న ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేయించారు.రోజులు గడుస్తున్న గాయం నయం కాకపోవడంతో కేర్ ఆస్పత్రి డాక్టర్ రేపాకుల కార్తీక్‌ను కలిసారు. అతను టిబీయా ఎముక నాన్-యూనియన్‌తో బాధపడుతున్నాడని డాక్టర్ నిర్ధారణ చేసారు. రోగికి చికిత్స విధానాన్ని తెలియపరచి అతడికి ఉన్న ఇంప్లాంట్‌ను తీసేసి, కాలి ఎముకను స్థిరీకరించడానికి ఇంటర్‌లాకింగ్ నెయిల్‌ని ఉపయోగించి కొత్త శస్త్రచికిత్స చేశారు. ఎముక అంటుకట్టుట యొక్క సాంప్రదాయిక పద్ధతికి బదులుగా, ఇది హిప్ (ఇలియాక్ క్రెస్ట్) నుంచి ఎముకను తీసుకోవడాన్ని కలిగి ఉంటుందన్నారు. "బోన్ గ్రాఫ్టింగ్ కోసం భారతదేశంలో సింథస్ (RIA2) వ్యవస్థను ఉపయోగించడం ఇదే మొదటిసారని డాక్టర్ కార్తిక్ తెలిపారు. ఈ వినూత్న చికిత్స సాధ్యమైనంత ఉత్తమమైన సంరక్షణను అందించడానికి అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించడంలో కేర్ హాస్పిటల్స్ నిబద్ధతను తెలియజేస్తుందని, అటువంటి అధునాతన పద్ధతులను అవలంబించడం ద్వారా, రోగులు తక్కువ అసౌకర్యం, త్వరగా కోలుకోవడంతో పాటు సమర్థవంతమైన చికిత్సను పొందేలా చేస్తుందని ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కృష్ణ మూర్తి తెలిపారు.

## బండ్లగూడ ఆర్టీవో ఆఫీస్‌లో రోడ్డు భద్రతపై అవగాహన



నవతెలంగాణ-సిటీబ్యూరో

జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సౌత్ జోన్ ఇన్‌చార్జి ఆర్టీవో కిష్టయ్య ఆధ్వర్యంలో మంగళవారం సలార్-ఇ-మిలత్ గ్రౌండ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్టీఏ అధికారులు వాహనదారులకు, డ్రైవర్లకు, దరఖాస్తుదారులకు ద్విచక్ర వాహనం నడిపే సమయంలో విధిగా హెల్మెట్ ధరించాలనీ, మోటార్ కార్లు, ట్యాక్సీ డ్రైవర్లు సీటు బెల్టులు ధరించాలని సూచించారు. పరిమితికి మించి ప్యాసింజర్స్‌ను తీసుకువెళ్లవద్దని ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ప్రమాదాలకు కారణమయ్యే ట్రిపుల్ రైడింగ్ వంటివి చేయకూ డదన్నారు. అలాగే తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలను వాహనాలు నడపడానికి అనుమతించవద్దన్నారు. ఎంవీఐలు, ఏఎంవీఐలు, కానిస్టేబుల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రేక్షక మనోరంజకంగా పాడ గల ప్రజ్ఞా నిధి రేణుక



నవతెలంగాణ-కల్చరల్

పాటలోని సాహిత్యాన్ని తాను ఆస్వాదిస్తూ ప్రేక్షక మనోరంజకంగా పాడ గల ప్రజ్ఞా నిధి రేణుక అని వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై వంశీ ఇంటర్నేషనల్ (ఇండియా) నిర్వహణలో మధుర గాన మయూఖ గా పేరు పొందిన గాయని రేణుక కు వంశీ గ్లోబల్ మ్యూజిక్ అవార్డ్ ప్రదానం చేసి వంశీ రామరాజు మాట్లాడారు. విఖ్యాత నటులు ఎన్‌టీఆర్ ,ఏఎన్ ఆర్, సావిత్రి, జమున, వంశీ సంస్థలకు ఎంతో ఆప్తులు అని.. సావిత్రి డిసెంబర్ లోనూ మిగిలిన ముగ్గురు జనవరిలో మృతి చెందారనీ వారి వర్ధంతి సందర్భంగా వారు నటించిన సినిమాల లోని పాటలు తో స్వర నీరాజనం అర్పించారు. రేణుక సహా గాయకుడు వై ఎస్ రామ కృష్ణ తో కలసి పలు పాటలు మధురం గానం చేశారు. సుధామయి వ్యాఖ్యానం సందర్భోచితంగా ఉంది. సుంకరపల్లి శైలజ, నటుడు శంకర్ పాల్గొన్నారు

# బతుకమ్మకుంటపై హైడ్రాకు అనుకూలంగా తీర్పు

- ఎడ్ల సుధాకర్‌రెడ్డి పిటిషన్‌ను డిస్మిస్ చేసిన హైకోర్టు
- చెరువు పునరుద్ధరణకు హైడ్రా చర్యలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎట్టకేలకు అంబర్‌పేటలోని బతుకమ్మ కుంట పునరుద్ధరణపై హైడ్రాకు అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇచ్చింది. అగ్రిమెంట్ ఆఫ్ సేల్ మీద గత 3 దశాబ్దాలుగా తనదిగా చెబుతున్న ఎడ్ల సుధాకర్‌రెడ్డికి హైకోర్టులో చుక్కెదురైంది. మంగళవారం తుది తీర్పులో హైకోర్టు బతుకమ్మ కుంటగానే గుర్తించింది. బతుకమ్మ కుంట స్థలం తమదంటూ ఎడ్ల సుధాకర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది. బతుకమ్మ కుంట చెరువు పునరుద్ధరణలో హైడ్రా చర్యలు సక్రమమేనంటూ కోర్టు సమర్థించింది. అంబర్‌పేటలో బతుకమ్మ కుంటను పునరుద్ధరించాలంటూ కాంగ్రెస్ సీనియర్ నేత వీ. హనుమంతరావు హైడ్రాను సంప్రదించడమే కాకుండా సంబంధిత పత్రాలను కూడా అందజేసిన విషయం విధితమే. చెరువుల పునరుద్ధరణలో భాగంగా గత నవంబరు 13న అంబర్‌పేటలోని బతుకమ్మ కుంటను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సందర్శించారు. అదే రోజు పునరుద్ధరణకు చర్యలు ప్రారంభించారు. అయితే హైడ్రా చర్యలపై ఎడ్ల సుధాకర్‌రెడ్డి అదే నెల 24న కోర్టును ఆశ్రయించగా హైకోర్టు స్టే ఇచ్చింది. ఆ తర్వాత హైడ్రా, రెవెన్యూ, ఇరిగేషన్, సంబంధిత శాఖ అధికారులు సర్వే నంబరు 563లో ఉన్న భూ రికార్డులను పరిశీలించి కోర్టులో కౌంటర్ దాఖలుచేశారు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ సీవీ భాస్కరరెడ్డి పిటీషనర్ అయిన ఎడ్ల సుధాకర్ రెడ్డికి ఈ భూమిపై ఎలాంటి హక్కులేదని తీర్పుచెప్పారు. అది బతుకమ్మ కుంటగానే నిర్ధారించారని, బతుకమ్మకుంటపైన 2017 సంవత్సరంలో హైకోర్టు డబుల్ బెంచ్ చెరువుగానే తీర్పును వెలువడించినదని, ఫిర్యాదుదారుడికి ఏమైనా హక్కుంటే సివిల్ కోర్టును ఆశ్రయించాలని సూచించిందని గుర్తు చేశారు. హైకోర్టు తీర్పు పట్ల హైడ్రా కమిషనర్ హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరఫున సంబంధిత పత్రాలను కోర్టుకు సమర్పించి, అనుకూలమైన తీర్పు రావడంలో కృషి చేసిన హైడ్రా లీగల్ బందంతో పాటు, రెవెన్యూ ఉద్యోగులను మంగళవారం హైడ్రా ప్రధాన కార్యాలయంలో సన్మానించారు. హైడ్రా స్టాండింగ్ కౌన్సిల్ కె. రవీందర్‌రెడ్డి, సీహెచ్. జయకష్ణ, హైడ్రా న్యాయ సలహాదారుడు శ్రీనివాస్, హైడ్రా లీగల్ విభాగం లైజినింగ్ అధికారి డి. మోహన్, హైడ్రా డిప్యూటీ కలెక్టర్ ఎల్. సుధ, తహసిల్దార్ ఎం.హేమ మాలిని, తహసిల్దార్ పీ. విజయ్ కుమార్, అంబర్‌పేట తహసిల్దార్ బీ. వీరాబాయి, సర్వేయర్ కిరణ్‌లతో పాటు పలువురు అధికారులను ప్రత్యేకంగా అభినందించి, శాలువతో సన్మానించారు.

**ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుంది: హైడ్రా కమిషనర్**

బతుకమ్మ కుంటకు పూర్వ వైభవం తీసుకొస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. 1962-63 లెక్కల ప్రకారం మొత్తం 14.06 ఎకరాల విస్తీర్ణంలో బతుకమ్మ కుంట ఉందన్నారు. బఫర్ జోన్‌తో కలిపి మొత్తం వైశాల్యం 16.13 ఎకరాల విస్తీర్ణంలో ఉందని సర్వే అధికారులు తేల్చారని, తాజా సర్వే ప్రకారం అక్కడ 5.15 ఎకరాల విస్తీర్ణంలో మిగిలిందన్నారు. ప్రస్తుతం మిగిలి ఉన్న 5.15 ఎకరాల విస్తీర్ణంలోనే బతుకమ్మ కుంటను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం అక్కడ నివాసం ఉంటున్న వారికి ఎలాంటి ముప్పు లేకుండా చెరువును పునరుద్ధరిస్తామన్నారు. ఒకప్పటి ఎర్రకుంటనే.. కాలక్రమంలో బతుకమ్మ కుంటగా మారిందన్న స్థానికులు. రెవెన్యూ రికార్డులు కూడా ఇదే విషయాన్ని చెబుతున్నాయని, కాలక్రమంలో బతుకమ్మకుంటలో చెత్త, నిర్మాణ వ్యర్థాలు పోయడంతో చెరువు ఆనవాళ్లు కోల్పోయిందన్న స్థానికులు తెలిపారన్నారు. బతుకమ్మ కుంట చుట్టూ సుందరీకరణ పనులు చేద్దామని, దాంతో బతుకమ్మ కుంటలో నీటితో కళకళలాడితే పరిసర ప్రాంతాల్లో పర్యావరణం, భూగర్భ జలాల పెరుగుదలతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని కమిషనర్ తెలిపారు.

## దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన ప్రజ్ఞాశాలి పీవీ



- గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

నవతెలంగాణ-కల్చరల్

దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన ప్రజ్ఞాశాలి పీ వీ. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు అవిశ్రాంతంగా కృషి చేశారని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కొనియాడారు. రవీంద్రభారతిలో పీవీ మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పీవీ నరసింహారావు మెమోరియల్ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, పాల్గొనగా మాజీ ఎంపీలు, సుబ్బిరామిరెడ్డి, కేవీపీ రామచంద్రరావు, పీవీ సోదరుడు పీవీ మనోహర్రావు హాజరయ్యారు. పీవీ మెమోరియల్ అవార్డును దివంగత కాళోజీ నారాయణావు పక్షాన ప్రముఖ కవి నలి మె ల భాస్కర్, సావిత్రి దంపతులకు గవర్నర్ అందజేశారు.

ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. పీవీ కాళోజి గురు శిష్యుల బంధం అని, ఇరువురు ఒకరినొకరు గౌరవించుకుంటారని పేర్కొన్నారు. పీవీ 16 భాషల్లో అనర్గళంగా మాట్లాడగలుగుతాడన్నారు. సోషలిస్ట్ భావాలు కలిగిన నేత అని ఆయన అమలు చేసిన భూ సంస్కరణలు రాజకీయ మౌలిక స్వభావాన్ని మార్చేసాయన్నారు. గడ్డం ప్రసాద్ మాట్లాడుతూ.. పీవీ దేశ ఆర్థిక ప్రగతిని పరుగులు పెట్టించారన్నారు. విద్యా వ్యవస్థలో పెను మార్పులు తీసుకొచ్చి విద్యను అన్ని వర్గాల వారికి అందించిన మహానేత పీవీ అని అన్నారు. నిజాం నిరంకుశ పాలనపై కలం ఎక్కుపెట్టిన ప్రజా కవి కాళోజి అని, పీవీ కాళోజి ఒకరినొకరు గౌరవించుకునేవారని ఆయన తెలిపారు. పీవీ ప్రభాకర్, పీవీ శరత్ బాబు, ఎస్ వి సుభాష్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు విజయబాబు, సీఎస్పీ డైరెక్టర్ బాలలత, పివి ఫౌండేషన్ జనరల్ సెక్రెటరీ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కుట్టు మిషన్‌లకు దరఖాస్తు చేసుకోండి

- దరఖాస్తులను ఈనెల 20వ తేదీలోగా సమర్పించాలి
- జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి ఇలియాజ్ అహ్మద్



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీస్ కార్పొరేషన్ హైదరాబాద్ ద్వారా జిల్లాలోని పేదలు, నిరుద్యోగులు, అర్హులైన, శిక్షణ పొందిన మహిళలకు ఇందిరమ్మ మహిళా శక్తి పథకం కింద ఉచిత కుట్టు మిషన్‌లు పొందుటకు అర్హులైన వారు ఈనెల 20వ తేదీలోగా దరఖాసులను సమర్పించాలని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి ఇలియాజ్ అహ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రిస్టియన్ మైనార్టీ మహిళ దరఖాస్తుదారులు వారి అర్హత ప్రమాణాల ప్రకారం ఈనెల 4 నుంచి 20వ తేది లోగా దరఖాస్తులను సమర్పించాలని ఆయన తెలిపారు. నిరుద్యోగ క్రైస్తవ మైనార్టీ మహిళా సంఘం పేద, నిరుపేద, విడాకులు పొందిన, వితంతువులు, అనాధలు, ఒంటరి మహిళలకు ప్రాధాన్యతల మేరకు ఈ పథకం ద్వారా అందజేస్తామని ఆయన చెప్పారు. తెల్లా రేషన్ కార్డు, ఆహార భద్రత కార్డు లేదా రెండు అందుబాటులో లేకుంటే ఆదాయ ధ్రువీకరణ పత్రం, అభ్యర్థి తల్లిదండ్రుల, సంరక్షకుల వార్షిక ఆదాయం 2 లక్షల వరకు ఉండాలనీ, దరఖాస్తుదారు వయసు 18 నుంచి 55 ఏండ్ల మధ్య ఉండాలన్నారు. వయసు రుజువుకు ఓటర్ ఐడి, ఆధార్ కార్డు తప్పనిసరి అని, నివాస రుజువుగా ఆధార్ కార్డు, ఒక కుటుంబానికి ఇంటికొక కుట్టు మిషన్ ఇవ్వనున్నట్టు తెలిపారు. అభ్యర్థి తప్పనిసరిగా ప్రభుత్వం ద్వారా టైలరింగ్ కోర్సులో శిక్షణ పొందాలని, గుర్తింపు పొందిన శిక్షణ సంస్థలు ట్రెనింగ్ సర్టిఫికెట్ సమర్పించాలన్నారు. కనీస విద్యార్హత 5వ తరగతి, గత 5ఏండ్లలో టీజీసీఎంఎఫ్‌సీ నుంచి ఆర్థిక సహాయం దరఖాస్తుదారు స్వీయ డిక్లరేషన్ సమర్పించాలని ఆయన తెలిపారు.

## నవతెలంగాణ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన హనుమంతు ముదిరాజ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

నవతెలంగాణ తెలుగు దినపత్రిక నూతన క్యాలెండర్, డైరీని వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ డీసీసీ ప్రధాన కార్యదర్శి, టీజీఆర్టీసీ టీజేఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి కె. హనుమంతు ముదిరాజ్, టీజేఎంయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ స్వాములయ్య, రాష్ట్ర నాయకులు పి. శ్రీనయ్య, గోలి రవీందర్, సిటీ రీజినల్ సెక్రెటరీ బుల్లెట్ పాండు, పరిగి టౌన్ అధ్యక్షులు ఎర్రగడ్డపల్లి కృష్ణ, పర్దీప్ రోడ్ లీడర్ కౌన్సిలర్ శ్రీనివాస్ పవర్, ఘనముని శ్రీనివాస్, కుడుములు యాదయ్య, మున్నూరు బాలుతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం హనుమంతు ముదిరాజ్ మాట్లాడుతూ పత్రికలు ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తున్నాయని, ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారధిగా పత్రికలు వ్యవహరిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రజాసమస్యలను వెలికితీసి ప్రజలకు న్యాయం జరిగే వరకు నవతెలంగాణ దినపత్రిక నిరంతరం పనిచేయడం అభినందనీయమని హనుమంతు ముదిరాజ్ తెలిపారు.

## మంత్రి చేతుల మీదుగా నూతన ఫోటో కెమెరాను అందుకున్న అసిస్టెంట్ డైరెక్టర్ అబ్దుల్ కలీం



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర సచివాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సమాచార శాఖ క్షేత్ర స్థాయి ఉద్యోగులకు నూతన టెక్నాలజీతో కూడిన ఫోటో కెమెరాలను రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబం ధాలు, గృహ నిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివా సరెడ్డి, రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ డాక్టర్ హరీష్, అదనపు సంచాలకులు డీ.ఎస్.జగన్, ఇతర అధికారులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ డీపీఆర్వో కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ అబ్దుల్ కలీం నూతన టెక్నాలజీతో కూడిన కొత్త ఫోటో కెమెరాను మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు.

## బాలల రక్షణ, భద్రతకు సహకరించాలి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా



నవతెలంగాణ-సిటీబ్యూరో

అందరితో సమన్వయంతో బాలల రక్షణకు, వారి భద్రతకు సహకారం అందించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అన్నారు. 'ఆపరేషన్ స్మైల్- XI' వివిధ శాఖలతో మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి స్వర్ణలత మాట్లాడుతూ 14 ఏండ్లలోపు ఉన్న బాల కార్మికులతో పని చేయిస్తూ, బాలలను వివిధ పారిశ్రామిక వాడల్లో గానీ, పిల్లల భిక్షాటన గానీ, అక్రమ రవాణా, బాలల నిర్వ స్థితి ప్రాంతాల నుంచి కాపాడి, వారికి విముక్తి కల్పించి బాలలకు వెలుగులు నింపాలన్నారు. బాలలతో పని చేయించుకుంటున్న యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ రామ్మోహన్ మాట్లాడుతూ బాలల రక్షణ, వారి సంరక్షణ కోసం ఈ నెల 1 నుంచి 31వ తేదీ వరకు 24X7 గంటలు అందుబాటులో ఉంటామన్నారు. ఆపరేషన్ స్మైల్-XI నిర్వహించడం వలన బాలలకు ఎంతగానో తోడ్పడినందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారులు, లేబర్ డిపార్టుమెంట్ అధికారులు, డీఎంఅండ్‌హెచ్‌ఓ అధికారి రఘునాథస్వామి, రెవెన్యూ అధికారులు, బాల రక్ష భవన్ కో-ఆర్డినేటర్ నాగమణి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఎండీ ఇంతియాజ్ రహీం, జిల్లా బాలల పరిరక్షణ విభాగ సభ్యులు, చైల్డ్ లైన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా టీఎన్జీవోస్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

- పాల్గొన్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, షబ్బీర్ అలీ, కోదండరామ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ యూనియన్ హైదరాబాద్ జిల్లా, సిటీ భాగ్యనగర్ ఎన్జీవో, ఎంసీహెచ్ఎస్ లిమిటెడ్-2025 డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. పబ్లిక్‌గార్డెన్‌లోని లలిత కళాతోరణంలో సోమవారం టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని(ముజీబ్) ఆధ్వర్యంలో డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. ముఖ్య అతిథిగా శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ప్రభుత్వ సలహదారు ఎండీ అలీ షబ్బీర్ ఎం.డీ.అలీ, ఎమ్మెల్సీ కోదండరామ్, టీజీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్‌లు హాజరై అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ముజీబ్‌తో పాటు ఇతర ప్రముఖులతో కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి (33) జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యనిర్వాహక, ప్రాథమిక సభ్యులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు హాజరై విజయవంతం చేశారు. టీఎన్జీవోలు, సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు మారం జగదీశ్వర్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎల్లవేళలా ముందుండి ప్రభుత్వ పథకాలను విజయవంతం చేస్తారని తెలిపారు. 2024లో కొత్తగా 8826 జూనియర్ అసిస్టెంట్లు, 426 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, 1056 పారామెడికల్ సిబ్బందిని నియమించినందుకు వారు ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఏపీలో పనిచేస్తున్న కొంతమంది ఉద్యోగులను తీసుకువచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న డీఏను విడుదల చేయాలని, పీఆర్‌సీని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి.. ఓపీఎస్‌ను ప్రవేశపెట్టాలన్నారు. లైబ్రరీ, అగ్రికల్చర్ మార్కెటింగ్, ఎయిడెడ్ స్కూల్స్, కాలేజీల ఉద్యోగులకు 010 కింద జీతం అమలు చేయాలనీ, కాంట్రాక్ట్, ఔట్‌సో ర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. జీవో 317 సమస్యను పరిష్కరించడానికి కృషి చే యాలని వారు విజ్ఞప్తి చేశారు. పోలీసు శాఖ, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా, లలితకళా తోరణం సిబ్బం దికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రజలందరికీ విందు ఏర్పాటు చేశారు.



నవతెలంగాణ
హైదరాబాద్
బుధవారం | జనవరి 8, 2025 | www.navatelangana.com

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**నవతెలంగాణ-ముషీరాబాద్**

ముషీరాబాద్ నియోజకవర్గంలోని కవాడిగూడ, ముషీరాబాద్, రాంనగర్ డివిజన్లకు చెందిన సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు 11 చెక్కులు, సీఎంఆర్ 2, ఎల్‌ఓసి (రూ.9 లక్షల) విలువ గల చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే ముఠా గోపాల్ గాంధీనగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌ల అధ్యక్షులు, వల్లాల శ్యామ్ యాదవ్, శ్రీధర్‌రెడ్డి, శంకర్ ముదిరాజ్, మీడియా ఇన్‌చార్జి ముచ్చ కుర్తి ప్రభాకర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీధర్ చారి, వల్లల రవి, కరిక కిరణ్, శివ ముదిరాజ్, కళ్యాణ్ నాయక్, బింగి సతీష్ , రామచందర్, రాములు, టిల్లు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



**నవతెలంగాణ-ముషీరాబాద్**

తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కమిటీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం గోల్కొండ చౌరస్తా వద్దగల సెంట్రల్ సిటీ కార్యాలయంలో పట్టణ అభివృద్ధి సంఘం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, చారకొండ వెంకటస్వామి మరియల గోపాల్, జిల్లా ఉపాధ్యక్షులు,వి యాదమ్మ,పి భాస్కరరావు, జిల్లా సహాయ కార్యదర్శిలు రాపర్తి ప్రభాకర్, కేశవులు, అల్వాల బాబు, జిల్లా సోషల్ మీడియా, కన్వీనర్ సిహెచ్ నాగేష్, జిల్లా కమిటీ సభ్య లు పి.రాజు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఆర్. వెంకటేష్, ఆఫీస్ సెక్రటరీ శ్రీరాములు పార్టీ సభ్యులు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై నవతెలంగాణ దృష్టి..

- **నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణలో జోనల్ కమిషనర్ వెంకన్న..**




**నవతెలంగాణ-ధూల్‌పేట్**

ప్రజా సమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకురావడంలో నవతెలంగాణ కృషి ఉందని జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ టి.వెంకన్న అన్నారు. నవ తెలంగాణ నూతన ఏడాది క్యాలెండర్ ఆయన జోన్ ఇన్‌చార్జి వెంకట స్వామితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ప్రజల సమస్యల పరిష్కారంలో పత్రిక తమ వంతు పాత్ర పోషిస్తుందన్నారు. ప్రస్తుతం పెరిగిన సోషల్ మీడియాతో ప్రభావితం ఉన్న తమదైన శైలిలో ముద్ర వేసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, పత్రిక సిబ్బంది పాల్గొన్నారు.

## 'దేశంలో ఎక్కడా లేని విధంగా స్పోర్ట్స్ సిటీ'

**ఈ నెల 21 నుంచి 24 వరకు 47వ ఆల్ ఇండియా రాజీవ్ గాంధీ అండర్-19, ట్వంటీ-20 లీగ్ క్రికెట్ చాంపియన్ షిప్-2025 : మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావు**



**నవతెలంగాణ-హిమాయత్‌నగర్**

దేశంలో ఎక్కడ లేని విధంగా సీఎం ఎ.రేవంత్ రెడ్డి తెలంగాణలో 'స్పోర్ట్స్ సిటీ' నిర్మించబోతున్నారని మాజీ రాజ్యసభ సభ్యులు, ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ, క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మెన్ వి.హనుమంతరావు తెలిపారు. మంగళవారం బషీర్ బాగ్, ఎల్బీ స్టేడియంలోని ఫతే మైదాన్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో క్రికెట్ లీగ్‌కు సంబంధించిన బ్రోచర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వి.హనుమంతరావు మాట్లాడుతూ 47వ ఆల్ ఇండియా స్వర్గీయ రాజీవ్ గాంధీ అండర్-19 (డే అండ్ నైట్) ట్వంటీ-20 లీగ్ క్రికెట్ ఛాంపియన్ షిప్-2025 పోటీలను ఈ నెల 21వ తేదీ నుంచి 24 వరకు హైదరాబాద్ నగరంలో జరగనున్నాయని చెప్పారు. క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ హైదరాబాద్, అండర్ ది ఏజీస్ ఆఫ్ క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ క్రికెట్ అండర్-19 లీగ్ పోటీలను 21న మొదటి మ్యాచ్ అంబర్ పేట్, వాటర్ వర్క్స్ గ్రౌండ్స్ లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి ప్రారంభించనున్నట్లు తెలిపారు. మిగతా మ్యాచులు అత్తాపూర్‌లోని విజయానంద్ గ్రౌండ్స్, ఫైనల్ మ్యాచ్ బషీర్ బాగ్ లోని ఎల్బీ స్టేడియంలో జరుగుతుందని, ఈ మ్యాచ్‌కు సీఎం ఎ.రేవంత్ రెడ్డి హాజరై విన్నర్లకు ట్రోఫీని అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో క్రీడా రంగం మరింత అభివృద్ధి చెందేందుకు సీఎం ఎంతో కృషి చేస్తున్నారని, తెలంగాణ రాష్ట్రం నుంచి క్రీడల్లో అంతర్జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ పొందాలన్నదే తమ లక్ష్యమన్నారు. త్వరలో 'ప్రెస్ వర్సెస్ పాలిటిక్స్' పేరుతో క్రికెట్ మ్యాచ్ ను నగరంలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు, ఫెడరేషన్ అధ్యక్షులు ఆది అవినాష్, ప్రధాన కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్, సభ్యులు ఆర్.లక్ష్మణ్ యాదవ్, సద్గురు, ధనంజయ్, అప్సర్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ దందాను అరికట్టాలి

- **డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీ కమలాసన్ రెడ్డికి వినతి**



**నవతెలంగాణ-ముషీరాబాద్/సుల్తాన్‌బజార్**

రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ దందాను అరికట్టాలని మెడికల్ షాపులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) తెలంగాణా రాష్ట్ర కమిటీలు ప్రతినిధి బృందం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీ కమలాసన్ రెడ్డిను తన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతినిధి బృందం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో మెడికల్ పట్ల ప్రజలకు అవగాహన రాహిత్యం మూలంగా విస్తృత స్థాయిలో డ్రగ్స్ మాఫియా పెరిగిపోతుందని క్రింది స్థాయిలో అధికారులు తనిఖీలు చేయాలని కోరారు. ప్రయివేట్ మెడికల్ షాపుల ఉల్లంఘనలకు అడ్డూ అదుపు లేకుండా ఎక్కువ షాపులలో ఫార్మాసిస్టులు ఉండటం లేదన్నారు. ఎంఆర్‌పీ ధరలే ఒక మోసం అనుకుంటే వాటికి మించి అమ్ముతున్నారు. మరీ ముఖ్యంగా అపోలో మందుల షాపులో కనీస నిబంధనలు పాటించడం లేదన్నారు. ప్రతి ప్రయివేట్ మెడికల్ షాపులో విస్తృత తనిఖీలు చేపట్టాలని కోరారు. ప్రతినిధి బృందంలో పీఓడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షులు డి.స్వరూప, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు కేఎస్ ప్రదీప్, పీఓడబ్ల్యు నగర అధ్యక్షులు లక్ష్మీబాయి, వర లక్ష్మి, పీవైఎల్ నగర అధ్యక్షులు ఎం.రవికుమార్, పీవైఎల్ నగర కార్యదర్శి బీఎస్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 'సీఎం రేవంత్ రెడ్డికి సావిత్రిబాయి పూలే ఫౌండేషన్ కృతజ్ఞతలు'



**నవతెలంగాణ-హిమాయత్ నగర్**

మహిళలకు విద్యా బోధన అందించడంలో విశేష కృషి చేసిన సావిత్రిబాయి పూలే జయంతి రోజును రాష్ట్ర సీఎం ఎ.రేవంత్ రెడ్డి 'మహిళా ఉపాధ్యాయ దినోత్సవం' (ఉమెన్స్ టీచర్స్ డే)గా ప్రకటించి, జీఓ నెంబర్-9ను విడుదల చేసినందుకు సావిత్రిబాయి పూలే ఫౌండేషన్ కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు మంగళవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఫౌండేషన్ చైర్మెన్ మీసుగ గోపీ, సీఈఓ సి.పరమేశ్వరి, ప్రొఫెసర్ ఎం.భాగయ్య, సభ్యులు ఎం.ఎ.సలీం, జానకిరెడ్డి తదితరులు మాట్లాడుతూ తమ ఫౌండేషన్ విజ్ఞప్తి మేరకు రాష్ట్ర సీఎం ఎ.రేవంత్ రెడ్డి 'ఉమెన్స్ టీచర్స్ డే' గా ప్రకటించినందుకు ప్రత్యేకంగా ఆయనకు, రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, సీతక్క, పొన్నం ప్రభాకర్, కమిషనర్ తదితరులకు ధన్యవాదాలు తెలిపారు. సావిత్రిబాయి పూలే దంపతులకు భారతరత్న అవార్డును ప్రకటించాలని, వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న ఒక బీసీ మహిళకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షులు గగనం వెంకటస్వామి, కార్యవర్గ సభ్యులు అశోక్, నర్సయ్య, జి.అలివేలు, మంజుల, శారద, వనితారాణి తదితరులు పాల్గొన్నారు.

## 20 వేల గ్రామ పంచాయతీ సిబ్బందితో భారీ 'బహిరంగ సభ'

**తెలంగాణ రాష్ట్ర కారోబార్ అండ్ సిబ్బంది అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సాదుల శ్రీకాంత్**



**నవతెలంగాణ-ముషీరాబాద్**

హైదరాబాద్ నగరంలో త్వరలో 20 వేల మందితో గ్రామ పంచాయతీ సిబ్బంది కలసి భారీ 'బహిరంగ సభ'ను నిర్వహించ తలపెట్టినట్లు తెలంగాణ రాష్ట్ర కారోబార్ అండ్ సిబ్బంది అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సాదుల శ్రీకాంత్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర కారోబార్ అండ్ సిబ్బంది అసోసియేషన్ కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్-2005 ను ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు సాదుల శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ సభకు రాష్ట్రంలోని అన్ని జిల్లాలు మండలాలు, గ్రామాల నుండి కారోబర్లు, బిల్ కలెక్టర్లతో పాటు అన్ని కేటగిరీల సిబ్బంది పెద్ద ఎత్తున హాజరుకావాలని ఆయన కోరారు. సభకు వేలాదిగా పంచాయతీ ఉద్యోగులు తరలిరావాలని సభ తేదీని త్వరలో ప్రకటిస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు తేలుకంటి మురళి, స్వామి, విజయ్ కుమార్, రాజేందర్, అశోక్, ప్రభాకర్, శ్రీనివాస్, బాబు గౌడ్, మురళి, నాగేష్, నరసింహులు, నారాయణ, వెంకన్న, శివాజీ, ప్రశాంత్, వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామిక వాదులపై పెట్రేగిపోతున్న మతోన్మాద దాడులు..

- **సీపీఐ (ఎం-ఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి పి.సూర్యం**

**నవతెలంగాణ-ముషీరాబాద్**

తెలంగాణ రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా ప్రగతిశీల రచయితలు, మేధావులు, ఉపాధ్యాయులపై మతోన్మాద గుండాల దాడులు పెరిగిపోతున్నాయి. హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో కొంత మంది ఉన్మాదులు వీక్షణం సంపాదకులు వేణుగోపాల్‌పై దాడి చేయడం అత్యంత దుర్మార్గమని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పి.సూర్యం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. వారు ఆయన మాట్లాడుతూ రచయిత్రి మెర్సీ మార్గరైట్‌పై కూడా ఇదేవిధంగా మత ఉన్మాదంతో పెట్రేగిపోతున్నారని తెలిపారు. ప్రధాన ఉపాధ్యాయులు రాములు పై కూడా తన విధి నిర్వహణలో ఉండగా పాశవిక దాడికి పూనుకున్నారు. వేణుగోపాల్, మెర్సీ మార్గరెట్ సమాజాన్ని ప్రగతిశీల భావజాలం వైపు నడిపించేందుకు అనేక విలువైన రచనలు, పుస్తకాలను అందించారు. ఇది సహించని సంఘ్ పరివార్, కాషాయ మూకలు ఇటువంటి దాడులకు బరితెగిస్తున్నారన్నారు. మేధావులు, రచయితలు గోవింద్ పన్సారే, నరేంద్ర దబోల్కర్, గౌరీ లంకేష్ లాంటి అనేకమందిని ఉన్మాదులు హత్యలు చేశారన్నారు. రాష్ట్రంలో ఎలాగైనా అధికారంలోకి రావాలని బీజేపీ రాష్ట్ర ప్రజల మధ్య మతోన్మాదాన్ని రెచ్చగొట్టడుతుందని ఈ దుర్మార్గమైన చర్యలను సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ ఖండిస్తుంది. ఫాసిస్టు చర్యలకు, ఫాసిజం విధానాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమానికి అన్ని శక్తులు కలిసి రావాలని కోరారు.

# అనాథల ఆపద్బాంధవుడు ఈ సంజీవుడు

**నిరంతరం సేవే మార్గం.. స్కై ఫౌండేషన్ ద్వారా పేదలకు అన్నదానం**









**నవతెలంగాణ-ముషీరాబాద్**

నగరంలో ఎంతోమంది అనాథలు అభాగ్యులు నిరుపేదలు మతిస్థిమితం లేని వారు నిత్యం చలికి వణుకుతూ ఎండకు ఎండుతూ ఆకలి కేకలతో అలమటిస్తూ ఫుట్‌పాత్‌లపైన జీవనం సాగిస్తుంటారు. వారి జీవితం దుర్భరం ఆకలితో బక్క చిక్కిపోయి ప్రాణాలు కోల్పోతున్న సంఘటన ప్రతిరోజు ఎన్నో చూస్తుంటాం.. అటువంటివారికి తనవంతుగా ఆదుకోవడమే లక్ష్యంగా ముందడుగు వేస్తున్నాడు స్కై ఫౌండేషన్ ప్రెసిడెంట్ సంజీవ్ కుమార్.. తన ఫౌండేషన్ ద్వారా ఎంతో మంది నిరాశ్రయులకు అనాథలకు అన్నదానం, ఔషధాలు, దుస్తులు దుప్పట్లు పంపిణీ చేస్తూ వారిని ఆదుకుంటున్నారు. సేవే లక్ష్యంగా ప్రేమే మార్గంగా ముందుకు సాగుతున్నారు. ఎవరి వద్ద నుంచి ఏమీ ఆశించకుండా నిస్వార్థమైన సేవ చేస్తూ అనాథల ఆపద్బాంధవుడుగా నిలుస్తున్నాడు.

**అతని లక్ష్యం అనాథలకు ఆశ్రమం కల్పించడం అతని సేవ నిస్వార్థం**

మహబూబ్ నగర్‌కు చెందిన వై.సంజీవ్ కుమార్ అనే వ్యక్తి 1999లో ఎన్నో ఆశలతో వ్యాపారం చేసుకుందామని హైదరాబాద్ నగరానికి వచ్చాడు. సిటీలో కంప్యూటర్ ఎడ్యుకేషన్ సంస్థను స్థాపించారు. బిజినెస్‌లో తనకు తోడుగా ఉండాల్సిన తన మిత్రులు బిజినెస్ పార్టనర్స్ మోసం చేయడంతో అన్ని కోల్పోయాడు. చివరకు ఉండడానికి నీడ, తినడానికి తిండి లేక నానా ఇబ్బందులు పడుతూ పస్తులున్నాడు. అన్నీ తెలిసిన తనకే ఇన్ని కష్టాలు వస్తే ఏ ఆధారం లేని రోడ్డు పక్కన ఉండే అనాథలు అభాగ్యుల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అని తలుచుకుని తనలో తానే మదనపడేవారు, ఆ క్షణంలో ఆవేదన నుంచి ఉత్పన్నమైంది స్కై ఫౌండేషన్.. పద్మారావు నగర్‌లో కన్సల్టెన్సీ పెట్టడం ఆ ఆదాయంతో రోడ్డు పక్కన అనాథలకు ఏదైనా సహాయం చేయాలని ప్రతి నెలా రెండు, నాలుగో ఆదివారాలలో తన సంస్థ సభ్యులతో కలిసి రోడ్డు పక్కన అనాథలకు అన్నదానం చేయడం ప్రారంభించాడు. ఇప్పటివరకు దాదాపు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉన్నారు. తన జీవిత ఏకైక లక్ష్యం అనాథలకు, నిరుపేదలకు రోడ్డు పక్కన జీవితం కొనసా గిస్తున్న వారికి ప్రత్యేక శాఖను ఏర్పాటు చేసి వారికి అనాథల ఆశ్రమం ఏర్పాటు చేయడమే తన లక్ష్యంగా పనిచేస్తున్నాడు.

**ప్రతి పండగ వాళ్లతోనే..**

ప్రతి ఇంట్లో పండగలు వచ్చాయంటే ఇంటిల్లిపాది ఎంతో సంతోషంగా ఇంట్లో వారంతా కలిసి పిండివంటలు చేసుకుని బంధువులు స్నేహితులతో కలిసి ఆహ్లాదకరమైన వాతావరణంలో గడుపుతుంటారు. కానీ దానికి భిన్నంగా అనాథ, అభాగ్యుల పరిస్థితి కనీసం పలకరించేవారే ఉండారు. కానీ సమాజంలో వాళ్లకు నేనున్నానంటూ ప్రతి పండగనూ సంజీవ్ కుమార్ వాళ్లతో కలిసి జరుపుకుంటారు. వారికి కొత్త వస్త్రాలు అందజేసి పిండి వంటలు వారితో కలిసే తిని వారికి నేనున్నానని భరోసాను కల్పిస్తున్నాడు. రాష్ట్ర ప్రభుత్వం వారిని ఆదుకొని వారికి ప్రత్యేక శాఖను ఏర్పాటు చేసి అనాథలు అభాగ్యులు లేని సమాజాన్ని నిర్మించాలని అహర్నిశలు శ్రమిస్తున్నాడు ఈ సంజీవుడు..

## రాష్ట్ర నాయి బ్రాహ్మణ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ..



**నవతెలంగాణ-సుల్తాన్‌బజార్**

నాయి బ్రాహ్మణులు అందరూ ఐక్యతలోనే తమ హక్కులు సాధించవచ్చునని ట్రాన్స్‌పోర్ట్ అడిషనల్ కమిషనర్ సీఎల్ఎన్ గాంధీ అన్నారు. మంగళవారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ కళామందిర్ ఆడిటోరియంలో తెలంగాణ రాష్ట్ర నాయి బ్రాహ్మణ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్-2025 ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని రాష్ట్ర అధ్యక్షులు దేవరకొండ నాగరాజు, ప్రముఖ పారిశ్రామికవేత్త ఎల్ రాంబాబుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాయి బ్రాహ్మణులు అందరూ ఐక్యతతో ఉండి ప్రభుత్వానికి మంగళ సత్తా ఏందో చూపించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి నాయి బ్రాహ్మణ హక్కుల కోసం కృషి చేయాల న్నారు. తెలంగాణ రాష్ట్ర నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దేవరకొండ నాగరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వం నాయి బ్రాహ్మణులకు ఎమ్మెల్సీ ఇవ్వాలని కోరారు. నాయి బ్రాహ్మణ ఫెడరేషన్‌కు పాలక మండలి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సెలూన్స్ కు విద్యుత్ సబ్సిడీ నిధుల బిల్లులు విద్యుత్ శాఖకు బకాయిలు చెల్లించి విద్యుత్ శాఖ వారి వేధింపులను అరికట్టాలన్నారు. దేవాలయ పాలకమండలిలో ఒక నాయి బ్రాహ్మణుడుని నామినేటెడ్ సభ్యుడుగా తీసుకునే విధంగా ఏపీ ప్రభుత్వం ఇచ్చిన విధంగా జీవో జారీ చేయాలన్నారు. కళ్యాణ కట్టలో పనిచేస్తున్న నాయి బ్రాహ్మణులను రెగ్యులర్ చేయాలన్నారు. నాయి బ్రాహ్మణ కులం పేరుతో దూషించిన వారిపై చర్యలు తీసుకునే విధంగా ఏపీ ప్రభుత్వం జీవో ఇచ్చినట్టుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అడ్వైజర్ ఏ.మూల సుధాకర్. ప్రధాన కార్యదర్శి కే యాదగిరి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కే.ఈశ్వర్, కే.శ్రీనివాస్, రాష్ట్ర సహాయ కార్యదర్శిలు ఎం.రామ చందర్, కే.హరినాథ్, ఏ.జయప్రభ, ఎస్. లక్ష్మీనారాయణ, చౌటకూర నగేష్, ఏం.గుర ప్ప, ఎస్ భూపాల్ రాజ్, తొలిచుక్క మాధవి శ్యాం కుమార్, వివిధ వార్డుల అధ్యక్ష కార్యదర్శులు నాయకులు పాల్గొన్నారు.

## రైతాంగానికి భూభారతి ఒక భరోసా

- **తెలంగాణ బీసీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మెన్ నూతి శ్రీకాంత్ గౌడ్**



**నవతెలంగాణ-మెహిదీపట్నం**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి పథకం రాష్ట్ర రైతాంగానికి ఒక భరోసా అని కాంగ్రెస్ ప్రభుత్వం వేసిన మరొక ముందడుగని తెలంగాణ బీసీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మెన్ నూతి శ్రీకాంత్ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ తెలంగాణ రైతన్న సమస్యలను అర్థం చేసుకొని తప్పుల తడకగా ఉన్న ధరణిని రద్దు చేస్తామని ప్రకటించిందని గుర్తు చేశారు. తమ ఎన్నికల మేనిఫెస్టోలో కూడా దాన్ని పొందుపరిచి తాము అధికారంలోకి వస్తే ధరణిని బంగాళా ఖాతంలో పడేస్తామని కాంగ్రెస్ నాయకులు అన్నప్పుడు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందని ఆయన తెలిపారు. దాని ఫలితంగానే ఎన్నికలలో కాంగ్రెస్ విజయం సాధించి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం కొలువు దీరిందని స్పష్టం చేశారు. అసెంబ్లీలో ధరణిని రద్దు చేస్తూ దాని స్థానంలో నూతన 'ఆర్ఓఆర్ 2024 భూమాత' బిల్లును తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. నేడు భూమాతలో ప్రతి విషయాన్ని నిర్భయంగా నిర్దిష్టంగా తెలుసుకునే అవకాశం కల్పించడం హర్షించదగ్గ విషయమన్నారు. రానున్న మూడు నెలల్లో మరిన్ని అంశాలను పొందుపరుస్తూ నిపుణుల నుండి మరికొన్ని సూచనలు సలహాలు తీసుకొని మరిన్ని అంశాలను పొందుపరచడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన తెలియజేశారు. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం వ్యవసాయానికి మాత్రమే సహాయం అందించాలని దృఢమైన సంకల్పంతో పనిచేస్తుందని ప్రతి గ్రామంలో అగ్రికల్చరల్ ఆఫీసర్, సాటిలైట్ సహాయంతో పంట పొలాలను గుర్తించి నిజమైన రైతులకు సహాయం అందించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తుందన్నారు. ఎకరానికి రూ.6వేల చొప్పున సంవత్సరానికి రెండుసార్లు రైతు భరోసా ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. ప్రభుత్వం పటిష్టమైన అవగాహనతో గ్రామీణ వ్యవసాయ రంగాన్ని స్వర్ణ యుగం వైపు తీసుకెళ్లేందుకు దృఢనిశ్చయంతో ఉందని ఆయన పేర్కొన్నారు.

## తెలంగాణ క్షౌర వృత్తిదారుల సంఘం నూతన కమిటీ

**నవతెలంగాణ-ముషీరాబాద్**



తెలంగాణ క్షౌర వృత్తిదారుల సంఘం నూతన కమిటీ నీ మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రాష్ట్ర సదస్సులో ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎంవీ రమణ, రాష్ట్ర సమన్వయ కమిటీ నాయకులు పైళ ఆశయ హాజరయ్యారు. క్షౌర వృత్తిదారుల సంఘం గౌరవ అధ్యక్షులుగా జంపాల మనోహర్, జి శ్రీనివాస్, అధ్యక్షులుగా ప్రసాదం విష్ణు, ఉపాధ్యక్షులు కొత్తపల్లి అవినాష్, ప్రధాన కార్యదర్శి చెన్నారం మల్లేష్, సహాయ కార్యదర్శి దుర్గాప్రసాద్, మహిళ అధ్యక్షురాలుగా ఉమారాణి, సహాయ కార్యదర్శి హరిత, ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ బిల్లు లు వెంటనే ప్రభుత్వం చెల్లించాలని నవీన సెల్లన్స్ ఏర్పాటు కు ప్రభుత్వం ఆర్థిక సహకారం చేయాలని నాయి బ్రాహ్మణ ఫెడరేషన్‌కు పాలకవర్గాన్ని నియమించాలని, ఇందిరమ్మ ఇండ్ల పథకంలో నిరుపేద నాయి బ్రాహ్మణ అందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## నేడు అయ్యప్ప స్వామి మహాపడిపూజ, ఇరుముడి

**నవతెలంగాణ-అంబర్‌పేట**

శ్రీ జవంతీశ్వరన్ అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షుడు కేజీఎస్‌సీ బోసు గురుస్వామి ఆధ్వర్యంలో నేడు (బుధవారం) కాచిగూడలోని తుల్జాభవన్‌లో అయ్యప్ప స్వామి మహా పడిపూజ, అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పీసీ ప్రదీప్ నాయుడు గురుస్వామి, లక్కాకుల ప్రవీణ్ కుమార్ గురుస్వామి, కె.వి. యాదగిరి గురుస్వామి తెలిపారు. ఉదయం 5 గంటలకు గణపతి హోమంతో ప్రారంభమై పడిపూజ, ఇరుముడి, పడి వెలిగించుట, భక్తులకు, అయ్యప్ప స్వాములకు భిక్ష, అన్న ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలుంటాయని వారు పేర్కొన్నారు. సాయంత్రం 5గంటలకు అయ్యప్ప స్వాముల శబరియాత్ర కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభమవుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, కార్పొరేటర్లు కన్నె రమేష్ యాదవ్ (కాచిగూడ), వై. అమృత (నల్లకుంట), బి.పద్మా వెంకట్ రెడ్డి (బాగ్ అంబర్పేట), దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ (గోల్నాక), జి.మహాలక్ష్మి రామన్ గౌడ్ (హిమాయత్ నగర్), ఎ. పావని వినయ్ కుమార్ (గాంధీనగర్), బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, మున్నూరుకాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆర్.వి.మహేందర్ కుమార్, తదితరులు హాజరవుతారని తెలిపారు.

## పోగొట్టుకున్న సెల్ ఫోన్‌లను అప్పగించిన అబిడ్స్ పోలీసులు



**నవతెలంగాణ-సుల్తాన్‌బజార్**

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌లు అబిడ్స్ పోలీసులు బాధి తులకు అందజేశారు. అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ ఇమ్మాన్యుయేల్ తెలిపిన వివరాల ప్రకారం అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను హ్యాకింగ్ ద్వారా పట్టుకొని రికవరీ చేసి పోగొట్టుకున్న బాధితులకు అందజేశారు. పలువురు తమ ఫోన్లు పోయాయని అబిడ్స్ పోలీసుల ఫిర్యాదు చేయగా రికవరీ చేసి పూర్ణచందర్, సుశీల్, సురేష్ గణేష్, లోకేష్ , మాధవిలకు మొబైల్ ఫోన్‌లను అందజేశారు. ఈ కార్యక్రమ ంలో అబిడ్స్ పోలీస్ స్టేషన్ డీఐ నరసింహ, కానిస్టేబుల్ వి. ఎలీషా తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలి



**నవతెలంగాణ-ముషీరాబాద్**

గాంధీనగర్ డివిజన్ అభివృద్ధిలో భాగంగా చిక్కడపల్లి స్ట్రీట్ నెంబర్ 2 లో చాలా కాలంగా పెడింగ్ లో ఉన్న నూతన రోడ్డు నిర్మాణం పనులను మంగళవారం గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి మొదలైన నూతన రోడ్డు నిర్మాణం పనులను పర్యవేక్షించారు. త్వరలో స్ట్రీట్ నెంబర్ 2, ప్రజల కోరిక మేరకు నూతన రోడ్డు నిర్మాణం అందుబాటులోకి తెస్తామని కార్పొరేటర్ అన్నారు. త్వరగతిన రోడ్డు నిర్మాణం పనులను పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్ల మెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, జీహెచ్ఎంసీ ఇంజనీర్ గీత, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, స్థానికులు లక్ష్మణ్ గౌడ్, శ్రీకాంత్, సుశీల్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు సాంప్రదాయాలకు ప్రతిరూపం సంక్రాంతి పండుగ



- **బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డా.ఎన్ గౌతమ్ రావు**

**నవతెలంగాణ-అంబర్‌పేట**

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని హైదరాబాద్ అంబ ర్‌పేట మున్సిపల్ మైదానంలో అటల్ బిహారీ వాజ్‌పేయి (ఏబీవీ) ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహిం చారు. ఏబీవీ ఫౌండేషన్ నిర్వహణలోని 15 సెంటర్లలోని కుట్టు మిషను అల్లికలు బ్యూటిషన్ తదితర అంశాలలో శిక్షణ పొందుతున్న ఔత్సాహిక మహిళలు ఈ పోటీలలో పాల్గొన్నారు. పోటీలలో పాల్గొని వేసిన ముగ్గులను ఉద్దేశించి హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్.గౌతమ్ రావు మాట్లాడుతూ మహిళలంతా ఒకచోట చేరి ఇలాంటి వేడుకల్లో పాల్గొనడం చాలా సంతోషకరమన్నారు. ఏబీవీ ఫౌండేషన్ చైర్మెన్ కావ్య రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే మహిళలకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో మహిళల కోసం మరిన్ని శిక్షణ సెంటర్ లను త్వరలో ప్రారంభిస్తామన్నారు. పోటీలలో పాల్గొన్న వారికి గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు బహుమతులను అందజేసిన గౌతమ్ రావు, కావ్య రెడ్డి. జ్యోతి నీరజ తదితరులున్నారు.



రుచి డవే... ఒకప్పుడు సాధారణ పాఠశాల ఉపాధ్యాయురాలు. ప్రకృతి అంటే ఎంతో ప్రేమ. దాన్ని కాపాడుకోవల్సిన బాధ్యత మనుషులదే అని బలంగా నమ్ముతారు. అంతేకాదు దాని కోసం స్వయంగా కార్యాచరణ మొదలుపెట్టారు. ఓ ఉపాధ్యాయినిగా తన పాఠశాల విద్యార్థినులకు ప్రకృతిపై ప్రేమను పెంచారు. ఇప్పుడు ఉపాధ్యాయ వృత్తిని వదిలి అటవీ సంరక్షణ అధికారిగా మారి పర్యావరణం కోసం ఎంతో కృషి చేస్తున్న ఆమె పరిచయం...

# స్కూల్ టీచర్ టు ఫారెస్ట్ ఆఫీసర్

పదిహేనేండ్ల కిందటి సంగతి ఇది. గుజరాత్‌లోని తలాజా పట్టణంలోని నవ్‌కర్ మంత్ర బాలికల ఉన్నత పాఠశాల అది. ఆ పాఠశాలకు చెందిన విద్యార్థినుల బృందం పర్యావరణ విద్యలో ఓ ప్రత్యేకమైన ప్రయాణాన్ని ప్రారంభించింది. పాఠశాలకు వెళ్లేటప్పుడు ఆ అమ్మాయిలు స్థానిక వ్యవసాయ క్షేత్రాల నుండి గొంగళి పురుగులను సేకరించి తెచ్చుకునేవారు. వాటిని పెంచడానికి, పరిశీలించడానికి ప్రత్యేక తరగతి గదిని ఏర్పాటు చేసుకున్నారు. అలా తెచ్చుకున్న గొంగళి పురుగులు సీతాకోకచిలుకలుగా మారిన తర్వాత తిరిగి వాటిని అడవిలోకి వదిలేవారు. ఇలా ఆ బాలికలు మొక్కల సంరక్షణ, వన్యప్రాణుల సంరక్షణలో విలువైన పాఠాలు నేర్చుకునేవారు. ఇది సాధారణ పాఠశాల ప్రాజెక్ట్ కంటే ఎక్కువగా మారిపోయింది. తమ పాఠశాల ఉపాధ్యాయురాలు రుచి డేవ్ ద్వారా వారు పొందిన స్ఫూర్తి. ఇది ఆమె నుండి ప్రకృతిని ప్రేమించడం, ఆరాధించడం నేర్చుకున్నారు.



### సాహసోపేతమైన నిర్ణయం

నేడు రుచి పర్యావరణ పరిరక్షణకు ఒక వెలుగుగా మారారు. గుజరాత్ అటవీ శాఖలో అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (ACF)గా సేవలందిస్తున్నారు. ఫారెస్ట్ ఆఫీసర్‌గా మారిన ఈ ఉపాధ్యాయురాలి ప్రయాణం సమాజానికి ఎంతో స్ఫూర్తినిస్తుంది. గణనీయమైన మార్పును ప్రేరేపిస్తుంది. 12 ఏండ్ల పాటు తన జీవితాన్ని బోధనకు అంకితం చేసిన రుచి 2016లో తరగతి గదిని వదిలి గుజరాత్ అటవీ శాఖలో చేరాలని సాహసోపేతమైన నిర్ణ యం తీసుకున్నారు. ప్రకృతి, విద్య పట్ల ఆమెకున్న ప్రేమ ఓ కొత్త ప్రయత్నంగా వ్యక్తీకరించబడింది. అంతేకాదు గుజరాతీలో సీతాకోక చిలుకల గురించిన ఒక పుస్తకాన్ని అప్నా పతంగియా (మా సీతాకోకచిలుకలు) పేరుతో ప్రచురించారు. 700కి పైగా చిత్రాలు, ఇలస్ట్రేషన్‌లతో నిండిన ఈ 424-పేజీల కళాఖండం అతి తక్కువ కాలంలోనే ఎంతో ప్రాచుర్యం పొందింది. పాఠకుల హృదయాలను దోచుకుంది. ప్రకృతి పరిరక్షణ పట్ల ఆమె దృక్పథాన్ని విస్తృతం చేసింది.


### కొత్త అధ్యాయం

2016లో రుచి గుజరాత్ అటవీ శాఖకు మారడంతో ఆమె జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభమయింది. ఆమె కోయంబత్తూరులోని సెంట్రల్ అకాడమీ ఫర్ స్టేట్ ఫారెస్ట్ సర్వీసెస్(CASFOS)లో శిక్షణ పొందారు. అక్కడ పర్యావరణ పరిరక్షణపై మరింత అవగాహన పెంచుకున్నారు. అక్కడే ఆమె 'ఎ పిక్టోరియల్ ఫీల్డ్ గైడ్ టు బటర్‌ఫ్లైస్ ఆఫ్ ఫారెస్ట్ క్యాంపస్' అని రాశారు. అప్పుడు కోయంబత్తూరు సీతాకోక చిలుకలపై ఆమె మరింత ప్రేమ పెంచుకున్నారు. 'వాటి మనోహరమైన జీవిత చక్రం, శక్తివంతమైన రంగులతో పిల్లల నుండి పెద్దల వరకు ఎవరినైనా ఆకర్షించగలవు. అవి మనలో ఉత్సుకతో పాటు పర్యావరణానికి లోతైన సంబంధాన్ని ప్రేరేపిస్తాయి' అని రుచి పంచుకున్నారు.



### ఔషధ మొక్కల తోట

ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లో పని చేసే సమయంలో తన కెరీర్ మొత్తంలో రుచి గిర్ వన్యప్రాణుల అభయారణ్యంతో సహా అనేక కీలకమైన పరిరక్షణ ప్రాంతాలలో పనిచేశారు. స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వద్ద ఔషధ మొక్కల తోట అయిన ఆరోగ్య వాన్‌ను అభివృద్ధి చేయడం ఆమె అత్యంత ముఖ్యమైన పనులలో ఒకటి. ఈ ప్రాజెక్ట్ అప్పటి రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ దృష్టిని ఆకర్షించింది. అయన కూ0డా ఈ ఆరోగ్య వాన్ నుండి ప్రేరణ పొందారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఇలాంటి ఉద్యానవనాన్ని రూపొందించాలని అనుకున్నారు. ఈ ప్రయత్నంలో సహాయం చేయమని ఆయన రుచిని పిలిచారు. ఆమె నైపుణ్యంతో ఆరు ఎకరాల ఆరోగ్య వనం 2022లో ప్రాణం పోసుకుంది. యోగా భంగిమలో మానవుని ఆకారంలో ఉన్న ఈ ఉద్యానవనం మొక్కలలోని ఔషధ గుణాలను ప్రదర్శిస్తుంది. సందర్శకులకు ఆయుర్వేద ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకుంది.




#### అంతరించిపోతున్న జాతులపై

'ప్రకృతి ప్రాముఖ్యతను ప్రజలు అర్థం చేసుకున్నప్పుడు, దాని సంరక్షణలో చురుగ్గా పాల్గొన్నప్పుడు మాత్రమే పరిరక్షణ సాధ్యమవుతుంది' అని ఆమె ఓ వెబ్‌సైట్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు. విద్య కోసం ఆమె చేసిన కృషి తన భవిష్యత్తు పరిరక్షణ ప్రయత్నాలకు పునాది వేసింది. గుజరాత్‌లోని సౌరాష్ట్ర ప్రాంతంలో అంతరించిపోతున్న జిప్స్ రాబందు జాతులపై తన డాక్టరల్ పరిశోధన పూర్తి చేశారు. తర్వాత రుచి భావ్‌నగర్, అమ్రేలి జిల్లాల్లోని తీర ప్రాంతాల్లో రాబందుల సంరక్షణపై పని చేయడం ప్రారంభించారు.

### గ్లాస్ వాటర్ బాటిల్ ప్లాంట్

పర్యావరణ పరిరక్షణ పట్ల రుచి నిబద్ధత సైద్ధాంతిక పరిజ్ఞానానికి మించినదిగా చెప్పుకోవచ్చు. ఆమె పర్యావరణ సమస్యలను పరిష్కరించడానికి ఒక వినూత్నమైన, ఆచరణాత్మక విధానాన్ని తీసుకుంటారు. గుజరాత్‌లోని పదమ్‌దుంగారి ఎకో-టూరిజం సెంటర్‌లో పనిచేసిన సమయంలో గ్లాస్ వాటర్ బాటిల్ ప్లాంట్‌ను ప్రవేశపెట్టడం ద్వారా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను తొలగించే ప్రాజెక్ట్‌కు ఆమె నాయకత్వం వహించారు. ఈ ప్రయత్నం ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడమే కాకుండా స్థానికంగా ఉపాధిని కూడా కల్పించింది. ఆ తర్వాత ఈ ప్రాజెక్ట్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎకో టూరిజం సైట్‌లకు మోడల్‌గా మారింది. గ్లాస్ వాటర్ బాటిల్ ప్లాంట్ విజయం, సమాజ సాధికారతతో పరిరక్షణను మిళితం చేయగల ఆమె సామర్థ్యానికి ఒక ఉదాహరణ మాత్రమే.

### ఆచరణలో నడిపించడం ద్వారా

రుచి అభిరుచి, కృషి, నాయకత్వం రాష్ట్రవ్యాప్తంగా ఆమెకు అమితమైన గౌరవాన్ని సంపాదించిపెట్టాయి. అంతేకాదు ఆమె ఇటీవలే అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌గా పదోన్నతి కూడా పొందారు. ఇప్పు డు దక్షిణ గుజరాత్‌లోని ధరంపూర్ సబ్-డివిజన్‌లో సేవలందిస్తున్న రుచి హ్యాండ్-ఆన్ విధానంతో కొనసాగుతున్నారు. వన్యప్రాణుల పరిరక్షణలో ఫలితాలు ఉపన్యాసాల నుండి కాకుండా ఆచరణలో నడిపించడం ద్వారా వస్తాయని ఆమె నమ్ముతున్నారు. ■

## పల్స్ రేటు గురించి...

ఏదైనా అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్తే, డాక్టర్ చెయ్యి పట్టుకుని నాడీ కొట్టుకునే వేగాన్ని చెక్ చేస్తారు. దీన్ని పల్స్ రేట్ అంటారు. దీని ఆధారంగా వ్యక్తి ఆరోగ్యంపై వైద్యులు ఓ అంచనాకు వస్తారు. సాధారణంగా హార్ట్ రేటు నిమిషానికి 55 నుంచి 85 బీట్స్ వరకు ఉంటుంది. ఒకవేళ అంతకంటే ఎక్కువ లేదా తక్కువగా ఉంటే ఆరోగ్యం బాగాలేదని అర్థం. పల్స్ రేటు వ్యక్తులను బట్టి మారుతూ ఉంటుంది. ఇది అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. పల్స్ రేటును ప్రభావితం చేసే అంశాలేంటి? ఈ రీడింగ్ ఎంత ఉంటే మంచిది? అసలు దీన్ని ఎలా కొలుస్తారు..? ఇలాంటి వివరాలు చూద్దాం.

**ఒత్తిడి :** తరచుగా ఒత్తిడి, ఆందోళన, ఎమోషన్స్‌కు గురవుతుంటే పల్స్‌పై ప్రభావం పడుతుంది. ఇలాంటి సందర్భాల్లో హృదయ స్పందన రేటు సాధారణం కంటే ఎక్కువగా ఉండవచ్చు.

**బరువు :** అధిక బరువు కూడా పల్స్ రేటును పెంచు తుంది. ఎందుకంటే అధిక బరువు కారణంగా వివిధ భాగాలకు రక్తాన్ని సరఫరా చేయడానికి శరీరం మరింత కష్టపడాల్సి ఉంటుంది. ఇది ఒత్తిడిని కలగజేసి పల్స్ రేటు పెరుగుదలకు కారణమవుతుంది.

**రక్తహీనత :** శరీరంలో రక్తం తగిన స్థాయిలో లేకపోతే పల్స్ రేటు పెరుగుతుంది. ముఖ్యంగా ఎర్ర రక్తకణాలు తక్కువ స్థాయిలో ఉంటే రక్తాన్ని సరఫరా చేయడానికి గుండె ఎక్కువగా శ్రమించాల్సి ఉంటుంది. ఫలితంగా పల్స్ రేటు పెరిగిపోతుంది.

**నొప్పి :** శరీరంలోని ఏదైనా భాగంలో నొప్పి ఉంటే అది ఒత్తిడి కలగజేస్తుంది. దాని కారణంగా పల్స్ రేటు పెరుగుతుంది.

**మందుల దుష్ప్రభావాలు :** కొన్ని రకాల మందులు వాడటం వల్ల పల్స్ రేటులో మార్పు ఉంటుంది. ముఖ్యంగా బీటా బ్లాకర్స్ వంటి మందుల వినియోగంతో పల్స్ రేటు తగ్గిపోతుంది.

**హార్మోన్స్ అసమతుల్యత :** శరీరంలో వివిధ రకాల హార్మోన్స్ అసాధారణంగా ఉంటే పల్స్ రేటుపై ప్రభావం పడుతుంది.

### ఎలా మెజర్ చేస్తారు?

నాడిని అంచనా వేయడానికి చూపుడు, మధ్య వేలును మెడ మీద ఉండే శ్వాసనాళంపై ఉంచాలి. మణికట్టు మీద బొటనవేలు ఉంచి పల్స్ తెలుసుకోవచ్చు. నాడీ కొట్టుకోవడం మీకు స్పర్శగా వినిపిస్తున్నప్పుడు 15 సెకన్లలో బీట్స్ సంఖ్యను లెక్కించాలి. నిమిషానికి బీట్‌లను లెక్కించడానికి ఈ సంఖ్యను నాలుగుతో గుణించాలి.

### పల్స్ రేటు బాగా తగ్గితే?

హృదయ స్పందన రేటు చాలా నెమ్మదిగా ఉన్నప్పుడు, పల్స్ కూడా ఆటోమెటిక్‌గా తగ్గుతుంది. ఈ పరిస్థితిని వైద్య పరిభాషలో 'బ్రాడీకార్డియా' అని పిలుస్తారు. ఈ సమయంలో హృదయ స్పందన రేటు 60 bpm కంటే తక్కువగా ఉంటుంది. మందులు, ఎలక్ట్రోలైట్ అసమతుల్యత, అంతర్లీనంగా ఆరోగ్య సమస్యలు, గుండె పనితీరులో సమస్యల వల్ల ఇలా జరగవచ్చు. బ్రాడీకార్డియా పరిస్థితికి చికిత్స అవసరం ఉండకపోవచ్చు. అయితే దీర్ఘకాలం కొనసాగితే పరిస్థితి తీవ్రంగా మారుతుంది. ఇది మైకం, మూర్ఛ వంటి సమస్యలకు దారితీయవచ్చు.

## కేటీఆర్‌కు షాక్

(మొదటిపేజి తరువాయి)

సీజన్ 9 నిర్వహించిన స్పాన్సర్స్ సీజన్ 10 నిర్వహించే ముందు ఎందుకు తప్పుకున్నారు? అప్పటికప్పుడు ఆ బాధ్యతలను హెచ్ఎండీఏ ఎందుకు తీసుకున్నది? మున్సిపల్ శాఖ ఆధీనంలోనే హెచ్ఎండీఏ ఉంది. ఆ శాఖ మంత్రిగా నిందితుడైన పిటిషనర్ ఆనాడు ఉన్నారు. మంత్రిగా కేటీఆర్ తీసుకున్న నిర్ణయం కారణంగానే ఇవన్నీ జరిగాయా లేదా? పిటిషనర్ చెబుతున్నట్టుగా నిధులు బ్యాంక్ ద్వారానే వెళితే, అవి ఎక్కడికి వెళ్లాయి. ఎవరికి చేరాయి. చేరిన వాళ్ల నుంచి తిరిగి మరెవరికి వెళ్లాయి. మోసం ఎక్కడ జరిగింది. అసలు మోసం జరిగిందా? లేదా? ఒప్పందం కంటే ముందే చెల్లింపులు జరిగాయా? లేదా? ఇవన్నీ కేసు దర్యాప్తులో తేలాల్సివుంది. కాబట్టి ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలన్న కేటీఆర్ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నాం. కోర్టులు అసాధారణ పరిస్థితుల్లోనే ఎఫ్ఐఆర్‌లను కొట్టేస్తాయి. దర్యాప్తు ఏకపక్షంగా, చట్ట వ్యతిరేకంగా జరిగిందనే నిర్ధారణకు వచ్చినప్పుడు మాత్రమే ఎఫ్ఐఆర్‌లను కొట్టేస్తాయి. ఈ కేసులో దర్యాప్తు ఇంకా ప్రాథమిక దశలోనే ఉంది. డిసెంబర్ 18న ఫార్ములా ఈ రేసింగ్‌పై ఫిర్యాదు అందింది. ఆ తర్వాత రోజు ఎఫ్ఐఆర్ నమోదైంది. ఆ వెంటనే అంటే డిసెంబర్ 20న కేటీఆర్ హైకోర్టుకు వచ్చేశారు. దర్యాప్తు సంస్థకు విచారణ చేసేందుకు కనీస గడువు ఇవ్వాలి. ఇక్కడ అలా జరగలేదు. పైగా కేసులోని అభియోగాలన్నీ తీవ్రమైనవి. ఉన్నతాధికారి దానకిషోర్ ఉన్నత స్థాయిలోని వాళ్లపై ఫిర్యాదు చేశారు. సాధారణ వ్యక్తులపై అభియోగాలు కాదన్న విషయాన్ని తీవ్రంగా పరిగణించాలి. ఇలాంటి అభియోగాలు ఉన్న కేసుల్లో ఎఫ్ఐఆర్‌లను కొట్టేయడానికి అధికారం అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే కోర్టులకు ఉంటుంది. ఇక్కడ అలాంటి పరిస్థితులేమీ లేవు. పైగా, విదేశీ కంపెనీలకు ఆర్థిక శాఖ, క్యాబినెట్ అనుమతులు లేకుండానే నిధుల చెల్లింపులు జరిగి పోయాయి. ఇలాంటి ఆరోపణలపై పూర్తి స్థాయిలో ఏసీబీ దర్యాప్తు జరగాల్సిందే. దీనిని అడ్డుకోవాలన్న పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నాం' అని జస్టిస్ లక్ష్మణ్ తీర్పులో పేర్కొన్నారు.

**సెక్షన్లు ఏవీ కేటీఆర్‌కు వర్తించవు :దవే**

కేటీఆర్ తరపున సుప్రీంకోర్టు సీనియర్ లాయర్ సిద్దార్థ్ దవే వాదనలు వినిపిస్తూ ఏసీబీ అధికారులు నమోదు చేసిన సెక్షన్లు ఎఫ్ఐఆర్‌కు వర్తించవన్నారు. ఫార్ములా-ఈ కార్ల రేస్ నిర్వహణ ఒప్పందంపై పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సంతకం చేశారని తెలిపారు. ఆ శాఖకు మంత్రిగా ఉన్న కేటీఆర్‌ను ఎఫ్ఐఆర్‌లో నిందితునిగా చేర్చడం తగదన్నారు. ఒప్పందంలో లోటుపాట్లు ఉంటే వాటిని సరిచేయాల్సింది అధికారులేగానీ మంత్రిగా పిటిషనర్ కాదన్నారు. కేటీఆర్ ఎక్కడా లబ్ది పొందలేదని స్పష్టం చేశారు. అవినీతి జరిగినట్లు ఎఫ్ఐఆర్‌లో ఎక్కడా ఆధారాలు చూపించలేదని వాదించారు.

**ఒప్పందానికి ముందే చెల్లింపులు : ఏజీ సుదర్శన్‌రెడ్డి**

'ఫార్ములా ఈ రేస్‌కు సంబంధించి 2023లో రెండో ఒప్పందం కుదుర్చుకోవడానికి ముందే చెల్లింపులు జరిగాయి. ఒప్పందాలు జరుగుతాయని ముందుగానే ఊహించి చెల్లింపులు చేశారు. ఇది అవినీతి కిందకే వస్తుంది. ఇందుకు ప్రాథమిక ఆధారాలున్నాయి. ఫస్ట్ అగ్రిమెంట్ 2022 అక్టోబర్ 5న జరగ్గా 2023 అక్టోబరు 27న రద్దయింది. ఆ తర్వాత 2023 అక్టోబర్ 30న రెండో ఒప్పందం జరిగింది. రెండో ఒప్పందానికి ముందే.. అంటే 2023 అక్టోబర్ 3, 11 తేదీల్లో రెండు విడతలుగా రూ.54.88 కోట్లు హెచ్ఎండీఏ సాధారణ నిధుల నుంచి చెల్లింపులు చేసేసింది. ఆనాటి మున్సిపల్ మంత్రి కేటీఆర్ ఆధీనంలోనే హెచ్ఎండీఏ ఉంది. మున్సిపల్ మంత్రిగా పిటిషనర్ కేటీఆర్ ఉన్నారు. పిటిషనర్ చెప్పిన కారణంగానే ఆర్థిక శాఖ అనుమతి కూడా లేకుండా నగదు చెల్లింపులు జరిగాయి. చట్ట ప్రకారం రూ.10 కోట్లకు మించి చెల్లింపులు జరపాలంటే ప్రభుత్వం నుంచి హెచ్ఎండీఏ అనుమతి పొందాలన్న నిబంధనను కూడా అమలు చేయలేదు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇంత మొత్తం చెల్లించాలంటే ఆర్థిక శాఖ నుంచి పర్మిషన్ పొందాలి. ఈ నిబంధనను గాలికి వదిలేసి చెల్లింపులు చేసేలా పిటిషనర్ మంత్రి హెూదాలో అధికారులకు ఉత్తర్వులు ఇచ్చారు. పది కోట్లకు మించి విదేశీ సంస్థలకు నిధులు పంపాలంటే రిజర్వు బ్యాంకు అనుమతి పొందాలన్న నిబంధనను గాలికి వదిలేశారు. ఐఓబీ ద్వారా నేరుగా విదేశీ సంస్థలకు సొమ్ము చెల్లింపులు కూడా చట్ట వ్యతిరేకం. విదేశీ సంస్థకు నగదు చెల్లించిన ఫలితంగా ఇన్‌కంట్యాక్స్ కింద రూ.14 కోట్లు అదనపు భారం పడింది. ఫార్ములా ఈ రేసింగ్ నిర్వహించడం వల్ల ప్రభుత్వానికి ఏమీ లాభాలు రాలేదు. స్పాన్సర్లకే లాభాలొచ్చాయి. నిందితుల జాబితాలో ఫార్ములా ఈ సంస్థను ఎందుకు చేర్చలేదని పిటిషనర్ ప్రశ్నించడం ద్వారా కేసు నుంచి ఏదో ఒక విధంగా తప్పించుకునే తాపత్రయమే అది. అవినీతి ఎక్కడ జరిగిందో ఒక నిర్ణయానికి వచ్చాక కేసు నమోదు జరిగింది. దర్యాప్తులో తేలే అంశాల ఆధారంగా అవసరమైతే ఇతరులను కూడా నిందితులుగా చేర్చేందుకు చట్టంలో వెసులుబాటు ఉంది. ఫార్ములా ఈ రేసుకు చెందిన కంపెనీ ఇంగ్లండ్‌కు చెందినది. అన్ని అంశాలను పరిశీలించాకే కేసు నమోదు చేయాలనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది. అందుకే ఎఫ్ఐఆర్ నమోదుకు కొంత జాప్యం జరిగింది. ఎఫ్ఐఆర్ ఏమీ ఎన్‌సైక్లోపీడియా కాదు. కాబోదు. రాజకీయ, వ్యక్తిగత కక్ష సాధింపు చర్యలతో కేసు నమోదు చేశామని పిటిషనర్ వాదించడమే రాజకీయం. ఫిర్యాదుపై ప్రాథమిక విచారణ జరిగింది. అక్టోబరు 18న దీనిపై ప్రభుత్వానికి నివేదిక అందింది. గవర్నర్‌కు కూడా సమాచారం ఇచ్చి పిటిషనర్‌పై విచారణ చేపట్టేందుకు డిసెంబర్ 17న గవర్నర్ నుంచి పర్మిషన్ కూడా వచ్చింది. కేసు ప్రాథమిక దర్యాప్తు కూడా ప్రారంభించకుండానే కేసును క్వాష్ చేయాలని పిటిషనర్ కోర్టుకు రావడమే విడ్డూరం' అని ఏసీబీ తరపున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదించారు.

**చట్టాలన్నీ తుంగలోకి తొక్కారు**

'రెండో ఒప్పందం చేసుకోవడానికి ముందే రెండు విడతల్లో నగదు చెల్లింపులు జరిగాయి. విదేశీ కరెన్సీ చెల్లింపుల నిబంధనల ఉల్లంఘన జరిగింది. చట్టాలను గంపగుత్తగా ఉల్లంఘించారు. నిధులు ఎవరికి చెల్లించారో, చెల్లించామని చెబుతున్న నిధులు ఆ సంస్థకు వెళ్లాయో లేదో, ఒకవేళ నిధులు ఆ సంస్థకు వెళితే అక్కడి నుంచి ఆ నగదు వేరే వాళ్లకు మళ్లింపు జరిగిందా? అవినీతి ఎక్కడ జరిగింది? పిటిషనర్‌కే తిరిగి నిధులు చేరాయా? వంటి అంశాలన్నీ ఏసీబీ దర్యాప్తులో తేలుతుంది. ఈ దశలో పిటిషనర్ వాదనలను ఆమోదించొద్దు.

మంత్రి పర్యవేక్షణలోనే పురపాలకశాఖ అధికారులు విధులు నిర్వహిస్తారు. రేసింగ్‌కు చెల్లింపుల ఫైల్‌ను ఆ నాటి మంత్రి కేటీఆర్ ఆమోదించారు. రేసింగ్ విషయంలో అన్ని రకాలుగా నిబంధనలు ఉల్లంఘించారు. చట్టాలన్నింటినీ మూకుమ్మడిగా ఉల్లంఘించారు. కేటీఆర్ ఏ లక్ష్యంతో ఫార్ములా ఈ రేసింగ్ నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారో, అది మంచో చెడో తేలాల్సింది దర్యాప్తులో మాత్రమే. ప్రభుత్వానికి చెందిన సొమ్ము నిర్వహణలో ఉల్లంఘనలు జరిగితే ఐపీసీ సెక్షన్ 405 వర్తిస్తుందన్నారు. అనుమతులు లేకుండా ప్రభుత్వ సొమ్ము తరలింపు జరిగింది. చివరికి సొమ్ము చెల్లింపుల విధానాల ఉల్లంఘన జరిగింది. ప్రాథమికంగా ప్రభుత్వ సొమ్ము పిటిషనర్ అధీనంలో ఉంది. కాబట్టి ఆరోపణల పరిధిలోనే కేటీఆర్ ఉన్నారు. అనేక నిబంధనలను ఉల్లంఘించారు. గంపగుత్తగా రూల్స్ ఉల్లంఘనలకు పాల్పడ్డారు. ఒప్పందం లేకుండా చెల్లింపులు, మంత్రిగా పిటిషనర్ ఆదేశాలతో హెచ్ఎండీఏ చెల్లింపులు చేయడం ఈ రెండు కారణాలు దర్యాప్తును కొనసాగించడానికి సరిపోతాయి. కచ్చితమైన ఆధారాలు ఉన్నందున పిటిషన్‌ను డిస్మిస్ చేయాలి' అని ఫిర్యాదుదారుడైన మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం. దానకిషోర్ తరపున సీనియర్ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి వాదించారు.

**కేటీఆర్ పిటిషన్ డిస్మిస్**

'ఫార్ములా రేస్ నిమిత్తం ప్రభుత్వం, ఫార్ములా ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈఓ), ఏస్ నెక్స్‌జెన్ ప్రయివేటు లిమిటెడ్ మధ్య ఒప్పందం కుదిరింది. సీజన్ 9 సమర్థవంతంగా నిర్వహించాక పదో సీజన్‌కు ప్రమోటర్ వెళ్లిపోవడంతో ప్రభుత్వమే చెల్లింపులు జరిపి రేస్ నిర్వహణకు అగ్రిమెంట్ కుదిరింది. ఇప్పటికే ఉన్న ఒప్పందం అమల్లో భాగంగానే రెండో అగ్రిమెంట్ జరిగింది. అది ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా జరిగిందని అభియోగం. 2023కు చెందిన బకాయిల చెల్లింపులూ జరిగాయి. కొత్త ఒప్పందాన్ని ప్రభుత్వం అమలు చేయకపోవడంతో ఈ వివాదం అంతర్జాతీయ స్థాయిలో అర్బిట్రేషన్ పరిధిలోకి వెళుతుందని నాటి పాలకులు భావించారు.

రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగా కేసు నమోదైంది. ఈ కేసు నమోదు 14 నెలల ఆలస్యంగా చేయడాన్ని తీవ్రంగా పరిగణించాలి. లలిత కుమారి, చరణ్‌సింగ్ కేసుల్లో సుప్రీంకోర్టు జారీ చేసిన తీర్పులకు విరుద్ధంగా కేసు నమోదు తీవ్ర జాప్యమైంది. ఆ కేసుల్లో సుప్రీం కోర్టు మూడు నెలల జాప్యానికే ఒప్పుకోలేదు. ఇక్కడ అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 13(1)(ఎ) కింద కేసు నమోదు చెల్లదనీ పిటిషనర్‌కు 41ఎ నోటీసులు జారీ చేయకుండా ఉండేందుకే ఐపీసీ 409, 405, పీసీ యాక్ట్ 13(1)(ఎ) వంటి సెక్షన్లను నమోదు చేశారు. నిధుల చెల్లింపులు, అంతకముందు అగ్రిమెంట్లు, అన్నీ డాక్యుమెంట్స్ ప్రభుత్వం దగ్గరే ఉన్నాయి. నిధులు పొందిన వాళ్లను వదిలేసి పైసా కూడా తీసుకోని తనను నిందితుడిగా చేర్చడం రాజకీయ కుట్రలో భాగమే. నిధులను సొంతానికి వినియోగించుకోలేదు. ప్రమోటర్ నిందితునిగా లేనప్పుడు ఐపీసీ 120 బి కింద కుట్ర జరిగిందనే అభియోగాన్ని ఎలా మోపుతారని ప్రశ్నించారు. ప్రభుత్వ విధాన నిర్ణయంలో భాగంగానే ఇవన్నీ జరిగాయి. విధాన నిర్ణయాల్లో లోటుపాట్లు ఉంటే వాటిని ప్రభుత్వమే సరిదిద్దుకోవాలి. ఆ నాటి మంత్రి తీసుకున్న నిర్ణయమని చెప్పి తనపై కేసు నమోదు చట్ట వ్యతిరేకం' అని కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది.

## వీసీల నియామక నిబంధనల్లో మార్పులు

**న్యూఢిల్లీ :** దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో వైస్ ఛాన్సలర్ల నియామకాలకు సంబంధించి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ముసాయిదా మార్గదర్శకాలు విడుదల చేసింది. వీటి ప్రకారం పరిశ్రమకు చెందిన నిపుణులను, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న సీనియర్ ప్రొఫెషనల్స్‌ను నేరుగా వీసీలుగా నియమించుకునే అవకాశం లభిస్తుంది. ప్రస్తుత మార్గదర్శకాల ప్రకారం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా నియమితులు కావాలంటే ప్రొఫెసర్‌గా లేదా ప్రముఖ పరిశోధనలో లేదా అకడమిక్ అడ్మినిస్ట్రేటివ్ విభాగంలో కనీసం పది సంవత్సరాల పాటు పని చేసి ఉండాలి. అయితే ఇప్పుడు తాజాగా విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం పరిశ్రమలో, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో, ప్రభుత్వ విధానాలలో లేదా కనీసం ప్రభుత్వ రంగ సంస్థలో కనీసం పది సంవత్సరాల సీనియర్ స్థాయి అనుభవం గడించి ఉంటే సరిపోతుంది. ముసాయిదా మార్గదర్శకాలను కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విడుదల చేశారు. యూనివర్సిటీల్లో అధ్యాపకుల నియామకానికి సంబంధించిన నిబంధనలకు కూడా ఆయన అందులో సవరణలు ప్రతిపాదించారు. అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీలు ఏ సబ్జెక్టులో పొందినప్పటికీ యూజీసీ-నెట్‌లో మంచి పనితీరు కనబరచిన సబ్జెక్టులో అధ్యాపకులుగా నియమితులు కావడానికి అర్హత పొందుతారు. దీనిపై యూజీసీ ఛైర్మన్ ప్రొఫెసర్ మామిడాల జగదీష్ కుమార్ మాట్లాడుతూ ఇది చాలా ముఖ్యమైన వెసులుబాటు అని చెప్పారు. సూచనల కోసం నూతన మార్గదర్శకాలను యూజీసీ వెబ్‌సైటులో ఉంచారు. కనీసం 55 శాతం మార్కులతో ఎంఈ లేదా ఎంటెక్ ఉత్తీర్ణులైన వారిని యూజీసీ-నెట్‌లో అర్హత సాధించకపోయినా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నేరుగా నియమించుకోవచ్చు. ఏ సబ్జెక్టులో అయితే అధిక విద్యార్హత కలిగి ఉంటారో ఆ సబ్జెక్టునే బోధించే వెసులుబాటు కూడా ఉంటుంది. అంటే మాథమెటిక్స్‌లో బ్యాచిలర్, ఫిజిక్స్‌లో మాస్టర్ డిగ్రీలు ఉండి కెమిస్ట్రీలో పీహెచ్‌డీ చేసి ఉంటే కెమిస్ట్రీలోనే బోధించవచ్చు. దీనివల్ల వివిధ నేపథ్యాల నుండి వచ్చిన వారిని ఎంపిక చేసుకునే అవకాశం లభిస్తుందని జగదీష్ కుమార్ తెలిపారు. కాగా నూతన మార్గదర్శకాలు కేంద్ర, రాష్ట్ర, ప్రయివేటు, డీమ్డ్ యూనివర్సిటీలకు వర్తిస్తాయి.

## అసోం బొగ్గు గని ప్రమాదం

- ముగ్గురు మృతి.. చిక్కుకున్న పది మంది కార్మికులు
- రంగంలోకి నేవీ, ఆర్మీ

**డిస్పూర్ :** అస్సాంలోని దిమా హసౌ జిల్లాలో ఒక బొగ్గు గనిలో జరిగిన ప్రమాదంలో ముగ్గురు మరణించారు. ఇంకా పది మంది కార్మికులు గనిలో చిక్కుకుని ఉన్నారని అధికారులు అనుమానిస్తున్నారు. వీరి రక్షించడం కోసం ఆర్మీ నేవీకి చెందిన బృందాలు రంగంలోకి దిగాయి. రెస్క్యూ కార్యకలాపాలను ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. రెస్క్యూ ఆపరేషన్‌లో సహాయం కోసం నేవీ డీప్ డైవర్లకు విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. డైవర్లు విశాఖపట్నం నుంచి బయలుదేరారని, త్వరలోనే ప్రమాద స్థలానికి చేరుకుంటారని అధికారులు వెల్లడించారు. జిల్లాలోని ఉమ్రాంగ్సోకు సమీపంలో ఉన్న ఈ బొగ్గు గనిలోకి సోమవారం ఉదయం ఒక్కసారిగా వరదలు రావడంతో ఈ ప్రమాదం సంభవించింది.

## హమాలీ రేట్లు పెంచుతాం.. బకాయిలు చెల్లిస్తాం

(మొదటిపేజి తరువాయి)

సమ్మెను విరమించాలని కోరారు. గతేడాది అక్టోబర్ నాలుగో తేదీన జరిగిన ఒప్పందంలో భాగంగా పెరిగిన హమాలీ రేట్ల బకాయిలను చెల్లించాలని కోరగా.. చెల్లిస్తామని మంత్రి హామీనిచ్చారు. స్వీపర్లకు, హమాలీలకు యూనిఫాం కుట్టుకూలితో సహా చెల్లిస్తామనీ, బోనస్ రూ.7500 చెల్లించేందుకు నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. దసరా పండుగ సందర్భంగా ఇచ్చే స్వీటు బాక్సు రూ.900కు పెంచిన అగ్రిమెంట్ ప్రకారం ఇస్తామనీ, హమాలీలు ఆందోళన చెందొద్దని అన్నారు. మంత్రి సూచన మేరకు జేఏసీ రాష్ట్ర నాయకులు తమ సంఘాలతో చర్చించి మెజార్టీ నిర్ణయం ప్రకారం సమ్మె విరమిస్తున్నట్టు ప్రకటించారు. వారం రోజులుగా ఐక్యంగా సమ్మెలో పాల్గొని జయప్రదం చేసిన సివిల్ సప్లయ్, జీసీసీ హమాలీ కార్మికులకు, సహకరించిన అధికారులకు జేఏసీ రాష్ట్ర నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

## లైంగికబాబా ఆశారాంకు బెయిల్



**న్యూఢిల్లీ:** లైంగికబాబా ఆశారాంకి.. సుప్రీంకోర్టు మంగళవారం మధ్యంతర బెయిల్ మంజూరీ చేసింది. ఆరోగ్యం క్షీణిస్తున్న నేపథ్యంలో మార్చి 31వ తేదీ వరకు ఆయనకు బెయిల్ ఇచ్చారు. మెడికల్ గ్రౌండ్స్ మీద 86 ఏండ్ల ఆశారాం బాపునకు బెయిల్ ఇస్తున్నట్టు కోర్టు తెలిపింది. జస్టిస్ ఎంఎం సుంద్రేశ్, జస్టిస్ రాజేశ్ బిందాల్‌తో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలను పాస్ చేసింది. ఆశారాం బాపు తరపున సీనియర్ న్యాయవాది దేవదత్త కమాత్ వాదించారు. ఆయనతో పాటు అడ్వకేట్లు రాజేశ్ గులాబ్ ఇనాందార్, శాశ్వత్ ఆనంద్ కూడా ఉన్నారు.ఆశారాం బాపు అసలు పేరు అసుమల్ సిరుమలాని హర్పలని. జోద్‌పూర్‌లోని అతన ఆశ్రమంలో ఓ టీనేజ్ అమ్మాయిపై లైంగికదాడికి పాల్పడిన ఘటనలో అతన్ని అరెస్టు చేశారు.జోద్‌పూర్ కేసులో బెయిల్ దొరికినా.. మరో అఘాయిత్యం కేసులో అతని పేరు ఉన్న కారణంగా ఇప్పుడే అతను జైలు విడిచి బయటకు రాలేరు. 2013లో గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఓ మహిళను కూడా లైంగికంగా వేధించినట్టు ఆశారాంపై ఆరోపణలు ఉన్నాయి.మార్చి 31వ తేదీ వరకు బెయిల్ మంజూరీ చేస్తున్నట్టు సుప్రీం ధర్మాసనం తెలిపింది. రిలీజైన తర్వాత ఆయన తన ఫాలోవర్లను కలుసుకోరాదు అని కోర్టు చెప్పింది.

## ఎంజేపీలో ఫుడ్ పాయిజన్

(మొదటిపేజి తరువాయి)

వెంటనే స్థానిక ప్రభుత్వ ప్రధానాస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం ఒక్కొక్కరి ఆరోగ్యం కుదుటప డింది. మధ్యాహ్నం వరకు 23 మంది విద్యార్థినులను వైద్యులు డిశ్చార్జ్ చేశారు. మరో 8 మంది విద్యార్థులను సాయంత్రానికి హాస్టల్‌కు పంపించారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్‌డీవో మహేశ్వర్, అదనపు డిఎంహెచ్ఓ సుజాత, ఇతర ఉన్నతాధికారులు ఆస్పత్రిలో విద్యార్థినులతో మాట్లాడారు. వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో ఆరా తీశారు. విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ సంఘాల నాయకులు గురుకుల పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు.

అక్కడ ఉన్న పోలీసు లకు, వీరికి మధ్య స్వల్ప తోపులాట జరిగింది. విద్యార్థినుల తల్లిదండ్రులు హాస్టల్ నిర్వా హకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్‌సీఓ అంజలి తెలిపారు. విద్యార్థినులందరూ క్షేమంగా ఉన్నారని చెప్పి వారికి సిక్ లీవ్‌లు ఇవ్వడంతో తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లారు.

## మార్చి నాటికి మెట్రోల డీపీఆర్‌లు సిద్ధం చేయాలి

(మొదటిపేజి తరువాయి)

ప్రతిపనికి నగరంలోకి రానవసరం లేకుండా అక్కడే అన్ని సౌకర్యాలతో ఆ జంక్షన్‌ను అభివృద్ధి చేయాలన్నారు. జంక్షన్‌కు పూర్తి ప్రణాళికను తయారు చేయాలని ఆదేశించారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) కింద రేడియల్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని చెప్పారు.

సమీక్షలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాసరాజు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, పురపాలక.. పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాల కమిషనర్ శశాంక తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవ్యవస్థపై పూర్తి నమ్మకముంది

## అక్రమ కేసులపై అక్కడే తేల్చుకుంటా : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



భారత పౌరునిగా, చట్టాన్ని, రాజ్యాంగాన్ని గౌరవించే వ్యక్తిగా తనపై రేవంత్ సర్కార్ అక్రమంగా బనాయించిన కేసులను న్యాయపరంగా ఎదుర్కొంటానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. తనకు న్యాయవ్యవస్థపై పూర్తి నమ్మకం ఉందనీ, ఎలాంటి కేసునైనా అక్కడే తేల్చుకుంటానని ఆయన తెలిపారు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, జన్వాడ ఫాంహౌస్, హైడ్రా తదితర చర్యలతో గతేడాది నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నదని విమర్శించారు. ఆరు గ్యారంటీల అమలులో విఫలమైన రేవంత్ సర్కార్ అటెన్షన్ డైవర్షన్ కోసమే ఇలాంటి నాటకాలాడుతోందని ఆయన దుయ్యబట్టారు. అందువల్ల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఈ డైవర్షన్‌కు గురికావద్దని ఆయన సూచించారు. బీజేపీ, కాంగ్రెస్ వేరు వేరు కాదనీ, హస్తం పార్టీ రక్షణ కవచంలా కమలం పార్టీ పని చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ప్రజాక్షేత్రంలో ఆ రెండు పార్టీలను చిత్తు చిత్తుగా ఓడించి తిరిగి అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్ నందినగర్‌లోని కేసీఆర్ నివాసంలో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.

సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో మీడియా సమక్షంలో చర్చ పెట్టాలంటూ కేటీఆర్ సవాల్ విసిరారు. మంగళవారం సాయంత్రం బంజారాహిల్స్‌లోని తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడారు. ఈ-రేస్‌లో తాను అణాపైసా అవినీతికి పాల్పడలేదనీ, పైపెచ్చు హైదరాబాద్, తెలంగాణ ప్రతిష్ట ప్రపంచవ్యాప్తంగా పెరిగిందని గుర్తుచేశారు. పచ్చకామెర్ల వారికి లోకమంతా పచ్చగా కనిపిస్తుందన్నట్టు అవినీతిపరులకు, రూ.50 లక్షలతో రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన దొంగకు ప్రతిపనిలో అవినీతి కనిపిస్తున్నదని ఎద్దేవా చేశారు. రాజకీయ ప్రేరేపిత, కక్షసాధింపు కేసు అని తెలిసినా తాను సోమవారం విచారణకు హాజరయ్యేందుకు వెళ్లానని తెలిపారు. గతంలో తమ నాయకులు పట్నం మహేందర్ రెడ్డి ఇవ్వని స్టేట్ మెంట్‌ను కూడా ఇచ్చినట్టుగా మీడియాకు లీకులివ్వడంతో తన న్యాయవాదిని వెంటబెట్టుకుని వెళ్లినట్టు తెలిపారు. ఈ-రేస్‌పై అసెంబ్లీ చర్చ పెట్టమంటే సీఎం రేవంత్‌రెడ్డి భయపడి పారిపోయారనీ, మరోసారి న్యాయవాది సమక్షంలో విచారణ అంటే వెనుకడుగు వేశారని తెలిపారు. భయపడుతున్నది కాంగ్రెస్ నాయకులే తప్ప తాము కాదన్నారు. న్యాయవాదిని వెంటబెట్టుకుని విచారణకు వెళ్లేందుకు హైకోర్టుకు వెళ్లనున్నట్టు తెలిపారు. హైకోర్టు తాను వేసిన క్వాష్ పిటిషన్‌ను కొట్టేస్తే తనకేదో ఉరిశిక్ష పడినంతగా కాంగ్రెస్ నాయకులు శునకానందంతో కామెంట్ చేస్తున్నారని విమర్శించారు.

దుర్మార్గుల నుంచి రక్షణ కోసమే తాను హైకోర్టుకు వెళ్లానని కేటీఆర్ తెలిపారు. ట్రయల్స్ మీడియాలో, సచివాలయంలో, మంత్రుల పేషీల్లో జరగవన్నారు. ఏ విచారణకైనా తాను సిద్ధమేననీ, తన లాయర్‌తో కలిసి హాజరవుతానని మరోసారి పునరుద్ఘాటించారు. హైకోర్టు తాను తప్పు చేశాననీ గానీ, స్కాం అని గానీ, శిక్ష అనే పదాలే వాడలేదని గుర్తుచేశారు. సీఎం నోటి నుంచి వచ్చేవి వేదవాక్కులు, భగవద్గీత సూక్తులు కావన్నారు. గ్రీన్ కో నుంచి ఎలక్టోరల్ బాండ్లు తీసుకోని పార్టీ ఏదైనా రాష్ట్రంలో ఉందా? అని ఆయన ప్రశ్నించారు.

### మెఘా కృష్ణారెడ్డితో రేవంత్ రెడ్డి క్విడ్ ప్రోకో

మెఘా కృష్ణారెడ్డితో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్విడ్ ప్రోకో చేశారా? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు మెఘా కృష్ణారెడ్డి కాంగ్రెస్‌కు నిధులిచ్చారనీ, అందుకే పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు కాంట్రాక్ట్ ఇచ్చారా? అక్కడ్నుంచి రాఘవ ఇంజినీరింగ్‌కు అప్పగించారా? అని నిలదీశారు. మెఘా కృష్ణారెడ్డి బీఆర్ఎస్‌కు కూడా నిధులిచ్చారని తెలిపారు. మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు తాగునీరు తెస్తామన్న ప్రాజెక్టులో కూడా మెఘా కృష్ణారెడ్డికి రూ.4 వేల కోట్ల కాంట్రాక్ట్ అప్పగిస్తున్నట్టు తనకు సమాచారం ఉందని తెలిపారు. సుంకేశుల రిటైన్ వాల్ కుంగినప్పుడు బ్లాక్ లిస్ట్‌లో పెట్టాల్సిన మెఘాకే మళ్లీ కాంట్రాక్ట్ ఎందుకు అప్పగించారని ప్రశ్నించారు. ఒక కాంట్రాక్టర్ మంత్రి, బ్రోకర్ సీఎం అయితే ఇలాంటి ఆరోపణలే వస్తాయని ఎద్దేవా చేశారు. క్విడ్ ప్రోకో అంటే నాకింత - నీకింత అని తెలుగు అర్థం అని తెలిపారు. గ్రీన్ కోకు తన నుంచి లాభం జరిగిందని విమర్శలు చేస్తున్నవారు తనకు వచ్చిన లాభమేంటో చెప్పడం లేదనీ, దీన్ని క్విడ్ ప్రోకో అని ఎలా అంటారని ప్రశ్నించారు.

## దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ అరెస్టుకు మరో వారంటు జారీ

**సియోల్ :** దేశంలో సైనిక పాలన విధించిన కేసులో అభిశంసించబడిన దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌ను అరెస్టు చేసేందుకు మరోసారి వారంటు జారీ అయింది. ఈ మేరకు దక్షిణ కొరియా అవినీతి నిరోధక సంస్థకు ఆదేశాలు అందాయి. గత వారం అధ్యక్షుడి అరెస్టుకు ప్రయత్నించినప్పటికీ అధ్యక్ష భవన భద్రతా సిబ్బంది అడ్డుకోవడంతో విఫలమైంది. అయితే తాజాగా జారీ చేసిన వారంటు ఎన్ని రోజులు అమల్లో వుంటుందో అవినీతి నిరోధక శాఖ దర్యాప్తు అధికారులు ధృవీకరించలేదు. యూన్‌ను నిర్బంధంలోకి తీసుకోవడానికి సియోల్ పశ్చిమ జిల్లా కోర్టు గత వారం తొలుత వారంటు జారీ చేసింది. ఆయన నివాసాన్ని సోదాచేయడానికి విడిగా మరో వారంటు జారీ చేశారు. డిసెంబరు 3న విధించిన మార్షల్ లా డిక్రీపై ప్రశ్నించేందుకు హాజరు కావాల్సిందిగా అధికారులు కోరుతుంటే ఆయన ధిక్కరిస్తున్నారు. శుక్రవారం యూన్‌ను అదుపులోకి తీసుకునేందుకు పలువురు అవినీతి నిరోధక శాఖ అధికారులు, పోలీసు సిబ్బంది చాలా ప్రయత్నాలు చేశారు. కానీ ఆయన నివాసంలో అధ్యక్ష భవన భద్రతా సిబ్బందితో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడడంతో వెనుతిరగాల్సి వచ్చింది. దాదాపు ఐదు గంటల పాటు ఈ ప్రహసనం కొనసాగినా ఫలితం లేకపోయింది. ఆ తర్వాత అధికారులు మరో ప్రయత్నం చేయలేదు. సోమవారంతో ఆ కోర్టు వారంట్ల గడువు ముగిసిపోయింది.

## జాహ్నవి మృతి కేసులో సియాటిల్ పోలీసు అధికారికి ఉద్వాసన

**సియాటిల్, న్యూయార్క్ :** అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలుగు విద్యార్థిని జాహ్నవి కందుల మరణించిన కేసులో ఆ ప్రమాదానికి బాధ్యుడైన సియాటిల్ పోలీసు అధికారి కెవిన్ డేవ్‌ను పోలీసు విభాగం నుండి తొలగించినట్లు అధికారులు ప్రకటించారు. ఎవరినీ గాయపరచాలన్నది ఆ అధికారి ఉద్దేశం కానప్పటికీ ఆయన ప్రమాదకర డ్రైవింగ్ వల్ల జరిగిన విషాద పర్యవసానాలను తాము ఆమోదించలేకపోయామని సియాటిల్ తాత్కాలిక పోలీసు చీఫ్ సూ రాహెర్ చెప్పారు. సియాటిల్ పోలీసు డిపార్ట్‌మెంట్ నుండి కెవిన్ డేవ్‌కు ఉద్వాసన చెప్పినట్లు తెలిపారు. 2023 జనవరి 23న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జాహ్నవి సియాటిల్‌లో రోడ్డు దాటుతుండగా పోలీసు ఆఫీసర్ కెవిన్ డ్రైవ్ చేస్తున్న వాహనం దూసుకొచ్చి ఆమెను ఢీ కొంది. డ్రగ్ ఓవర్‌డోస్ బాధితుడి నుండి కాల్ రావడంతో ఆ వ్యక్తిని తీసుకువచ్చేందుకు మితిమీరిన వేగంతో కెవిన్ కారు నడుపుతున్నాడు. కారు ఢీ కొన్న వేగానికి జాహ్నవి వంద అడుగుల దూరంలో పడిపోయారు. బాధితుడిని త్వరగా చేరాలన్న ఆయనఉద్దేశం ఒక మనిషి ప్రాణాన్ని తీసిందని, సియాటిల్ పోలీసు విభాగానికి అపఖ్యాతి తెచ్చిపెట్టిందని, అందువల్ల ఆ వ్యక్తి చర్యను సమర్థించలేమని పోలీసు చీఫ్ వ్యాఖ్యానించారు. అందుకే కెవిన్‌ను పోలీసు శాఖ నుండి తొలగించినట్లు చెప్పారు. ఈ మేరకు ఆమె ఒక ఇ మెయిల్ పంపారు. సియాటిల్ టైమ్స్ ఈ వార్తా కథనాన్ని ప్రచురించింది.



# టీఓఏకు ఐఓఏ షాక్

- తెలంగాణ ఒలింపిక్ సంఘానికి దక్కని గుర్తింపు
- జాతీయ క్రీడలకు చెఫ్ డీ మిషన్‌గా శాట్ ఎండీ
- భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు ఉష నిర్ణయం

**తెలంగాణ ఒలింపిక్ సంఘం (టీఓఏ) మళ్లీ సంక్షోభంలో కూరుకుంది. గత నాలుగేండ్లుగా అధ్యక్షుడు లేకుండానే కార్యకలాపాలు సాగించిన టీఓఏ.. ఇటీవల ఎన్నికల్లో నూతన అధ్యక్షుడిగా జితేందర్ రెడ్డిని ఎన్నకున్నప్పటికీ ఫలితం లేకుండా పోయింది. నిబంధనల విరుద్ధంగా సాగిన తెలంగాణ ఒలింపిక్ సంఘం ఎన్నికలను భారత ఒలింపిక్ సంఘం గుర్తించలేదు!. ఉత్తరాఖాండ్‌లో జరుగనున్న జాతీయ క్రీడలకు సైతం చెఫ్ డి మిషన్‌ను ఎంపిక చేసే అధికారం టీఓఏకు ఇవ్వలేదు. దీంతో తెలంగాణ ఒలింపిక్ సంఘం కథ మళ్లీ మొదటికొచ్చింది.**

నవతెలంగాణ-హైదరాబాద్

తెలంగాణ ఒలింపిక్ సంఘానికి (టీఓఏ)కు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) దిమ్మతిరిగే షాక్ ఇచ్చింది. న్యాయ పరమైన అడ్డంకులను దాటుకుని ఇటీవల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోగా.. భారత ఒలింపిక్ సంఘం నుంచి ఎటువంటి గుర్తింపు దక్కలేదు. ఎన్నికల ప్రక్రియ, ఎలక్టోరల్ కాలేజ్ తయారీలో తీవ్రమైన తప్పిదాలు జరిగినట్టు ఐఓఏ భావించటంతో.. తెలంగాణ ఒలింపిక్ సంఘం మరోసారి సంక్షోభంలో కూరుకుంది. 38వ జాతీయ క్రీడలు జనవరి 28 నుంచి ఫిబ్రవరి 14 వరకు ఉత్తరాఖాండ్‌లో జరుగనున్నాయి. జాతీయ క్రీడల్లో పోటీపడే రాష్ట్రాల నుంచి చెఫ్ డీ మిషన్ అధికారుల ఎంపిక సాధారణంగా రాష్ట్ర ఒలింపిక్ సంఘాలకు ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ సంఘం (ఏపీఓఏ) కార్యవర్గం సమావేశమై.. చెఫ్ డి మిషన్‌ను ఎంపిక చేసింది. ఇక్కడ తెలంగాణ ఒలింపిక్ సంఘానికి గుర్తింపు ఇవ్వని ఐఓఓ.. జాతీయ క్రీడలకు తెలంగాణ జట్లను పంపేందుకు వీలుగా సొంతంగా చెఫ్ డి మిషన్ అధికారులను స్వయంగా ఎంపిక చేసింది. ఈ మేరకు ఐఓఏ అధ్యక్షురాలు పి.టి ఉష జనవరి 6న రాష్ట్ర ప్రభుత్వ క్రీడల ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్‌కు ఓ లేఖ ద్వారా సమాచారం అందించారు.

### చెఫ్ డి మిషన్‌గా శాట్ ఎండీ

జాతీయ క్రీడల్లో పాల్గొనే తెలంగాణ బృందానికి చెఫ్ డి మిషన్‌గా ఐఎఫ్ఎస్ అధికారిణి సోనీబాలా దేవి వ్యవహరించనున్నారు. సోనీ బాలాదేవి ప్రస్తుతం తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్) వైస్ చైర్మెన్, ఎండీగా కొనసాగుతున్నారు. డిప్యూటీ టీఓఏ మాజీ కోశాధికారి, తెలంగాణ పెంటాథ్లాన్ వైస్ ప్రెసిడెంట్ మహేశ్వర్, ఆర్చరీ సంఘం కార్యదర్శి సంజీవ్ రెడ్డిలను ఎంపిక చేశారు. ఈ మేరకు ఐఓఏ అధ్యక్షురాలు పి.టి ఉష లేఖ రాశారు. చెఫ్ డి మిషన్ నియామకంతో తెలంగాణ నుంచి జాతీయ క్రీడల్లో పోటీపడే జట్లు, క్రీడాకారుల ఎంపిక ఇతర అంశాల నుంచి తెలంగాణ ఒలింపిక్ సంఘాన్ని దూరం చేసినట్టు అయ్యింది.

### ఎందుకీ నిర్ణయం?

తెలంగాణ ఒలింపిక్ సంఘం పనితీరు, ఎన్నికల ప్రక్రియపై ఐఓఏకు పలు ఫిర్యాదులు అందాయి. దీంతో టీఓఏలో ఏం జరుగుతుందో తెలుసుకుని నివేదిక ఇవ్వాలని ఏక సభ్య కమిటీని సైతం నియమించింది. ఓ వైపు ఐఓఏ నియమిత కమిషనర్ నివేదిక ఇవ్వాల్సి ఉండగా.. మరోవైపు టీఓఏకు ఎన్నికలు నిర్వహించారు. భారత ఒలింపిక్ సంఘం నిబంధనల ప్రకారం జిల్లా ఒలింపిక్ సంఘాలకు ఎన్నికల్లో ఓటు హక్కు ఉండదు. కానీ తెలంగాణలో జిల్లా సంఘాలకు ఓటు హక్కు కల్పించారు. ఇక 70 ఏండ్ల పైబడిన వారు ఎన్నికల్లో పోటీకి అనర్హులు. ఒకవేళ ఎన్నికైన కొంత కాలం తర్వాత 70 ఏండ్ల వయసు వస్తే అప్పటి నుంచి పదవిలో కొనసాగేందుకు అర్హత కోల్పోతారు. ఇక ఎలక్టోరల్ కాలేజ్ (ఓటర్ల జాబితా) తయారీలోనూ పారదర్శకత లోపించిందని భారత ఒలింపిక్ సంఘానికి సమర్పించిన నివేదికలో పేర్కొన్నట్టు సమాచారం. దీంతో తెలంగాణ ఒలింపిక్ సంఘానికి ఇటీవలే ఎన్నికలు ముగిసి, నూతన కార్యవర్గం బాధ్యతలు చేపట్టినా... ఐఓఏ నుంచి గుర్తింపు లభించలేదు. ఒలింపిక్ అసోసియేషన్ రూల్స్ ప్రకారం రాష్ట్ర ఒలింపిక్ సంఘం ఎన్నికలకు ఐఓఏ నుంచి పరిశీలకులు వస్తారు. పరిశీలకులు లేకుండా జరిగిన ఎన్నికలను గుర్తించరు. జిల్లా ఒలింపిక్ సంఘాలు, రాష్ట్ర క్రీడా సంఘాల ఎన్నికలకు సైతం టీఓఏ పరిశీలకులను పంపిస్తుంది. లేకుంటే, ఆ ఎన్నికలను అధికారికంగా గుర్తింపు ఇవ్వదు. ఐఓఏ పరిశీలకుడు లేకుండా జరిగిన ఎన్నికలకు గుర్తింపు ఉండదని తెలంగాణ ఒలింపిక్ సంఘం పెద్దలకు తెలిసినా.. నిబంధనలను తుంగలో తొక్కి ఎన్నికల ప్రక్రియను ముగించారు.

### అడ్‌హాక్ కమిటీకి చాన్స్?

జాతీయ క్రీడలకు తెలంగాణ జట్లను పంపించే అధికారం, చెఫ్ డి మిషన్ నియామకం అధికారాన్ని లాగేసుకున్న భారత ఒలింపిక్ సంఘం.. త్వరలోనే తెలంగాణ ఒలింపిక్ సంఘం నిర్వహణ బాధ్యతలను సైతం చేతుల్లోకి తీసుకునే అవకాశం కనిపిస్తోంది. జాతీయ స్పోర్ట్స్ కోడ్, ఒలింపిక్ నిబంధనలను పాటిస్తూ.. ఎన్నికలు నిర్వహించే వరకు అసోసియేషన్ రోజువారీ వ్యవహారాల పర్యవేక్షణకు అడ్ హాక్ కమిటీని ఏర్పాటు చేసే సూచనలు కనిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా, మంగళవారం ఎల్బీ స్టేడియం ఆవరణలోని ఒలింపిక్ భవన్‌లో ఏపీ జితేందర్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ ఒలింపిక్ సంఘం సమావేశమైంది. కార్యదర్శి మల్లారెడ్డి, కోశాధికారి సతీశ్ గౌడ్ సహా ఆఫీస్ బేరర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఆర్బిట్రేషన్, వివాద పరిష్కార కమిటీలను ఏర్పాటు చేస్తూ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. భారత ఒలింపిక్ సంఘం తీసుకున్న నిర్ణయంపై ఎటువంటి ప్రకటన చేయలేదు.

# నవచిత్రం



## బాలకృష్ణ కెరీర్‌లో గుర్తుండిపోయే చిత్రం

### - నిర్మాత సూర్యదేవర నాగవంశీ

హీరో బాలకృష్ణ ఈ సంక్రాంతికి మరో వైవిధ్యభరితమైన చిత్రం 'డాకు మహారాజ్'తో అలరించడానికి సిద్ధమవుతున్నారు. ఈ చిత్రానికి బాబీ కొల్లి దర్శకత్వం వహించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా ఈనెల 12న భారీస్థాయిలో విడుదల కానుంది.

ఈ నేపథ్యంలో నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ, 'ఈనెల 9న అనంతపురంలో భారీ ప్రీ ఈరిలీజ్ ఈవెంట్‌ని ప్లాన్ చేశాం. ఈ సినిమాని తెలుగునాట కావాల్సినన్ని థియేటర్లలో భారీగా విడుదల చేస్తున్నాం. యూఎస్‌లో కూడా భారీ స్థాయిలోనే రిలీజ్ ఉంటుంది. అక్కడ బుకింగ్స్ బాగున్నాయి. తెలుగుతో పాటు తమిళంలోనూ ఈ నెల 12నే రిలీజ్ చేస్తున్నాం. ఈ సినిమాతో ఈ సంక్రాంతికి ఘన విజయం సాధిస్తామనే నమ్మకం ఉంది. సినిమాలో యాక్షన్ సన్నివేశాలు బాగుంటాయి. ఈ సినిమా చూసి, నేను నమ్మకంగా చెబుతున్నాను. ఈ చిత్రం అసలు నిరాశ పరచదు. బాలకృష్ణ కెరీర్‌లో గుర్తుండిపోయే సినిమాల్లో ఒకటిగా నిలుస్తుంది' అని అన్నారు.

'మొదటి నుంచి బాలకృష్ణని కొత్తగా చూపించాలనే ఉద్దేశంతో, ప్రతి విషయంలో వైవిధ్యం చూపిస్తూ ఎంతో జాగ్రత్తగా ఈ సినిమాని రూపొందించాం. ప్రచార చిత్రాలకు బాలకృష్ణ అభిమానులు, ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. దాంతో సినిమా విజయం పట్ల మాకు మరింత నమ్మకం పెరిగింది. అలాగే ఈ చిత్రం రాబోయే రోజుల్లో పలు సినిమాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని బలంగా నమ్ముతున్నాను. బాలకృష్ణ అభిమానులకు ఒక మెమరబుల్ ఫిల్మ్ ఇవ్వాలనేది నాగవంశీ డ్రీమ్. అందుకు తగ్గట్టుగానే సరికొత్తగా ఉండేలా, ఒక మంచి సినిమాని తీశాం. ఇందులో ఐదు యాక్షన్ సీక్వెన్స్‌లు ఉంటాయి. ప్రతి సీక్వెన్స్ అభిమానులకు ఎంతో హై ఇస్తుంది. యాక్షన్‌తో పాటు మంచి వినోదం, హత్తుకునే భావోద్వేగాలతో కుటుంబ ప్రేక్షకులు మెచ్చేలా ఈ సినిమా ఉంటుంది' అని దర్శకుడు బాబీ కొల్లి చెప్పారు. కథానాయిక ప్రగ్యా జైస్వాల్ మాట్లాడుతూ, 'ట్రైలర్‌కు ఇంతటి అద్భుతమైన రెస్పాన్స్ ఇచ్చిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ఈనెల 12న నా పుట్టినరోజు. ఈ చిత్ర విజయాన్ని నా పుట్టినరోజు కానుకగా అందిస్తారని కోరుకుంటున్నాను' అని తెలిపారు. 'సినిమా చాలా భిన్నంగా ఉంటుంది. ఈ చిత్రంపై నాకు చాలా నమ్మకం ఉంది. నా సినీ ప్రయాణంలో ఈ చిత్రం ప్రత్యేకంగా నిలుస్తుందని నమ్మకంగా ఉన్నాను. ఈ చిత్రం మీ అందరికీ ఖచ్చితంగా నచ్చుతుంది' అని కథానాయిక శ్రద్ధా శ్రీనాథ్ అన్నారు.

## రీ-లోడెడ్ వెర్షన్ రిలీజ్‌కి రెడీ



అల్లు అర్జున్

కేవలం 32 రోజుల్లోనే (రూ.1831 కోట్ల గ్రాస్) భారతీయ సినీ చరిత్రలోనే అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రంగా, ఇండియన్ నెంబర్‌వన్ ఫిల్మ్‌గా 'పుష్ప-2 ది రూల్' నిలిచిన సంగతి తెలిసిందే. ఈ సినిమా మరోసారి నేషన్ వైడ్‌గా హాట్ టాపిక్‌గా మారింది. ఈనెల 11 నుంచి 'పుష్ప-2'కు మరో ఇరవై నిమిషాల పవర్‌ఫుల్ ఫుటేజ్‌ను యాడ్ చేస్తూ 'పుష్ప-2 రీ లోడెడ్ వెర్షన్'ని రిలీజ్ చేయబోతున్నారు. ఈ విషయాన్ని అధికారికంగా మంగళవారం ప్రకటించారు మేకర్స్. అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కలయికలో రూపొందిన ఈ సినిమాని సుకుమార్ రైటింగ్ సంస్థతో మైత్రీ మూవీమేకర్స్ కలిసి నిర్మించింది.

## అజిత్‌కు తృటిలో తప్పిన ప్రమాదం



అజిత్

హీరో అజిత్‌కి తృటిలో ప్రమాదం తప్పింది. రేస్ ప్రాక్టీస్ చేస్తుండగా ఆయన కారు గోడను బలంగా ఢీ కొట్టింది. దాంతో కారు ముందు భాగం డ్యామేజ్ అయ్యింది. అజిత్ సురక్షితంగా బయటపడ్డారు. వెంటనే స్పందించిన భద్రతా సిబ్బంది ఆయన్ని మరో కారులో తరలించింది. ప్రొఫెషనల్ రేసర్‌గా అజిత్‌కి మంచి గుర్తింపు ఉన్న సంగతి తెలిసిందే. దుబాయ్ గ్రాండ్ ప్రీలో పాల్గొనేందుకు ఇటీవల ఆయన అక్కడకు వెళ్లారు. రేసు ప్రాక్టీస్ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈనెల 11, 12న దుబాయ్ వేదికగా 24హెచ్ కారు రేసు జరుగనుంది. అజిత్‌కు తృటిలో తప్పిన ఈ ప్రమాదం తాలూకా వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అజిత్ సురక్షితం అని తెలియడంతో అటు ప్రేక్షకులు, ఇటు ఆయన ఫ్యాన్స్ ఊపిరి పీల్చుకున్నారు.




## మీ అందరినీ కడుపుబ్బా నవ్విస్తాం : వెంకటేష్

వెంకటేష్, అనిల్ రావిపూడి, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ కాంబినేషన్‌లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను మహేష్ బాబు లాంచ్ చేశారు. నిజామాబాద్ కలెక్టర్ గ్రౌండ్‌లో భారీగా తరలివచ్చిన అభిమానులు, ప్రేక్షకులు సమక్షంలో ఈ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ చాలా గ్రాండ్‌గా జరిగింది.

ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ, 'నిజామాబాద్‌లో ట్రైలర్ లాంచ్ జరగడం చాలా హ్యాపీగా వుంది. మీ లవ్‌కి, సపోర్ట్‌కి థ్యాంక్స్. నాకు ఎన్నో హిట్లు ఇచ్చారు. 'బొబ్బిలిరాజా, చంటి, గణేష్, సీతమ్మ వాకిట్లో.., ఎఫ్ 2, ఎఫ్3' ఇలా ఎన్నో విజయాలు ఇచ్చారు. ఇప్పుడు 'సంక్రాంతికి వస్తున్నాం'తో రాబోతున్నాం. సంక్రాంతి సినిమా ఇంట్లో ప్రతి ఒక్కరూ వచ్చి చూడాలి. తప్పకుండా ఈ సినిమాని మీరు ఎంజాయ్ చేస్తారు. ఫుల్ ఎంటర్ టైన్మెంట్, సాంగ్స్.. ఇలా అనిల్ హోల్‌సమ్ ఎంటర్‌టైనర్‌ని ఇచ్చారు. మీ అందరికీ నచ్చుతుంది. ఈ సినిమాతో పాటు 'గేమ్ ఛేంజర్', 'డాకు మహారాజ్' అన్నీ పెద్ద హిట్లు కావాలని కోరుకుంటున్నాను. దిల్ రాజు బ్యానర్‌లో చేసిన నాలుగు సినిమాలు సూపర్ హిట్లు అయ్యాయి. దర్శకుడు అనిల్‌కి థ్యాంక్స్. ఐశ్వర్య, మీనాక్షి చాలా అద్భుతంగా నటించారు. పెళ్ళాలకి మీ ఫ్లాష్ బ్యాకులు చెప్పొద్దు(నవ్వుతూ). సినిమా చూడండి. మామూలుగా ఉండదు' అని తెలిపారు.

ట్రైలర్‌లో చూసింది కొంచెమే.. సినిమాలో చాలా ఉంది. ఇదొక టిపికల్ జోనర్ సినిమా. వెంకటేష్ అద్భుతంగా నటించారు.ఖచ్చితంగా పండక్కి చాలా పెద్ద హిట్ కొట్టబోతున్నాం. అందరూ ఫ్యామిలీతో ఎంజాయ్ చేస్తారు. సంక్రాంతికి మీ ఫ్యామిలీ అంతా థియేటర్స్‌కి వచ్చేయండి. కడుపుబ్బా నవ్వించి బయటికి పంపుతాం.

- డైరెక్టర్ అనిల్ రావిపూడి

'మా 58వ సినిమా ఈవెంట్ ఇక్కడ చేయడం మాకు చాలా గర్వంగా ఉంది. ఎంతోమంది హీరోలు, దర్శకులు సపోర్ట్ చేస్తే ఈ స్థాయిలో ఉన్నాం. అనిల్ మా బ్యానర్‌లో ఆరు సినిమాలు చేసి ఒక పిల్లర్‌లా నిలబడ్డారు. ఈ ఏడాది మా సంస్థకు బ్లాక్‌బస్టర్ పొంగల్ ఇయర్. పాన్ ఇండియా సినిమా 'గేమ్ ఛేంజర్' 10న రిలీజ్ అవుతుంది. మా బ్యానర్‌లో 'ఎఫ్ 2', 'ఎఫ్ 3' లాంటి సూపర్ హిట్స్ చేసిన వెంకటేష్ సినిమా జనవరి 14న వస్తోంది. అలాగే 'డాకు మహారాజ్'ని నైజంలో మేం రిలీజ్ చేస్తున్నాం. అందుకే ఇది మాకు బ్లాక్ బస్టర్ పొంగల్'. ఈ సినిమాకి రండి.. హాయిగా నవ్వుకోండి' అని దిల్ రాజు చెప్పారు.

## ఓ తల్లి ప్రసవ వేదనకి ప్రతిబింబం



అరవింద్ కృష్ణ, బిగ్ బాస్ ఫేమ్ దివి, మేఘన శ్రీనివాస్, వినయ్ కీలక పాత్రల్లో విల్లర్ట్ ప్రొడక్షన్ హౌస్ బ్యానర్‌లో '1000 వర్డ్స్' అనే సినిమా రూపొందింది. ఈ సినిమాకు రమణ విల్లర్ట్ నిర్మాతగా వ్యవహరిస్తూనే డైరెక్షన్ చేశారు. సోమవారం ప్రదర్శించిన స్పెషల్ ప్రీమియర్‌కు రేణూ దేశాయ్, ఎస్వీ కృష్ణారెడ్డి, అచ్చి రెడ్డి, మధుర శ్రీధర్, జ్యోతి పూర్వాజ్, సుకు పూర్వాజ్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు.

ఈ సందర్భంగా రేణూ దేశాయ్ మాట్లాడుతూ, 'రమణ ఫోటోగ్రాఫర్‌గా నాకు తెలుసు. ఆయన ఓ కథ చెప్పాడు. బాగానే అనిపించింది. కానీ ఎలా తీసి ఉంటారా? అని అనుకున్నాను. ఈ మూవీ చూశాక అద్భుతంగా అనిపించింది. ఇది అందరికీ రీచ్ అవ్వాలి. అందరూ చూడాల్సిన, అందరికీ తెలియాల్సిన సినిమా. ఒక్క ఫోటో మీద ఇంత మంచి కథను రాసుకుని తీశారు. సినిమా చూశాక నాకు కూడా కన్నీళ్లు వచ్చాయి. రమణకి ఇది ఆరంభం మాత్రమే. ఆయన్నుంచి ఇంకా ఇలాంటి మంచి చిత్రాలు రావాలని ఆశిస్తున్నాను' అని అన్నారు. 'ఓ తల్లి బిడ్డను కనేప్పుడు పడే బాధను చెప్పాలని, చూపించాలనే ఈ సినిమాను తీశాం. అరకులో పూర్తిగా షూట్ చేశాం. నేను మొదటి ప్రయత్నం చేశాను. చూసిన వారంతా తప్పులు చెప్పండి. వాటిని తెలుసుకుని సరిదిద్దుకుంటాను' అని డైరెక్టర్, నిర్మాత రమణ విల్లర్ట్ అన్నారు.

## ప్రేక్షకులకు థ్యాంక్స్



ధర్మ, ఐశ్వర్య శర్మ హీరో, హీరోయిన్లుగా నటించిన సినిమా 'డ్రింకర్ సాయి'. బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్ అనేది ఈ చిత్ర ట్యాగ్ లైన్. ఈ చిత్రాన్ని ఎవరెస్ట్ సినిమాస్, స్మార్ట్ స్క్రీన్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్ పై బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ నిర్మించారు. కిరణ్ తిరుమలశెట్టి ఈ చిత్రాన్ని రూపొందించారు. డిసెంబర్ 27న విడుదలైన ఈ సినిమా సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది. ఈ నేపథ్యంలో సినిమా ప్రత్యేక ప్రదర్శనను మీడియా కోసం ఏర్పాటు చేశారు.

డైరెక్టర్ కిరణ్ తిరుమలశెట్టి మాట్లాడుతూ, 'మా సినిమాకు ప్రేక్షకుల నుంచి ఆదరణ దక్కింది. ఫస్ట్ వీక్ సక్సెస్ ఫుల్‌గా కంప్లీట్ చేసుకుని, మంచి కలెక్షన్స్‌తో సెకండ్ వీక్ రన్ అవుతోంది. నేను అనుకున్న పాయింట్ ప్రేక్షకులకు బాగా రీచ్ అయ్యింది. ఈ సినిమా ఫలితం పట్ల మా నిర్మాతలు సంతోషంగా ఉన్నారు' అని తెలిపారు.

'ఈ సినిమా కమర్షియల్‌గా మంచి సక్సెస్ సాధించింది. ఇప్పటిదాకా 5.75 కోట్ల రూపాయల గ్రాస్ కలెక్షన్స్ వచ్చాయి' అని ప్రొడ్యూసర్ బసవరాజు లహరిధర్ చెప్పారు. హీరో ధర్మ మాట్లాడుతూ, 'మా సినిమాను ఆదరించడం ద్వారా చిత్ర పరిశ్రమలో యువ హీరోగా నాకో స్థానం కల్పించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. హీరోగా బాగా ఎంకరేజ్ చేశారు. ఇలాంటి మంచి మూవీ నాతో చేసిన దర్శక, నిర్మాతలకు థ్యాంక్స్' అని అన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

## జీడీపీకి ధరల పోటు

- నాలుగేండ్ల కనిష్టానికి పతనం..!
- 2024-25లో 6.4 శాతమే
- ఎన్ఎస్ఓ అంచనాల వెల్లడి



**న్యూఢిల్లీ :** దేశంలోని అధిక ధరల పోటు ఆర్థిక వ్యవస్థను మందగించేలా చేస్తున్నాయి. హెచ్చు ద్రవ్యోల్బణంతో ప్రజల కొనుగోలు శక్తి హరించుకుపోవడంతో ఆ ప్రభావం వృద్ధి రేటుపై స్పష్టంగా కనబడుతోంది. దీనికి నేషనల్ గణంకాల శాఖ (ఎన్ఎస్ఓ) తాజా అంచనాలు మరింత బలాన్ని చేకూర్చాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత జీడీపీ 6.4 శాతానికి పరిమితం కావొచ్చని మంగళవారం ఓ రిపోర్ట్‌లో అంచనా వేసింది. ఇది నాలుగేండ్లలోనే అత్యంత కనిష్ట స్థాయి కావడం ఆందోళనకరం. ఇంతక్రితం 2023-24లో జీడీపీ 8.2 శాతం పెరిగింది. 2024-25 6.6 శాతం వృద్ధి ఉండొచ్చని ఆర్బీఐ ఇటీవల అంచనా వేసింది. దీంతో పోల్చినా జీడీపీ మరింత తగ్గే అవకాశం ఉంది. మొదటి ముందస్తు అంచనాల మందగమనం ఆర్థిక కార్యకలాపాల మరింత పతనాన్ని స్పష్టం చేస్తోంది. వాస్తవిక జీడీపీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.184.88 లక్షల కోట్లకు చేరొచ్చని అంచనా. గత ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.173.82 లక్షల కోట్లుగా చోటు చేసుకుంది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) జులై నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో వృద్ధి ఏకంగా 5.4 శాతానికి పడిపోయి.. దాదాపు రెండేండ్ల కనిష్టానికి క్షీణించింది. ఆర్బీఐ, రేటింగ్ ఏజెన్సీల అంచనాల కంటే ఘోరంగా క్షీణించడం గమనార్హం. కేంద్ర గణంకాల శాఖ (ఎన్ఎస్ఓ) రిపోర్ట్ ప్రకారం.. క్యూ2లో మైనింగ్, గనుల రంగాలు అత్యంత పేలవ ప్రదర్శన కనబర్చాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో జీడీపీ ఏకంగా 8.1 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. గడిచిన ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 6.7 శాతానికి పరిమితమయ్యింది. ఈ రెండింటితోనూ పోల్చినా జీడీపీలో భారీ తగ్గుదల నమోదుకావడం ఆందోళనకరం. మరోవైపు రేటింగ్ ఏజెన్సీలు కూడా 6 శాతం ఎగువన వృద్ధి ఉండొచ్చని చేసిన అంచనాల కంటే మరింతగా పడిపోవడం విశేషం. జీడీపీ 7 శాతం పెరగనుందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ అంచనా వేశారు. ఆర్బీఐ అంచనాలు మించి జీడీపీ పతనం కావడం ఆర్థిక వ్యవస్థ పట్ల తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. వీటిన్నింటి పరిశీలనలోకి తీసుకుంటే భారత ఆర్థిక వ్యవస్థ బయటికి కనబడుతున్నంత బలంగా ఏమీ లేదని.. మందగమనం చాయలు స్పష్టం చేస్తున్నాయి.

## భారత్‌లో మైక్రోసాఫ్ట్ రూ.25వేల కోట్ల పెట్టుబడులు

- క్లౌడ్, కృత్రిమ మేధ సామర్థ్యాలపై దృష్టి
- ఆ సంస్థ సీఈఓ సత్య నాదేళ్ల వెల్లడి



**న్యూఢిల్లీ :** టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ భారత్‌లో భారీ పెట్టుబడులను ప్రకటించింది. వచ్చే 2030 నాటికి 3 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.25వేల కోట్లు) పెట్టుబడులు పెట్టనున్నట్టు మైక్రోసాఫ్ట్ ఛైర్మన్, సీఈఓ సత్య నాదేళ్ల వెల్లడించారు. మంగళవారం బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో నాదేళ్ల మాట్లాడుతూ.. దేశంలో క్లౌడ్, కృత్రిమ మేధ సామర్థ్యాలను విస్తరించడం, డేటా సెంటర్ల విస్తరణ కోసం ఈ మొత్తాన్ని వ్యయం చేయనున్నామని తెలిపారు. అదే విధంగా 2030 నాటికి కోటి మందికి కృత్రిమ మేధా (ఏఐ)పై శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఇది వరకు ఎప్పుడూ ఇంత పెద్ద మొత్తం పెట్టుబడులను ప్రకటించలేదని సమాచారం. ఏఐ భవిష్యత్ ఆవిష్కరణలలో కీలకంగా మారనుంది. ఈ క్రమంలోనే భారత్‌లో 3 బిలియన్ డాలర్ల పెట్టుబడికి సంతోషిస్తున్నామని నాదేళ్ల తెలిపారు. భారత్‌లో మైక్రోసాఫ్ట్‌ను మరింత విస్తరించనున్నామన్నారు. వచ్చే 2030 నాటికి కోటి మందికి ఏఐలో శిక్షణ ఇవ్వడం ద్వారా.. ఎంతో మందికి ఉపాధిని కూడా కల్పించనున్నామన్నారు. భవిష్యత్‌లో ఏఐ నిపుణుల అవసరం పెద్ద సంఖ్యలో ఏర్పడుతుందన్నారు. ఏఐలో తమ ఉద్యోగులకు మరింత శిక్షణ ఇవ్వనున్నామన్నారు. కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడంలో భారతీయ నిపుణులు ముందు వరుసలో ఉంటారని ప్రశంసించారు.

## జారుడుమెట్లు

- ఐదు పైసలు పతనమై డాలర్‌తో రూపాయి విలువ 85.73 కనిష్ట స్థాయికి..

**ముంబయి :** ప్రపంచ మార్కెట్‌లో రూపాయి విలువ తగ్గింది. మంగళవారం డాలర్‌తో రూపాయి విలువ ఐదు పైసలు పతనమై డాలర్‌తో 85.73 కనిష్ట స్థాయికి దిగజారింది. హెచ్చు చమురు ధరలు, విదేశీ సంస్థాగత నిధులు తరలిపోవడం రూపాయిపై ఒత్తిడిని పెంచాయి. ఇంటర్ బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో 85.77 వద్ద తెరుచుకున్న రూపాయి విలువ.. ఇంట్రాడేలో ఏకంగా 85.80 కనిష్ట స్థాయిని తాకింది. ఇంతక్రితం సెషన్‌తో పోల్చితే 5 పైసలు తగ్గి 85.73 వద్ద ముగిసింది. సోమవారం సెషన్‌లో 11 పైసలు పెరిగి 85.68 వద్ద నమోదయ్యింది.

## బంధన్ ఎంఎఫ్ నుంచి కొత్త ఫండ్

**హైదరాబాద్ :** బంధన్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా 'బంధన్ నిఫ్టీ అల్ఫా లో వాలటిలిటీ 30 ఇండెక్స్ ఫండ్'ను ఆవిష్కరించింది. ఈ ఓపెన్ ఎండెడ్ స్కీమ్‌లోని నిధులను ఎంపిక చేసిన స్టాక్స్‌ల్లో పెట్టుబడులను పెట్టనున్నట్లు పేర్కొంది. ప్రస్తుత అనిశ్చితి మార్కెట్‌లో అవకాశాలను అందిపుచ్చుకోవడానికి దోహదం చేస్తుందని ఆ సంస్థ భావిస్తోంది. ఈ ఎన్ఎఫ్ఓ జనవరి 08న ప్రారంభమై.. 20తో ముగియనుందని బంధన్ ఏఎంసీ సీఈఓ విశాల్ కపూర్ తెలిపారు.

## మారుతి సుజుకి 'ఇ ఫర్ మీ' విజన్

**న్యూఢిల్లీ :** దిగ్గజ వాహన రంగ కంపెనీ మారుతి సుజుకి విద్యుత్ వాహన రంగంలోని విస్తృత అవకాశాలను అందిపుచ్చుకోవడానికి 'ఇ ఫర్ మీ' విజన్‌ను ఎంచుకున్నట్లు వెల్లడించింది. ఇందులో భాగంగా తొలి ఎస్‌యువి ఎలక్ట్రిక్ వాహనం ఇ విటారాను ఆవిష్కరించనున్నట్టు తెలిపింది. ఈ వాహనాన్ని త్వరలో న్యూఢిల్లీలో జరగనున్న భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో ఆవిష్కరించనున్నట్లు పేర్కొంది. ఇ ఫర్ మీలో భాగంగా ఇవిలో మౌలిక వసతులకు కూడా మద్దతును అందించనున్నట్టు పేర్కొంది.

## హైదరాబాద్‌లో రికార్డ్ నివాస అమ్మకాలు

- నైట్‌ఫ్రాంక్ ఇండియా రిపోర్ట్

**హైదరాబాద్ :** గతేడాది హైదరాబాద్‌లో మెరుగైన నివాస, వాణిజ్య కార్యాలయాల లావాదేవీలు జరిగాయని రియాల్టీ కన్సల్టెంట్ సంస్థ నైట్‌ఫ్రాంక్ ఇండియా ఓ రిపోర్ట్‌లో తెలిపింది. ఏడాదికేడాదితో పోల్చితే 2024లో ఆఫీసు లావాదేవీలు 17 శాతం పెరిగి 1.03 కోట్ల చదరపు అడుగులుగా చోటు చేసుకుందని వెల్లడించింది. 2020 తర్వాత ఇది అత్యధిక వృద్ధి అని.. ఆల్‌టైం రికార్డ్ అని పేర్కొంది. మరోవైపు నివాస అమ్మకాలు 12 శాతం పెరిగి 36,974 యూనిట్లుగా చోటు చేసుకున్నట్లు పేర్కొంది. "హైదరాబాద్ కొనుగోళ్లకు ప్రాధాన్యత కలిగిన ప్రదేశంగా కొనసాగుతుందని నైట్ ఫ్రాంక్ ఇండియా ప్రతినిధి జోసెఫ్ తిలక్ పేర్కొన్నారు. ఈ నగరంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కారణంగా మరింత ఆకర్షణీయంగా మారుతోందన్నారు.

# కరీంనగర్ డెయిరీపై దుష్ప్రచారం

- స్వార్థ ప్రయోజనాల కోసమే..
- హైదరాబాద్, బెంగళూర్, ఢిల్లీ సహా నగరాల నడిబొడ్డునే డెయిరీ కేంద్రాలు
- పర్యావరణ జాగ్రత్తలు, సాంకేతిక పరిజ్ఞానంతోనే నిర్వహణ
- పాడిరైతుల సంక్షేమంతో రాష్ట్రంలోనే నెంబర్‌వన్‌గా నిలిచాం : కరీంనగర్ డెయిరీ చైర్మెన్ చలిమెడ రాజేశ్వర్‌రావు




నవతెలంగాణ -కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / కరీంనగర్

'పోటీ మార్కెట్‌లో వస్తున్న కొన్ని ప్రయివేటు డెయిరీ వ్యక్తులు, స్థానికంగా స్వార్థ ప్రయోజనాల కోసం కొందరు కరీంనగర్ డెయిరీపై దుష్ప్రచారానికి దిగారు. డెయిరీ వల్ల స్థానిక ప్రజలకు చర్మవ్యాధులు వస్తున్నాయని, మా పాలల్లో కల్తీ జరుగుతోందని నిందారోపణలు చేస్తూ మాపై బురదజల్లే కుట్రలు చేస్తున్నారు. రోజుకు 12వేల లీటర్ల సేకరణతో మొదలైన ఈ డెయిరీ సంస్థ లక్షా 80వేల పాలసేకరణ స్థాయికి చేరి పలు సంక్షేమ పథకాలతో లక్ష మందికిపైగా పాడి రైతుల భాగస్వామ్యంతో నడుస్తోంది. సంస్థ పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో ఉత్పత్తులు చేస్తూ పర్యావరణ జాగ్రత్తలు పాటిస్తోంది' అని కరీంనగర్ డెయిరీ చైర్మెన్ చలిమెడ రాజేశ్వర్‌రావు తెలిపారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 1971లో స్థాపించిన కరీంనగర్ డెయిరీ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రోజుకు 12వేల లీటర్ల పాలు సేకరించిందని చెప్పారు. తొలినాళ్లలో కేవలం 4వేల లీటర్ల పాల విక్రయాలే సాగగా.. ఒక దశలో నెలకు రూ.30లక్షల అదనపు భారం పడి నష్టాల బాట పట్టిందని తెలిపారు. డెయిరీలో అనేక మార్పులతోపాటు పాడి రైతులకు 55కు పైగా సంక్షేమ పథకాలు అమలు చేసి రాష్ట్రంలో ఏ డెయిరీకి లేని ఆదరణ తీసుకొచ్చామని, ప్రస్తుతం లక్ష మంది రైతులు ఈ డెయిరీని నమ్ముకుని నడిపిస్తున్నారని వివరించారు. లక్షా 80వేల పాలను సేకరిస్తున్న డెయిరీ ప్రస్తుతం 1.04లక్షల లీటర్ల పాలను విక్రయిస్తూ మిగిలిన పాలను పౌడర్‌గా తయారు చేసేందుకు పంపిస్తున్నట్టు తెలిపారు.

ఇంత మంది ఆధారపడి అభివృద్ధి బాటలో పయనిస్తున్న డెయిరీపై కొంత మంది స్వార్థ ప్రయోజనాల కోసం విష ప్రచారం చేస్తున్నారన్నారు. డెయిరీ నగర నడిబొడ్డున ఉండటం వల్ల చర్మవ్యాధులు వస్తున్నాయని, పిల్లలు అంగవైకల్యంతో పుడుతున్నారంటూ భయానక వాతావరణం సృష్టించే విధంగా విమర్శలు చేస్తున్నారని అన్నారు.

ఇటీవల పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఫిర్యాదు చేసే హక్కు ఎవరికైనా ఉంటుందని, ఈ నేపథ్యంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ఇప్పటికే రెండుమార్లు తనిఖీ చేసి వెళ్లారని చెప్పారు. హైదరబాద్‌లోని లాలపేటలో అతి పెద్ద విజయ డెయిరీ ఉందని, హయత్‌నగరంలో మదర్ డెయిరీ, బెంగళూర్‌లో నందిని డెయిరీలాంటివి ఎన్నో ప్రధాన నగరాల్లోనే ఉన్నాయని, అక్కడ రాని కాలుష్యం కరీంనగర్ సిటీలో ఎందుకు వస్తుందని అన్నారు. లక్షలాది మంది రైతుల భాగస్వామ్యంతో నడుస్తున్న ఈ డెయిరీపై దుష్ప్రచారాన్ని ఇప్పటికైనా మానుకోవాలని, లేకపోతే ఇంతమంది రైతులు రోడ్డున పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 12న డెయిరీ ఆధ్వర్యంలో రైతు కుటుంబాలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో మేనేజింగ్ డైరెక్టర్ శంకర్, ఇతర డైరెక్టర్లు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీ నందిగం సురేష్‌కు సుప్రీం బెయిల్ నిరాకరణ

### ట్రయల్ కోర్టుకు వెళ్లాలని సుప్రీం సూచన



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సుప్రీం కోర్టులో మాజీ ఎంపీ నందిగం సురేష్‌కు ఎదురుదెబ్బ తగిలింది. మరియమ్మ హత్య కేసులో ఆయనకు బెయిల్‌ను సుప్రీం కోర్టు నిరాకరించింది. మరియమ్మ హత్య కేసులో హైకోర్టు బెయిల్ నిరాకరించడంతో నందిగం సురేష్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను మంగళవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. ఏపీ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ ట్రయల్ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేసినప్పుడు నందిగం సురేష్ తనపై ఎటువంటి నేర చరిత్ర లేదని పేర్కొన్నారని, అయితే అప్పటికే ఆయనపై ఐదు కేసులు ఉన్నాయని తెలిపారు. అలాగే దర్యాప్తును, సాక్షులను ప్రభావితం చేశారని, 36 మందితో ఉన్న ఎఫ్ఐఆర్‌లో ఆయన పేరు లేకుండా ఒత్తిడి తెచ్చారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. కేసు నమోదు అయినప్పుడు ఆయన ఎంపీగా ఉన్నారని, ఆయన పార్టీ అధికారంలో ఉండటంతో మూడేళ్లుగా దర్యాప్తులో పురోగతి లేదని అన్నారు. ట్రయిల్ కోర్టు ఈ అంశాలను పరిగణనలో తీసుకుని, దర్యాప్తు లోపభూయిష్టంగా ఉందని పేర్కొని, బెయిల్ నిరాకరించిందని తెలిపారు. బెయిల్ కోసం హైకోర్టుకు వెళ్లారని, హైకోర్టు కూడా ఇదే అంశాన్ని స్పష్టం చేసి, బెయిల్ తిరస్కరించిందని పేర్కొన్నారు.నందిగం సురేష్ తరపు సీనియర్ న్యాయవాది మహేష్ జత్మలానీ వాదనలు వినిపిస్తూ బెయిల్ మంజూరుకు నేర చరిత్రతో సంబంధం లేదని అన్నారు. అందుకు 2012, 2024ల్లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులను ఉదహరించారు. అయితే ధర్మాసనం జోక్యం చేసుకుని నేర చరిత్ర ఉందా? లేదా? అనేది సమస్య కాదని, నేర చరిత్రను దాచిపెట్టడమే ప్రధానమైన అంశమని పేర్కొంది. ప్రస్తుత కేసులో నేర పాత్రను పరిశీలించాలని, అంతేతప్ప పూర్వ నేర చరిత్రకు సంబంధం లేదని అన్నారు. మొదట అసలు నందిగం సురేష్‌కు వ్యతిరేకంగా ఒక్క సాక్ష్యం కూడా లేదని, రెండోసారి విచారణ జరిపినప్పుడు ఐదుగురు సాక్షులు సాక్ష్యం ఇచ్చారని తెలిపారు. వీరంత ఒకేలా సాక్ష్యం ఇవ్వడం చూస్తే, కావాలనే నందిగం సురేష్‌కు వ్యతిరేకంగా సాక్ష్యం ఇప్పించారని తెలుస్తోందని అన్నారు. అయితే పోలీసులు చార్జిషీట్ దాఖలు చేసిన నేపథ్యంలో తాము జోక్యం చేసుకోలేమని, ట్రయల్ కోర్టుకు వెళ్లాలని సూచించింది.

# 'ట్రూ అప్' రద్దు చేయండి

### ఇఆర్‌సికి వామపక్షాల రాయబారం... బహిరంగ విచారణలో పార్టీలు, నిపుణులు



**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపిఇఆర్‌సి) మంగళవారం నిర్వహించిన బహిరంగ విచారణ సందర్భంగా ప్రజలకు పెనుభారంగా మారుతున్న ట్రూ అప్ ఛార్జీలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. ఇఆర్‌సి వద్దకు రాయబారం నిర్వహించిన వామపక్ష పార్టీలు తక్షణం ట్రూ అప్ ఛార్జీలను రద్దుచేయాలని డిమాండ్ చేశాయి. దీంతో పాటు సెకి ఒప్పందాన్ని రద్దు చేయాలని, ఏపిఇఆర్‌సి ప్రజల తరపున నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరాయి. ఈ మేరకు వామపక్షాల నేతలు ఇఆర్‌సి ఛైర్మన్ ఠాగూర్ రామ్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఇఆర్‌సి నిర్వహించిన విచారణలో పాల్గొన్న వివిధ పార్టీల నేతలు, విద్యుత్ రంగ నిపుణులు కూడా ఈ అంశంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలపై మోపుతున్న భారాలను రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. తొలుత వామపక్ష పార్టీలు విజయవాడలోని ఒక ప్రైవేటు హాలులో బహిరంగ విచారణ జరుపుతున్న ఏపి ఇఆర్‌సి ఛైర్మన్ వద్దక రాయబారం నిర్వహించాయి. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అదాని లాభాలకు గ్యారంటీలు ఇవ్వడమే లక్ష్యంగా ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని అన్నారు. గత ప్రభుత్వం టిడిపి పేరు చెప్పి ప్రజలపై భారాలు మోపితే, ప్రస్తుత ప్రభుత్వం వైసిపి పేరుచెప్పి అదే పని చేస్తోందన్నారు. ఫలితంగా ప్రజలపై వేల కోట్ల రూపాయల భారం పడుతోందన్నారు. విద్యుత్ ఛార్జీలపై కూటమి ప్రభుత్వం మాటతప్పిందని తెలిపారు. ఎన్నికల్లో విద్యుత్ చార్జీలు పెంచేది లేదని అవసరమైతే తగ్గిస్తామని చెప్పి, ఈ ఆరు నెలల్లోనే ట్రూ అప్, సర్వీసు చార్జీల పేరుతో రూ.16వేల కోట్లు అదనపు భారం వేసిందన్నారు. ఇది చాలదన్నట్లు ఈ ఏడాదికి మరో రూ.5,900 కోట్ల లోటు చూపిస్తుందని చెప్పారు. ఈ లోటును ప్రభుత్వం భరించేందుకు సిద్ధంగా లేదన్నారు. దీంతో ఈ భారం వచ్చే ఏడాది వినియోగదారులపై పడనుందన్నారు. రూ.1,750 కోట్లు లంచాలు తీసుకుని యూనిట్ 2.49 కొనుగోలు చేసేందుకు గత ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటే, ఈ ప్రభుత్వం కనీసం విచారణ చేయడం లేదన్నారు. స్మార్ట్ మీటర్లు, విద్యుత్తు చార్జీలు ఉపసంహరించుకోవడంతో పాటు సెకి ఒప్పందాన్ని రద్దు చేసే వరకూ ఉద్యమం ఆగదన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ఇఆర్‌సి ఏనాడు ప్రజల ప్రయోజనాలు కాపాడలేదన్నారు. వేల కోట్లు ఖర్చు చేసి స్మార్ట్ మీటర్లు బిగించాలని ఎవరు కోరారని ప్రశ్నించారు. అసెంబ్లీలో అదానీ పేరు ప్రస్తావించేందుకే సిఎం బయపడుతున్నారని చెప్పారు.

సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసి కార్యదర్శివర్గ సభ్యులు పి.ప్రసాద్ మాట్లాడుతూ అవినీతి లక్ష్యంగా జరిగిన విద్యుత్ ఒప్పందాలు వల్ల ప్రజలపై పడే భారాన్ని నివారించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజలను మభ్యపెట్టేందుకు ఏపిఇఆర్‌సి ప్రయత్నిస్తోందన్నారు. అనంతరం ప్రజల నుంచి వేలాదిగా సేకరించిన అభ్యంతరాలను ఏపిఇఆర్‌సి ఛైర్మన్ ఠాగూర్ రామ్‌సింగ్‌కు వి శ్రీనివాసరావు, రామకృష్ణ, ఇతర వామపక్ష పార్టీల నాయకులు అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ, విజయవాడ తూర్పు, పశ్చిమ కార్యదర్శులు కె. కృష్ణ, బి. రమణరావు, బి.సత్యబాబు, నాయకులు వై.కేశవరావు, ఎం.హరిబాబు, ఆంధ్ర మాల్యాద్రి, సిపిఐ నాయకులు వీరభద్రరావు, పి.దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

### దోడ్డిదారిన భారాలు మోపొద్దు

- స్మార్ట్‌మీటర్లు బిగించొద్దు : బహిరంగ విచారణలో బాబూరావు

**అమరావతి** :విద్యుత్ వినియోగదారులపై దొడ్డిదారిన భారాలు మోపొద్దని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. ఏపి ఇఆర్‌సి ఛైర్మన్ ఠాగూర్ రామ్‌సింగ్ అధ్యక్షతన జరిగిన బహిరంగ విచారణలో ఆయన మాట్లాడుతూ ట్రూఅప్, ఎఫ్‌పిపిసిఎ వంటి పేర్లతో డిస్కమ్‌లు వేలకోట్ల రూపాయలు వసూలు చేస్తున్నాయని, అదే సమయంలో భారాలు మోపడం లేదంటూ పచ్చి అబద్దాలు చెబుతున్నాయని అన్నారు. పాత ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రతి నెల 40 పైసల విధానాన్ని ఎందుకు రద్దు చేయడం లేదని ప్రశ్నించారు. విజయవాడ నగరంలో 2 యూనిట్లు వాడిన వినియోగదారులకు రూ.910ల బిల్లు వచ్చిం దని బిల్లు ప్రతులను చూపించారు. ఎలక్ట్రిసిటీ డ్యూటీ ధరను 6 పైసలు నుంచి రూ.1కి పెంచారన్నారు. కేంద్రప్రభుత్వం విద్యుత్ రంగాన్ని నాశనం చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఉద్యోగులకు వేతనాలు, బకాయిలు చెల్లించకుండా కార్పొరేట్లకు ప్రభుత్వం రాయితీలు కల్పిస్తోందన్నారు.

## మార్కెట్లకు స్వల్ప ఉపశమనం

**ముంబయి :** దేశీయ స్టాక్ మార్కెట్లకు స్వల్ప ఉపశమనం లభించింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాల నేపథ్యంలో మంగళవారం బీఎస్‌ఈ సెన్సెక్స్ 234.12 పాయింట్లు లేదా 0.30 శాతం పెరిగి 78,199కి చేరింది. ఇంట్రాడేలో 78,452-77,925 మధ్య కదలాడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 92 పాయింట్ల లాభంతో 23,707 వద్ద ముగిసింది. సోమవారం సెషన్‌లో సెన్సెక్స్ 1258 పాయింట్లు, నిఫ్టీ 389 పాయింట్ల చొప్పున పతనం అయ్యాయి. ఈ భారీ నష్టాల నుంచి మదుపర్లకు కాస్త ఊరట లభించినట్లయ్యింది.

## ప్రణబ్ ముఖర్జీ సార్మక చిహ్నానికి స్థలం కేటాయింపు

**న్యూఢిల్లీ :** మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ స్మారక చిహ్నం నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం స్థలం కేటాయించింది. ఈ విషయాన్ని ప్రణబ్ ముఖర్జీ కుమార్తె శర్మిష్ఠ ముఖర్జీ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు.

రాజ్‌ఘాట్ ఆవరణలో భాగమైన 'రాష్ట్రీయ స్మృతి' కాంప్లెక్స్‌లో ప్రణబ్ ముఖర్జీ సార్మక చిహ్నం నిర్మాణానికి స్థలాన్ని కేటాయించినట్లు కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ మంత్రిత్వ శాఖ తనకు లేఖ ద్వారా తెలిపినట్లు శర్మిష్ఠ తెలిపారు. ఈ విషయంపై మంగళవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలిసి శర్మిష్ఠ కృతజ్ఞతలు తెలిపారు.

## ఏఐసీసీ ప్రధాన కార్యాలయం ముందు వాల్ పోస్టర్ల కలకలం

- రైతుబంధుపై కాంగ్రెస్ యూటర్న్ అంటూ స్టిక్కర్లు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ అక్బర్ రోడ్ లోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయం వద్ద పోస్టర్ల కలకలం నెలకొంది. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఆఫీసు గోడలపై, గేటు ముందు ఉన్న బ్యారికేడ్ల పై మంగళవారం స్టిక్కర్లు దర్శనమిచ్చాయి. ఇందులో రైతు బంధు విషయంలో కాంగ్రెస్ యూటర్న్ తీసుకుందని రాసి ఉంది. అలాగే 'వరంగల్ డిక్లరేషన్‌లో రాహుల్ గాంధీ ఎకరానికి రూ. 15 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. 2024లో రైతులకు విడుదల చేసిన మొత్తం సున్నాం. ఇప్పుడు సీఎం రేవంత్ యూటర్న్ తీసుకుని రూ. 12 వేలు ఇస్తామంటున్నారు' అని ఇంగ్లీష్‌లో విమర్శించారు.

## తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే బదిలీకి

- కేంద్రానికి సుప్రీంకోర్టు కొలిజియం సిఫారసు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే బదిలీకి సుప్రీంకోర్టు కొలిజియం కేంద్రానికి సిఫారసు చేసింది. ఈ మేరకు మంగళవారం సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, పలువురు సీనియర జడ్జిలతో కూడిన కొలిజియం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా జస్టిస్ అలోక్ అరాధేను బాంబే హైకోర్టుకు, బాంబే హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా ఉన్న జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయను ఢిల్లీకి ట్రాన్స్‌ఫర్ చేస్తూ కొలిజియం సిఫారసు చేసింది. అలాగే జస్టిస్ కె వినోద్ చంద్రన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి కల్పిస్తూ కొలిజియం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ మూడు రికమెండేషన్లను కొలిజియం కేంద్రానికి రికమెండ్ చేసింది అయితే ఈ సిఫారసులను కేంద్రం పరిశీలించి, రాష్ట్రపతి ఆమోదం కోసం పంపాల్సి ఉంటుంది. రాష్ట్రపతి ఆమోద ముద్ర తర్వాత సిఫారసులు అమలవుతాయి.

## చిన్న కాళేశ్వరం పనులు అడ్డగింత

- నష్టపరిహారం అందించాకే పనులు నిర్వహించాలని బాధిత రైతుల డిమాండ్
- పోలీసులకు గ్రామస్తులకు మధ్య వాగ్వాదం పలువురి అరెస్ట్



నవతెలంగాణ-మహాదేవపూర్

జయశంకర్-భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలో మంగళవారం ప్రారంభించిన చిన్న కాళేశ్వరం కెనాల్ పనులను ఎల్కేశ్వరం రైతులు అడ్డుకున్నారు. 2012లో సర్వే నిర్వహించి నష్టపరిహారం అందించామని, ఇది ప్రభుత్వ భూమి అంటూ రైతులకు అధికారులు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా రైతులు తమ ఆందోళనను కొనసాగించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. తాతల కాలం నాటి నుంచి ఆ భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, తమ వద్ద పట్టా పాసుపుస్తకాలతో పాటు అన్ని రకాల దస్తావేజులు, ఆధారాలు ఉన్నాయని తెలిపారు. దానికి సమాధానంగా రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ.. ఇది ప్రభుత్వ భూమి అని, తమ వద్ద అన్ని ఆధారాలతో సహా దస్తావేజులు ఉన్నాయని తెలిపారు. దాంతో తమ వద్దా అన్ని రికార్డులు ఉన్నాయంటూ పనులు నిర్వహించడానికి వీల్లేదని రైతులు ఆందోళనకు దిగారు. దాంతో పోలీసులకు, గ్రామస్తులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు పలువురిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ.. మంత్రి ప్రమేయంతో దౌర్జన్యం చేస్తూ రాళ్లబండి రజిత అనే మహిళా రైతును, ఆర్ల ప్రసాద్‌ను అరెస్టు చేశారని, వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గతంలో వేరే చోట సర్వే నిర్వహించి ఇక్కడే నిర్వహించామంటూ కెనాల్ పనులను ప్రారంభిస్తూ తమ పొట్టగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి తమకు 2013 భూ సర్వే చట్ట ప్రకారం నష్టపరిహారం అందించి పనులు కొనసాగించాలని రైతులు డిమాండ్ చేశారు.

## నేడు విశాఖకు మోడీ

- పూడిమడకలో ఎన్‌టిపిసి గ్రీన్ ఎనర్జీ హైడ్రోజన్ ప్రాజెక్టుకు శంకుస్థాపన
- దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు పునాదిరాయి
- వర్చువల్ పద్ధతిలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం
- లక్షలాది మంది జనసమీకరణకు టిడిపి కూటమి నేతల కసరత్తు



**విశాఖ :** భారత ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం విశాఖకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. సాయంత్రం నాలుగు గంటలకు ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి విశాఖలోని ఐఎన్ఎస్ డేగాకు ప్రధాని చేరుకుంటారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బిజెపి ఎంపి పురంధేశ్వరి సహా పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు మోడీ పర్యటనలో భాగస్వాములు కానున్నారు. భద్రత కోసం ఇప్పటికే కేంద్ర రక్షణ దళాలకు చెందిన బలగాలు విశాఖకు చేరుకున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు మధ్యాహ్నం ఒంటి గంటకే విశాఖకు విచ్చేసి వైజాగ్ పోర్టు గెస్ట్‌హౌస్‌లో బస చేస్తారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ, వాల్తేరు డివిజన్‌తో కూడిన విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు వంటి అంశాలపై ప్రధాని ఏ ప్రకటనలు చేస్తారోనన్న చర్చ నడుస్తోంది. ఆంధ్రా యూనివర్సిటీ (ఏయు) గ్రౌండ్స్‌లోని బహిరంగ సభ ప్రాంగణం నుంచే జాతీయ గ్రీన్ హైడ్రోజనర్ మిషన్‌లో భాగంగా పూడిమడకలోని ఎన్‌టిపిసికి చెందిన గ్రీన్ హైడ్రోజన్ ఎనర్జీ ప్రాజెక్టుకు వర్చువల్‌గా శంకుస్థాపన చేయను న్నారు. విభజన హామీల్లో భాగమైన దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు శంకుస్థాపన చేస్తారని తెలుస్తోంది. పారిశ్రామిక, మౌలిక వసతుల రంగాలకు సంబంధిం చిన కొన్ని ప్రాజెక్టులనూ మోడీ ప్రారంభించను న్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని రూ.19,500 కోట్ల విలువైన రైల్వే, రోడ్డు ప్రాజెక్టులను ప్రధాని ఇక్కడి నుంచే వర్చువల్‌గా ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు.

**రోడ్ షో, బహిరంగ సభ ఇలా..**

బుధవారం సాయంత్రం 4.45 నుంచి 5.30 గంటల వరకూ నగరంలోని వెంకటాద్రి వంటిల్లు నుంచి ఏయు ఇంజనీరింగ్ కళాశాల మైదానం వరకూ మోడీ రోడ్డు షో నిర్వహించనున్నారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారు. ప్రధాని సభను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కూటమి ప్రభుత్వం మూడు లక్షల మందిని సభకు తరలించే దిశగా కసరత్తు చేస్తోంది. విశాఖ నగరంలో ప్రజల రాకపోకలపై ఇప్పటికే ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ప్రధాని విశాఖ పర్యటన కోసం ప్రభుత్వం నాలుగు వేల మంది పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసింది. 35 మంది ఐపిఎస్‌ల పర్యవేక్షణలో ఏర్పాట్లు సాగుతున్నాయి. మూడు లక్షల మందిని సమీకరించడానికి టిడిపి కూటమి నాయకులు శ్రమిస్తున్నారు.

**దేశంలోనే మొట్టమొదటి హైడ్రోజన్ హబ్**

విశాఖ నగరానికి 50 కిలోమీటర్ల దూరంలోగల అనకాపల్లి జిల్లా పూడిమడకలో 1,600 ఎకరాల విస్తీర్ణంలో రూ.1.85 లక్షల కోట్ల పెట్టుబడితో హైడ్రోజన్ ప్రాజెక్టు ఏర్పాటు కానుంది.